అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 26-4-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 116 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50

త్రిపురలో 100 శాతానికిపైగా పోలింగ్

- రిగ్గింగ్‌కు పాల్పడితేనే ఇలా వందశాతం దాటుతుంది
- రీపోలింగ్ నిర్వహించాలి : సీపీఐ(ఎం)


(ఫైల్)

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

త్రిపురలోని పశ్చిమ త్రిపుర లోక్‌సభ నియోజకవర్గంలో, రామ్‌నగర్ శాసనసభ స్థానంలో ఈనెల 19న జరిగిన పోలింగ్‌లో వంద శాతంపైగా పోలింగ్ జరిగింది. మజ్లిస్‌పూర్ సెగ్మెంట్‌లో 105.30 శాతం, ఖాయర్‌పూర్‌లో 100.15 శాతం, మోహన్‌పూర్ సెగ్మెంట్‌లో 109.09 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని, మళ్లీ పోలింగ్ నిర్వహించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికలు జరగలేదని సీపీఐ(ఎం) త్రిపుర శాఖ కార్యదర్శి జితేంద్ర చౌదరి విమర్శించారు. "పశ్చిమ త్రిపుర లోక్‌సభ నియోజకవర్గానికి ఎన్నికలు, అదే పార్లమెంటరీ నియోజకవర్గంలో భాగమైన రామ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నిక స్వేచ్ఛగా, న్యాయంగా, సాధారణ పద్ధతిలో జరగలేదని పైరికార్డులు నిస్సందేహంగా రుజువు చేస్తున్నాయి. బూత్‌లను స్వాధీనం చేసుకున్నప్పుడు, వ్యవస్థీకృత పద్ధతిలో పూర్తిగా రిగ్గింగ్ చేసినప్పుడే ఇటువంటి సరిపోలని పోలింగ్ శాతం జరుగుతుంది" అని అన్నారు.

"రిటర్నింగ్ అధికారి కార్యాలయం ద్వారా తమ పార్టీకి అందుబాటులో ఉంచిన పోలింగ్ స్టేషన్ల వారీగా పోలింగ్ రిపోర్టుల నుండి డేటా సేకరించాం. రిటర్నింగ్ అధికారికి ప్రిసైడింగ్ అధికారి రిపోర్టును అందించే పోలింగ్ స్టేషన్ల వారీ డేటా పబ్లిక్‌గా అందుబాటులో లేనప్పటికీ, డిమాండ్‌ను బట్టి దాన్ని యాక్సెస్ చేయవచ్చు. అలానే వివరాలు తీసుకున్నాం" అని ఆయన తెలిపారు.

లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు తాజా ఎన్నికలను నిర్వహించాలని కాంగ్రెస్, సీపీఐ(ఎం)లు డిమాండ్ చేశాయి. పశ్చిమ త్రిపురలో పోలింగ్ ముగిసిన కొద్దిసేపటికే లెఫ్ట్ ఫ్రంట్ కన్వీనర్ నారాయణ్‌కర్ మాట్లాడుతూ రెండు స్థానాల్లో తాజా ఎన్నికలు నిర్వహించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయని చెప్పారు. త్రిపుర పశ్చిమ లోక్‌సభ సీటు, రామ్‌నగర్ అసెంబ్లీ సీటు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం పూర్తి స్థాయిలో విఫలమవడం, ఎన్నికల సంఘం చేసిన పెద్ద చర్చలు, వాగ్దానాలు చూసి ఆశ్చర్య పోయాం"అని అన్నారు.

పెద్ద ఎత్తున నకిలీ ఓటింగ్‌ను నిరోధించడంలో ఎన్నికల సంఘం విజయవంతమైందని, అయితే గూండాయిజం అదుపు లేకుండా పోయిందని, ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు రాకుండా అడ్డుకు న్నారని కాంగ్రెస్ నేత సుదీప్ రాయ్ బర్మన్ ఆరోపించారు. బీజేపీ అధికార ప్రతినిధి నబెందు భట్టాచార్జీ మాట్లాడుతూ "మేము డేటాను చూడలేదు. ఎన్నికల సంఘం ఈ విషయాన్ని పరిశీ లిస్తుంది. ఎన్నికల సంఘం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా మేం దానికి కట్టుబడి ఉంటాం" అని అన్నారు.

మేడే రోజు కార్మికులకు సెలవు దినం ప్రకటించాలి

- లేబర్ కమిషనర్‌కు సీఐటీయూ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అంతర్జాతీయ మేడే దినోత్సవం సందర్భంగా కార్మికులకు సెలవు ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో కార్మికశాఖ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. 2023 మేడే సందర్భంగా కొన్ని సంస్థల యాజమాన్యాలు సెలవు ప్రకటించలేదనే విషయాన్ని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ఈసారి రాష్ట్రంలోని పరిశ్రమలు, షాపులు, ఎస్టాబ్లిష్‌మెంట్స్ ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, ఇతర సంస్థల్లో పనిచేసే కార్మికులకు సెలవు ప్రకటించే విధంగా యజమానులకు తగిన ఆదేశాలను జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

మోడీని అనర్హుడిగా ప్రకటించాలి

- కేంద్ర ఎన్నికల సంఘానికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి విజ్ఞప్తి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రధాని మోడీని ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుడిగా ప్రకటించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘానికి గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రధానిగా వ్యవహరిస్తున్న మోడీ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వివిధ సభల్లో మాట్లాడుతున్న తీరు జుగుప్స కలిగిస్తున్నదని విమర్శించారు.రాజ్యాంగ బద్ధంగా పాలన చేస్తానంటూ ప్రధానిగా ప్రమాణం చేసి దానికి వ్యతిరేకంగా మతోన్మాదిగా దేశ ప్రజలను ముస్లింలకు వ్యతిరేకంగా రెచ్చగొడుతున్న తీరు ఆయన ప్రధాని పదవికి మచ్చ తెస్తున్నదని తెలిపారు. రాజస్థాన్‌లోని సభలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల చర, స్థిర ఆస్తులను ముస్లింలకు పంచి పెడుతుందంటూ మోడీ వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లను ఆ పార్టీ తగ్గించి ముస్లింలకు ఇస్తుందంటూ ప్రకటించారని పేర్కొన్నారు. చత్తీస్‌ఘడ్‌లో సామాజిక న్యాయం పేరుతో ప్రజల ఆస్తులను లూటీ చేసే ప్రమాదముందంటూ మోడీ మాట్లాడారని తెలిపారు. ప్రధానిగా ఉండి ప్రజల సంపదను బీజేపీ అదానీ, అంబానీలకు దోచిపెట్టిన దాన్ని తిరిగి ప్రజల ఆస్తులుగా మారుస్తారనే భయంతోనే మోడీ ఈ మాటలు మాట్లాడుతున్నట్టు స్పష్టమవుతున్నదని పేర్కొన్నారు. ఆయన దృష్టిలో భారత ప్రజలంటే అదానీ, అంబానీ, నీరవ్ మోడీ, విజయ్ మాల్యా వంటి కొద్ది మంది సంపన్నులు తప్ప 140 కోట్ల మంది కాదని ఎద్దేవా చేశారు. ఎన్నికల సంఘానికి ఉన్న విచక్షణాధికారాన్ని ఉపయోగించుకుని మోడీని ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ లక్ష్యాలను నిలబెట్టాలని కోరారు. ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం తీసుకునే చర్య చరిత్రలో నిలిచిపోవాలని ఆకాంక్షించారు.

మూడోసారి మోడీ ప్రధాని అయితే ప్రజలు ఐక్యంగా జీవించడం, దేశం ఐక్యంగా ఉండటం సాధ్యం కాదని ఆందోళన వ్యక్తం చేశారు. మతం ఆధారంగా దేశ ప్రజలను చీల్చటం, మతాల మధ్య చిచ్చు పెట్టటం, తద్వారా దేశ సమైక్యతకు నష్టం కలిగించడమే మోడీ గ్యారంటీగా భావించాలని విమర్శించారు. తెలంగాణ ప్రజలు విజ్ఞతతో వ్యవహరించి రాష్ట్రంలోని లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి స్థానం లేకుండా చేయాలని నర్సిరెడ్డి విజ్ఞప్తి చేశారు. అప్పుడే దేశం సమైక్యంగా ఉంటుందనీ, రాజ్యాంగం రక్షించబడుతుందని తెలిపారు.

అంబేద్కర్ కోరుకున్న సమానత్వం రాలేదు

ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి

- అంబేద్కర్ వర్సిటీలో స్మారకోపన్యాసం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అంబేద్కర్ కోరుకున్న సమానత్వం రాలేదని ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 133వ జయంతి వేడుకలను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన స్మారకోపన్యాసాన్ని ఇచ్చారు. అంబేద్కర్ చిత్రపటానికి లింబాద్రి పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు. అనంతరం లింబాద్రి మాట్లాడతూ ప్రపంచ సమానత్వాన్ని అంబేద్కర్ కోరుకున్నారనీ, అది ఇంకా రాలేదని చెప్పారు. ఆయన దూర దృష్టి గల నేత అని అన్నారు. రాజ్యాంగంలో పొందుపర్చిన ఆర్టికల్ మూడు ప్రకారమే తెలంగాణ ఏర్పడిందని వివరించారు. స్వాతంత్ర్యానికి పూర్వం అంబేద్కర్ ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నారనీ, అంటరానితనం, వివక్ష ఆయన్ను బాగా ఆలోచింప చేశాయని చెప్పారు. రాజ్యాంగం పునాది అనేది స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం అనే అంశాలపై ఆధారపడి ఉందని వివరించారు. ప్రాథమిక సూత్రాలుగా భారత రాజ్యాంగ పీఠికలోకి సామాజిక, ఆర్థిక, రాజకీయ, న్యాయం, ఆలోచనలు, భావ వ్యక్తీకరణలో నమ్మకాలు, విశ్వాసాల్లో స్వేచ్ఛ, అంతస్తులు, అవకాశాల్లో తేడాలున్న సమాజంలో అందరి మధ్య సమానత్వం సాధించాలని అంబేద్కర్ సూచించారని గుర్తు చేశారు. దేశ రాజకీయాలను, పరిపాలనా విభాగాలను వ్యవస్థలను, వనరులను సమానంగా అందరికీ పంచాలని ఆయన కోరుకున్నారని చెప్పారు. అయితే ఇప్పటికే దేశంలోని సంపద కొందరి వద్దే కేంద్రీకృతం అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఇప్పుడు ఇదే అంశంపై ఆందోళన వ్యక్తమవుతోందని అన్నారు. అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి కె సీతారామారావు మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయంలో 25 అడుగుల ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామనీ, త్వరలోనే ఆవిష్కరిస్తామని చెప్పారు. అంబేద్కర్ ఆశయాలకు యూనివర్సిటీ కట్టుబడి ఉందని వివరించారు. ప్రభుత్వ పరిపాలన శాస్త్రం 75 వసంతాల అంతర్జాతీయ సదస్సు బ్రోచర్‌ను లింబాద్రి ఈ సందర్భంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ వర్సిటీ రిజిస్ట్రార్ ఎవిఆర్ఎన్ రెడ్డి, డీన్ వడ్డాణం శ్రీనివాస్, సెమినార్ డైరెక్టర్ పల్లవి కబ్డే, కో డైరెక్టర్ సి వెంకటయ్యచ సీఎస్‌టీడీ డైరెక్టర్ ఆనంద్ పవార్, విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ ఎల్వీకే రెడ్డి, పుస్తక ప్రచురణల విభాగం డైరెక్టర్ గుంటి రవీందర్, ఎస్సీ,ఎస్టీ సెల్ ఇన్‌చార్జీ బానోత్ ధర్మ తదితరులు పాల్గొన్నారు.

దేశ ద్రోహులకు కాంగ్రెస్ ఏజెంట్

- తెలంగాణు ప్రజలు కొట్లాడి తెచ్చుకున్నరు: ఎన్.రామచంద్రరావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశద్రోహులకు ఏజెంట్‌గా కాంగ్రెస్ పార్టీ మారిందని మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు ఆరోపించారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ విడుదల చేసిన దాంట్లో ఒక్క చార్జీ లేదు..షీటూ లేదు అని విమర్శించారు. తమది ఆర్ఎస్ఎస్ భావజాలం అని సగర్వంగా చెప్పుకుంటున్నామన్నారు. కాంగ్రెస్ భావజాలమేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ దేశ వ్యతిరేక విధానాలు తీసుకున్నదని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చే అలవాటు కాంగ్రెస్‌దనీ, అనేకసార్లు సవరించిందని గుర్తు చేశారు.ఎమర్జెన్సీ విధించి ప్రజల హక్కులను హరించిందని కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. రాహుల్‌గాంధీ తెలంగాణలో చెల్లని రూపాయి అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలకిచ్చిన హామీలేమయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణను కాంగ్రెస్ పార్టీ ఇవ్వలేదనీ, ప్రజలు కొట్లాడి సాధించికున్నారని తెలిపారు. తెలంగాణ ముందే ఇచ్చిఉంటే ఇన్ని బలిదానాలు జరిగేవి కావన్నారు. తాము ఇప్పటివరకూ రిజర్వేషన్లు పెంచాం తప్ప తీసెయ్యలేదని చెప్పారు.

ప్రశ్న తెలివిని పెంచుతుంది



- సమాధానం చెప్పలేనప్పుడే విసుగు
- విద్యాబోధనలో నిరంతర ఆధునీకరణ అవసరం : టీచర్స్ వర్క్‌షాప్‌లో ప్రముఖ కవి సుద్దాల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ప్రశ్న అభివృద్ధికి సూచిక. అది తెలివిని పెంచుతుంది. ఆ ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వలేనప్పుడే మనిషిలో అసహనం, విసుగు, ఆక్రోశం పెరుగుతుంది' అని ప్రముఖ కవి సుద్దాల అశోక్ తేజ అన్నారు.గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వ ర్యంలో 'విద్యా బోధనలో నిరంతరం ఆధునికతను అందు కుందాం' అనే అంశంపై ఉపాధ్యాయుల వర్క్‌షాప్‌ను బాలోత్సవ కమిటీ ఉపాధ్యక్షులు మమత అధ్యక్షతన నిర్వ హించారు.ఈ సందర్భంగా అశోక్ తేజ మాట్లాడుతూ ఉపా ధ్యాయులు బహుముఖ ప్రజ్ఞాశాలురుగా ఉండాలని సూచిం చారు.విద్యార్థుల హావ భావాలను అర్థం చేసుకోవాలన్నారు. వాస్తవానికి పిల్లలే ఉపాధ్యాయులకు ఎన్నో విషయాలు నేర్పిస్తారని వివరించారు. ఒక కార్యం వెనుక అనేక కారణాలుంటాయనీ,ఆ కారణాలను అర్థం చేసుకునే చైతన్యాన్ని ఉపాధ్యాయులు అలవర్చుకోవాలని చెప్పారు. విద్యార్థులతో సాదాసీదాగా ఉపాధ్యాయులు వ్యవహరిస్తే సృజనాత్మకతను వెలికి తీయలేమన్నారు. వారి జీవన నేపథ్యం, సామాజిక, ఆర్థిక స్థితిని అధ్యయనం చేయాలని సూచించారు. అప్పుడే ఏ విద్యార్థికి ఏ స్థాయిలో విద్యనందించగలమో అర్థమవుతుందని తెలిపారు.' తరగతి గదిలోనే దేశ భవిష్యత్ నిర్దేశించబడుతుంది' అని చెప్పిన కోఠారి మాటల్లో అర్థాన్ని ఒడిసి పట్టుకోవాలని సూచించారు. పిల్లవాడికి ఏ రూపంలో చెబితే..ఆ పాఠ్యాంశంలోని సారాన్ని గ్రహించగలడన్న విషయాలు ..ముందు మనకు అర్థం కావాలన్నారు. అందుకే ఉపాధ్యాయులు బహుపాత్రలు పోషించే టీచర్‌గా అభివృద్ధి కావాలన్నారు. పిల్లలు టీచర్‌ను నమ్మినంతగా తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను కూడా నమ్మరని ఉదాహరణలతో సహా వివరించారు. కార్యక్రమంలో మోటివేటర్ గంప నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల హావభావాలు, బాడీలాంగ్వేజ్‌తో పాటు విద్యార్థులను సక్రమమైన మార్గంలో తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. స్టేట్ స్కూల్ చైర్మెన్ వాసిరెడ్డి అమర్‌నాథ్, అనురాగ్ యూనివర్సిటీ డైరెక్టర్ శ్రీనివాస్, బాలోత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూపతి వెంకటేశ్వర్లు, ఎన్ సోమయ్య, ఉపాధ్యక్షులు సుజావతి, రూప, జి బుచ్చిరెడ్డి, నాయకులు పద్మ గీతారాణి, నవీన్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 26-4-2024 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 116 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50



రిజర్వేషన్ల రద్దుకు మోడీ-షా కుట్రలు

బీజేపీని నమ్మితే..మోసపోయినట్టే | **రాష్ట్రంలో కారు షెడ్‌కు పోయింది..తిరిగిరాదు**

- కేసీఆర్‌కు అధికారంలో ఉన్న పదేండ్లలో ప్రజలు గుర్తుకురాలేదు
- పదవి పోయాక తిరిగితే నమ్ముతారా?

కాంగ్రెస్‌కు పదవులు ముఖ్యం కాదు.. ప్రజా సంక్షేమమే ధ్యేయం

- చేవెళ్లలో రంజిత్‌రెడ్డిని లక్ష ఓట్లతో గెలిపించాలి : చేవెళ్ల పార్లమెంట్ రాజేంద్రనగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

దేశంలో రిజర్వేషన్లు రద్దు చేసేందుకు బ్రిటీష్ వారసులు మోడీ, షా.. కుట్రలు చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బీజేపీ అంటే భారతీయ జనతా పార్టీ కాదని బ్రిటీష్ జనతా పార్టీగా మారిందని, బ్రిటీష్ పాలనలో ఎలాంటి ...5లో



దేవుని పేరుతో ఒకడు దేవుని మీద ఒట్టేసి మరొకడు

అక్షింతలు, పులిహోర, కాషాయ జెండా పేదల కడుపు నింపవు

అమలు గాని హామీలు.. కాంగ్రెస్ ఓట్లు ఎలా అడుగుతుంది : భువనగిరిలో మాజీ సీఎం కేసీఆర్

వివరాలు 7లో..

రాష్ట్రంలో ముగిసిన నామినేషన్ల ఘట్టం

- బరిలో 547 మంది అభ్యర్థులు
- ఖమ్మంలో అత్యధికంగా 29 నామినేషన్లు

వివరాలు 7లో..


మోడీ పాలనలో పెరిగిన
తాళి తాకట్లు
కోవిడ్ తర్వాత భారీగా బంగారం రుణాలు

కాంగ్రెస్ పార్టీ హిందూ మహిళలు ధరించిన బంగారు తాళిబొట్లను లాక్కొని వాటిని దేశంలోకి చొరబడిన ముస్లిం మహిళలకు అందజేస్తుందంటూ ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల తీవ్ర వ్యాఖ్య చేసిన విషయం తెలిసిందే. అయితే మోడీ పాలనలో వాస్తవంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అనర్థదాయకమైన విధానాల కారణంగా కార్మిక కుటుంబాలకు చెందిన మహిళల మంగళసూత్రాలు, ఇతర బంగారు ఆభరణాలు సంపన్నుల ఖజానాకు చేరుతున్నాయి.

వివరాలు 15లో



- ప్రభుత్వ అసమర్థ విధానాలే కారణం
- పెరగని వేతనాలు... పెరిగిన ఖర్చులు
- గరిష్ట స్థాయికి రుణభారం



కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు రెండూ ఒకటే

సిద్దిపేటలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా



15లో..

- మోడీ మూడోసారి ప్రధాని అయ్యాక తెలంగాణలో అవినీతి అంతం
- రాష్ట్రంలో 12 లోక్‌సభ స్థానాలను గెలిపించాలి
- సహారా ఇండియా పేమెంట్స్ చెల్లించాలంటూ సభలో కార్మికుల ప్లకార్డుల ప్రదర్శన

రుణమాఫీ, ఆరు గ్యారంటీలు అమలుచేస్తే రాజీనామా చేస్తా..

మీరు సిద్ధమేనా..? అంటూ రేవంత్‌కు హరీశ్‌రావు సవాల్..

- బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి నామినేషన్ సభలో ఎమ్మెల్యే హరీశ్‌రావు



6లో..

సంపాదకీయం

వేధిస్తున్న ప్రశ్న



విద్యార్థులు.. దేశ భావి పౌరులు. నాణ్యమైన మానవ వనరులుగా మారి దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాల్సినవారు. అలాంటి విద్యార్థులు ఇంటర్ ఫలితాలు వెలువడిన వెంటనే పదుల సంఖ్యలో ఆత్మహత్యలు చేసుకోవడం కలవరపాటుకు గురిచేస్తున్నది. రైతుల ఆత్మ హత్యలను మించి విద్యార్థుల బలవన్మరణాలు చోటుచేసు కోవడం మరింత ఆందోళన కలిగిస్తున్నది. దీనికి కారణం చదువుల ఒత్తిళ్లా?.. తల్లిదండ్రుల ఆకాంక్షలను తీర్చలేక పోతున్నామనే భయమా? ఏం చేస్తే విద్యార్థుల ఆత్మహత్యలు ఆగుతాయనేది సర్వే సర్వత్రా వేధిస్తున్న ప్రశ్న.

> విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి విద్యా సంస్థలు తీసుకుంటున్న చర్యలు శూన్యం. మారుతున్న పరిస్థితిలో ఉపాధి అవకాశాలకు సంబంధించిన అంశాలను మాత్రమే పాఠ్యప్రణాళికల్లో చేరుస్తూ సామాజికాంశాలు, మానవీయ విలువలు, జీవన నైపుణ్యాలు వంటి నిజజీవితానికి సంబంధించిన అంశాలను పూర్తిగా విస్మరిస్తున్నారు. దీంతో సమస్యలు వచ్చినప్పుడు వాటిని ఎలా ఎదుర్కోవాలో తెలియక, భావోద్వేగాలకు లోనవుతూ అర్థాంతరంగా అసువులు బాస్తున్నారు.

ఇంటర్ ఫలితాల వెల్లడి తర్వాత విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడడం వంటి ఘటనలు విద్యార్థులు పడుతున్న మానసిక సంఘర్షణను స్పష్టంగా చెబుతున్నాయి. ఇది ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ఎదురవుతున్న సమస్య కాదు. దేశ వ్యాప్తంగా ప్రతీ ఏటా విద్యార్థుల ఆత్మహత్యల సంఖ్య పెరిగిపోతున్నది. జాతీయ నేర నమోదు విభాగం- 2023 గణాంకాల ప్రకారం ఒక్క 2022లోనే దేశ వ్యాప్తంగా పదివేలకు పైగా 18ఏండ్లలోపు వారే ఆత్మహత్యలకు పాల్పడ్డారు. 2022లో జరిగిన ఆత్మహత్యల్లో దాదాపు 8శాతం విద్యార్థులవే. ప్రస్తుతం ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అంశాలలో విద్యార్థి ఆత్మహత్యలు సైతం ఒకటి. సమాజ ప్రగతిలో విద్యారంగం పాత్ర అతి ప్రధానమైనది. భవిష్యత్ సమాజ నిర్మాణానికి ఉపయోగపడేలా మానవ వనరులను అభివృద్ధి పరచడం విద్యా సంస్థల ప్రధాన బాధ్యత. ప్రాథమిక స్థాయిలో అందుకు సంబంధించిన బీజాన్ని విద్యార్థుల్లో నాటడంలో వాటిదే కీలక భూమిక.

తెలిసీ తెలియని వయసులో ఒత్తిడిని తట్టుకోలేక క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.ఇది అత్యంత బాధాకరమైన విషయం. ఈ ఘటనలు రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలకు కేంద్రమవుతున్నాయే తప్ప... అందుకు గల కారణాలను లోతుగా అధ్యయనం చేసి, దీర్ఘకాల ప్రయోజనాల దృష్ట్యా భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టడంలో వ్యవస్థలు వైఫల్యం చెందాయి. ప్రస్తుతం విద్యాబోధన విద్యార్థి కేంద్రంగా జరగడం లేదనేది నిర్వివాదాంశం. ముఖ్యంగా ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు తమ మార్కెట్‌ను మరింతగా విస్తరించుకోవడం కోసం మార్కులు, ర్యాంకులే ధ్యేయంగా విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడిని పెంచుతున్నాయి. తమ పిల్లలు మెరుగైన ఉద్యోగాల్లో స్థిరపడాలనే కోరికతో తల్లిదండ్రులు సైతం అందుకు సహకరిస్తున్నారు.

కానీ, విద్యార్థులు పడుతున్న మనోవేదనను ఇటు ఉపాధ్యాయులు, అటు తల్లిదండ్రులు సరిగ్గా అర్థం చేసుకోలేకపోతున్నారు. మెరుగైన ఫలితాలు రాకపోతే ఏమంటారోనని కొందరు, తల్లిదండ్రులు తమపై పెంచుకున్న ఆశలను నెరవేర్చలేకపోతున్నామని మరికొందరు ఆత్మన్యూనత భావానికి లోనవుతున్నారు. ఎవరికి చెప్పుకోవాలో తెలియక, భరోసా కల్పించేవారు లేక అంతర్గత సంఘర్షణకు లోనవుతూ చివరకు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఇందుకు మారుతున్న పరిస్థితుల్లో వారి కుటుంబ నేపథ్యం, సామాజిక, ఆర్థిక స్థితిగతులు విద్యార్థుల్లో మానసిక ఆందోళన కూడా కారణాలు అవుతున్నాయి. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి విద్యా సంస్థలు తీసుకుంటున్న చర్యలు శూన్యం. మారుతున్న పరిస్థితిలో ఉపాధి అవకాశాలకు సంబంధించిన అంశాలను మాత్రమే పాఠ్యప్రణాళికల్లో చేరుస్తూ సామాజికాంశాలు, మానవీయ విలువలు, జీవన నైపుణ్యాలు వంటి నిజజీవితానికి సంబంధించిన అంశాలను పూర్తిగా విస్మరిస్తున్నారు. దీంతో సమస్యలు వచ్చినప్పుడు వాటిని ఎలా ఎదుర్కోవాలో తెలియక, భావోద్వేగాలకు లోనవుతూ అర్థాంతరంగా అసువులు బాస్తున్నారు.

2019లో ఇంటర్ ఫలితాల తర్వాత 27మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడడంతో అప్పటి తెలంగాణ ప్రభుత్వం అన్ని జూనియర్ కళాశాలల్లో కౌన్సిలర్లను నియమించుకోవాలని ఆదేశించినప్పటికీ అది అమలుకు మాత్రం నోచుకోలేకపోయింది. విద్యార్థులపై ఒత్తిడి లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్యార్థులే కేంద్రంగా విద్యా భోధన జరిగేలా విధానాలను రూపొందించి అమలు పరచాలి. నిజానికి ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో విద్యార్థుల మానసిక స్థితిగతులపై నిత్యం పర్యవేక్షణ అవసరం. అప్పుడే విద్యార్థుల సమస్యలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి పరిష్కార మార్గాలను చూపగలుగుతాం. విద్యార్థుల్లో మనోధైర్యాన్ని పెంపొందించాలి. అప్పుడే స్వతహాగా తమ సమస్యలను తామే పరిష్కరించుకునేలా విద్యార్థులను సన్నద్ధం చేసినప్పుడే విద్యార్థుల సమ్మిళిత అభివృద్ధి సాధ్యం. 'పరీక్షలు శిక్షలు కాదు..నీ సామర్థ్యం తెలుసుకునే ఒక ప్రయత్నం మాత్రమే' అని చెప్పి ధైర్యపు మందు పోసే వారే కావాలిప్పుడు. ఆ దిశగా ప్రభుత్వం, విద్యాశాఖ చర్యలు చేపట్టాలి. అప్పుడే విద్యార్థుల ఆత్మహత్యలు లేని రాష్ట్రాన్ని, దేశాన్ని చూడగలుగుతాం.

'మోడీ గ్యారంటీ' రాజదండనే!


ఎస్ వీరయ్య



బీజేపీ ఎన్నికల ప్రణాళిక దేశ ప్రజలకు ఒక సవాలు. ఎంతటి నేరమైనా 'బాజాప్తా చెప్పే చేస్తాను... నన్నెవరు ఆపగలరో చూస్తా...' అన్నంత అహంభావంతో ప్రజల మీదకు విసిరిన ఆయుధం అది. ప్రజల దృష్టి మరల్చి, దొంగదెబ్బ తీసేందుకు చేస్తున్న దుస్సాహసం ఇది. పేదరికం దాదాపు నిర్మూలించాననీ, ఈ పదేండ్లలో వాగ్దానాలన్నీ అమలు చేసాననీ, అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాయని చెప్పటం దుస్సాహసం కాక ఏమవుతుంది? అంతటితో ఆగలేదు. దేశంలో ఆర్థిక, సామాజిక పరివర్తన సాధించాననీ చెప్పుకున్నది. అవినీతిని చట్టబద్ధం చేసిన బీజేపీ, సుప్రీంకోర్టు తీర్పు తర్వాత, తల దించుకోవల్సింది పోయి, అవినీతి వ్యతిరేక పోరాటం కొనసాగిస్తామనటం హాస్యాస్పదం. సంక్షేమ చర్యలన్నీ వీరి దృష్టిలో 'ఉచితాలు'. ఇవి ఉండకూడదని సుప్రీంకోర్టుకు చెప్పారు కదా! అందువల్ల పెద్దగా ఆ వాగ్దానాలు చేయలేదు. ప్రజాసమస్యల పరిష్కారానికి నిర్దిష్ట పరిష్కారాలు చూపలేదు. నియంతృత్వం, మతరాజ్యం నిర్మాణానికి మాత్రం ఈ ప్రణాళిక నిర్దిష్ట మార్గ నిర్దేశం చేసింది. ప్రజలు ఆగ్రహిస్తే నేరం నాది కాదు... మోడీదే అని తప్పుకోవచ్చు. ఎందుకంటే ఇవి బీజేపీ గ్యారంటీలు కాదు. మోడీ గ్యారంటీలు మాత్రమే!

మోడీ పాలనలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయట పడేసారట. అదే నిజమైతే, 80కోట్ల మందికి పైగా ఇంకా ఐదేండ్లు ఉచిత బియ్యం అమలు చేస్తానని ఎందుకు చెప్పారో వారికే తెలియాలి. గ్యాస్ సిలిండర్ ధర రూ.400 నుంచి 1200లకు పెంచిన వీరు మహిళలకు ఉచిత గ్యాస్ గురించి మాట్లాడటం ఆశ్చర్యకరం. గత 50ఏండ్లలో అత్యధిక నిరుద్యోగం మోడీ పాలనలోనే అయినా యువతకు కోట్లాది నూతన అవకాశాలు కల్పించామని చెప్పుకున్నారు. బీజేపీ ముఖ్యమంత్రులు, నాయకులు చెప్పినట్టు, పకోడీలు అమ్ముకుని కూడా బతికే మార్గం చూపించి ఉండవచ్చు. మేక్ ఇన్ ఇండియా అర్భాటమే తప్ప ఆచరణలో సాధించింది లేదు. మోడీ పాలనలో తయారీ రంగం ఉత్పత్తి వాటా దేశ ఆర్థిక వ్యవస్థలో 17 నుంచి 13శాతానికి దిగజారింది. ఉపాధి అవకాశాలు కల్పించే రంగం దుస్థితి ఇది. ఇప్పటికే ఉన్న అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం వంటి స్కీం వర్కర్ల రంగాలను వదిలించుకునే ప్రయత్నంలో ఉన్నారు. మరోవైపు శ్రామిక మహిళల సంఖ్య పెరుగుతుందని మోడీ గ్యారంటీ! పైగా అవి స్థిరత్వాన్నిచ్చే ఉద్యోగాలు కాదు. విద్య, వైద్యం, పర్యాటకం, చిల్లర వ్యాపారం, ఐటి వంటి రంగాలలో స్వయం సహాయక గ్రూపులుగా పనులు చేసుకుని బతకాలన్నారు. పేరుకు మాత్రం చట్టం చేసి అమలు చేయకుండా దాచిపెట్టిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ఘనకార్యంగా చెప్పుకున్నారు.

వాగ్దానాలన్నీ అమలు చేసారట! రైతుల ఆదాయం రెట్టింపయ్యిందా? ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలేమైనాయి? విదేశాల నుంచి నల్లధనం తెచ్చి ఎన్ని కుటుంబాల ఎకౌంట్లలో రు.15లక్షల చొప్పున వేసారు? ఇండ్లు లేని వారందరికీ ఇండ్లు నిర్మించారా? చరిత్రలో ఎప్పుడూ లేనంత అధిక సంఖ్యలో మహిళల మీద లైంగిక దాడులు జరిగాయి. మణిపూర్ ఆదివాసీ మహిళల దుస్థితి జగమెరిగినదే. మహిళలకు భద్రత అంటే ఇదేనా? కుల దురహంకార దాడులు తారస్థాయికి చేరాయి. సామాజిక న్యాయం అంటే ఇదేనా? కులగణనకు నిరాకరిస్తూ బీసీ కమిషన్ గురించి మాట్లాడటం ఎవరిని నమ్మించడానికి? కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్ల జరిగిన పుల్వామా ఉగ్రవాద దాడిని కప్పిపుచ్చుతూ ఉగ్రవాద రహిత దేశం గురించి 'మోడీ గ్యారంటీ' అనే అర్హత వీరికి లేదు. అందరికీ నిర్బంధోచిత విద్య ప్రస్తావన లేదు. నూతన విద్యా విధానం పేరుతో విద్యను కార్పొరేటీకరిస్తూ నాణ్యమైన విద్య గురించి మాట్లాడుతున్నారు. బడా వైద్య సంస్థలను ప్రోత్సహిస్తూ ఆరోగ్య భారత్ గురించి మోడీ గ్యారంటీ అనటం మోసపూరితం. కార్మిక చట్టాలు రద్దు చేసి 'శ్రామిక బంధు' అనటం ఎవరిని నమ్మించడానికి? వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాల ఊసులేదు. పెన్షన్ హక్కు మీద, సౌకర్యాల మీద దాడి చేస్తూనే వృద్ధుల గురించి మొసలి కన్నీరు కార్చారు. ప్రపంచ మార్కెట్‌లో అతి తక్కువ ధరలకు పెట్రోలియం ఉత్పత్తులు దొరికిన సమయంలో, ఇక్కడ అత్యధిక ధరలతో ప్రజల నడ్డి విరిచిన బీజేపీ ప్రభుత్వం, ప్రపంచ ధరల దెబ్బ నుంచి దేశ ప్రజలను కాపాడామని అంతర్జాతీయ స్థాయి అబద్ధం చెప్పగలిగింది.

కార్మికుల కోసం ఉత్పత్తితో ముడిపడిన ప్రోత్సాహకం (ప్రొడక్షన్ లింక్‌డ్ ఇన్సెంటివ్) గురించి కంపెనీలలో వింటాం. కానీ మోడీ ప్రభుత్వం ఈ పేరుతో, ప్రభుత్వ ఖజానా నుంచి బడాబాబుల కోసం బడ్జెట్‌లో రూ.6200 కోట్లు కేటాయించింది. మోడీ పాలనలో ఆదానీ ఆస్తి రు.53వేల కోట్ల నుంచి రూ.17లక్షల 30వేల కోట్లకు పడగలెత్తింది. అంబానీ సంపద పది లక్షల కోట్లు దాటింది. టాటా, బిర్లాల గురించి చెప్పనవసరమే లేదు. మరోవైపు మోడీ ప్రభుత్వం కార్మికుల క్షేత్రస్థాయి కనీస వేతనం రోజుకు రూ.178 చాలంటున్నది. దేశం

> వాగ్దానాలన్నీ అమలు చేసారట! రైతుల ఆదాయం రెట్టింపయ్యిందా? ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలేమైనాయి? విదేశాల నుంచి నల్లధనం తెచ్చి ఎన్ని కుటుంబాల ఎకౌంట్లలో రు.15లక్షల చొప్పున వేసారు? ఇండ్లు లేని వారందరికీ ఇండ్లు నిర్మించారా? చరిత్రలో ఎప్పుడూ లేనంత అధిక సంఖ్యలో మహిళల మీద లైంగిక దాడులు జరిగాయి. మణిపూర్ ఆదివాసీ మహిళల దుస్థితి జగమెరిగినదే. మహిళలకు భద్రత అంటే ఇదేనా? కుల దురహంకార దాడులు తారస్థాయికి చేరాయి. సామాజిక న్యాయం అంటే ఇదేనా? కులగణనకు నిరాకరిస్తూ బీసీ కమిషన్ గురించి మాట్లాడటం ఎవరిని నమ్మించడానికి? కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్ల జరిగిన పుల్వామా ఉగ్రవాద దాడిని కప్పిపుచ్చుతూ ఉగ్రవాద రహిత దేశం గురించి 'మోడీ గ్యారంటీ' అనే అర్హత వీరికి లేదు.

అత్యంత అసమానతలతో ఉన్నదని అంతర్జాతీయ నివేదికలు ఘోషిస్తున్నాయి. ఆర్థిక అసమానతలు బ్రిటిష్ పాలనా కాలం కన్నా తీవ్రమైనాయని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆర్థికవేత్త స్టిగ్లిట్జ్ నేతృత్వంలో జరిగిన అధ్యయనాలు తేల్చాయి. ప్రజల ఆర్థిక, సామాజిక పరిస్థితులు మెరుగుపరచకుండా దేశాన్ని ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామంటున్నారు. అంటే బడాబాబుల సంపద అనేక రెట్లు పెరుగుతుందన్నమాట. ఇందుకోసం ప్రపంచీకరణ పేరుతో నాల్గవ తరం ఆర్థిక సంస్కరణలు వేగంగా అమలు జరుపుతామని ప్రణాళికలో చెప్పారు.

ప్రజల అసంతృప్తిని అణచివేయవచ్చుననీ, లేదా పక్కదారులు పట్టించవచ్చని వీరి ధైర్యం. వనరులన్నీ జీఎస్టీ పేరుతో కేంద్రం గుప్పిట్లో పెట్టుకున్నారు. ఈడీ, ఐటీ, సీబీఐ లాంటి సంస్థలను ప్రయోగించి తమను వ్యతిరేకించేవారిని లొంగదీసు కుంటున్నారు. బ్లాక్ మెయిల్ సాధనాలుగా వాడుతున్నారు. 'సుపరి పాలన' పేరుతో రాజుల కాలం నాటి 'రాజదండం' చేబూనిన మోడీ ఫొటో ప్రణాళికలో ముద్రించారు. బీజేపీ గెలిస్తే దేశం భవిష్యత్తుకు ఇదే సూచిక. అందుకే 'ఒకే దేశం ఒకే ఎన్నిక' అమలు చేస్తామన్నారు. మరోవైపు ప్రపంచంలో విస్తరిస్తున్న తమ 'ఖ్యాతి' గురించి చెప్పుకున్నారు. వంద దేశాలకు కరోనా వ్యాక్సిన్ అందించామన్నారు. మన దేశంలో వేలాదిమంది మరణిస్తున్నప్పటికీ, బడాబాబులు వ్యాక్సిన్ విదేశాలకు ఎగుమతి చేసి రూ.వేలకోట్లు గడించేందుకు కేంద్రం సహకరించిన విషయం ప్రజలు మరచిపోయారని వారి నమ్మకం. అంతరిక్ష పరిశోధనలో తమ పాత్ర ఏమీ లేకపోయినా... ఆరు దశాబ్దాల కృషి ఫలితమైన 'చంద్రయాన్ 3' ఖ్యాతిని తమ ఖాతాలో రాసుకున్నారు. ఇక్కడ తగిన ఉపాధి లేక ఇతర దేశాలకు పోయిన మేధస్సు గురించి మోడీకి బాధ లేదు. అలాంటి వారంతా సాధికారత సాధించి, ప్రపంచంతో అనుసంధానం అయినట్టు చెప్పి వీరు గర్విస్తున్నారు. ఇవన్నీ చెప్పటం ద్వారా జాతీయ దురభిమానం పెంచుతున్నారు. అభివృద్ధి పేరుతో బడాబాబులను పెంచి పోషిస్తున్నారు. వారసత్వం పేరుతో చరిత్రను వక్రీకరిస్తున్నారు. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలను ప్రభావితం చేయటం ద్వారా ప్రజల ఆలోచనల మీద పట్టు బిగించాలని ప్రయత్నిస్తున్నారు. మధ్యతరగతి సాధికారత గురించి నొక్కిచెప్పేది అందుకే. వీరికోసం గృహవసతి, రియల్ ఎస్టేట్ సవరణలు, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, మధ్యతరగతి జీవన సౌలభ్యం, ఆధునిక రోడ్లు, రైళ్ళు, ఎయిర్‌పోర్టులు, 6జిల గురించి రాసి పంచరంగుల చిత్రం చూపించారు.

అసంతృప్తి చెందిన ప్రజల దృష్టి మరలించేందుకు రాముడిని, మతాన్ని వాడుకుంటున్నారు. ఓటు బ్యాంకు కోసం మతపరమైన విభజన సృష్టిస్తున్నారు. ఎన్నికల ప్రణాళికలో కూడా రామాలయం, మతపరమైన భావోద్వేగాలు పెంచే ఎత్తుగడలు వాడుకున్నారు. ఎన్నికల సంఘం ఎందుకు కండ్లు మూసుకున్నదో అర్థం కాదు. సమస్యల పరిష్కారంలో విఫలమైన మోడీ ప్రభుత్వం రాముడి పేరు చెప్పి తప్పించుకోజూస్తున్నది. సంస్కృతి, మత స్థలాల పునరుద్ధరణ, రాముని వారసత్వం నిక్షిప్తం చేయటం, ప్రోత్సహించటం, సాంస్కృతిక పర్యాటక రంగం అభివృద్ధి పేరుతో చేయబోతున్న చర్యలు ప్రస్తావించారు. పర్యవసానాలు ఎంత భయంకరంగా ఉంటాయో అనుభవంలోకి వచ్చేదాకా అర్థం కాదు. అదే వీరి ధైర్యం. కామన్ సివిల్ కోడ్, పౌరసత్వ సవరణ చట్టం అమలు గురించి చెప్పారు.

దేశ సమతుల్యాభివృద్ధి గురించి చెపుతూనే జాతీయ సమగ్రతను విస్మరించారు. ఈశాన్య భారతం గురించి రాస్తూ హిందూ భావన కలిగించే ఫొటోలు పొందుపరిచారు. ఎన్నికల ప్రణాళికలో నిలువు నామాలతో రుషి రూపంలో కనిపించే విధంగా మోడీ ఫొటో ముద్రించారు. ఇవన్నీ దేనిని సూచిస్తున్నాయి? ప్రజలు తమ సమస్యలు మరచిపోయి ఆధ్యాత్మిక భావనతో సర్దుకుపోవాలని బీజేపీ కోరిక. కానీ దేవుడి గురించి, మతం గురించి చెప్పడానికి మత గురువులున్నారు. పూర్వీకుల నుంచి వస్తున్న నమ్మకాలున్నాయి. ప్రజలెన్నుకున్న ప్రధానమంత్రీ, ప్రజాస్వామ్యంలో ఒక రాజకీయ పార్టీగా బీజేపీ కూడా ఇవే చెప్పడాన్ని ప్రజలు అంగీకరించజాలరు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైన వీరికి మళ్లీ అధికారంలో కొనసాగే అర్హత లేదని గుర్తిస్తారు. కానీ భజనపరులనే తప్ప ప్రశ్నించేవారిని మోడీ సహించరు. నిజం చెప్పేవారిని నిలువనీయరు. తన చుట్టూ ఉన్నవారంతా మోడీని పొగడ్తలతో ముంచెత్తేవారే. కార్పొరేట్ మీడియా కూడా తన ప్రయోజనం కోసం ఇదే చేస్తున్నది. అందుకే ప్రజలంతా మోడీ మత్తులో ఉన్నారని మోడీ నమ్ముతున్నారు. ఆయనతోబాటు బీజేపీ కూడా అదే నమ్ముతున్నది. ఈ నమ్మకాలను వమ్ము చేసే శక్తి ప్రజల చేతుల్లోనే ఉన్నది. ■

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ అసెంబ్లీలో 28 మార్చి 2023న చేసిన హిందీ ప్రసంగ సారాంశాన్ని సంక్షిప్తంగా నేను ఇక్కడ తెలుగులో ఇస్తున్నాను. కేజ్రీవాల్ బయట ఉండడం తనకు ప్రమాదమని భావించే ఆయనను మోడీ, అక్రమంగా జైల్లోకి తోశారు-అనేది ధృవపడింది ఢిల్లీ సీఎం ఉపన్యాసం ఇలా సాగింది-

అదానీ పేరుతో దేశాన్ని దోచుకుంటున్నది మోడీనే!


డాక్టర్ దేవరాజు మహారాజు

* * *

అధ్యక్ష మహోదయా! నేను ఈ మధ్య ఒక బీజేపీ అగ్రనేతతో మాట్లాడడం జరిగింది. మా మధ్య చాలాసేపు సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఆ వివరాలు తెలుసుకుంటే ఇప్పుడు మీకూ, సభలోని వారందరికీ రోమాలు నిక్కబొడుస్తాయి. కండ్లు బైర్లు కమ్ముతాయి... ఆయన నన్ను ఒక ప్రశ్న అడిగాడు- "కేజ్రీవాల్ జీ మీకు ఏమనిపిస్తోంది? మోడీజీ అదానీకి ఎందుకింతగా మేలు చేస్తున్నాడూ?" -అని॥ నేనన్నాను- "వాళ్లిద్దరు మంచి మిత్రులు కదా? అందుకని మిత్రునికి సహాయ పడుతున్నాడు"- అని చెప్పాను.

"ఒస్! అంతే అనుకుంటు న్నారా?"- అని ఆయన చిన్నగా నవ్వుకుంటూ ఇంకా ఇలా అన్నాడు- "మోడీజీ ఇంతవరకు ఎవరికీ ఏమీ చేయలేదు. తన భార్యకు ఏమీ చేయలేదు. స్వంత తల్లిని ఆదుకో లేదు. గుజరాత్‌లో ఉండే సోదరుడికి, ఇంకా ఇతర కుటుంబ సభ్యులకు, బంధువర్గానికీ ఎవరికీ ఏమీ చేయలేదు. అంతేకాదు ఆయనకు రాజకీయ భిక్ష పెట్టిన రాజకీయ గురువుకే ఏమీ చేయలేదు. అలాంట ప్పుడు ఒక స్నేహితుడి కోసం నియమ నిబంధనలన్నీ పక్కకునెట్టి ఇంత పెద్ద మొత్తంలో సహాయం మీద సహాయం మళ్లీ మళ్లీ ఎందుకు చేస్తున్నాడూ? - అని ఎప్పుడైనా ఆలోచిం చారా? ఆలోచించి చూడండి"- అంటూ కొద్దిసేపు ఆగాడు. "స్వంత వాళ్లను కూడా అశ్రద్ధ చేసి ఎవరి స్వార్థం వాళ్లు చూసుకునే ఈ రోజుల్లో ఎవరైనా ఒక స్నేహితుడి కోసం దేశాన్ని తాకట్టు పెట్టే పరిస్థితి తీసుకొస్తాడా? అని ఆయన నన్ను మళ్లీ ప్రశ్నించాడు.

"అయితే మరి విషయ మేమిటో మీరే చెప్పండి"- అని అడిగాను నాకేమీ అర్థం కాక... ఆయన చెప్పడం కొనసాగించాడు.

"కొంచెం సీరియస్‌గా ఆలోచించండి. మీకే అర్థమవుతుంది! హిడెన్ బర్గ్ రిపోర్టు వచ్చింది. నాలుగు వైపులా ఛీత్కారాలు వినిపించాయి. అదానీ గ్రూపు కుప్పగూలింది. ఇది అందరికీ తెలిసిన విషయమే! మోడీజీ ఎంతటి స్వార్థ జీవి అంటే వారి మధ్య కేవలం స్నేహ బంధమే ఉంటే- ఒక్క నిమిషంలో నాకు అతనితో అంటే అదానీతో అవసరమే లేదని చెప్పి, పక్కన పెట్టేవాడు- కానీ అలా జరగలేదు. కారణం ఏమిటీ? ఇప్పటికీ ఆయనకు వెన్నుదన్నుగా ఉంటున్నాడు. ఒక్కోసారి ఆదానీకి డబ్బులివ్వండని ఎస్‌బీఐతో చెపుతున్నాడు. ఈ రోజే పత్రికల్లో వార్త వచ్చింది. పీఎఫ్ వారికి కూడా డబ్బులివ్వమని చెప్పాడట. అంటే ఆదానీకి డబ్బులిచ్చి కాపాడండని మొత్తం ఏజెన్సీలన్నింటినీ పుర మాయి స్తున్నాడు. ఎందుకూ? ఏ రాజకీయ నాయకుడూ అలా చేయడు. తనకు అప్రతిష్ట వస్తుందనుకున్న మరు క్షణమే అలాంటి వారిని దూరం పెడతారు. ఎవడో మునిగిపోతున్నాడంటే ఏ రాజకీయ నాయకుడైనా ఎందుకు పనిగట్టుకుని అన్ని వైపుల నుండి అన్నిరకాలుగా సహాయపడతాడూ? కొద్దిపాటి ఇంగిత జ్ఞానం ఉన్నవారికైనా విషయం అర్థమవు తుంది-" అని అన్నాడు ఆ బీజేపీ ముఖ్యనేత.

అవును-అందులో ఇంకా ఏదో విషయం దాగుందని నాకు అనిపించింది. అందుకే నేనన్నాను. "నిజమే కదా? మరి మోడీజీ ఎందుకు అలా చేస్తున్నాడో నాకైతే అర్థం కావడంలేదు. ఘోరంగానష్టపోయి, కూలిపోయేవారికి ఏ రాజకీయ నాయకుడైనా ఎందుకు సహాయ పడతాడూ? అసలు విషయ మేమిటో చెప్పండి!"- అని అడిగాను కొంచెం ఉత్సుకతతో.

"అసలు విషయమేమంటే-బయటికి చూపించేది అదానీని... లోపల ఉన్నది మోడీజీనే" అన్నాడు. "అరె! అదెలా?" నా ఉత్సుకత పెరిగింది.


"బయటి ప్రపంచానికి అదానీని చూపిస్తున్నాడు గానీ, లోపల ఆ డబ్బులన్నీ మోడీవే. మోడీ నుండి 10/15/20 శాతం కమీషన్ తీసుకుని పనిచేసే ఫైనాన్సియల్ మేనేజర్-అదానీ! అంతే- ప్రపంచ ఐశ్వర్య వంతుల జాబితాలో అదానీపేరు రెండోదిగా ప్రకటించినపుడు - మనం అర్థం చేసుకోవాల్సిందేమంటే ప్రపం చంలోని అత్యంత ధనవం తుల్లో మోడీ రెండవవాడిగా నిలిచాడు- అని! రేపొద్దున అధికారం కోల్పోయి JPC\ED \CBI లతో విచారణ జరిగితే గనక, దొరికిపోయేది అదానీ కాదు - మోడీనే! నిండా మునిగేది అదానీకాదు, మోడీనే! అదానీ దివాలా తీశాడంటే మోడీజీ దివాలా తీశాడనే అర్థం!!

ఆయన చెపుతున్న మాటలకు నేనాశ్చర్య పోయాను. నాకు నమ్మశక్యంగా అనిపించలేదు. అందుకే అన్నాను. "మోడీజీకి అంతడబ్బు ఎందుకూ? కుటుంబమే లేనోడు. అంత డబ్బు ఏం చేసుకుంటాడు పాపం!!"

"పాపం కాదు, కేజ్రీవాల్‌జీ అది దాహం! ధన దాహం!! అదొక పిచ్చి, అదొక మైకం.. దానికి హద్దే ఉండదు. దానికి అలవాటు పడిన వాడు వెనక్కి తగ్గడు. విచక్షణా శక్తి కోల్పో తాడు. ప్రపంచంలోని ధనవంతులంతా ధన సంపాదనలో ఇంకా ఇంకా ఎందుకు తాపత్రయపడు తున్నారూ? సామాజిక సేవా కార్యక్రమాలు ఎందుకు చేపట్టడం లేదూ? ఒక్కసారి ఆలోచించండి. ధన దాహం నెత్తికెక్కినవాడు ఒక పిచ్చివాడిలా ప్రవర్తిస్తాడు. ఎన్ని అనైతిక కార్యక్రమాలకైనా సిద్ధపడతాడు. ఏది ఏమైనా కానీయండి. వ్యక్తి గతంగా తన స్వార్థం తను చూసుకుంటాడు."- అని ఆ బీజేపీ అగ్ర నాయకుడు చెప్పినపుడు నాకొక కొత్త విషయం తెలిసినట్లయ్యింది-నమ్మక తప్పలేదు. ఆయన చెప్పిన కోణంలో ఆలోచిస్తే నిజమే! మోడీజీ ఈ పదేండ్లలో అలాంటి అనైతిక కార్యక్రమాలకే ప్రాధాన్యమిచ్చాడని అనిపించింది. అయితే, మోడీ ప్రపంచ ధనవంతుల్లో అక్రమంగా మొదటివాడిగా నిలవాలని తాపత్రయ పడుతున్నాడా? - హమ్మా!!

నా పరిస్థితి గమనించి ఆ బీజేపీ అగ్రనేత మరికొంత వివరంగా చెప్పసాగాడు. గుడ్లప్ప గించి వినడం నావంతయింది. అధ్యక్ష మహోదయా! ఆయన ఇలా చెప్పాడు- "కేజ్రీవాల్ జీ! ఆ మధ్య మోడీజీ శ్రీలంకకు వెళ్లారు. మీకు గుర్తుంది కదా? శ్రీలంక రాష్ట్రపతి రాజపక్స, రాజపక్సను కలిసి అక్కడి విండ్ ప్రాజెక్ట్‌ను బలవంతంగా అదానీ గ్రుపునకు ఇప్పించి వచ్చాడు. ఆ స్థాయి నేతలు ఎవరైనా అంతగా దిగజారి మీ ప్రాజెక్ట్ నేను చెప్పినవారికే ఇవ్వండని ప్రాధేయపడరు. కానీ, నైతికతను, స్థాయిని, హోదాను మరిచిన మోడీ దేశ ఔన్నత్యాన్ని కూడా లెక్కచేయకుండా రాజపక్స దగ్గర దేబరించి, విండ్ ప్రాజెక్ట్ అదానీకి ఇప్పించి వచ్చాడు. అంటే ఏమిటీ లోపాయకారిగా ఆ ప్రాజెక్ట్ తనే తీసుకున్నాడు. ఈ విషయం ఎలా బయటికి వచ్చిందీ అంటే- శ్రీలంక పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ, అక్కడి విద్యుత్ బోర్డు ఛైర్మన్‌ను విచారిస్తున్నప్పుడు అసలు విషయం బయటపడింది. మోడీ బలవంతం మీద రాజపక్స చెపితేనే తను ఆ ప్రాజెక్ట్ అదానీ గ్రూపుకు ఇవ్వాల్సి వచ్చిందని ఆయన అన్నాడు. ఇక బంగ్లాదేశ్ వారికి విద్యుత్ కావల్సి వచ్చింది-1500 మెగావాట్ విద్యుత్తు 25 ఏండ్ల కొరకు! మోడీజీ ఆ ప్రాజెక్ట్ కూడా అదానీకే ఇప్పించాడు. అంటే తన ఖాతాలో వేసుకున్నాడని అర్థం! మోడీజీ ఇజ్రాయిల్ వెళ్లాడు. ఇజ్రాయిల్‌తో మన దేశానికి రక్షణ సంబంధమైన కొనుగోళ్లు ఉన్నాయి. ఆ వ్యాపారమంతా మోడీ అదానీకి ఇప్పించాడు. అంటే తనకే ఇప్పించుకున్నాడు. రెండు మూడేండ్ల క్రితం దేశంలోని ఆరు విమానాశ్రయాల్ని ప్రయివేటు పరం చేయడానికి వేలం వేశారు. అందులో ఉన్న ముఖ్య నిబంధన ఏమిటంటే-'ఎయిర్ పోర్ట్ నిర్వహణలో అనుభవమున్నవారే వేలం పాటలో పాల్గొనాలి!' అని ఉంది. అయితే చివరి క్షణంలో ఆ నిబంధన తొలగించి, ఎయిర్ పోర్ట్ నిర్వహణలో ఏ మాత్రం సంబంధం లేని అదానీకి వాటిని అప్ప గించారు. అంటే ఏమిటీ? ఎయిర్‌పోర్ట్ నిర్వహణ ఏ మాత్రం తెలియని మోడీ వాటిని తీసుకున్నాడు. ఏ ప్రభుత్వమైనా ఆయా శాఖల్లో అనుభవమున్న వారినే ఎన్నిక చేసుకుంటుంది కదా? కానీ, మోడీ ప్రభుత్వంలో అధికారం ఇలా దుర్వినియోగ మయ్యింది."

కొంచెం ఊపిరి తీసుకుని, ఆ అగ్రనేత మళ్లీ ప్రారంభించాడు. నా చెవులను నేను నమ్మలేకుండా వింటూ కూర్చున్నాను.



> "బయటి ప్రపంచానికి అదానీని చూపిస్తున్నాడు గానీ, లోపల ఆ డబ్బులన్నీ మోడీవే. మోడీ నుండి 10/15/20 శాతం కమీషన్ తీసుకుని పనిచేసే ఫైనాన్సియల్ మేనేజర్-అదానీ! అంతే- ప్రపంచ ఐశ్వర్యవంతుల జాబితాలో అదానీపేరు రెండోదిగా ప్రకటించినపుడు - మనం అర్థం చేసు కోవాల్సిందేమంటే ప్రపంచంలోని అత్యంత ధనవంతుల్లో మోడీ రెండవవాడిగా నిలిచాడు-అని! రేపొద్దున అధికారం కోల్పోయి భూజల జుణ లజబీX లతో విచారణ జరిగితే గనక, దొరికిపోయేది అదానీ కాదు - మోడీనే! నిండా మునిగేది అదానీ కాదు, మోడీనే! అదానీ దివాలా తీశాడంటే మోడీజీ దివాలా తీశాడనే అర్థం!!

"కేజ్రీవాల్‌జీ మీకు తెలుసా? నవంబర్ 2021 నుంచి దేశంలోని విమానాశ్రయాలలో జరిగే వ్యాపార లావాదేవీలలో 30 శాతం డబ్బు ఎవరికి పోతోంది? అంటే-అదానీ పేరుతో మోడీ జేబులోకి పోతోంది. ED\CBI వంటి తుపాకులు గురిపెట్టి, బెదిరించి ఫ్యాక్టరీలు లాక్కుంటున్నది. ఎవరి కోసమో కాదు, మోడీ తన స్వంతానికే' 10 అక్టోబర్ 2018న క్రిష్ణపట్నం ఎయిర్‌పోర్ట్ మీద ఇన్ కంటాక్స్ సోదాలు నిర్వహించి - అదానీ పేరు చెప్పి దాన్ని మోడీ స్వంతం చేసుకున్నాడు. 10 డిసెంబరు 2020 ఎసిసి, అంబుజా సిమెంట్ ప్లాంట్స్ మీద ED\CBI\IT సోదాలు నిర్వహించి క్రమంగా వాటిని అదానీ పేరుతో మోడీ తన ఖాతాలో వేసుకున్నాడు. ఇకపోతే ముంబై విమానాశ్రయం -20 జులై 2020న దాని యజమాని జివికె మీద సోదాలు నిర్వహిం చారు. ఒక్కటే బెదిరింపు- "ఇచ్చేసి వెళ్లు -లేదా జైలుకెళ్లి కూచో-"అని! అలా కంపనీలు, ఫ్యాక్టరీలు, విమానాశ్రయాలు- అన్నింటికీ అదే దౌర్జన్యం! తలకు తుపాకి గురిపెట్టి 'ఇస్తావా' ఛస్తావా?' అన్న విధంగా మోడీ దౌర్జన్యం నిరాఘాటంగా సాగుతూ వస్తోంది".


"కేజ్రీవాల్ జీ! అర్థమవుతోంది కదా? ఇంకా చెప్పండి-మోడీ అవినీతికి కొత్తదారులు ఎలా వేశాడో- రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం ఒక చిత్రమైన ఆదేశం జారీ చేసింది. ప్రతి రాష్ట్రం తమ పవర్‌ప్లాంట్‌కు అవసరమ య్యే పదిశాతం ఇంపోర్టెడ్ కోల్ (విదేశ బొగ్గు) అదానీ నుంచి కొనుగోలు చేయాలని ఆ ఆర్డరు సారాంశం! అవసరం ఉన్నా లేకున్నా తప్పక కొనాలని ఆదేశించింది.

దేశంలో దొరికే బొగ్గు టన్నుకు రూ.2 వేలయితే, విదేశాల బొగ్గు రూ.20 వేలు. అంటే పదిరెట్లు ఎక్కువ ధర పెట్టి తప్పనిసరిగా మోడీ (అదానీ)బొగ్గు కొనాల్సి ఉంటుంది. ఈయన దేశానికి ప్రధానా? నియంతా? దౌర్జన్య వ్యాపారా? దేశాన్ని ఇంతగా వంచించే నేత మనకు అవసరమా? బొగ్గు విలువలు ఏ ప్రయివేటు కంపెనీ దగ్గర ఉండకూడదనీ, కేవలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలోనే ఉండాలని లోగడ సుప్రీంకోర్టు ఒక తీర్పు ఇచ్చింది. దానికి విరుగుడు మోడీ కనుక్కున్నాడు. 4వేల కేలరీల కన్నా తక్కువ ఉన్న బొగ్గు రిజెక్టెడ్ (నాణ్యత లేని)ది అని - అదానీకి ఉచితంగా అప్పగించాడు. అంటే తనకే పంపించు కున్నాడు. అసలైతే అదంతా నాణ్యత గల బొగ్గు అధికార దుర్వినియోగంతో 'రిజెక్టెడ్' అని చెప్పి, ఉచితంగా కాజేయడమన్న మాట! ఆ రకంగా ఈ దేశ ఖజానా నుంచి రూ.2800 కోట్లు మోడీ లాగేస్తున్నాడు. 2014లో అదానీ (మోడీ) ఆదాయం రూ.50 వేల కోట్లయితే, ఏడేండ్ల తర్వాత అది 11.5 లక్షల కోట్లు అయ్యింది."

"మోడీజీకి చదువు లేదు. ఇంగ్లీషు రాదు, ఆర్థిక పరిజ్ఞానం లేదు. ప్రపంచ పరిజ్ఞానం శూన్యం అందుకే అదానీని సలహాదారుగా చేసుకుని, అతనికి కొంత కమీషనిస్తూ తన అధికారాన్ని దుర్వినియో గం చేస్తూ. దేశాన్ని దోచుకుంటున్నాడు.- ఇంతటి అవినీతి ప్రధాని మనకు గతంలో ఎవరూ లేరు. విదేశాల నాయకులొస్తే వారితో ఫొటోలు తీయించుకోవడం సరే-కానీ, దేశాన్ని తాకట్టుపెట్టే ప్రయాదకరమైన ఒడంబడికల మీద ఎక్కడెక్కడ సంతకాలు చేస్తున్నాడో ఏమో? దేశ ప్రజలు నిజాలు గ్రహించి, మోడీ-బీజేపీల నుంచి అధికారం తక్షణమే లాగేసుకోవాలి! తప్పదు!! దేశాన్ని కాపాడుకోవాలి!!!" అంటూ కేజ్రీవాల్ ముగించాడు.

- కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త (మెల్బోర్న్ నుంచి) ■

మత రాజ్యంలో...మహిళ!



ఓ నా పవిత్ర దేశమా..!!
నీకు మరోసారి శిరసా నమామి
మహిళగా ఇక్కడ పుట్టినందుకు
నిస్సిగ్గుగా నీరాజనాలు
అర్పించుకుంటున్న..!
"యత్ర నార్యంతు పూజ్యతే
రమంతే తత్ర దేవతా' అంటారు
ఏదీ..!!? అదేదీ కానరాదే
నా పుణ్య భూమిన
వల్లించేందుకు అల్లిన
కల్లబొల్లి కల్పితాలు..
"బేటీ బచావో,బేటీ పడావో"
ఏది ఎక్కడా..!?
అంతరంగం నుంచి వెలువడని
ఆ పదాల అమలు కనబడదే..!?
"ధృతరాష్ట్ర పాలనలో
ద్రౌపదీ అవమానం ఎవరికి
వినబడుతుందని".!
అయినా..నా దేశం పవిత్ర దేశమే
భారతీయులందరూ నాసహోదరులే

నేనే కానిదాన్ని..!
నా కర్మభూమి నడిగడ్డ మీద
సార్వభౌమాధినేత కూడా
ఓ గిరిజన మహిళనే..!
అయినా మణిపూర్
మారణకాండ చల్లారదు..
ఏవో కొన్ని చట్టాలూ,
న్యాయాలూ ఉంటాయి
వాటిని అమలుపరిచే చిత్తశుద్ధి ఏదీ!?
"వెనకటికెవరో చక్రవర్తి
రోమ్ నగరం తగలబడుతున్నా
ఫిడేల్ వాయించాట్ట"
అలా ఉంది ఏలికల తీరు
సుమోటోగా రాని న్యాయం
ఎవరికోసమో ఎందుకోసమో
అంతకన్నా..ఆదిమ జాతుల్లోనే నయం
అప్పటికప్పుడే కన్నుకు కన్నూ
పన్నుకు పన్నూ తీర్పు..

ఏ మూల చూసినా..
ఏ రోజు చూసినా
ఏముంది గర్వకారణం
మహిళలపై అత్యాచారాల పర్వాలే
పైగా పైకి పొక్కకుండా
ఎప్పటికప్పుడూ వాటిని
మెత్తి కమ్మెయ్యరూ..!?
మణిపురా..మహారాష్ట్రనా..
గుజరాతా కాదు అడుగడుగునా
ఆడవాళ్లపై అఘాయిత్యాలే..!
మహిళలనిక్కడ వివస్త్రలను చేసి
ఊరేగించి హింసించడం
అనాదిగా వస్తున్న సనాతన
ధర్మం కదా
కండ్ల ముందటే సామూహిక దాడి
కిమ్మన్న నాధుడు కరువాయే..!
అన్నట్టు..మీకు తెలియదేమో
ఇక్కడ మహిళలని ప్రతిమలుగా
ఉంటేనే
పూజిస్తారు, ఆరాదిస్తారు,అభిషేకిస్తారు
ప్రాణాలతో కంటబడితే,
వెంటాడి వేటాడి అంతు చూదరూ.!
డెబ్బై ఐదేండ్లయినా స్వతంత్ర
స్వర్ణోత్సవ భరతమా..!
నీ మత మదాంధ రాజకీయ
ఎత్తుగడలలో
మహిళలెప్పటికీ పావులేనా..!!

-నాంపల్లి సుజాత
9848059893

విద్యుత్‌పై చర్చకు సిద్ధం..



- కేసీఆర్‌వన్నీ అబద్ధాలే..
- ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

'విద్యుత్ సమస్యపై చర్చించేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మీరు సిద్ధంగా ఉన్నారా? అని ఆ విషయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నీ అబద్ధాలే చెబుతున్నారు. ఎన్నికలకు ముందు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు.' అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల ఓ మీడియా ఛానల్ ఇంటర్వ్యూలో, తాజాగా బహిరంగ సభల్లో కేసీఆర్ చేసిన ప్రకటనలు, వాఖ్యల డొల్ల తనాన్ని ఈ సందర్భంగా భట్టి ఎండగట్టారు. గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో విద్యుత్ రంగం కోలుకోలేని నష్టాలకు గురైందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అసమర్థత, నిర్లక్ష్యం మూలంగా ఆ రంగాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని పేర్కొన్నారు. అవరోధాలన్నింటిని అధిగమించి రెప్పపాటు కూడా కరెంటు పోకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాబోయే 30 ఏండ్లకు రాష్ట్ర ప్రజల విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని వాటిని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామన్నారు. పార్లమెంటు ఎన్నికలకు ముందు కేసీఆర్ చేస్తున్న ప్రకటనలు, వాస్తవాలపై చర్చకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. దీర్ఘకాలిక అవసరాల కోసం చత్తీస్‌ఘడ్ నుంచి విద్యుత్తు కొనుగోలు చేశామంటూ కేసీఆర్ చెప్పిన మాటల్లో వాస్తవం లేదని తెలిపారు. మే6, 2017 నుంచి వెయ్యి మెగావాట్ల విద్యుత్ సరఫరాకు డిసెంబర్ 2014లో ఒప్పందం చేసుకున్నారనీ, కానీ తెలంగాణ డిస్కమ్‌లకు 300 నుంచి 400 మెగా ఓట్ల కన్నా ఎక్కువ సరఫరా చేయలేదని పేర్కొన్నారు. పైగా ఏప్రిల్ 2022 నుంచి విద్యుత్ సరఫరాను పూర్తిగా ఆపేశారన్నారు. చత్తీజ్‌సడ్‌తో చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేయించటంలో నాటి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. ఇది వాస్తవం కాగా..పూర్తి అబద్ధాలతో ఆయన ప్రచారం చూస్తున్నారనీ, ఇలాంటి దుష్ప్రచారాన్ని మానుకోవాలని హితవు పలికారు. తాము అధికారంలోకొచ్చిన మూడు నెలల్లోనే 24 గంటల కరెంటు ఇచ్చామని తెలిపారు. గత ప్రభుత్వ పాపాల మూలంగా తెలంగాణ డిస్కంలు వేలకోట్లలో అప్పుల్లో కూరుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆవిర్భావ సమయానికి డిస్కంల నష్టాలు రూ. 12, 186 కోట్లు కాగా బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఆ నష్టాల భారం రూ.62 ,461 కోట్లకు చేరిందని భట్టి ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు.

రిజర్వేషన్ల రద్దుకు మోడీ- షా కుట్రలు

(మొదటిపేజీ తరువాయి)

రిజర్వేషన్లు లేకుండా పాలించారని గుర్తు చేశారు. అదే విధంగా బీజేపీ మాతృ సంస్థ అయిన ఆర్ఎస్ఎస్ ప్రధాన ఎజెండా రిజర్వేషన్ల రద్దని, దాన్ని అమలు చేయడానికి సూరత్ నుంచి మోడీ, షా బయలుదేరారని తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి నామినేషన్ దాఖలు అనంతరం ఏర్పాటు చేసిన రోడ్డు షోలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్.. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం రిజర్వేషన్లు తీసుకొస్తే.. బీజేపీ ఈ ఎన్నికల్లో 400 ఎంపీ సీట్లు వస్తే రిజర్వేషన్లు రద్దు చేయాలని చూస్తోంద న్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, గిరిజన, ఆదివాసీల సంక్షేమం కోసం నాటి మేధావులు రాజ్యాంగాన్ని రచించారని, అలాంటి రాజ్యాంగాన్ని రద్దు చేసే కుట్రలు చేస్తే దేశ ప్రజలు తరిమి తరిమి కొట్టే పరిస్థితి వస్తదని హెచ్చరించారు. నమో బీజేపీ అంటూ బయలుదేరిన బీజేపీ నాయకుల మాటలు నమ్మితే మోసం పోవడం తప్పదన్నారు. 2014 ఎన్నికల్లో మోడీ ప్రతి పేదవాడి బ్యాంక్ ఖాతాలో రూ.15లక్షలు వేస్తానని చెప్పి పైసా కూడా వేయలేదని విమర్శించారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి పదేండ్లలో 7 లక్షల ఉద్యోగాలు కూడా దాటలేదన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని.. రైతుల నడ్డి విరిచేలా నల్లచట్టాలు తీసుకు వచ్చేందుకు కుట్రలు చేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వం చేవెళ్ల పార్లమెంట్‌కు అన్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్ వికారాబాద్‌ను శాటిలైట్ సిటీగా గుర్తించి రూ. 2 కోట్ల నిధులు కేటాయిస్తే బీజేపీ రద్దు చేసిందని తెలిపారు. ఐటీఐఆర్‌ను రద్దు చేసిందన్నారు. ఇలాంటి పార్టీకి ఇక్కడ ఓట్లడిగే నైతిక హక్కులేదని అన్నారు. ఈ ప్రాంతంలో బీజేపీ నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కొండ విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబానికి మంచి పేరు ఉందని, బీజేపీతో జతకట్టి కుటుంబ చరిత్రను కలుషితం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కారు పార్టీ షెడ్‌కు వెళ్లిందని, తిరిగి వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. కేసీఆర్, కేటీఆర్ మాత్రం కారు.. మళ్లీ రోడ్డెక్కుతుందని కలలుకంటున్నారన్నారు. పదేండ్ల కాలంలో కేసీఆర్‌కు ప్రజలు గుర్తుకు రాలేదని, పదవి పోయిన తర్వాత తిరిగితే నమ్ముతారా అని ప్రశ్నించారు. అసెంబ్లీకి వచ్చేందుకు చేతకాని కేసీఆర్.. గంటల కొద్ది టీవీ చానల్ వద్ద కూర్చొని మాట్లాడితే ప్రజలు నమ్మేపరిస్థితి లేదన్నారు.

మ్యానిఫెస్టో గురించి వివరిస్తాం

- సమయం ఇవ్వండి : మోడీకి ఖర్గే లేఖ

న్యూఢిల్లీ : న్యాయ్ సంకల్ప పేరుతో కాంగ్రెస్ ఇటీవల విడుదల చేసిన మ్యానిఫెస్టోపై వివరణ ఇస్తామని, దీనికి సమయం కేటాయించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఆ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే లేఖ రాసారు. ఇటీవల ఎన్నికల సభల్లో కాంగ్రెస్ మేనిఫెస్టోపై మోడీ తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఖర్గే ఈ లేఖ రాసారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో గురించి ప్రధానమంత్రి మోడీకి అతని సహాయకులు తప్పుగా చెప్పి ఉంటారని కాబట్టి మేం మ్యానిఫెస్టోపై పూర్తి వివరణ ఇస్తామని ఖర్గే లేఖలో తెలిపారు.

ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ... పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు షెడ్యూల్ విడుదల

- మే2న నోటిఫికేషన్, 27న పోలింగ్
- జూన్ 5న ఓట్ల లెక్కింపు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం గురువారం విడుదల చేసింది. ఈ ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ మే 2న జారీ కానుంది. నోటిఫికేషన్ విడుదై లనాటి నుంచి మే 9 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. మే10న వాటిని పరిశీలించనున్నారు. నామినేషన్ల ఉపసం హరణకు చివరి తేదీ మే 13 కాగా, ఉప ఎన్నికకు అదే నెల 27నఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించ నున్నారు. జూన్ 5న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజక వర్గానికి ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్ రెడ్డి.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికైన సంగతి తెలిసిందే. దీంతో ఈ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. కాగా ఈ ఉప ఎన్నికల కోసం చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న)ను కాంగ్రెస్ తన అభ్యర్థిగా ప్రకటించింది.

వేడిగాల్పులతో ఉక్కిరిబిక్కిరి

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ఎండలు మండిపోతున్నాయి. ముఖ్యంగా దక్షిణ తెలంగాణ జిల్లాల్లో భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. గురువారం కూడా రాష్ట్రంలో పలుచోట్ల 45 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు దాటాయి. వచ్చే వారం రోజుల్లో ఈ ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముంది. ఒకటెండ్రు మినహా అన్ని జిల్లాల్లోనూ గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటిపోయాయి. మరోవైపు వేడిగాలుల తీవ్రత పెరిగింది. ఉదయం 9 గంటల నుంచి రాత్రి ఏడెనిమిది గంటల వరకు వేడిగాల్పులు వీస్తున్నాయి. దీనికితోడు ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. ఇంట్లో ఫ్యాన్లు, కూలర్లు పెట్టుకున్నా వేడిగాల్పులే వస్తున్న పరిస్థితి. 26 నుంచి 29 తేదీ వరకు రాష్ట్రంలో నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట, కొమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి,ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. అదే సమయంలో పలు జిల్లాల్లో ఒకటెండ్రు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడొచ్చని సూచించింది. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రణాళికా సొసైటీ(టీఎస్‌డీపీఎస్) నివేదిక ప్రకారం గురువారం ఉదయం 8:30 నుంచి రాత్రి 10:00 గంటల వరకు రాజన్నసిరిసిల్లలోని గంభీరావుపేట, వికారాబాద్ జిల్లా మర్పల్లిలో తేలికపాటి వర్షం కురిసింది.

ఎన్నికేదైనా జెండా సిరిసిల్లదే..

- పార్లమెంట్ ఎన్నికలకు ఆర్డర్లు.. ఫుల్
- నేత కార్మికులకు చేతినిండా పని





నవతెలంగాణ – సిరిసిల్ల

దేశంలో ఎక్కడ ఎన్నికల జరిగినా అక్కడ సిరిసిల్ల జెండా ఎగరాల్సిందే. సిరిసిల్ల నేతన్నల నైపుణ్యాన్ని మెచ్చిన రాష్ట్ర స్థాయి, జాతీయస్థాయి రాజకీయ పార్టీలు తమ ప్రచార జెండాలు, కండువాలు, ఇతర వస్త్ర సామాగ్రి ఆర్డర్లను సిరిసిల్ల నేతన్నలకు ఇస్తున్నారు. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న వేళ సిరిసిల్ల నేతన్నలకు మెండుగా ఉపాధి లభిస్తోంది. తెల్లని వస్త్రాన్ని ఉత్పత్తి చేసి దానిపై వివిధ పార్టీలకు చెందిన నాయకుల ఫొటోలు, గుర్తులు, పార్టీలకు సంబంధించిన కలర్స్‌తో పూర్తి స్థాయి జెండాలు, కండువాలు తయారవుతున్నాయి. తక్కువ ధరలకే ఎన్నికల ప్రచార సామాగ్రిని సరఫరా చేస్తూ జాతీయ స్థాయి పార్టీల చూపు సిరిసిల్ల వైపు చూసేలా చేస్తున్నారు నేతన్నలు. కార్మికులకు ఎలక్షన్ సందడితో చేతినిండా పని దొరుకుతోంది.



తెలుగు రాష్ట్రాల ఆర్డర్లు..

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన రాజకీయ పార్టీల ఆర్డర్లు సిరిసిల్ల నేతన్నలకు ఇప్పటికే అందాయి. ఆ మేరకు కార్మికులు ఉత్పత్తి ప్రారంభించారు. పార్టీ జెండా తయారీకి మీటరున్నర వస్త్రం, కండువా తయారీకి మీటర్ వస్త్రాన్ని వాడుతున్నారు. వివిధ పార్టీలు ఆర్డర్‌లను బట్టి జెండాలను, కండువాలను తయారు చేస్తున్నారు. ఇప్పటికే అధికారపార్టీ కాంగ్రెస్ 5లక్షల మీటర్ల ఆర్డర్‌లను ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ ఎన్నికలు జరుగుతుండటంతో అధికారపార్టీ అయినా వైసీపీ రూ.5లక్షల మీటర్ల ఆర్డర్ ఇచ్చింది. మిగతా రాజకీయ పార్టీలు కూడా ఆర్డర్లను ఇచ్చాయి. ప్రస్తుతానికి జెండాలు, కండువాలను తయారు చేస్తున్నారు. జెండాలు తయారు చేసే నేతన్నలు రూ.9 చొప్పున మీటరు వస్త్రాన్ని కొనుగోలు చేస్తారు. దీనికి ప్రింటింగ్ కోసం రూ.8 ఖర్చవుతుంది. ఒక జెండా తయారీకి రూ.17 ఖర్చవుతుంది. ఉత్పత్తిదారులు ఈ జెండాలను రూ.19నుంచి రూ.20 విక్రయిస్తున్నారు.

నేత కార్మికులకు ఉపాధి ..

ప్రస్తుతం జెండాల ఉత్పత్తిలో సిరిసిల్లలో దాదాపు 1500మంది నేత కార్మికులు ఉపాధి పొందుతున్నారు. జెండా కట్ చేస్తే ఒక్కో జెండాకు 25పైసలు, కుట్టిస్తే 40పైసలు చొప్పున ఇస్తారు. జెండాల తయారీ కార్ఖానాలో జెండాలను కట్ చేస్తూ స్థానికులు, కుట్టు పని చేస్తూ కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఇంకా ఆర్డర్‌లు పెరిగితే ఈ ఉపాధి పెరుగనుంది. రాజకీయ పార్టీల తమ అభ్యర్థులను పూర్తిగా ప్రకటిస్తే మరిన్ని ఆర్డర్లు పెరుగుతాయిని ఉత్పత్తిదారులు చెబుతున్నారు.

రెండు రాష్ట్రాలకు సిరిసిల్ల నుంచే..

సిరిసిల్లలో తయారైన వివిధ పార్టీల జెండాలను రెండు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. తెలంగాణలోని ఇతర జిల్లాలకు చెందిన ప్రింటింగ్ వ్యాపారస్తులు ఎంపీ అభ్యర్థుల ఆర్డర్‌లు, ఆంధ్రప్రదేశ్‌లోని ఎమ్మెల్యే అభ్యర్థుల ఆర్డర్లు తీసుకుని సిరిసిల్లలో ఇస్తుంటారు. నేరుగా అభ్యర్థులతోకాక మధ్యవర్తులతో కూడా కొన్ని ఆర్డర్లు లభిస్తాయి. ప్రధానంగా ఉమ్మడి రాష్ట్రంలో చూసుకుంటే ఒక్క సిరిసిల్లలోనే జెండాలు తయారవుతున్నాయి.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన తెలుగు తేజాలు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

దేశంలో ఎన్ఐటీలు, త్రిపుల్ ఐటీల్లో ప్రవేశం, ఐఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక కోసం నిర్వహించే జేఈఈ మెయిన్ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) గురువారం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో మరోసారి సత్తాచాటారు. దేశవ్యాప్తంగా 56 మంది విద్యార్థులు వంద పర్సెంటైల్ స్కోర్‌ను సాధించారు. వారిలో 22 మంది తెలుగు విద్యార్థులే ఉండడం విశేషం. ఈ ఘనతను సాధించిన వారిలో తెలంగాణ నుంచి 15 మంది, ఏపీ నుంచి ఏడుగురు విద్యార్థులున్నారు. ఈనెల నాలుగు నుంచి 12 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ మెయిన్ రెండో విడత రాతపరీక్షలకు 11,79,569 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారిలో 10,67,959 మంది హాజరయ్యారు. జనవరి 27 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు జేఈఈ మెయిన్ మొదటి విడత రాతపరీక్షలకు 12,21,624 మంది దరఖాస్తు చేయగా, 11,70,048 మంది అభ్యర్థులు హాజరయ్యారు. రెండు విడతలకు కలిపి 14,76,557 మంది దరఖాస్తు చేస్తే, వారిలో 14,15,110 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. మొదటి విడతలో 23 మంది వంద ఎన్టీఏ స్కోర్‌ను సాధించారు. వారిలో పది మంది తెలుగు విద్యార్థులే ఉండడం గమనార్హం. ఇందులో తెలంగాణ విద్యార్థులు ఏడుగురు, ఏపీ విద్యార్థులు ముగ్గురున్నారు. మొదటి, రెండు విడతలకు హాజరైన విద్యార్థుల మెరుగైన స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుని మెరిట్ జాబితాను ఎన్టీఏ గురువారం విడుదల చేసింది. కేటగిరీల వారీగా కటాఫ్ మార్కులను కూడా ప్రకటించింది. దేశవ్యాప్తంగా 2.50 లక్షల మంది అభ్యర్థులను జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేసింది.

జేఈఈ మెయిన్ టాపర్ల వివరాలు

1. గజారే నీల్‌కృష్ణ నిర్మల్‌కుమార్– మహారాష్ట్ర
2. దక్షేష్ సంజయ్ మిశ్రా–మహారాష్ట్ర
3. ఆరవ్ భట్–హర్యానా
4. ఆదిత్య కుమార్– రాజస్థాన్

వంద పర్సెంటైల్ సాధించిన తెలంగాణ విద్యార్థులు

1. హుందేకర్ విదిత్
2. ముత్తవరపు అనూప్
3. వెంకట సాయితేజ మదినేని
4. రెడ్డి అనిల్
5. రోహన్ సాయి పబ్బా
6. శ్రీయాశస్ మోహన్ కల్లూరి
7. కేసం చన్న బసవరెడ్డి
8. మురికినాటి సాయి దివ్యతేజ రెడ్డి
9. రిషి శేఖర్ శుక్లా
10. తవ్వ దినేశ్‌రెడ్డి
11. గంగ శ్రేయాష్
12. పొలిశెట్టి రితీశ్ బాలాజీ
13. తమటం జయదేవ్ రెడ్డి
14. మావూరు జశ్విత్
15. దొరిసాల శ్రీనివాసరెడ్డి

వంద పర్సెంటైల్ సాధించిన ఏపీ విద్యార్థులు

1. చింటు సతీష్ కుమార్
2. షేక్ సూరజ్
3. మకినేని జిష్ణుసాయి
4. తోటంశెట్టి నిఖిలేష్
5. అన్నరెడ్డి వెంకట తనీష్‌రెడ్డి
6. తోట సాయికార్తీక్
7. మురసాని సాయి యశ్వంత్‌రెడ్డి

రేపటినుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తు

జేఈఈ మెయిన్‌లో కటాఫ్ మార్కులు సాధించిన 2.50 లక్షల మంది అభ్యర్థులు అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత సాధించారు. శనివారం నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. వాటి సమర్పణకు వచ్చేనెల ఏడో తేదీ వరకు గడువున్నది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌ను ఐఐటీ మద్రాస్ నిర్వహిస్తున్నది. వచ్చేనెల 17 నుంచి 26 వరకు అడ్మిట్ కార్డులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. అదేనెల 26న ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్–2 రాతపరీక్షలను నిర్వహిస్తారు. జూన్ తొమ్మిదిన జేఈఈ అడ్వాన్స్‌డ్ రాతపరీక్షల ఫలితాలను విడుదల చేస్తారు.

జేఈఈ మెయిన్ ఫలితాల్లో శ్రీచైతన్య రికార్డు



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

జేఈఈ మెయిన్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు సంచలన రికార్డు సృష్టించారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ మాట్లాడుతూ తమ విద్యార్థులు 300కి 300 మార్కులతో ఆలిండియా ఒకటి, మూడు, ఆరు, తొమ్మిది ర్యాంకులను సాధించారని వివరించారు. ఓపెన్ కేటగిరీలో వందలోపు 25 ర్యాంకులు, 200లోపు 46 ర్యాంకులు, వెయ్యిలోపు 200 ర్యాంకులను కైవసం చేసుకున్నారని చెప్పారు. 300కి 300 మార్కులు సాధించి కెసి బసవ రెడ్డి ఆలిండియా ఒకటో ర్యాంకు, తోటంశెట్టి నిఖిలేష్ మూడో ర్యాంకు, హిమాన్షు తలార్ ఆరో ర్యాంకు, రెడ్డి అనిల్ తొమ్మిదో ర్యాంకు పొందారని అన్నారు. టాప్ పదిలోపు నాలుగు ర్యాంకులను తమ విద్యార్థులు సాధించారని చెప్పారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలో వంద పర్సెంటైల్ సాధించిన విద్యార్థులు 272 మంది ఉన్నారని వివరించారు. ఈ ఘనత సాధించిన విద్యాసంస్థ శ్రీచైతన్య మాత్రమేనని అన్నారు. ఇందుకు కారణమైన విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందిని ఆమె అభినందించారు. అనితర సాధ్యమైన ప్రోగ్రాములు, మైక్రో షెడ్యూళ్లు, ఇంటర్నల్ పరీక్షలు, ర్యాంకింగ్ విధానం, ఇన్ఫినిటీ లెర్న్ ఆన్‌లైన్ యాప్‌తోపాటు నిరంతరం శ్రమించే అధ్యాపకుల వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని చెప్పారు. జేఈఈ అడ్వాన్స్‌డ్, నీట్ పోటీ పరీక్షల్లోనూ ఆలిండియా ఓపెన్ కేటగిరీలో నెంబర్‌వన్ ర్యాంకులను సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

జేఈఈ మెయిన్ ఫలితాల్లో నారాయణ చరిత్ర



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

జేఈఈ మెయిన్ ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు చరిత్రను సృష్టించారు. ఈ మేరకు నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు పి సింధూర నారాయణ, శరణి నారాయణ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓపెన్ కేటగిరీలో ఆలిండియా ఒకటి, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది, పది, 12 ర్యాంకులను తమ విద్యార్థులు సాధించారని తెలిపారు. పదిలోపు ఆరు, 12లోపు ఏడు ర్యాంకులతో నారాయణ విద్యాసంస్థ ప్రభంజనం సృష్టించిందని పేర్కొన్నారు. వందలోపు 28, వెయ్యిలోపు 171 ఓపెన్ కేటగిరీ ర్యాంకులతో ఆలిండియా లీడర్‌గా నారాయణ నిలిచిందని తెలిపారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో జి నీల్‌కృష్ణ ఒకటో ర్యాంకు, హెచ్ విదిత్ ఐదో ర్యాంకు, ఎం అనూప్ ఆరో ర్యాంకు, ఎం సాయితేజ ఏడో ర్యాంకు, సిహెచ్ సతీష్‌కుమార్ ఎనిమిదో ర్యాంకు, ఆర్యన్ ప్రకాష్ పదో ర్యాంకు, పి రోహన్ సాయి 12వ ర్యాంకు కైవసం చేసుకున్నారని వివరించారు. జేఈఈ మెయిన్ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు విజయదుందుభి మోగించారని పేర్కొన్నారు. అనితర సాధ్యమైన శిక్షణ, పరిశోధనాత్మకమైన కార్యక్రమాలు, పటిష్ట ప్రణాళిక, స్టడీ మెటీరియల్, నిబద్ధతతో కూడిన వారాంతపు పరీక్షల వల్లే ఈ ఘనత సాధ్యమైందని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అందుకు సహకరించిన అధ్యాపకులు, బోధనేతర సిబ్బందిని వారు అభినందించారు.

పటాన్‌చెరు ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

- బొగ్గు లారీని వెనుకనుంచి ఢీకొట్టిన కారు
- కారులో మంటలు చెలరేగి.. ఒకరు సజీవ దహనం
- లారీకీ అంటుకున్న మంటలు..
- మంటలార్పిన అగ్నిమాపక సిబ్బంది



నవతెలంగాణ–పటాన్‌చెరు

ఆగి ఉన్న బొగ్గు లారీని వెనకనుంచి కారు ఢీకొన్న ఘటనలో ఒకరు సజీవ దహనమైన సంఘటన ముత్తంగి రింగ్ రోడ్డుపై గురువారం తెల్లవారు జామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్పూర్ మండలం బీరంగూడకు చెందిన శిరీష్ (33) వ్యాపారం చేస్తుంటాడు. కాగా గురువారం ఉదయం ఐదున్నర గంటల సమయంలో వ్యాపారం నిమిత్తం రింగ్ రోడ్డుపై నుంచి హైదరాబాద్‌కు ఎర్టికా కారులో బయలుదేరారు. కాగా, మండల శివారులోని ముత్తంగి ఔటర్ రింగ్ రోడ్డుపై ఆగి ఉన్న బొగ్గు లారీని వెనకాల నుంచి కారు ఢీకొట్టగా ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగి కారు పూర్తిగా దగ్ధమై బొగ్గులారీకి సైతం మంటలు వ్యాపించాయి. దాంతో కారులో చిక్కుకుపోయిన శిరీష్ సజీవ దహనం అయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను పూర్తిగా ఆర్పి వేశారు. మృతున్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాద ఘటనతో ఓఆర్ఆర్‌పై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. మృతుని అన్న కార్తీక్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృతి
- మరో నలుగురికి గాయాలు
- మనవరాలి మొక్కు తీర్చుకోవటానికి వెళ్తూ..
- కోదాడ పట్టణ శివారులో ఘటన



నవతెలంగాణ – కోదాడరూరల్/బోనకల్

సూర్యాపేట జిల్లా కోదాడ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దుర్గాపురం స్టేజీ వద్ద ఆగి ఉన్న లారీని కారు ఢీ కొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు దుర్మరణం చెందారు. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. మృతుల్లో ఓ చిన్నారి, ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. మరో మహిళ, ముగ్గురు చిన్నారులు ప్రమాదం నుంచి గాయాలతో బయటపడ్డారు. మృతుల్లో.. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం గోవిందాపురం (ఎల్) గ్రామానికి చెందినవారు నలుగురుండగా, సూర్యాపేట జిల్లా కోదాడ మండలం చిమిర్యాలకు చెందిన మరో ఇద్దరు ఉన్నారు. కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం..కోదాడ మండలం చిమిర్యాల గ్రామానికి చెందిన జిల్లా శ్రీకాంత్.. హైదరాబాద్‌లో నివాసం ఉంటూ ఓ ప్రయివేటు వ్యక్తి వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం గోవిందపురం గ్రామానికి చెందిన నాగమణితో అతనికి వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు లావణ్య (2), లాస్య (4) ఉన్నారు. కాగా పెద కూతురికి పుట్టు వెంట్రుకలు తీయించడానికి శ్రీకాంత్ అత్తమామలు నల్లమల రామచంద్రరావు, మాణిక్యం దంపతులు, అతని బావ కృష్ణంరాజు, స్వర్ణకుమారి దంపతులతో పాటు వీరి కుమారులు కౌశిక్, కార్తీక్‌తో కలిసి విజయవాడలోని గుణదలకు బయలుదేరారు. కాగా, గురువారం ఐదున్నర గంటల సమయంలో కోదాడ సమీపంలోని దుర్గాపురం స్టేజీ వద్ద ఆగి ఉన్న లారీని వెనక నుండి వచ్చిన వీరి కారు.. అతివేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రామచంద్రరావు (45), మాణిక్యం (40), కృష్ణంరాజు (25), స్వర్ణకుమారి (23), శ్రీకాంత్ (30), చిన్నారి లాస్య (4) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. శ్రీకాంత్ భార్య నాగమణి, చిన్న కుమార్తె లావణ్య, కృష్ణంరాజు కుమారులు కౌశిక్, కార్తీక్ గాయాలతో బయటపడ్డారు. నాగమణికి తీవ్ర గాయాలయ్యాయి. తొలుత వీరిని కోదాడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో బంధువులు ఖమ్మంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కౌశిక్, కార్తీక్ కోదాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. లావణ్యకు స్వల్ప గాయాలు కావటంతో ప్రాథమిక చికిత్స అనంతరం బంధువులు ఇంటికి తీసుకెళ్లారు. కౌశిక్, కార్తీక్‌కు కూడా ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు. మృతదేహాలను కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, మరో ఐదు నిమిషాలు గడిస్తే చిమిర్యాల వద్ద ఉన్న శ్రీకాంత్(మతుడు) పెద్దమ్మను సైతం కారులో ఎక్కించుకొని గుణదలు తీసుకుని వెళ్లాల్సి ఉంది. ఇంతలోనే ఈ ప్రమాదం చోటు చేసుకోవడంతో చిమిర్యాల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వీరందరూ హైదరాబాద్‌లోనే ఉంటూ ఇండ్లలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్పీ రాహుల్ హెగ్డే, తహసీల్దార్ సూర్యనారాయణ, టౌన్ సీఐ రాము ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను, మృతుల బంధువులను పరామర్శించారు. రెండు రోజుల కింద ముకుందాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం మరువకముందే ఈ ప్రమాదం జరగడంతో వాహనదారులు, ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ ప్రమాదానికి.. కారు డ్రైవర్ నిద్రమత్తులో అతివేగంగా నడపడమే కారణమని సీఐ రాము తెలిపారు. శ్రీకాంత్ సోదరుడు నందిగామ రాజశేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజన్న ఆలయ ఉద్యోగులు, సిబ్బందిపై కమిషనర్ కొరడా

- 13మందిపై క్రమశిక్షణా చర్యలు చర్యలు
- మరొకరు (14వ వ్యక్తి) ఎవరంటూ చర్చ?
- నవతెలంగాణ వరుస కథనాలకు స్పందించిన ఎండోమెంట్ శాఖ



నవతెలంగాణ – వేములవాడ

రాజన్న క్షేత్రంలో అవినీతి, అక్రమార్జన బహుముఖ రూపాల్లో రాజన్నకే మహిమలు చూపిస్తున్న అధికారులు, ఉద్యోగులపై కమిషనర్ కొరడా ఝులిపించారు. అవినీతిపై 'నవ తెలంగాణ' దినపత్రికలో ప్రత్యేక వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ కథనాలకు స్పందించిన దేవాదాయ– ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు చర్యలకు ఆదేశించారు.

తెలంగాణకే తలమానికంగా విరాజిల్లుతున్న వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఏ చిన్న ఘటనా జరిగినా అది సంచలనమే.. అలాంటిది గురువారం ఆలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మొత్తం 13మందిపై ఉన్నతాధికారులు చర్యలకు ఆదేశించడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ముగ్గురు ఏఈవోలు, నలుగురు పర్యవేక్షకులు, సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, మరో ఇద్దరు వ్యక్తుల సేవల సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. మొత్తం 14 మందిపై చర్యలు తీసుకున్నారంటూ వినబడినా మరొకరి ప్రస్తావన రాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అంతేకాకుండా ప్రసాదాల తయారీ పర్యవేక్షకుడికి దేవాలయ ఖాతాలో డబ్బులు జమ చెయ్యాలని ఆదేశించడంతో అవినీతిపరుల గుండెలు గుబేల్ అంటున్నాయి.

విధుల్లో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలు

గుడినే కాదు గుడిలో లింగాన్ని మింగే ఘనాపాటిలు ఉన్నారు. ఈ క్రమంలో విధుల్లో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న 13మంది ఆలయ ఉద్యోగులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం పట్ల మిగతా ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే ఎంతో మందిపై నిఘా కొనసాగడం, చాలా మంది ఉద్యోగులు, సిబ్బందిపై నిత్యం అవినీతి ఆరోపణలు వ్యక్తమవుతుండటంతో ఇందులో తమ పేర్లు ఉంటాయేమోనని, ఎప్పుడు ఏమి జరుగుతుందోనని కొంతమంది ఉద్యోగులు ఆందోళన చెందుతున్నట్టు చర్చ జరుగుతోంది. ఇంటి దొంగలు ఎవరంటే భుజాలు తడుముకునే పరిస్థితి నెలకొంది.

2021లోనే విజిలెన్స్ విచారణ..

వాస్తవానికి ఈ 13మంది ఉద్యోగులకు సంబంధించి 2021లోనే విజిలెన్స్ విచారణ పూర్తయింది. కానీ నివేదిక ఫైల్ అప్పటి దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ వద్ద పెండింగ్‌లో ఉండటం, సదరు ఉద్యోగులకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ అండదండలు పుష్కలంగా ఉండటంతో ఫైల్ ముందుకు కదల లేదనే ఆరోపణలు ఉన్నాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక.. స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నేతృత్వంలో సీఎం రేవంత్ రాజన్న దేవాలయ అభివృద్ధిపై దృష్టి సారించారు. అదే సమయంలో గత ప్రభుత్వంలో కమిషనర్‌గా ఉన్న అనిల్ కుమార్‌ను ఇతర శాఖకు బదిలీ చేసి, హనుమంతరావును నూతన కమిషనర్‌గా నియమించారు. దీంతో అప్పటి పెండింగ్ ఫైల్స్ అన్నీ ఇప్పుడు ముందుకు వస్తున్నాయని, రాజన్న ఆలయ ఫైల్ ముందుకు రావడం వల్లే ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్టు వినికిడి. దీనికి తోడు కమిషనర్ హనుమంతరావు వేములవాడ పర్యటనకు వచ్చిన మూడు రోజుల్లోనే ఉద్యోగులపై చర్యలు తీసుకోవడంపై చర్చ సాగుతోంది.

మరో కొత్త చర్చ..

13మంది ఉద్యోగులపై చర్యలు తీసుకున్న మరుక్షణమే మరో కొత్త చర్చ మొదలైంది. ఆనాడు విజిలెన్స్ అధికారులు సమర్పించిన నివేదికలో మొత్తం 14మంది పేర్లు ఉండగా, ఇప్పుడు చర్యలు తీసుకున్న వారిలో 13మంది పేర్లు మాత్రమే ఉన్నాయని, మిగతా ఆ ఒక్కరు ఎవరు అంటూ మరో చర్చ. మిగిలిన ఆ ఒక్కరు ఆలయ ఈఓనా అంటూ ఉద్యోగుల్లో బహిరంగంగానే గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరు నేత కార్మికుల ఆత్మహత్య

- నివాళులర్పించిన సీపీఐ(ఎం) నేతలు
- ఉపాధి కల్పించి ఆదుకోవాలని డిమాండ్



నవతెలంగాణ - తంగళ్ళపల్లి/ సిరిసిల్ల టౌన్

ఉపాధి లేక.. కుటుంబం గడవని పరిస్థితి.. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు.. వీటి నుంచి బయటపడే మార్గం కనిపించని ఇద్దరు నేత కార్మికులు ప్రాణం తీసుకున్నారు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో గురువారం జరిగాయి. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన అంకారపు మల్లేశం(55) చేనేత పనిచేసేవాడు. ఆయనకు భార్య భారతి, కొడుకు మహేందర్ ఉన్నారు. నెల రోజులుగా వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కురుకుపోవడంతో ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. కుటుంబ పోషణ భారంగా మారింది. ఎక్కడా పని దొరకడం లేదని తీవ్ర మనస్తాపం చెందాడు.

గురువారం కూడా తంగళ్లపల్లి మండల కేంద్రంలో పలుచోట్ల పవర్ రూంలో పని కోసం పలువురిని అడిగి వచ్చాడు. పని దొరక్క పోవడంతో ఇందిరానగర్‌కు వెళ్లే దారిలో ఓ చింత చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం పద్మనగర్‌లో నివాసం ఉంటున్న ఆడిచర్ల కైలాసం పెద్ద కుమారుడు సాయి(25) వార్పిన్ కార్మికుడిగా పనిచేస్తుండేవాడు. నాలుగు నెలలుగా పనులు లేక ఉపాధి కోల్పోయాడు. దీంతో ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నాడు. గురువారం ఇంట్లోని షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి చూపించాలి
సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.స్కైలాబ్‌బాబు

పవర్‌లూమ్ కార్మికులకు శాశ్వత ఉపాధి కల్పించి ఆత్మహత్యలను నివారించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన పద్మనగర్‌లో ఆడిచర్ల సాయి(25) మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాలుగు నెలలుగా వస్త్ర పరిశ్రమలో ఏర్పడిన సంక్షోభంతో పనులు లేక పస్తులు ఉండి, అప్పుల బాధలతో కార్మికులు వరుసగా ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకేరోజు సిరిసిల్ల పట్టణానికి చెందిన ఆడిచర్ల సాయి, తంగళ్లపల్లి మండలానికి చెందిన అంకారపు మల్లేశం ఇద్దరూ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం కార్మికులకు ఉపాధి చూపకపోవడం వల్లనే

ఈ దారుణాలు జరుగుతున్నాయన్నారు. తక్షణమే కార్మికులకు రావలసిన యారాన్ సబ్సిడీ రూ.18కోట్లు, వస్త్ర పరిశ్రమ పెండింగ్ బకాయిలు 283 కోట్ల రూపాయలు విడుదల చేయాలన్నారు. బాధిత కార్మిక కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పార్టీ జిల్లా కార్యదర్శి మూషం రమేష్, జిల్లా కమిటీ సభ్యులు కోడం రమణ, జవ్వాజి విమల, ముక్తికాంతా అశోక్, సిఐటియు నాయకుడు అన్నల్‌దాసు గణేష్, వార్పిన్ వర్కర్స్ యూనియన్ నాయకుడు సిరిమల్ల సత్యం ఉన్నారు

ఇంటర్‌లో ఫెయిలయ్యానని... విద్యార్థిని ఆత్మహత్య


(ఫైల్)

నవతెలంగాణ-పెద్దవంగర

ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని మనస్తాపానికి గురై ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం చిట్యాల గ్రామంలో గురువారం జరిగింది. ఎస్ఐ మహేష్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన ఈదురు రామనర్సయ్య- సునిత దంపతులకు కుమారులు ప్రవీణ్, ప్రభాకర్, కుమార్తె ప్రవళిక ఉన్నారు. గ్రామంలో తమకున్న కొద్దిపాటి పొలం సాగుతో పాటుగా, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి కూతురు ప్రవళిక(16) మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్ (పీఎస్టీటీ గ్రూప్) చదువుతోంది. బుధవారం ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో ఆమె ఫెయిల్ కావడంతో మనస్తాపం చెందింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ప్రవళిక తమ్ముడు కొంతసేపటి తర్వాత ఇంటికి రాగానే ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించిన అక్కను చూసి గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని కిందకు దింపారు. వెంటనే కుటుంబ సభ్యులు తొర్రూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ప్రచారంలో జోష్ ఎక్కడ?

- అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే అంతంతే
- హడావిడికి పార్టీ శ్రేణులు దూరం
- ఎండలకు బయటకు రాని జనం
- రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లకే అభ్యర్థుల మొగ్గు
- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలది అదే తీరు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో జోరు కనిపించడం లేదు. ఒకటి, రెండు నియోజక వర్గాల్లో తప్ప పార్టీల హడావిడి అంతంత మాత్రంగానే ఉంది. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు సూటిపోటి మాటలు, ఘాటైన విమర్శలతో ఒకరిపై ఒకరు మాటల తూటాలను పేల్చుకున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఆ తర్వాత చల్లబడ్డారు. గత నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సభలు, సమావేశాలు, మైకుల హోరుతో పట్టణాలు, పల్లెలు హోరెత్తాయి. అభ్యర్థులు పోటా పోటీగా ప్రచారం నిర్వహించారు. గురువారం నాటితో నామినేషన్లు ముగిసినా ఆయా పార్టీలు, అభ్యర్థుల్లో ఎన్నికల జోష్ కనిపించడం లేదు. ముఖ్యనేతలు, కార్యకర్తల సమావేశాలకే పరిమితమవుతున్నారు. షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచే ప్రచారం నిర్వహిస్తే ఖర్చు తడిసి మోపెడవుతుందనే భయంతో అభ్యర్థులు వెనకడుగు వెస్తున్నట్టు తెలుస్తోంది. నామినేషన్ల పరిశీలన, తుది అభ్యర్థుల ఖరారు అనంతరం మే 1 నుంచి ప్రచారాన్ని పరుగులు పెట్టించేందుకు ప్రధాన పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. ఏడు శాసన సభ నియోజక వర్గాలు కలిస్తే ఒక పార్లమెంట్ నియోజకవర్గం కావడంతో వాటి పరిధి పెద్దగా ఉంటోంది. దానికి తోడు ఎండలు 45 డిగ్రీలు దాటడంతో జనం బయటకు రాకపోవడంతో జనం లేక సభలు పలచగా ఉంటున్నాయి. దాంతో పెద్ద పెద్ద సభలు కాకుండా చిన్న చిన్న సమావేశాలు, కార్నర్ మీటింగ్‌లు, రోడ్‌షోలకు నేతలు ప్రాధాన్యత ఇస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా ఆర్భాటంగా కాకుండా తమకున్న పరిధిలో అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తున్నారు. డబ్బు, అధికారం, కులం, తదితర అంశాలు ప్రభావం చూపిస్తున్న తరుణంలో జరుగుతున్న ఎన్నికల్లో ఓటర్లు ఎవరిని కనికరిస్తారో జూన్ 5న తేలనుంది. కాగా భువనగిరి స్థానం నుంచి ఈ ఎన్నికల్లో సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్ బరిలో నిలిచారు. బూర్జువా పార్టీలకు భిన్నంగా ప్రచారం నిర్వహిస్తూ తనదైన శైలిలో ప్రజలతో మమేకమవుతున్నారు.

ఆరు గ్యారెంటీలను నమ్ముకున్న కాంగ్రెస్

రాష్ట్రంలో మెజార్టీ పార్లమెంట్ స్థానాలను గెలుచుకోవాలనే లక్ష్యంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ మిగతా పార్టీలకంటె ఒకింత ముందు వరుసలో ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని విజయ తీరాలకు చేర్చిన ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే ఐదు గ్యారెంటీలను అమలు చేశామంటూ ఆ పార్టీ ఎన్నికల్లో ప్రధానంగా ప్రచారం చేస్తోంది. అధికారం చేపట్టిన మూడు నెలల్లోనే 30 వేల ఉద్యోగాలను ఇచ్చామని చెబుతూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. ఆగస్టు 15 లోపు రూ.2 లక్షల రుణమాఫీ ఏక కాలంలో చేస్తామని మరోసారి తాజాగా హామీ ఇచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పలు నియోజక వర్గాల్లో రోడ్‌షోలు, సభలు, సమాశాల్లో అన్ని తానై విస్తృతంగా పాల్గొంటున్నారు.

రైతు సమస్యలపై దృష్టి సారించిన బీఆర్ఎస్

ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ రైతు సమస్యలపై దృష్టి పెట్టింది. ఎండిపోయిన పంట పొలాలు, విద్యుత్ సమస్య, ధాన్యం కొనుగోళ్లు, సాగు నీరు తదితర సమస్యలను ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తోంది. అప్పుడెలా ఉంది తెలంగాణ? ఇప్పుడెలా ఉంది తెలంగాణ? అంటూ ఫోటోలు, అంకెలను వివరిస్తూ జనంలోకి వెళుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ ఒక్కరే రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 100 భారీ సభల్లో పాల్గొన్నారు. ఈ సారి అలా కాకుండా చిన్న చిన్న సభలు, సమావేశాలు, ఓటర్లతో ముఖాముఖీ కార్యక్రమాలతో ప్రచారం నిర్వహిస్తున్నారు. బుధవారం నుంచి మే 10 వరకు జరగనున్న కేసీఆర్ బస్సు యాత్రతో పార్టీ శ్రేణుల్లో జోష్ నింపే ప్రయత్నం చేస్తున్నారు.

మోడీనే నమ్ముకున్న బీజేపీ

కాషాయ పార్టీ బీజేపీ అభ్యర్థులు ఒకటి రెండు నియోజకవర్గాల్లో సొంత చరిష్మాతో ప్రచారం నిర్వహిస్తున్నా, రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే ఆ పార్టీ అభ్యర్థులు మోడీనే నమ్ముకున్నట్టు తెలుస్తోంది. పదేండ్ల అధికారం, హిందూ అనుకూల విధానాలు, తమను గట్టెక్కిస్తాయని వారు భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ బీసీ ముఖ్యమంత్రి, ఎస్సీ వర్గీకరణ నినాదాన్ని ఎత్తుకుంది. ఈ సారీ అయోధ్య రామ మందిరం, సీఏఏ, తదితర అంశాలను ప్రచారం చేస్తోంది. గతానికి భిన్నంగా ఈ సారి ప్రజల్లో మరింతగా భావోద్వేగాన్ని రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోంది. ప్రధానమంత్రి మోడీ, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, జాతీయ అధ్యక్షుడు నడ్డా తదితర నేతలు రాష్ట్రంలో ప్రచారం చేయనున్నారు.

తడిసి మోపెడవుతున్న ఖర్చు

ఎన్నికల ఖర్చు తడిసి మోపెడవుతుండటంతోనే అభ్యర్థులు ప్రచారానికి భయపడుతున్నారు. ఇప్పటి నుంచే ఎంత ప్రచారం చేసినా చివరి రెండు రోజులు డబ్బు, మద్యం పంపిణీ చేయందే ఓట్లు రాలని విచిత్రమైన పరిస్థితి ఉంది. చేసిన అభివృద్ధి, పోటీలో ఉన్న అభ్యర్థుల గుణగణాల కన్నా ఇవే అధిక ప్రభావాన్ని చూపే అవకాశామున్న నేపథ్యంలో వారు ఆచీతూచి అడుగేస్తున్నారు. అయితే కొన్ని నియోజక వర్గాల్లో మాత్రం అభ్యర్థులు విపరీతంగా ఖర్చు పెడుతున్న సంఘటనలు కూడా ఉన్నాయి. ఉత్తర తెలంగాణ జిల్లాలోని ఓ నియోజక వర్గంలో ప్రధాన పార్టీకి చెందిన అభ్యర్థి భోజనాలకే ప్రతి రోజూ రూ.25 లక్షల వరకు ఖర్చు పెడుతున్నట్టు తెలుస్తోంది. ప్రత్యర్థి పార్టీకి చెందిన అభ్యర్థి రాజకీయాల్లో సీనియర్ అయినప్పటికీ ఎదుటి వారి ఖర్చును తట్టుకోలేక పోతున్న పరిస్థితి నెలకొంది. అందుకే ఇప్పటి నుంచే ప్రచారం పక్కన పెట్టి చివరి రెండు రోజులే చావోరేవో తేల్చుకోవాలని ఆయన నిర్ణయించుకున్నారు.

మందులు అమ్ముకొని బతికిన చరిత్ర నీది

- మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి : గుత్తా ముఖ్య అనుచరుల వ్యాఖ్యలు



నవతెలంగాణ-నల్లగొండటౌన్

"సుదీర్ఘ రాజకీయ అనుభవం పరిజ్ఞానం కలిగిన మచ్చలేని మహా నాయకుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి.. మందులు అమ్ముకొని బతికిన నీచ చరిత్ర నీది.. గుత్తా గురించి మాట్లాడే అర్హత నీకెక్కడిది..? ఉస్మానియా యూనివర్సిటీలో వేలాది మంది చేసిన ఉద్యమాలను నీవే చేసినట్టు నీ ఖాతాలో వేసుకొని, వెంట నడిచిన స్నేహితులను సైతం నిలువునా ముంచింది ఎవరికి తెలియదు.. అధికారులను వేధించి.. దళిత బంధులో కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డావ్.. ఇవన్నీ నిజం కాదా..?" అని గుత్తా ముఖ్య అనుచరులు మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌నుద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని గుత్తా సుఖేందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గుత్తాను విమర్శించే స్థాయిగాని, వయస్సు లేని చిల్లర వ్యక్తి గాదరి కిషోర్ అని అన్నారు. ప్రజలకు తన నీచ చరిత్ర తెలుసు కాబట్టే మొన్నటి ఎన్నికల్లో ఘోరంగా ఓడించి తరిమికొట్టారని అన్నారు. ఇసుకదందాను వృత్తిగా మార్చుకుని వందల కోట్ల రూపాయలు సంపాదించిన ప్రబుద్ధుడని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజకీయ నాయకుల ఇండ్ల చుట్టూ తిరిగి చందాలు వసూలు చేసి సొంతానికి వాడుకున్నాడని ఆరోపించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ పతనానికి ప్రధాన కారుకుడు కిషోర్ అని విమర్శించారు. తిరుమలగిరి మండలంలో దళితబంధు పథకంలో తన బినామీలకు, అనుచరులకు ఇప్పించి కోట్ల అవినీతికి పాల్పడిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. తనకు అనుకూలమైన కలెక్టర్‌ను రంగారెడ్డి జిల్లాలో పెట్టుకొని కుంట్లూరు గ్రామ శివారులో భూ అక్రమ దందా చేసిన విషయం ఒక పత్రికలో ప్రచురించిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఐకేపీ సెంటర్ల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని బినామి రైస్ మిల్లులకు పంపింది నిజం కాదా అన్నారు. మరోసారి గుత్తా సుఖేందర్ లాంటి వ్యక్తి మీద ఒక్కమాట మాట్లాడినా నాలుక కోసే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

ఈ సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ ఇరిగి పెద్దులు, కనగల్ జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం, బీఆర్ఎస్ సీనియర్ నేతలు ఐతగోని స్వామిగౌడ్, వెంకటేశ్వర్‌రావు, గోపాల్‌రెడ్డి, యామా దయాకర్, హరికృష్ణ, మునాసు వెంకన్న, మాజీ జెడ్పీటీసీ సంజీవ, చిల్కరాజు శ్రీనివాస్, బకారం వెంకన్న, పీఏసీఎస్ చైర్మెన్ దోటి శ్రీనివాస్, చెన్నగోని యాదగిరి, మైనారిటీ నాయకులు అనీష్ ముక్తాదర్, హన్ను ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వరంగల్ మేయర్ గుండుసుధారాణి

- కండువా కప్పిన జగ్గారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ చేరికల కమిటీ ఆధ్వర్యంలో పలువురు నేతలు హస్తం గూటికి చేరారు. వరంగల్ మేయర్ గుండుసుధారాణి,మానవతారాయ్ జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ పార్టీలోకి ఎవరు వచ్చినా తీసుకోవాలని ఏఐసీసీ ఆదేశించిందన్నారు. సంగారెడ్డిలో తనకు వ్యతిరేకంగా పని చేసిన వారు కూడా ఇప్పుడు పార్టీలోకి వస్తానంటే కండువా కాప్పాల్సిందేనన్నారు.

కాంగ్రెస్‌లో చేరుతామంటూ ఒత్తిడి పెరుగుతోందన్నారు. కొంత మంది అధిష్టానానికి ఉత్తరాలు రాస్తున్నారని తెలిపారు. త్వరలో రాహుల గాంధీ, ప్రియాంకగాంధీ సభలు ఉంటాయని చెప్పారు.

దేశంలో మోడీ వ్యతిరేక గాలి వీస్తోంది

- మోడీ పాలనలో కనబడని ఎమర్జెన్సీ
- స్వతంత్ర సంస్థల్ని నిర్వీర్యం చేసిన వైనం
- ఆర్ఎస్ఎస్‌ది స్వాతంత్ర్య పోరాటంలో లొంగిపోయిన పాత్ర
- ప్రజల పక్షాన గొంతు విప్పిన ప్రబీర్ పుర్కాయస్థ
- 'అలుపెరుగని పోరాటం' పుస్తకావిష్కరణ సభలో.. ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్.వినయ కుమార్



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

'దేశంలో మోడీ వ్యతిరేక గాలి వీస్తోంది కనబడని అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోంది. ఆనాటి ఎమర్జెన్సీ కూడా ఇంత దారుణంగా లేదు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆర్ఎస్ఎస్ వాదులది లొంగిపోయిన పాత్ర తప్ప ఏ చరిత్రా లేదు. మత విద్వేషాలను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన బీజేపీ.. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఈడీ, విజిలెన్స్, ఎన్నికల సంఘం వంటి సంస్థల్ని నిర్వీర్యం చేసింది. తమకు నచ్చిన వాళ్లతో ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేస్తుంది. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించకపోతే ప్రజాస్వామ్యం, రాజ్యాంగమే కాకుండా ప్రగతిశీల భావజాలం సైతం ప్రమాదంలోకి నెట్టబడుతుంది' అని ప్రజాశక్తి పూర్వ సంపాదకులు, ఎస్వీకే కార్యదర్శి ఎస్.వినయకుమార్ అన్నారు.

గురువారం సంగారెడ్డి పట్టణంలో నవతెలంగాణ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ప్రబీర్ పుర్కాయస్థ రచించిన 'అలుపెరుగని పోరాటం' పుస్తకావిష్కరణ సభ నవతెలంగాణ ప్రాంతీయ ప్రతినిధి మేకల కృష్ణయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంఘాలకు దేశ స్వాతంత్ర్య పోరాటంలో లొంగిపోయి క్షమాపణ కోరిన పాత్ర తప్ప.. పోరాడిన చరిత్ర లేదన్నారు. సావర్కర్ ఆదేశాల మేరకే మహాత్మాగాంధీని గాడ్సే హత్య చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గోద్రా అల్లర్లు సృష్టించి మారణహోమానికి పాల్పడిన ఫలితంగానే మోడీ సీఎం అయ్యారని, 2013లో ముజఫర్‌లో మత ఘర్షణలు సృష్టించి ఆధిత్యనాథ్ యోగి సీఎం అయ్యాడన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధిపొందిన సంఘటనల్లోని వాస్తవాల్ని వెలుగుతీసి న్యూస్‌క్లిక్ డిజిటల్ చానల్ ద్వారా ప్రజల పక్షాన నిలిచిన ప్రబీర్ పుర్కాయస్థను కుట్రపూరితంగా అరెస్టు చేశారని తెలిపారు.

ఆనాటి ఎమర్జెన్సీ కాలంలో మీసా చట్టం కింద పుర్కాయస్థను జైళ్లో పెట్టారని, ప్రస్తుతం మోడీ పాలనలో కొనసాగుతున్న అప్రకటిత ఎమర్జెన్సీలో కూడా ఉపా చట్టం కింద 2021లో అరెస్టు చేసిన.. బీజేపీ ప్రభుత్వం కక్షకట్టి నిర్బంధంలోకి నెట్టిందన్నారు. అప్పటి ఎమర్జెన్సీ ప్రకటితమైందని, మీడియాలో రాసే రాతలపై ఆంక్షలుండేవని గుర్తు చేశారు

. మోడీ పాలనలో కొనసాగుతున్న అప్రకటిత ఎమర్జెన్సీలో మాత్రం మీడియా సంస్థల్ని మోడీ తన చెప్పుచేతుల్లో పెట్టుకున్నారన్నారు. మోడీ పాలనలోని డొల్లతనాన్ని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఏమీ రాయలేకపోతున్నాయన్నారు. సోషల్ మీడియా మాత్రం మోడీ పాలనలోని డొల్ల చేష్టల్ని ఎత్తిచూపుతున్నాయన్నారు. డిజిటల్ మీడియాలో మోడీకి వ్యతిరేకంగా ప్రచారం చేస్తే సహించే పరిస్థితిలేదన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే ముస్లింలు హిందూ మహిళల పుస్తెలతాళ్లను ఉంచరని మోడీ చెప్పడం దుర్మార్గమైన చర్య అన్నారు. లౌకిక శక్తులు అప్రమత్తంగా ఉండి సోషల్ మీడియాలో వస్తున్న మోడీ త్రయం తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత, జర్నలిస్ట్, మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ, ప్రముఖ వైద్యులు కృష్ణమూర్తి, సీనియర్ జర్నలిస్టు పీవీరావు, నవతెలంగాణ బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ ఆర్.వాసు, రచయిత వినోద్‌కుమార్, సింగర్ కిషన్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు జి.జయరాజ్, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్యం, నవతెలంగాణ జీఎం నరేందర్, మెదక్ రీజియన్ మేనేజర్ రేవంత్‌కుమార్, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ, ఆరు గ్యారంటీలు అమలుచేస్తే రాజీనామా చేస్తా.. హరీశ్‌రావు



నవతెలంగాణ-మెదక్

"అసెంబ్లీ ముందున్న అమరవీరుల స్థూపం వద్దకు 26వ తేదీ ఉదయం 10 గంటలకు వస్తా.. రేవంత్ రెడ్డి దమ్ముంటే రా.. ఇద్దరి రాజీనామా పత్రాలను మేధావుల దగ్గర పెడదాం' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. గురువారం మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి నామినేషన్ సందర్భంగా మెదక్ జిల్లా కేంద్రంలోని ధ్యాన్ చంద్ చౌరస్తా నుంచి రాందాస్ చౌరస్తా వరకు బీఆర్ఎస్ నిర్వహించిన భారీ ర్యాలీలో జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత, ఎమ్మెల్యేలు సునితాలక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా ఆగస్ట్ 15 వరకు ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ అమలు చేస్తే తాను రాజీనామా చేస్తానని, అమలు చేయకుంటే రేవంత్ రెడ్డి రాజీనామా చేసేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. రాజీనామా లేఖలను ఇద్దరం మేధావుల చేతిలో పెడదామని, హామీలను అమలు చేస్తే నా రాజీనామా లేఖను మేధావులు స్పీకర్‌కు ఇస్తారని, చేయకుంటే నీ రాజీనామా లేఖను గవర్నర్‌కు ఇస్తారని తెలిపారు. మాట మీద నిలబడే వాడివి అయితే అమరవీరుల స్థూపం వద్దకు రావాలన్నారు. రాకుంటే కొడంగల్‌లో రాజకీయ సన్యాసం తీసుకుంటానని తోక ముడిచినట్టే, ఇప్పుడు అదే అవుతుందని తెలంగాణ ప్రజలకూ అర్థం అవుతుందన్నారు.అబద్ధాలతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ గద్దెనెక్కిందని ఎద్దేవా చేశారు. మెదక్ జిల్లా గులాబీ జెండాకు అడ్డా అని, 25 ఏండ్లుగా మెదక్ పార్లమెంటులో ప్రతిసారీ బీఆర్ఎస్ గెలుస్తుందని, ఈ సారీ భారీ మెజారిటీతో గెలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. మెదక్ అభివృద్ధి గురించి మాట్లాడే హక్కు రేవంత్ రెడ్డికి లేదన్నారు. కేసీఆర్ చెక్ డ్యాంలు కట్టడం వల్ల ఒక్క ఎకరా పంట ఎండకుండా చూశారని, కానీ కాంగ్రెస్ పాలనలో పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో పాటు కలెక్టరేట్, ఎస్పీ, మెడికల్ కాలేజ్ భవనాలను, ఫోర్ లైన్ రోడ్డును కేసీఆర్ ఏర్పాటు చేశారని చెప్పారు. మెదక్ జిల్లా కోసం ఆనాడు ఎన్నో ధర్నాలు, ఆందోళన చేసి జిల్లాను సాధించుకున్నామని, ఇప్పుడు రేవంత్ కొత్త జిల్లాలను తీసేస్తామని అంటున్నారని తెలిపారు. కేసీఆర్ మెదక్‌ను జిల్లా చేసిండు కాబట్టే నామినేషన్ కోసం రేవంత్ రెడ్డి మెదక్ వచ్చారని, రేవంత్‌ను మెదక్ రప్పించిన ఘనత గులాబీ జెండాదేనని తెలిపారు. కాంగ్రెస్ వచ్చాక లక్ష పెండ్లిండ్లు అయ్యాయని, తులం బంగారం ఎంత మందికి ఇచ్చారని ప్రశ్నించారు. 200 మంది రైతులు, 30 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు మాటలు నమ్మితే నీళ్ళు లేని బాయిల దుంకినట్టే అవుతుందన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తేనే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలవుతాయని తెలిపారు. మెదక్ పార్లమెంట్ అభ్యర్థుల్లో ఒకాయన ఆరో తరగతి వరకు చదివారని, మరొకరు బ్లాక్ మెయిలర్ అని అన్నారు. కానీ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి కలెక్టర్‌గా పనిచేసిన విద్యావంతుడని, ఆయన్ని గెలిపించాలని ప్రజలను కోరారు.

మోడీతో బాబు పొత్తు, జగన్ తొత్తు

- వారికి ఓటేస్తే డ్రెయినేజీలో వేసినట్లే
- ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి : వైఎస్.షర్మిల



విజయవాడ : వివేకా హత్య కేసులో నిందితుడైన వైఎస్.అవినాష్‌రెడ్డికి బెయిల్ కోసం ప్రధాని మోడీ కాళ్ల దగ్గర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోకరిల్లారని ఏపీసీసీ అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. ప్రత్యేక హోదాతోపాటు రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏనాడూ ప్రధానిపై ఒత్తిడి తేలేని జగన్... అవినాష్‌రెడ్డిని రక్షించడానికి పదేపదే ప్రధానిని కలిశారని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు ఓటేసినా, జగన్‌కు ఓటేసినా డ్రెయినేజీలో వేసినట్లేనని అన్నారు. ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో చేపట్టిన న్యాయయాత్రలో భాగంగా గురువారం ఆమె విజయవాడలోని కృష్ణలంక రాణిగారితోటలోనూ, గుంటూరు తూర్పు నియోజవర్గంలోని సంజీవయ్య నగర్‌లోనూ ఎన్నికల ప్రచార సభల్లో, సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ప్రసంగించారు. అవినాష్‌రెడ్డిని వెనకేసురావడం కోసం తనను, వివేకానందరెడ్డిని జగన్ కించిపరిచి మాట్లాడారన్నారు. పులివెందుల సభలో వైఎస్ వివేకా గురించి కనీసం నాలుగు మంచిమాటలు చెప్పకుండా ఆయనపై ఉన్న కక్ష బయటపెట్టారన్నారు. అవినాష్‌రెడ్డిని వెనకేసుకురావడానికి వివేకాను కించపర్చాలా? అని ప్రశ్నించారు. పసుపు చీర ధరిస్తే చంద్రబాబుతో తాను కలిసినట్టా? అని ప్రశ్నించారు. పసుపు రంగు టీడీపీ సొంతమా? చంద్రబాబు పేటెంట్ రంగని ఎవరైనా చెప్పారా? సాక్షి పేపరులో బేనర్ హెడ్డింగ్‌లో పసుపు రంగు ఎందుకు పెట్టుకున్నారని ప్రశ్నించారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సాక్షి పేపరు బ్యానర్ తయారు చేసేటప్పుడు పసుపు మంగళకరం అని ఆయనే లోగో రూపొందించారని గుర్తు చేశారు. గత పదేండ్లుగా ఏపీ రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రధాని మోడీతో టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల పొత్తు పెట్టుకుంటే, ఏపీ సీఎం జగన్ ఐదేండ్లుగా మోడీకి తొత్తుగా వ్యవహరించారని, అయినా, రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్టును కూడా తీసుకురాలేకపోయారని,ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా మోసం చేసిన మోడీతో జగన్ అంటకాగుతున్నారని విమర్శించారు.

దేశంలో ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే రాజధాని లేదని, మన రాష్ట్రానికి ఇటువంటి దుస్థితి వైసీపీ ప్రభుత్వ హయాంలోనే వచ్చిందని అన్నారు. చంద్రబాబు కూడా అన్నీ అబద్ధాలే చెప్పుతున్నారని విమర్శించారు.



పెన్షనర్ల సమస్యలు పరిష్కరించే వారికే మా ఓటు

- టాప్ర రాష్ట్ర కమిటీ తీర్మానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన వారికే ఓటు వేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్ర) నిర్ణయించింది. గురువారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం టాప్ర రాష్ట్ర అధ్యక్షులు పి నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి కృష్ణమూర్తి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధమేఘాలు ఆవరించాయనీ, అదానీ గ్రూప్ తయారు చేసిన డ్రోన్లు గాజా ప్రాంతంలో ఉపయోగించి దాడులు చేస్తున్నాయని తెలిపారు. దీంతో మోడీ నేతృత్వంలో భారత్‌లో కూడా యుద్ధోన్మాదంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధం ఏ సమస్యకూ పరిష్కారం కాదనీ, శాంతి కోసం భారత్ కృషి చేయాలని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పెన్షనర్ల సమస్యలను పరిష్కరించే వారికే ఓటు వేస్తామని తెలిపారు. ఈపీఎస్ 95, కోల్ మైన్స్ పెన్షనర్ల సమస్యల విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటు వేసేది లేదని స్పష్టం చేశారు. నో హయ్యర్ పెన్షన్ నో ఓట్ నినాదంతో ప్రజల్లోకి వెళ్తామని తెలిపారు. ఈపీఎస్, కోల్ మైన్స్ పెన్షనర్లకు ప్రతినెలా కనీసం రూ.తొమ్మిది వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఏఈ ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ శాఖలకు చెందిన విభాగాల్లో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ), మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్, టెక్నికల్ ఆఫీసర్ అండ్ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టులకు సంబంధించి ఫలితాలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) విడుదల చేసింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్)ను ప్రకటించామని తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలు www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని సూచించారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం మెరిట్ జాబితాను రూపొందిస్తామని పేర్కొన్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. 837 ఏఈ పోస్టుల భర్తీకి 2022, సెప్టెంబర్ 12న టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే.

చైన్ ఫార్మసీ ద్వారా మందుల విక్రయం

- వాటి నాణ్యతపై తనిఖీ చేయాలి : తెలంగాణ ఫార్మా సొసైటీ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చైన్ ఫార్మసీల ద్వారా 50 నుంచి 80 శాతం భారీ డిస్కౌంట్‌తో ప్రజలకు విక్రయిస్తున్న నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేయాలని తెలంగాణ ఫార్మా సొసైటీ కోరింది. ఈ మేరకు తెలంగాణ ఫార్మా సొసైటీ అధ్యక్షులు, ఫార్మకాలజిస్ట్ ఎ.సంజయ్ రెడ్డి డ్రగ్ కంట్రోల్ అథారిటీ డీజీ వీ.బీ.కమలాసన్ రెడ్డికి ఈమెయిల్ ద్వారా వినతిపత్రాన్ని సమర్పించారు. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం, 1940లోని రూల్స్ 1945 సెక్షన్ 65(2), (4), (9) అమలు చేసి ప్రాణాలను కాపాడాలని కోరారు. ఉత్తరాఖండ్ నుంచి రాష్ట్రానికి వస్తున్న నకిలీ మందులను డీసీఏ అధికారులు దాడుల్లో సీజ్ చేయడంతో ఆ రాష్ట్ర మందుల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. చైన్ ఫార్మసీలు ఒక వైపు ఔషధాలను తగ్గింపు ధరలకు విక్రయిస్తూ, మరో వైపు కొన్ని మందులకు ఎన్ పీపీఏ నిబంధనలను దాటవేసి అధిక ధరలకు అమ్ముతున్నాయని ఆరోపించారు. ఔషధాలకు సంబంధించి చట్టవిరుద్ధంగా చేస్తున్న మార్కెటింగ్ వ్యూహాన్ని ఆపేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటేయాలి..

- వారిపై ఇచ్చిన పిర్యాదులను స్పీకర్‌కు అందజేయండి
- ప్రభుత్వ న్యాయవాదికి హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ-హైదరాబాద్

ఖైరతాబాద్, భద్రాచలం, స్టేషన్ ఘన్‌పూర్‌ల నుంచి బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన దానం నాగేందర్, తెల్లం వెంకటరావు, కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోవడంపై దాఖలైన వ్యాజ్యాలను గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయసేన్‌రెడ్డి విచారించారు. కాంగ్రెస్‌లో చేరడం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికి వ్యతిరేకమంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్ దాఖలు చేసిన విడివిడి వ్యాజ్యాలపై విచారణను ఈ నెల 29కి వాయిదా వేశారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ ఎంపీ సీటుకు పోటీ చేస్తున్నారని పిటిషనర్ తరుపు లాయర్ చెప్పారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు కూడా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లో చేరారన్నారు హనమకొండ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా పార్టీ ఫిరాయించడంతో పాటు తన కుమార్తె కావ్యను వరంగల్ ఎంపీ సీటుకు పోటీలో నిలిపారని చెప్పారు. ముగ్గురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేశారనీ, పత్రికల్లో వార్తలు కూడా వచ్చాయనీ, ఇది పార్టీ ఫిరాయింపుల కిందకే వస్తుందని చెప్పారు. దీనిపై స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శులకు వినతిపత్రాలు ఇచ్చేందుకు వెళితే స్పీకర్ కార్యాలయంలోకి రానీయలేదని చెప్పారు. ప్రభుత్వ న్యాయవాది ద్వారా ఆ ముగ్గురిపై ఫిర్యాదులను స్పీకర్ ఆఫీసుకు చేరేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాది కల్పించుకుని, ఏవిధమైన ఆదేశాల జారీ అవసరం లేదనీ, స్పీకర్ ఆఫీసుకు పిటిషనర్ల ఫిర్యాదులు చేరేలా చేస్తామని చెప్పారు. ఇందుకు అనుమతించిన న్యాయమూర్తి, ముగ్గురు ఎమ్మెల్యేలపై పిటిషనర్ల ఫిర్యాదుల అఫిడవిట్లను స్పీకర్ కార్యాలయానికి చేరేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ న్యాయవాది సూచించారు. అది స్పీకర్ ఆఫీసుకు అందినట్టుగా నిర్ధారించాలని ఆదేశించారు. విచారణను ఈ నెల 29కి వాయిదా వేశారు.

ఎక్సైజ్ అధికారులకు మినహాయింపుపై ఆర్డర్ రిజర్వు

నవతెలంగాణ -హైదరాబాద్

ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాత రెవెన్యూ, హోమ్ ఇతర ప్రభుత్వ శాఖల్లోని అధికారులను బదిలీ చేసినప్పటికీ ఎక్సైజ్ శాఖలో మాత్రం బదిలీ చేయకపోవడాన్ని సవాల్ చేసిన కేసులో హైకోర్టు తీర్పును రిజర్వులో పెట్టింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాదే, జస్టిస్ జె అనిల్ కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల బదిలీల నుంచి ఎక్సైజ్ అధికారులకు మినహాయింపు ఇవ్వడం అన్యాయమంటూ సికింద్రాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి పిల్ దాఖలు చేశారు. ఇందుకు సంబంధించి ఎన్నికల విధులతో సంబంధం లేని, ఆఫీసులకే పరిమితమయ్యే అధికారులను బదిలీ చేయాల్సిన అవసరం లేదని ఈసీ చెప్పింది. గత డిసెంబర్ నాటి ఈసీ ఉత్తర్వులకు, ఫిబ్రవరి నాటి ఉత్తర్వులకు సంబంధం లేదనీ, ఇందులో ఎక్సైజ్ అధికారులకు మినహాయింపు ఇవ్వడం అవినీతిని ప్రోత్సహించడమేనని పిటిషనర్ తరుపు లాయర్ వాదన. హైకోర్టు దీనిపై జడ్జిమెంట్‌ను రిజర్వులో పెట్టింది.

దేవుని పేరుతో ఒకడు, దేవుని మీద ఒట్టేసి మరొకడు



అక్షింతలు, పులిహోర, కాషాయ జెండా పేదల కడుపు నింపవు

- రెండు లక్షల రుణమాఫీ ఎందుకు చేయలేదో చెప్పాలి
- 400 మెగావాట్ల ప్రాజెక్టును ఆంధ్రకు అప్పజెప్పారు
- అమలు గాని హామీలు
- నేడు కాంగ్రెస్ ఓట్లు ఎలా అడుగుతుంది : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యలు

నవతెలంగాణ-భువనగిరి

దేవుని పేరు చెప్పి ఒకడు ఓట్లు అడుగుతుండే, మరొకడు ఏ ఊరికి వెళ్తే ఆ ఊరి దేవునిపై ఒట్టేసి వరాలిస్తున్నాడు.. వీరిద్దరూ మోసకారులేనని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఉద్దేశించి తీవ్ర విమర్శలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేపట్టిన బస్సుయాత్ర గురువారం సాయంత్రం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద కార్నర్ మీటింగ్‌లో కేసీఆర్ మాట్లాడారు. ఎన్నో ఉద్యమాలు, పోరాటాల ద్వారా తెచ్చుకున్న తెలంగాణలో పదేండ్లపాటూ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకున్నామన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ మాత్రం ఏ వర్గం ప్రజలకూ మేలు చేయలేదన్నారు. భువనగిరి మున్సిపల్ చైర్మెన్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి చైర్మెన్ అయితే, బీజేపీ అభ్యర్థి వైస్ చైర్మెన్ దక్కించుకున్నారన్నారు. దీంతో ఎవరు ఎవరికి బీ టీమో తేలిపోయిందని ఎద్దేవా చేశారు. విద్యుత్ మోటార్లకు మీటర్లు పెట్టాలని మోడీ తనపై ఒత్తిడి చేసినా.. ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తానని బెదిరించినా రాష్ట్రానికి 25 వేల కోట్లను ఇవ్వకుండా అడ్డు తగిలినా రైతుల పక్షాన నిలబడ్డానని గుర్తు చేశారు. రాష్ట్రానికి మెడికల్ కాలేజీలు, నవోదయ కాలేజీలు ఇవ్వలేదన్నారు. ఆంధ్రలో ఏడు మండలాలు కలిపినందుకా.. 400 మెగావాట్ల ప్రాజెక్టును ఆంధ్రకు అప్పజెప్పినందుకా.. విద్యుత్ కొరత సృష్టించినందుకా బీజేపీకి ఓటు వేయాలి అని ప్రశ్నించారు. ఈ తెలంగాణ మీది.. ఈ భవిష్యత్ మీది.. పార్లమెంటు ఎన్నికలలో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు.

అధికారం నుంచి కేసీఆర్ పక్కకు పోగానే కాంగ్రెస్ ప్రభుత్వం నాగార్జునసాగర్ ప్రాజెక్టు కేఆర్ఎంబీకి అప్పగించి తెలంగాణ రైతులకు తీరని అన్యాయం చేసిందన్నారు. రెండు లక్షల రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిస్తేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి హామీలు అమలు చేయిస్తారని తెలిపారు. 225 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే సీఎంతోపాటు మంత్రులు కూడా కనీసం ఆ కుటుంబాలను పరామర్శించలేదన్నారు. కల్యాణ లక్ష్మి పథకానికి అదనంగా తులం బంగారం ఇస్తామని ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అదంతా అబద్ధం.. తులం తుస్సుమన్నది ధాన్యం బోనస్ బోగస్ అయిందని ఎద్దేవా చేశారు.

తమ పార్టీ సెక్యులర్ పార్టీ అని చెప్పారు. తన బిడ్డ జైలుకు వెళ్తే భయపడేది లేదన్నారు. తాను పోరాడుతానని ఏనాడూ లొంగిపోనన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ పట్టుదల కలిగిన నిజాయితీపరుడని చెప్పారు. క్యామ మల్లేష్‌ను గెలిపించడానికి కారు గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, ఎలిమినేటి ఉమా మాధవ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి, గొంగిడి సునీత, గాదరి కిషోర్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, జి.కిషన్ రెడ్డి, బూడిద బిక్షమయ్య గౌడ్, నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, జెడ్పీ చైర్మెన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, నాయకులు దేశపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చు రూ.లక్ష కోట్లు

- గతం కంటే ఈసారి మరింత అధికం
- వ్యయానికి వెనుకాడని రాజకీయ పార్టీలు,అభ్యర్థులు

వెల్లడిస్తున్న సంస్థలు



న్యూఢిల్లీ : ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో లోక్‌సభ ఎన్నికలు జరుగుతు న్నాయి. ఈ ఎన్నికల్లో గెలవటానికి రాజకీయ పార్టీలు సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. ఇందులో భాగంగా ఎంత ఖర్చుకైనా పార్టీలు, అభ్యర్థులు వెనుకాడటం లేదు. అయితే, ఈ ఎన్నికలు అత్యంత ఖరీదైన ఎన్నికలుగా నిలవనున్నాయని కొన్ని అంచనా సంస్థల సమాచారాన్ని బట్టి తెలుస్తున్నది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో అయిన మొత్తం ఖర్చు రూ. 55,000-60,000 కోట్లకు చేరుకున్నది. అయితే, ఈ సారి ఎన్నికల్లో దానిని మించి ఖర్చయ్యే అవకాశాలున్నాయని ఎన్నికల ఖర్చులను ట్రాక్ చేసే సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ (సీఎంఎస్) వెల్లడించింది. .

ఎన్నికల వ్యయాన్ని అంచనా వేసే ఓపెన్ సీక్రెట్స్.ఆర్గ్ ప్రకారం.. ఈ ఎన్నికల్లో కాబోయే ఖర్చు 2020 యూఎస్ ఎన్నికల్లో అయిన మొత్తం వ్యయం దాదాపు రూ. 1.2 లక్షల కోట్ల ఖర్చుతో సమానం. మరో మాటలో చెప్పాలంటే.. భారత్‌లో జరుగుతున్న ఎన్నికలు అత్యంత ఖరీదైనవి. అయితే, రాజకీయ పార్టీలు ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేయటంపై రాజకీయ విశ్లేషకుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. డబ్బు ప్రభావంతో ఓటర్లు ప్రభావితమయ్యే అవకాశాలే ఎక్కువ అని అంటున్నారు. భారత ఎన్నికల సంఘం(ఈసీఐ)నుంచి రాజకీయ పార్టీల ఖర్చుపై పరిమితులు ఉన్నప్పటికీ.. ఎన్నికల్లో డబ్బు ప్రవాహం ఆగకపోవటంపై సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈసీఐ 'వ్యయ పరిశీలకులను' నియమించి నప్పటికీ.. ప్రతి ఎన్నికలతో పాటు బహుమతులు, నగదు, బంగారం, డ్రగ్స్ వంటి బహుమతులు కూడా ప్రతి ఎన్నికలకు పెరుగుతూనే ఉన్నాయని విశ్లేషకులు అంటున్నారు. 'ఓటుకు నోటు'కు వ్యతిరేకంగా ఎన్నికల సంఘం ఎన్ని ప్రచారాలు నిర్వహిస్తున్నా అభ్యర్థులు, ఓటర్లు, రాజకీయ పార్టీల ప్రవర్తనలో ఎలాంటి మార్పు రావటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అభ్యర్థుల ఖర్చు విషయానికొస్తే.. ప్రతి పోటీదారు లోక్‌సభ నియోజకవర్గాలకు రూ. 75-95 లక్షలు (ప్రాంతాన్ని బట్టి), అసెంబ్లీ స్థానాలకు రూ. 28-40 లక్షల కంటే ఎక్కువ ఖర్చు చేయకూడదు. వ్యయ పరిమితులు బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రకటనలు, పోస్టర్లు, బ్యానర్‌లు, వాహనాలు, ఇతర వాటితో సహా ప్రతి అభ్యర్థి చట్టబద్ధంగా ప్రచారం కోసం ఖర్చు చేయగల మొత్తాన్ని సూచిస్తాయి. ఈ ఖర్చు పరిమితులు 1951-52లో మొదటి సార్వత్రిక ఎన్నికల సమయంలో దాదాపు రూ. 25,000 నుంచి ప్రతి అభ్యర్థికి ప్రస్తుతం రూ. 75-95 లక్షలకు పెరగటం గమనార్హం.


సీఎంఎస్ నివేదిక ప్రకారం.. 1998 నుంచి 2019 వరకు.. మొత్తం 20 సంవత్సరాలలో ఎన్నికల వ్యయం ఆరు రెట్లు పెరిగింది. 1998లో ఖర్చు రూ. 9,000 కోట్లు ఉండగా.. అది 2019లో దాదాపు రూ. 55,000 కోట్లకు ఎగబాకింది. 2019 ఎన్నికల సమయంలో ఒక్కో ఓటుకు సగటున రూ.700 లేదా లోక్‌సభ నియోజకవర్గానికి దాదాపు రూ.100 కోట్లు ఖర్చు చేసినట్టు అంచనా. రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థుల తీరును బట్టి చూస్తే ఈ సారి 2024 ఎన్నికల వ్యయం గణనీయంగా పెరిగే అవకాశం ఉన్నదని నిపుణులు, విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు.

2019 ఎన్నికల సమయంలో మొత్తం రూ. 55,000-60,000 కోట్ల పోల్ ఖర్చులో కేవలం రూ. 12,000-15,000 కోట్లు (20 నుంచి 25 శాతం) నేరుగా ఓటర్లకు చేరాయి. అభ్యర్థులపై పడిన అతిపెద్ద భారం ప్రచారం. ఇందుకు 30 నుంచి 35 అంటే.. రూ. 20,000-25,000 కోట్లు అభ్యర్థులు ఖర్చు చేశారు. రూ.5,000 నుంచి రూ.6,000 కోట్లు(మొత్తం వ్యయంలో 8-10 శాతం) ఖర్చు లాజిస్టిక్స్ మీద ఉన్నాయి. అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) నివేదిక ప్రకారం.. 2009 ఎన్నికల సమయంలో 29 శాతం మంది అభ్యర్థులు రూ. కోటి లేదా అంతకంటే ఎక్కువ ఆస్తులు కలిగి ఉన్నారు. ఆ సంఖ్య 2019 లోక్‌సభ ఎన్నికల నాటికి 474 మంది ఎంపీలకు(దాదాపు 88 శాతం మంది) చేరటం గమనార్హం.

అభ్యర్థుల విజయాన్ని సీరియస్‌గా తీసుకున్న రాజకీయ పార్టీలు.. తీవ్రమైన ఖర్చు చేస్తున్నాయి. అభ్యర్థుల తరపున పెద్ద ఎత్తున వ్యయం చేస్తున్నాయి. ఒక అంచనా ప్రకారం.. 2019లో 32 జాతీయ, రాష్ట్ర పార్టీలు అధికారికంగా ఖర్చు చేసిన మొత్తం రూ. 2,994 కోట్లలో.. రూ.529 కోట్లు అభ్యర్థులకు ఏకమొత్తంగా వెళ్లాయి. రియల్ ఎస్టేట్, మైనింగ్, కార్పొరేట్లు, పరిశ్రమలు, చిట్ ఫండ్, కాంట్రాక్టర్లు, పౌరులు, రవాణా దారులు, ఎన్నారైలు, వివిధ పరిశ్రమల మూలాల నుంచి దాతల డాలర్లు తరచుగా వస్తాయనీ, వీటినే రాజకీయ పార్టీలు ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నాయని చెప్తున్నారు.

ముస్లిం రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం

- కేంద్ర మంత్రి, బీజేపీ నేత పియూష్ గోయల్



అమరావతి : ముస్లిం రిజర్వేషన్లకు తాము వ్యతిరేకమని, కేంద్ర మంత్రి పియూష్ గోయల్ ప్రకటించారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా గురువారం విజయవాడ చేరుకున్న మంత్రి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతో ఉండవల్లి నివాసంలో గంటకుపైగా చర్చించారు. ప్రస్తుతం ఎన్నికల తీరు, ప్రచారం, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, మోడీ పర్యటనకు సంబంధించిన అంశాలపైనా చర్చించారు. అనంతరం విజయవాడలోని ఓ హోటల్లో గోయల్ మీడియాతో మాట్లాడారు. ముస్లిం రిజర్వేషన్లను తాము వ్యతిరేకిస్తున్నామని, మార్పులు చేర్పులు చేసేందుకు ఇదే తమకు తగిన సమయమని ప్రకటించారు. రాష్ట్రంలో ఐదేండ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి నిలిచిపోయిందని, ఏపీ వెనుకబడిందని, రైతులను పట్టించుకోవడం మానేశారని తెలిపారు. ఇసుక, ల్యాండ్, లిక్కర్ మాఫియాలకు కేంద్రంగా ఏపి మారిందని విమర్శించారు. విశాఖ రైల్వేజోన్ ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం భూమిని ఇవ్వలేదని పేర్కొన్నారు. జీడీపీ లో దేశం ఐదోస్థానానికి చేరుకుందని, మోడీ ఇచ్చిన హామీలను మర్చిపోలేదని, రామమందిర నిర్మాణం భారతీయులందరికీ గర్వకారణమని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ఎన్‌డిఏ కూటమి గెలుపు ఖాయంగా కనిపిస్తోందన్నారు.

టీడీపీ ఏం చెబుతుంది?

పియూష్ గోయల్ ప్రకటనతో టీడీపీ గొంతులో వెలక్కాయపడింది. టీడీపీ ముస్లిం రిజర్వేషన్ల విషయమై తమ వైఖరి ఏమిటన్నది ప్రజలకు స్పష్టపర్చవలసిన అవసరం ఏర్పడింది. ఒకే కూటమిలో వున్నా పార్టీలు పూర్తి విరుద్ధ వైఖరులు తీసుకుంటాయని చెబుతారా? లేక బీజేపీ విధానమే తమదీ అని చెబుతారో చూడాలి. రాష్ట్రంలో మైనార్టీలు గణనీయమైన నియోజకవర్గాల్లో గెలుపు ఓటములను ప్రభావితం చేయగలిగే విధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి వచ్చిన బీజేపీ నేత ప్రకటన ఎన్‌డిఏ కూటమిలో ప్రధానంగా ఉన్న టీడీపీ కి మింగుడు పడని అంశంగా మారింది.

లోక్‌సభ ఎన్నికలకు బలగాలపై సమీక్ష

- ఉన్నతాధికారులతో చర్చించిన డీజీపీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని రాష్ట్రంలో బందోబస్తు కోసం అవసరమైన కేంద్ర బలగాల గురించి రాష్ట్ర డీజీపీ డాక్టర్ రవి గుప్తా.. జిల్లాల ఎస్పీలు, నగర కమిషనర్లతో చర్చించారు. ఇప్పటికే రాష్ట్రంలో వంద కంపెనీల కేంద్ర బలగాలు ఎన్నికల బందోబస్తును నిర్వహిస్తున్నాయి. కాగా, తాజాగా ఏయే జిల్లాలకు ఎన్ని కేంద్ర బలగాలు అవసరమవుతాయనే విషయమై..ఆయన జిల్లాల ఎస్పీలు, నగర కమిషనర్ల నుంచి నివేదికలను కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 250 కంపెనీలకు పైగా కేంద్ర బలగాలను రాష్ట్రానికి కేటాయించారు. అయితే, ఈ సారి కూడా అదే సంఖ్యలో బలగాలు అవసరమవుతాయని ఉన్నతాధికారులు భావి స్తున్నారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఒకేసారి బలగాలను ఆ సంఖ్యలో పంపించటం సాధ్యం కాకపోవచ్చునీ, విడతలవారీగా పంపించటానికి కేంద్ర ఎన్నికల సంఘం అంగీకరించినట్టు తెలిసింది. కాగా, కేంద్ర బలగాల సంగతి ఎలా ఉన్నా.. రాష్ట్ర పోలీసు బలగాలను ఉపయోగించుకొని బందోబస్తుపై పూర్తిగా శ్రద్ధ వహించాలనీ, రాష్ట్రంలో ఎన్నికల సమయానికి కేంద్ర బలగాలు రావచ్చని ఉన్నతాధి కారులు భావిస్తున్నారు.

అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే.. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతల పరంగా అవాంఛనీయ సంఘటనలు తక్కువగానే చోటు చేసుకుంటాయనీ, అయినప్పటికీ.. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు, మతపరంగా సున్నితమైన ప్రాంతాలు, రాజకీయంగా పాత కక్షలు నెలకొని ఉన్న ప్రాంతాల్లో ముందస్తుగా పోలీసు బలగాలను కేంద్రీకృతం చేయాల్సి నవసర ముంటుందని ఒక పోలీసు ఉన్నతాధికారి అభి ప్రాయపడ్డాడు. కాగా, అభ్యర్థుల నామినేషన్ ఘట్టం పూర్తయిందనీ, ఇక అన్ని పార్టీలు తమ ప్రచారాన్ని ఉధృతం చేసేందుకు సమాయత్త మవుతున్నాయి.



ముఖాలు చూసి విచారణచేయను

కాళేశ్వరంపై ప్రజాభిప్రాయసేకరణ

- అవసరమైతే కేసీఆర్‌నూ విచారిస్తాం
- నివేదికల ఆధారంగా పనిచేస్తాం : బాధ్యతల్లోకి జస్టిస్ ఘోష్
- మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి ఉత్తమ్
- ఫిర్యాదులకు ఆహ్వానం : రాహుల్ బొజ్జా

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తామని జ్యుడీషియల్ విచారణ కమిషన్ చైర్మెన్ రిటైర్డ్ జస్టిస్ పినాకిని చంద్రఘోష్ వ్యాఖ్యానించారు. అవసరమైతే మాజీ సీఎం కేసీఆర్‌ను పిలిచి సమాచారం తీసుకుంటామని చెప్పారు. దీంతో సంబంధము న్న నిర్మాణ సంస్థలు, రాజకీయ నాయకులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. ఎన్‌డీఎస్‌ఏ, విజిలెన్స్, కాగ్ రిపోర్టుల ఆధారంగా విచారణ జరుగుతుందన్నారు. గురువారం హైదరాబాద్ లోని బీఆర్‌ఆర్‌కే భవన్‌లోని ఆయన కార్యాలయానికి వచ్చారు. నోడల్ అధికారులతో తొలుత భేటీ అయ్యారు. రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆయన్ను కలిశారు. అనంతరం మీడియాతో స్వల్ప సమయం చిట్‌చాట్ చేశారు. కాళేశ్వరంపై నిపుణుల అభిప్రాయాలను తీసుకుని విచారణ ప్రారంభిస్తామని చెప్పారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వెళ్లి బ్యారేజీలను పరిశీలిస్తామని తెలిపారు. కుంగిన పిల్లర్లను చూసి, ప్రాజెక్టు డ్యామేజీ తీవ్రతను అంచనా వేస్తామని చెప్పారు. త్వరలోనే అవకతవకలపై పత్రికా ప్రకటనలు ఇచ్చి, ప్రజాభిప్రాయ సేకరణ చేస్తామని ప్రకటించారు. మూడు రోజుల్లో కార్యాచరణ ప్రారంభిస్తామ న్నారు. సాంకేతిక అంశాలనూ పరిగణనలోకి తీసుకుని విచారణ చేస్తామన్నారు. నేను ముఖాలు చూసి విచారణ చేయనని వ్యాఖ్యానించారు. ఎన్‌డీఎస్‌ఏతోపాటు ప్రాజెక్టు నిర్మాణంలో పాలుపంచుకున్న ఇంజినీర్లతో సమావేశమవుతానని వివరించారు. న్యాయ సమస్యలు రాకుండా విచారణ చేస్తామన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తామన్నారు. తొమ్మిది రకాల సమాచారాన్ని జస్టిస్ ఘోష్‌కు సాగునీటి శాఖ అధికారులు ఇవ్వగా, మరింత సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. శుక్ర, శనివారాల్లో అధికారులతో ప్రాజెక్టుపై సమగ్ర వివరాలు సేకరించనున్నారు. వారితో సమావేశమై ప్రాజెక్టుకు ఏర్పడిన ముప్పు, ఇతర అంశాలపై చర్చించనున్నారు. కమిషన్ విచారణా కార్యాలయాన్ని బీఆర్‌ఆర్‌కే భవన్‌లోని 8వ అంతస్థులో ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. తొలిదశలో కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణ, అధికారులతో సమావేశాలు చేపట్టనున్నారు. రెండో దశలో క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా బ్యారేజీలను పరిశీలించనున్నట్టు తెలిసింది.

విచారణకు సహకరిస్తాం: జస్టిస్ ఘోష్‌తో మంత్రి ఉత్తమ్

జస్టిస్ చంద్రఘోష్ కమిషన్‌తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం భేటీ అయ్యారు. నేటి నుంచి బ్యారేజీలపై కమిషన్ విచారణ ప్రారంభమైంది. ఈ క్రమంలో మొదటిరోజు కావడంతో కమిషన్‌ను మంత్రి ఉత్తమ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చంద్రఘోష్ కమిషన్‌కు కాళేశ్వరం అంశాలను వివరించారు. వీలైనంత త్వరగా నివేదిక ఇవ్వాలని కమిషన్‌ను మంత్రి విజ్ఞప్తి చేశారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఆధారంగా చర్యలు చేపడతామని చెప్పారు. అవకాశం ఉంటే బ్యారేజీలకు మరమ్మతులు చేసి వచ్చే సీజన్‌కి డ్యామ్‌ని ఉపయోగంలోకి తేవాలని ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. కమిషన్‌కు అడిగిన వివరాలు, ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు ఉంటాయని ఉత్తమ్‌కుమార్ స్పష్టం చేశారు. మరో నాలుగైదు రోజుల్లో ఎన్‌డీఎస్‌ఏ రిపోర్టు రానుంద న్నారు. కేవలం రిపోర్టు ఆధారంగానే కాళేశ్వరానికి సంబంధించి ఎలాంటి నిర్ణయాలైనా ఉంటాయని వ్యాఖ్యానించారు.

ప్రజాభిప్రాయ సేకరణకు నోటిఫికేషన్ :రాహుల్‌బొజ్జా

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన ప్రజల ఫిర్యాదులు, నివేదనల సమర్పణకు ప్రభుత్వం బహిరంగ ప్రకటన చేసింది. దరఖాస్తులను సీల్డ్ కవర్‌లో విచారణ కమిషన్‌కు అందజేయవచ్చని తెలియజేసింది. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మూడు గంటల్లోపు హైదరాబాద్‌లోని బీఆర్‌ఆర్‌కే భవన్ 8వ అంతస్థులోని కమిషన్ కార్యాలయానికి వ్యక్తిగతంగా గానీ, లేదా పోస్టు ద్వారా సమర్పించే అవకాశాన్ని కల్పించారు. మే 31 వరకు నోటరీ అఫిడవిట్లు జత చేసి, సాక్ష్యాలతో ఫిర్యాదులు చేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన నిర్మాణ, నాణ్యత, నిర్మాణపరమైన లోపాలు, బాధ్యులను గుర్తించడం, నిధుల దుర్వినియోగం తదితర అంశాలపై కమిషన్ విచారణ చేయనున్నది. ఈ మేరకు గురువారం సాగునీటి పారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా బహిరంగ ప్రకటన విడుదల చేశారు. సాక్ష్యాధారాలు లేని ఫిర్యాదులను తిరస్కరిస్తామని పేర్కొన్నారు. కాళేశ్వరం విచారణ కమిషన్, బీఆర్‌ఆర్‌కే భవన్, డి బ్లాక్, 8వ అంతస్థు, సచివాలయం సమీపం, హైదరాబాద్-500063 చిరునామాకు ఫిర్యాదులు పంపవచ్చని గుర్తు చేశారు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ చట్టం, 1952(కేంద్ర ప్రభుత్వం చట్టం నెంబరు 60/1952, సెక్షన్ 3) ద్వారా సంక్రమించిన అధికారాలతో జస్టిస్ పినాకిని ఘోష్ విచారణ కమిషన్‌ను ప్రభుత్వం నియమించినట్టు తెలిపారు.

రాష్ట్రంలో ముగిసిన నామినేషన్ల ఘట్టం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎన్నికల ఘట్టం మొదటి అంకమైన నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగిసింది. చివరి రోజు ప్రధాన పార్టీల నేతలు, వారి, డమ్మీలు, ఇతర ముఖ్యులతో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థులు భారీగా నామినేషన్లు దాఖలు చేశారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజక వర్గాలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీకి గురువారం సాయంత్రం గడువు ముగిసే సమయానికి 547 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఖమ్మం లోక్‌సభకు అత్యధికంగా 29 నామినేషన్లు దాఖలు కాగా ఆదిలాబాద్ స్థానానికి అత్యల్పంగా ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. మొదటి ఆరు రోజుల్లో 302 మంది నామినేషన్లు దాఖలు చేయగా, చివరి రోజు ఏకంగా 145 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 18 నుంచి 25 వరకు ఏడు పనిదినాల్లో నామినేషన్లను స్వీకరించారు. శుక్రవారం నామినేషన్లను పరిశీలిస్తారు. ఉపసంహరణ గడువు ఈ నెల 29 ముగిసిన తర్వాత పోటీలో నిలవ బోయే తుది అభ్యర్థులను ఎన్నికల సంఘం ప్రకటించనుంది. దేశ వ్యాప్తంగా మొత్తం ఏడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. నాలుగో దశలో భాగంగా రాష్ట్రంలో మే 13న పోలింగ్ జరగనుంది, జూన్ 4న కౌంటింగ్, అదే రోజు ఫలితాలు వెలువడనున్నాయి.

సౌత్ జోన్ డీసీపీగా స్నేహా మెహ్రా నియామకం

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

హైదరాబాద్ నగర సౌత్ జోన్ డీసీపీగా స్నేహా మెహ్రాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు ఇక్కడ డీసీపీగా పని చేసిన సాయి చైతన్యను ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రభుత్వం బుధవారం బదిలీ చేసిన విషయం తెలిసిందే. 2018వ బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అయిన స్నేహా మెహ్రా గతంలో వరంగల్ ఏఎస్పీగా, సైబరాబాద్ డీసీపీగా, నగర మహిళా భద్రతా విభాగం ఎస్పీగా పని చేసి, ప్రస్తుతం సైబర్ క్రైమ్ డీసీపీగా విధులు నిర్వహిస్తున్నారు. కొత్త బాధ్యతలను ఆమె శుక్రవారం చేపట్టనున్నారు.





ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీల హక్కులు కాలరాసేందుకు కాంగ్రెస్ కుట్ర : ప్రధాని మోడీ

లక్నో : దేశంలోని ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీల హక్కులను కాలరాసే కుట్రకు కాంగ్రెస్ పార్టీ తెరలేపిందని ప్రధాని నరేంద్ర మోడీ గురువారం ఆరోపించారు. యూపీలోని ఆగ్రాలో జరిగిన ర్యాలీ నుద్దేశించి మోడీ మాట్లా డారు. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓబీసీల హక్కులను లాగేసుకుం దని, ఆపై దేశవ్యాప్తంగా ఎక్కడ అధి,కారం లోకి వచ్చినా ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీ లను వంచించేందుకు అలాగే చేయాలని భావిస్తోం దని ఆరోపిం చారు. కర్నాటకలో ముస్లింలం దరినీ ఓబీసీ జాబితాలో చేర్చుతూ అక్కడి కాంగ్రెస్ ప్రభు త్వం రాత్రికి రాత్రి నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఓబీసీల హక్కులను కాంగ్రెస్ కాలరాసిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. యూపీలోనూ ఈ క్రీడను రక్తికట్టించేందుకు కాంగ్రెస్ పావులు కదుపు తోందని దుయ్యబట్టారు. దేశంలో ఎక్కడ అవకాశం వచ్చినా కాంగ్రెస్ ఈ పనికి తెగ బడుతుందని అన్నారు. దొడ్డిదారిన ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు కోతలు పెట్టి దాన్ని ఇతరులకు బీజేపీ అందిస్తోందని ఆరోపించారు.

కార్పొరేట్ ప్రయోజనాల కోసం...
అన్నదాతలకు శరగోపం

- గంగలో కలిసిన హామీలు
- కేటాయింపుల్లో కోత...ధరల వాత
- రుణమాఫీ ఊసే లేదు
- విపత్తు నిధి నుండి సాయమూ రాదు


న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తోంది. వారికి మితిమీరిన రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తోంది. అదే సమయంలో అన్నదాతల నెత్తిన శరగోపం పెడుతోంది. వ్యవసాయ బడ్జెట్‌ను కుదిస్తోంది. ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు చుక్కల్ని తాకుతున్నాయి. సబ్సిడీలలో కోత పడుతోంది. మోడీ హయాంలో రైతు రుణాల మాఫీ ఊసే లేదు. పెట్టుబడి వ్యయం పెరగడం, ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు లభించకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు, ప్రభుత్వ ఉదాశీనత కారణంగా అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో బలవన్మరణానికి పాల్పడుతున్నారు. ఇక వ్యవసాయ కార్మికుల పరిస్థితి గురించి చెప్పాల్సిన అవసరమే లేదు.

చెప్పిందేమిటి?

పంటలు పండించడానికి రైతన్నలకు అయిన ఖర్చుకు కనీసం ఒకటిన్నర రెట్లు అదనంగా రాబడి ఉండేలా చూస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని నమ్మబలికింది. రైతు రుణాలు మాఫీ చేస్తామని చెప్పింది. ప్రతి రైతు కుటుంబానికీ లక్ష రూపాయల వరకూ వడ్డీ లేని రుణం ఇస్తామని తెలిపింది. అయితే ఈ హామీలలో ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదు.

ఉపాధి హామీకి తూట్లు

ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడం మాట అటుంచి బీజేపీ ప్రభుత్వం తన రైతు వ్యతిరేక విధానాల ద్వారా వారిని కష్టాల పాలు చేసింది. వార్షిక వ్యవసాయ బడ్జెట్ కేటాయింపులను 30% మేర కుదించింది. వ్యవసాయ సబ్సిడీలలో కోత విధించడంతో విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, డీజిల్, ఇతర వ్యవసాయ పెట్టుబడుల ధరలు పెరిగిపోయాయి. గ్రామీణ వ్యవసాయ కార్మికులకు వరప్రదాయినిగా నిలిచిన ఉపాధి హామీ పథకాన్ని మోడీ ప్రభుత్వం నీరుకార్చింది. దానికి అవసరమైన నిధులలో కోత పెట్టింది. ఉపాధి హామీ పథకానికి ఏటా రూ.2.72 లక్షల కోట్లు అవసరం కాగా 2023-24 బడ్జెట్‌లో కేవలం రూ.73,000 కోట్లు మాత్రమే విదిల్చింది.




వలస పక్షులుగా...

పంట ఉత్పత్తులకు తగిన ధర లభించకపోవడం, గ్రామాలలో పని లేకపోవడం, రుణాలను తిరిగి చెల్లించే దారి లేకపోవడంతో రైతులు పెద్ద సంఖ్యలో గ్రామాలను వదిలి ఉపాధి కోసం పట్టణాలు, నగరాల బాట పట్టారు. 2016 నుండి 2023 వరకూ...అంటే గడచిన ఆరు సంవత్సరాలలో నాలుగు కోట్ల మంది ప్రజలు గ్రామాల నుండి నగరాలకు వలస వెళ్లారు.

పెరిగిన రుణభారం

బీజేపీ ప్రభుత్వం రైతు రుణాల మాఫీ ఊసే మరిచింది. దేశంలోని రైతులందరి రుణాలు మాఫీ చేయడానికి ఐదు లక్షల కోట్ల రూపాయలు సరిపోతాయి. అయితే నిధుల కొరత కారణంగా తాము అన్నదాతల రుణాలు మాఫీ చేయలేమని ప్రభుత్వం చేతులెత్తేసింది. కానీ అదే సమయంలో కార్పొరేట్ కంపెనీలకు సంబంధించిన రూ.30 లక్షల కోట్ల రుణాలను రద్దు చేసింది. మోడీ పాలనలో రైతు కుటుంబాలపై రుణభారం 30% పెరిగింది. దీంతో అన్న దాతలు రుణాల ఊబిలో కూరుకుపోయారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తు సహాయ నిధిని కూడా దుర్వినియోగం చేసింది. వరదలు, కరువు కాటకాలు, ఇతర విపత్తుల కారణంగా పంట నష్టపోయిన రైతాంగానికి ఈ నిధి నుండి ఒక్క రూపాయి కూడా సాయం అందలేదు. దానికి బదులుగా రైతులను పంట బీమా దిశగా నెట్టేసింది. పంట బీమా అనేది ప్రైవేటు కంపెనీల చేతిలో ఉంటుంది. దీంతో రైతులు దోపిడీకి గురయ్యారు.



ఆత్మహత్యల బాటలో...

అధికారిక లెక్కల ప్రకారమే గత పది సంవత్సరాల కాలంలో దేశంలో 1,74,000 మంది రైతన్నలు బలవన్మరణానికి పాల్పడ్డారు. అంటే ప్రతి రోజూ 30 మంది రైతులు జీవనయానం సాగించలేక ప్రాణాలు తీసుకున్నారు.

చట్ట సవరణలతో కంపెనీలకు వరాలు

ఏది ఏమైనా సరే రైతులకు వ్యతిరేకంగా ఉన్న మూడు వ్యవసాయ చట్టాలను అమలు చేయాలని మోడీ ప్రభుత్వం భావిం చింది. అయితే చివరికి అన్నదాతల ఆగ్రహంతో వాటిని వెనక్కి తీసుకుంది. రైతులకు మద్దతు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన వ్యవ సాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీ (ఏపీఎంసీ)లను రద్దు చేయడానికి మోడీ ప్రభుత్వం చట్టాల కు దారుణ మైన సవరణలు చేసింది. భూ చట్టానికి చేసిన సవరణల కారణంగా రైతుల భూములను తేలికగా కొనుగోలు చేసేందుకు కంపెనీలకు అవకాశం లభించింది. భూసేకరణ చట్టాలను సవరిం చడం ద్వారా రైతుల భూములను లీజుకు ఇవ్వ డానికి కంపెనీలకు మార్గం సుగమమైంది.

ఎన్నికల హామీ నీటి మూటే

ఉత్తరప్రదేశ్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మోడీ హఠాత్తుగా టీవీ తెరపై ప్రత్యక్షమయ్యారు. రైతులను క్షమాపణ కోరారు. వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తానని, ఇతర రైతు డిమాండ్లను నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇచ్చిన తర్వాత రైతులు తిరిగి తమ తమ ఇళ్లకు చేరుకున్నారు. అయితే ఇది జరిగి సంవత్సరం గడిచినా తన హామీలు నెరవేర్చేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్న దాఖలాలేవీ కన్పించడం లేదు. ఈ విధంగా అన్ని రకాలుగా మోడీ ప్రభుత్వం రైతులను వంచించింది.

అవిశ్రాంత పోరాటంతో...

ప్రభుత్వం ఎంత కక్షపూరితంగా వ్యవహరించినప్పటికీ రైతన్నలు సంవత్సర కాలానికి పైగా రాజధాని వీధులలో అలుపెరుగని పోరాటం సాగిం చారు. విస్తృత స్థాయిలో జరిగిన ఈ నిరసనలు చారిత్రక ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ ఆందోళన సంద ర్భంగా పలువురు మహిళా రైతులు సహా 752 మంది అన్నదాతలు ప్రాణాలు కోల్పోవడం విచారకరం. ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా తెనీ కుమారుడు ఉద్దేశపూర్వకంగా వాహనాన్ని నడిపి, ఎనిమిది మందిని పొట్టనపెట్టు కున్నాడు. అందరి కళ్ల ఎదుటే ఈ దారుణం జరిగినప్పటికీ మోడీ ప్రభుత్వం అజయ్ మిశ్రాను మంత్రి పదవి నుండి తొలగించలేదు. ఆయనపై కఠిన చర్యలేవీ తీసుకోలేదు. బీజేపీ నేతలు మోసపూరిత ఎత్తుగడలు అనుసరించినా, భయపెట్టేందుకు ప్రయత్నించినా, చెదరగొట్టాలని చూసినా రైతులు ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు.

కారణమేమిటి?

రైతుల విషయంలో ప్రభుత్వం ఇంత దారుణంగా వ్యవహరించడానికి కారణం సుస్పష్టం. అన్నదాతలను వారి భూముల నుండి తరిమివేయాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించుకుంది. భూములపై వారికి ఉన్న నియంత్రణను లాగేసుకోవాలని వ్యూహం పన్నింది. వారి భూములు, ఉత్పత్తులను కార్పొరేట్ కంపెనీల పరం చేయాలని కుట్ర చేస్తోంది. అదానీ, అంబానీ ఇప్పటికే వ్యవసాయ రంగంలో గణనీయంగా పెట్టుబడులు పెట్టారు. రైతులు ఉపయోగించే విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారకాలు, ట్రాక్టర్లు, టిల్లర్లు, ఇతర వ్యవసాయ పరికరాలపై వారు ఇప్పటికే ఆధిపత్యం చెలాయిస్తున్నారు. ఇప్పుడు వారు రైతన్నల భూములు, పంటలపై కన్నేశారు. అందుకే ఏపీఎంసీ చట్టం, భూసేకరణ చట్టం, భూ లీజు చట్టానికి సవరణల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. కార్పొరేట్ కంపెనీల వైఖరి ఒకటే. రైతుల భూములు కొనుగోలు చేయడం లేదా వారు పండిస్తున్న పంటలపై పెత్తనం చేయడం. తాము నిర్ణయించిన ధరకు తమకే పంట ఉత్పత్తులు విక్రయించేలా రైతన్నలపై ఒత్తిడి తేవడానికి కార్పొరేట్ కంపెనీలు ప్రయత్నిస్తున్నాయి. రైతులకు రక్షణగా నిలవాల్సిన కేంద్ర ప్రభుత్వం, కార్పొరేట్ ప్రయోజనాలకు బాసటగా ఉంటోంది. వ్యవసాయాన్ని, రైతు సమాజాన్ని అణగదొక్కేందుకు కార్పొరేట్ కంపెనీల అజెండాను అమలు చేస్తోంది. అందుకే రైతు చట్టాల అమలుకు అన్ని ప్రయత్నాలు చేస్తోంది. అన్నదాతల జీవితాలను, వారి జీవనోపాధిని పరిరక్షించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న రైతు సంఘాలన్నీ సంఘటితమై జీవన్మరణ పోరాటాన్ని కొనసాగిస్తున్నాయి. మరోవైపు రైతుల్లో భయాందోళనలు రేకెత్తించేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. వారిని ఉగ్రవాదులుగా చూస్తోంది. వారి ఆందోళనను అణచివేయాలని యత్నిస్తోంది. ఈ ఆందోళన విజయవంతమైనప్పుడే రైతు సమాజం మనుగడ సాధ్యపడుతుంది. లేకుంటే అన్నదాతలు నిరుపేద కార్మికులుగా మారిపోతారు.

నేడే రెండో విడత పోలింగ్

- 13 రాష్ట్రాలు, 88 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు
- 1,202 మంది అభ్యర్థులు
- 15.88 కోట్ల ఓటర్లు, 1.67 లక్షల పోలింగ్ కేంద్రాలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ రెండో విడత ఎన్నికల పోలింగ్ నేడు జరగనుంది. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమై రాత్రి ఆరు గంటలకు ముగియనుంది. 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 88 లోక్‌సభ స్థానాల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి. అందులో 73 జనరల్, తొమ్మిది ఎస్సీ, ఆరు ఎస్టీ నియోజకవర్గాలు ఉన్నాయి. 1,202 మంది అభ్యర్థులు పోటీ చేయనున్నారు. వారిలో 1,098 మంది అభ్యర్థులు పురుషులు కాగా, 102 మంది మహిళలు, ఇద్దరు ట్రాన్స్ జండర్స్ ఉన్నారు. మొత్తం 15.88 కోట్ల ఓటర్లు ఉన్నారు. అందులో 8.08 కోట్లు పురుషులు, 7.8 కోట్లు మహిళలు, 5,929 మంది ట్రాన్స్ జండర్ ఓటర్లు ఉన్నారు. 34.8 లక్షల మంది ఓటర్లు మొదటి సారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలోనూ 3.28 కోట్ల ఓటర్లు 20 నుంచి 29 మధ్య వయస్సు గలవారు ఉన్నారు. 14.78 లక్షల మంది 85 ఏండ్ల పైబడిన వృద్ధులుండగా, 42,226 మంది వందేండ్ల పైడిన వృద్ధులున్నారు. 14.7 లక్షల మంది వికలాంగ ఓటర్లు ఉన్నారు. 1.67 లక్షల పోలింగ్ స్టేషన్లుండగా, 16 లక్షల మంది పోలింగ్ అధికారులు బాధ్యతలు నిర్వహించనున్నారు. 251 పరిశీలకులు బాధ్య తలు నిర్వహిస్తారు. భద్రతా సిబ్బంది కోసం మూడు హెలికాప్టర్లు, నాలుగు ప్రత్యేక రైళ్లు, దాదాపు 80 వాహనాలు ఉపయోగిం చనున్నారు. 50 శాతంపైగా (లక్షకు పైగా) పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది.

ఏ రాష్ట్రంలో, ఎన్ని స్థానాల్లో పోలింగ్

కేరళలోని మొత్తం 20 స్థానాలకు, కర్నాటకలోని 14, రాజస్థాన్‌లో 13, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్‌లలో 8 స్థానాల చొప్పున, మధ్యప్రదేశ్‌లో 7, అసోం, బీహార్‌లో 5, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ లలో 3, త్రిపుర, జమ్మూ కాశ్మీర్‌లలో ఒక్కో స్థానానికి పోలింగ్ జరగనుంది. మణిపూర్‌లోనూ పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ విడతలో వివిధ పార్టీలకు చెందిన హేమాహేమీలు బరిలో ఉన్నారు. రాహుల్ గాంధీ, శశి థరూర్, అరుణ్ గోవిల్‌లు వంటి అనేక మంది కాంగ్రెస్ నుంచి బరిలో దిగారు. బీజేపీ నుంచి హేమమాలిని, ఓం బిర్లా, గజేంద్ర సింగ్ షెకావత్ పోటీలో ఉన్నారు. సీపీఐ(ఎం) నుంచి శైలజ టీచర్, ఎలమారం కరీం, థామస్ ఐజాక్ బరిలో ఉన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేరళలోని వయనాడ్ నుంచి సిట్టింగ్ ఎంపీగా ఎన్నికల బరిలోకి దిగారు. ఆయన సీపీఐకి అభ్యర్థి అన్నీ రాజా, బీజేపీ అభ్యర్థి కె సురేంద్రన్‌తో తలపడనున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి శశిథరూర్ తిరువనంతపురం సీటును నాలుగోసారి నిలబెట్టుకోవాలని కష్టపడుతున్నారు. బీజేపీ నుంచి కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, సీపీఐ నుంచి పన్నయన్ రవీంద్రన్ అదే సీటు నుంచి పోటీలో ఉన్నారు.

2014 నుంచి మథుర నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న హేమమాలిని బీజేపీ అభ్యర్థిగా కాంగ్రెస్ నేత ముఖేష్ ధన్‌గర్‌పై పోటీ చేస్తున్నారు. కోటా నుంచి రెండుసార్లు ఎంపీగా ఎన్నికైన ఓం బిర్లా, కాంగ్రెస్ అభ్యర్థి ప్రహ్లాద్ గుంజాల్‌తో తలపడుతున్నారు. కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ జోధ్‌పూర్ స్థానం నుంచి మూడోసారి విజయం సాధించాలని చూస్తున్నారు. బెంగళూరు సౌత్ సిట్టింగ్ ఎంపీ, భారతీయ జనతా యువమోర్చా (బీజెవైఎం) జాతీయ అధ్యక్షుడు తేజస్వీ సూర్య, కాంగ్రెస్ అభ్యర్థి సౌమ్యారెడ్డితో తలపడనున్నారు. ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత భూపేష్ బఘేల్ గత 30 ఏండ్లుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న రాజ్‌నంద్‌గావ్ నుంచి పోటీ చేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీ నేత వీరేంద్ర కుమార్ ఖాటిక్ తికమ్‌గఢ్‌లో బరిలో నిలిచారు. ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి పంకజ్ అహిర్వార్ రంగంలోకి దిగారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ అలప్పుజ సీటులో పోటీకి దిగారు. సీపీఐ(ఎం) నుంచి ఎంపీ ఎఎం ఆరీఫ్ బరిలోకి దిగారు. త్రిస్సూర్‌లో కాంగ్రెస్‌కు చెందిన కె మురళీధరన్, సీపీఐకి చెందిన వీఎస్ సునీల్ కుమార్‌పై నటుడు, బీజేపీ తరపున సురేష్ గోపి పోటీలో ఉన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని బలూర్‌ఘాట్ నుంచి బీజేపీ ఎంపీగా ఉన్న సుకాంత మజుందార్ మళ్లీ తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఇలా వివిధ పార్టీలకు చెందిన హేమాహేమీలు రెండో విడత పోరులో తలపడను న్నారు. ఏప్రిల్ 19న దేశంలోని 102 స్థానాలకు తొలి దశ ఎన్నికలు జరగ్గా.. 65.5 శాతం పోలింగ్ నమోదైంది.



కన్నౌజ్ నుంచి అఖిలేశ్ యాదవ్ నామినేషన్ దాఖలు

లక్నో: సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ గురువారం యూపీలోని కన్నౌజ్ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. సమాజ్‌వాదీ పార్టీకి ఎంతో పట్టున్న కన్నౌజ్ నియోజకవర్గం నుంచి ఆయన మూడు సార్లు విజయం సాధించారు. 2012, 2014 ఎన్నికల్లో ఆయన భార్య డింపుల్ యాదవ్ గెలిచారు. 2019 ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి పాథక్ చేతిలో ఆమె ఓటమిని చవిచూశారు.

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో కన్నౌజ్ నుంచి నామినేషన్ దాఖలు అనంతరం అఖిలేశ్ మాట్లాడుతూ ఎస్పీ చేపట్టిన అభివృద్ధిని బీజేపీ ఉద్దేశపూర్వకంగా నిలువరిస్తోందని ఆరోపించారు. అంతేకాకుండా నెగెటివ్ రాజకీయాలకు పాల్పడుతోందని, ప్రజలను పదేపదే అవమానిస్తోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కన్నౌజ్ ప్రజలకు సేవలందించేందుకు తాను ఇక్కడికి వచ్చానని తెలిపారు. ఎస్పీ హయాంలో కన్నౌజ్‌లో జరిగిన అభివృద్ధి ప్రజలకు తెలుసునని అన్నారు. కొద్ది రోజుల క్రితం ఈ నియోజకవర్గం నుంచి అఖిలేశ్ మేనల్లుడు, ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ అల్లుడైన మాజీ ఎంపీ తేజ్ ప్రతాప్ యాదవ్ పోటీ చేస్తారని పార్టీ వర్గాలే ప్రకటించాయి. ఇక పార్టీ నేతల ఒత్తిడి మేరకు అఖిలేశ్ పోటీలో ఉండాలని నిర్ణయించారు.

ప్రధాని మోడీ, రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై
ఈసీ నోటీసులు

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘించారంటూ...



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల్లో పోటాపోటీగా ప్రచారం చేస్తున్న పార్టీలు ఒకడుగు ముందుకేసి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ని ఉల్లంఘిస్తున్నాయి. ప్రధాని మోడీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రసంగాలపై ఈసీ అసహనం వ్యక్తం చేసింది. ఎంసీసీని ఉల్లంఘించినందుకుగానూ దేశంలోని రెండు ప్రధాన జాతీయ పార్టీలకు ఈసీ షాక్ ఇచ్చింది. వివాదాస్పద వ్యాఖ్యలు చేసి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ని అతిక్రమించి నందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు గురువారం నోటీసులు జారీ చేసింది. ఆయా పార్టీల నేతలు చేసిన వ్యాఖ్యలపై బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఏప్రిల్ 29 ఉదయం 11 గంటలలోపు వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అయితే ఈసీ నోటీసులో నిబంధనలు అతిక్రమించిన నేతల పేర్లను పేర్కొనకపోవడం గమనార్హం.

"సాధారణంగా పార్టీలు తమ అభ్యర్థుల పట్ల బాధ్యత కలిగి ఉండాలి. వారి ఆదేశాలు లేకుండా ఎలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయొద్దు. కానీ పార్టీల అధినేతలే ఈ కామెంట్లు చేస్తున్నారు. ఉన్నత స్థాయిలో ఉన్నవారి ప్రసంగాలు ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఈసీ నిబంధనలు అతిక్రమించినందుకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత నడ్డా, ఖర్గేలపై ఉంది. రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులు ఎన్నికల నియమావళిని అనుసరిస్తున్నాయా లేదా అన్నది ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలి. ముఖ్యంగా స్టార్ విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. తమ అభ్యర్థులు, ముఖ్యంగా క్యాంపెయినర్ల ప్రవర్తనకు రాజకీయ పార్టీలు ప్రాథమిక బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తుల ప్రచార ప్రసంగాలు మరింత తీవ్రమైన పరిణామాలను కలిగి ఉంటాయని తెలిపింది" అని ఈసీ తన నోటీసులో పేర్కొంది.

ఇటీవల, రాజస్థాన్‌లోని ఎన్నికల ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 'చొరబాటుదారులకు, ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి దేశ సంపదను పంచవచ్చు' అని అన్నారు. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది.

ప్రధాని 'హిందువులు, ముస్లింలను విభజించాలని' చూస్తున్నారని ఆరోపించింది. ప్రధాని వ్యాఖ్యలపై ఈసీ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ కోరింది. మరోవైపు రాహుల్ గాంధీ తన ర్యాలీలలో అనుచిత భాష ఉపయోగించారని బీజేపీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. రాహుల్ గాంధీ తమిళనాడులో భాషా ప్రాతిపదికన ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నించారని బీజేపీ ఆరోపించింది.

దీంతో అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ పార్టీలకు ఈసీ నోటీసులు పంపింది. నోటీసుపై ఇరుపార్టీలు ఇంకా స్పందించ లేదు. 2024 లోక్‌సభ ఎన్నికల తొలి దశ పోలింగ్ ఏప్రిల్ 19న ప్రారంభమైంది. జూన్ 1 వరకు 44 రోజుల పాటు ఓటింగ్ ఏడు దశల్లో జరుగనుంది. జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి.

శరద్‌పవార్ నేతృత్వంలోని
ఎన్‌సీపీ మ్యానిఫెస్టో విడుదల



ముంబయి : శరద్ పవార్ నేతత్వంలోని నేషనల్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) మ్యానిఫెస్టో విడుదల చేసింది. 'శపత్‌నామా' పేరుతో గురువారం ఆ పార్టీ మహారాష్ట్ర అధ్యక్షుడు జయంత్ పాటిల్ విడుదల చేశారు. మ్యానిఫెస్టోలో మహిళలు, రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్టు ప్రకటించారు. మహిళల భద్రత కోసం వారికి సంబంధించిన సైబర్ చట్టాలను బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. అగ్నిపథ్ స్కీమ్‌ను రద్దు చేస్తామని, కులగణన చేపడతామని, రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. అప్రెంటీస్‌షిప్ హక్కు, ఉద్యోగాలలో మహిళలకు 50 రిజర్వేషన్ కల్పిస్తామని పేర్కొంది. జమ్ముకాశ్మీర్‌కి పూర్తి రాష్ట్ర హోదాకు మద్దతు ఇస్తామని, 'ఒకే దేశం.. ఒకే ఎన్నికలు'ని తిరస్కరిస్తున్నట్టు తెలిపింది. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని పెంచడానికి రాజ్యాంగ సవరణను చేస్తామని, ప్రభుత్వ రంగాలలో కాంట్రాక్ట్ కార్మికులను నిషేధిస్తామని, కార్మికుల ప్రయోజనాలను చట్టబద్ధంగా పరిరక్షిస్తామని పేర్కొంది.

పౌరసత్వ (సవరణ) చట్టం (సీఏఏ), జాతీయ పౌరసత్వ నమోదు (ఎన్ఆర్‌సీ), యూఏపీఏ చట్టాలను సమీక్షించి మార్పులను ప్రతిపాదిస్తామని పేర్కొంది. ఇతర చట్టాలు రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమైనవని తెలిపింది. రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలకు అధికారం కల్పించడం, విద్యుత్ పంపిణీని సమీక్షించడం, రాజ్యాంగ సవరణలను అమలు చేస్తామని తెలిపింది.

బంగారం కొనలేని స్థితిలో మహిళలు

మోడీ మంగళసూత్రాల విమర్శలపై తేజస్వీ యాదవ్ స్పందన

పాట్నా : భారీగా పెరుగుతున్న ధరలతో దేశంలో అనేక మంది మహిళలు బంగారం కొనలేని స్థితిలో ఉన్నా రని, ఇక 'మంగళసూత్రాలు' గురించి మాట్లాడం ఎందుకని ప్రధానమంత్రి మోడీని ఆర్జేడీ నాయకులు తేజస్వియాదవ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళల నుంచి మంగళసూత్రాలను కూడా లాగివేసుకుంటుందని మోడీ చేసిన ఆరోపణలకు స్పందిస్తూ తేజస్వి యాదవ్‌పై విధంగా స్పందించారు. పాట్నాలో విలేకరులతో తేజస్వి యాదవ్ మాట్లాడుతూ.. 'కోవిడ్ మహమ్మారి సమయంలోనూ, నోట్ల రద్దు తరు వాత, పుల్వామా ఉగ్రదాడి, సరిహద్దుల్లో ఘర్షణల కారణంగా అనేక మంది మహిళల మంగళసూత్రాలు తెగి పడ్డాయి. వీటికి ఎవరు బాధ్యత వహిస్తారో ప్రధానమంత్రి మాకు చెప్పాలి' అని అన్నారు. 'ఎన్నికలు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉండాలి. అధిక ధరలతో బంగారం మహిళలు కొనలేని విధంగా మారినప్పుడు 'మంగళసూత్రం' వ్యాఖ్యలు ఇప్పుడు ఎందుకు' అని కూడా యాదవ్ అన్నారు. బీహార్‌లో రెండో దశ ఎన్నికలు జరుగుతున్న మొత్తం ఐదు స్థానాలను ఆర్జేడీ, దాని మిత్ర పక్షాలు గెలుచుకుంటాయని తేజస్వి యాదవ్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎన్నికలు ఎన్డీఏ, ఇండియా వేదిక మధ్యే జరుగుతున్నాయని అన్నారు. 'ఒక వైపు రాజ్యాంగానికి ముప్పు తెచ్చే ఎన్డీఏ, మరోవైపు రాజ్యాంగాన్ని రక్షించాలని అనుకుం టున్న ఇండియా వేదిక. మీరు ఇండియాను లేదా ఎన్డీఏను ఒక్కదాన్నే ఎన్నుకోవాలి' అని తెలిపారు. కాంగ్రెస్ టిక్కెట్ ఇవ్వకపోవడంతో పూర్నియా స్థానం నుంచి ఇండిపెండెం ట్‌గా పోటీ చేస్తున్న రాజేష్ రంజన్ అలియాస్ పప్పు యాదవ్ ను బీజేపీ బీ-టీమ్‌గా తేజస్వి యాదవ్ విమర్శించారు.



'ఇంటి వద్ద నుండే వృద్ధులు ఓటేయ్యడానికి ఏర్పాట్లు'

నవతెలంగాణ - ఎల్బీనగర్

07-మల్కాజ్‌గిరి పార్లమెంటరీ నియోజకవర్గంలోని 049-ఎల్బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో వృద్ధులు ఇంటి వద్ద నుండి ఓటు వేయడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆ అధికారి మాట్లాడుతూ అర్హత గల వృద్ధులు 3722 మంది, అర్హత గల వికలాంగులు 4812 మంది ఉన్నారని తెలిపారు. ఈ మొత్తంలో 179 మంది వృద్ధులు మరియు 50 మంది వికలాంగులు ఫారం - 12D ద్వారా ఇంటి వద్ద ఓటు నమోదు చేసుకోవడానికి దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. అట్టి ఫారం - 12Dలను ఎలక్షన్ గైడ్ లైన్స్ ప్రకారం పరిశీలించిన అనంతరం వారి దరఖాసులను ఆమోదించినట్లు తెలిపారు. మే 5, 6, 8 తేదీలలో ఇంటి వద్ద నుండి ఓటు నమోదు చేసుకోవడానికి ఎలక్షన్ సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. కావున ఆమోదం పొందిన 213 మంది ఓటర్లు ఇంటి వద్ద నుండి పైన తెలిపిన తేదీలలో తమ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సమాచారాన్ని అన్ని పొలిటికల్ పార్టీ ప్రతినిధులకు తెలియజేసినట్టు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి తెలిపారు.

మెట్రో రైలులో ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ - ఎల్బీనగర్

మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని ఈ పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాజీ మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు గురువారం మెట్రో రైలులో ప్రయాణిస్తూ ఎన్నికల ప్రచారం చేశారు. ఎల్బీనగర్ నుంచి కూకట్‌పల్లి వరకు మెట్రో రైల్లో ప్రయాణించిన వారికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంబుపూర్ రాజు, కూకట్‌పల్లి నియోజకవర్గ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం పలువురు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు 10ఏండ్ల పాలనలో గ్రేటర్ హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. హైదరాబాద్‌కు లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చి అభివృద్ధి చేశారని కొనియాడారు. మల్కాజిగిరి పార్లమెంట్ ప్రజలారా ఆలోచించి.. కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



మధు యాష్కీని పరామర్శించిన సీఎం

నవతెలంగాణ - హయత్ నగర్

టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ తల్లి అనసూయ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన విషయం విధితమే. ఎల్బీనగర్‌లోని పాత ఇంటి వద్ద ఆమెకు గురువారం దశ దిన కర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లు హాజరై, ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట ప్రభుత్వ సలహా దారుడు వేం నరేందర్ రెడ్డి, ఇబ్రాహీం పట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, కార్మిక కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, ఉప్పల్, మలక్‌పేట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిలు పరమేశ్వర్ రెడ్డి, అక్బర్, టీపీసీసీ ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి ఉన్నారు.

'మే డే స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహించాలి'

నవతెలంగాణ - హయత్‌నగర్

మే డే స్ఫూర్తితో కార్మిక ఉద్యమాలు నిర్వహించాలని, కోల్పోయిన చట్టాలను తిరిగి కాపాడుకోవాలని సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, ఏఐటీయూసీ జిల్లా సబ్ కమిటీ సభ్యులు సామిడీ శేఖర్ రెడ్డి అన్నారు. 138వ మే డే అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరుతూ హయత్‌నగర్ మండల సమితి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం అధ్యక్షులు గోల్కొండ నాగరాజు సారథ్యంలో పార్టీ కార్యాలయంలో మే డే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులు 8 గంటల పని దినాల కోసం అమెరికా దేశం చికాగో నగరంలో వేలాది మందితో శ్రమకు తగ్గ వేతనం ఉండాలి, శ్రమ దోపిడి జరగకూడదు, వారాంతపు సెలవులు ఉండాలని నినందించి, రక్తపు టేరులు పారించి ఆ రక్తంలో ముంచిన జెండానే 'మే డే' అని వివరించారు. అంతేకాదు 'ప్రపంచ కార్మికుల్లారా ఏకంకండి' అని నినందించిన రోజు మే డే అని అన్నారు.



అలాగే ఏఐటీయూసీ స్వాతంత్రం కన్నా ముందే ఏర్పాటు అయి స్వాతంత్ర ఉద్యమంతో పాటు కార్మికుల హక్కుల కోసం నినందించి పోరాడి సాధిస్తే 40 చట్టాలను 4 కోడ్‌లుగా చేసి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారన్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో హరి సింగ్ నాయక్, సక్కు నాయక్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో రంజిత్ రెడ్డి విజయం ఖాయం



• మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ - బడంగ్‌పేట్

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డా.రంజిత్ రెడ్డి విజయం ఖాయమని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్‌లో ఆర్చిడ్ కాలనీ, మెట్రో సిటీ కాలనీ, సి.పి.ఎస్.ఆర్ కాలనీలలో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డికి మద్దతుగా గడప గడపకూ తిరుగుతూ కాంగ్రెస్ నాయకులతో మేయర్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే రంజిత్ రెడ్డి విజయానికి దోహదం చేస్తాయన్నారు. ఈ ప్రచారంలో టీపీసీసీ మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జి నిజాముద్దీన్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మైనారిటీ చైర్మన్ అఫ్జల్, సీనియర్ నాయకులు బాలింగని జంగయ్య, రియసత్, బాబా భాయ్, మెహముద్, రియాజ్ భాయ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - హయత్ నగర్



మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌ను గురువారం వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు భీం రాజ్, రంగారెడ్డి జిల్లా నాయకులు మోకాస్ మారి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

సంక్షేమ పథకాలే 'కొండ'ను గెలిపిస్తాయి



• అందెల శ్రీరాములు యాదవ్

నవతెలంగాణ - బడంగ్ పేట్

రానున్న ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డిని కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని మహేశ్వరం బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు.

మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 9వ డివిజన్‌లో కొండకు మద్దతుగా గురువారం మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్ రెడ్డి, కార్పొరేటర్ ఇంద్రసేన, మాజీ అధ్యక్షుడు నిమ్మల శ్రీకాంత్ గౌడ్, సహకార సంఘం బ్యాంకు మాజీ చైర్మన్ పి.పుల్లారెడ్డి, బ్యాంక్ డైరెక్టర్ తోట ప్రతాపరెడ్డి, నాయకులు ఏనుగు రామిరెడ్డి, మహేందర్, వెంకట్ రెడ్డి, లక్ష్మణ్, మోతకాని పెద్దయ్య, రామకృష్ణారెడ్డి, అమరేందర్ రెడ్డి, అరవింద్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, యువ నాయకులు నిమ్మల రవికాంత్ గౌడ్, వెంకటేష్ యాదవ్, లాలం కొండల్, నర్సింగ్ యాదవ్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ స్లిప్‌ల పంపిణీ కోసం సిబ్బందికి బాధ్యతలు

నవతెలంగాణ - ఎల్బీనగర్

07-మల్కాజ్ గిరి పార్లమెంటరీ నియోజకవర్గంలోని 049-ఎల్బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని ఓటర్లు మొత్తం 604716 మంది ఉన్నారని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి తెలిపారు. వారందరికీ సంబంధించిన ఓటరు సమాచారం స్లిప్పులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 26 నుండి మే 8వ తేదీ వరకు సంబంధిత ఏరియా బూత్ లెవల్ అధికారుల ద్వారా సెక్టోరల్ అధికారులు, పర్యవేక్షక అధికారుల పరివేక్షణలో స్లిప్‌ల పంపిణీ పూర్తవుతుందని అన్నారు. 049 - లాల్ బహదూర్ నగర్ అసెంబ్లీ ఓటర్లు తమకు ఓటర్ సమాచారం స్లిప్పులు అందకుంటే తమ ఫిర్యాదును జోనల్ ఆఫీస్ కొత్తపేట యందు ఉన్న కంట్రోల్ రూం యందు నమోదు చేసుకోవచ్చు అని సూచించారు. ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, 049 - లాల్ బహదూర్ నగర్ అసెంబ్లీ నియోజికవర్గం ఎన్నికల కంట్రోల్ రూం నంబర్.040 - 24140937 లేదా ఓటర్ స్లిప్‌ల పంపిణీ నోడల్ అధికారులు చంద్ర శేఖర్, డిప్యూటీ డైరెక్టర్ (యూ బి డి), ఎల్బీనగర్ జోన్, సెల్ నెం.8639031915 మరియు విజయ లక్ష్మి, డిప్యూటీ ఎస్టేట్ అధికారి, ఎల్బీనగర్ జోన్, సెల్ నెం.7702104249ను సంప్రదించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సూచించారు.

కాంగ్రెస్‌లో చేరిన జగన్ యాదవ్



నవతెలంగాణ - ఎల్బీనగర్

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి సేవలందించిన ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన గండి జగన్ యాదవ్ గురువారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జగన్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా నిబద్ధత కలిగిన కార్యకర్తగా చేస్తానని హామీ ఇచ్చారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు పట్నం మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో చరిత్ర సృష్టించిన 'చైతన్య'

నవతెలంగాణ - మీర్ పేట్

ఇంటర్ పరీక్ష ఫలితాల్లో చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు చరిత్ర సృష్టించారని ఆ కళాశాల యాజమాన్యం చైర్మన్ ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో పి ఆశ్రిత, బి స్పందన (467/470), ఎస్ కీర్తన, కె ద్విపరి, దుర్గా భవాని, ఇ పల్లవి, వైష్ణవి, దత్త సాయి, రిత్విక్ (466/470) మార్కులతో రాష్ట్రంలో 3వ ర్యాంకు సాధించారని తెలిపారు. బైపీసీ విభాగంలో శ్వేత, నవ్య శ్రీ, శ్వేత గుప్తా (436/440) మార్కులతో 2వ ర్యాంకు.. కీర్తన, భవాని(434/440) 4వ ర్యాంకు సాధించారని వెల్లడించారు. ఎంఈసీ విభాగంలో జి జ్యోతిర్మహి (496/500), సుమోజిత పాత్ర(494/500), కార్తికేయ (486/500), ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఎంపీసీ విభాగంలో జి విద్యంబిక, ఎస్ శరత్ కుమార్ (988/1000), బైపీసీ విభాగంలో డి సింధు (980/1000), ఎంఈసీ విభాగంలో పి వైశాలి (974/1000), సీఈసీ విభాగంలో దీపంజాలి (928/1000) మార్కులు సాధించినట్టు పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇంటర్‌లో 'శ్రీ మేధావి' ప్రభంజనం



నవతెలంగాణ - హస్తినాపురం

ఇంటర్మీడియట్ ఫలితాలలో హస్తినాపురంలోని శ్రీ మేధావి కళాశాలకు స్టేట్ సెకండ్ ర్యాంక్, స్టేట్ ఫోర్త్ ర్యాంక్ వచ్చిందని కళాశాల డైరెక్టర్ కోమాండ్ల శ్రీను గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మా కళాశాల విద్యార్థులు కే. వెంకటసాయి అనిరుద్‌కు ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 470కి గాను 467 మార్కులు, ఓ. ప్రవీణ్‌కు ఎంపీసీలో 470/ 465 మార్కులు సాధించి.. స్టేట్ ర్యాంకర్లుగా నిలిచారని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆ విద్యార్థులకు, కళాశాల అధ్యాపక బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



ఇంటర్‌లో స్పేస్ కాలేజ్ విద్యార్థుల సంచలనం



నవతెలంగాణ - మీర్ పేట్

ఇంటర్ పరీక్ష ఫలితాల్లో స్పేస్ జూనియర్ కళాశాల విద్యార్థులు సంచలనం సృష్టించారని ఆ కళాశాల యాజమాన్యం కరస్పాండెంట్ సాయి కృష్ణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో పి శరత్ (466/470) మార్కులు సాధించి రాష్ట్రంలో 3వ ర్యాంకు, డి అభినవ్ తేజ్ (465/470) 4వ ర్యాంక్, దీక్షిత (460/470) 5వ ర్యాంకు, బైపీసీ విభాగంలో ఈ . మనీష (436/440) రాష్ట్రంలో 2వ ర్యాంకు, రక్షిత రెడ్డి(435/440) 3వ ర్యాంకు, ఈ శృతి(434/440)4వ ర్యాంకు సాధించారని తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఎంపీసీ విభాగంలో ఈ సురేష్ (986/1000), గౌతమ్ నాయక్ (978/1000), దివ్య శ్రీ (977/1000), బైపీసీ విభాగంలో విధార్తి (956/1000), సురేఖ మీరాజ్ (949/1000), సి నిర్మల (948/1000) మార్కులతో మంచి ఫలితాలు సాధించారని వెల్లడించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్, వైస్ ప్రిన్సిపాల్ సంగీత, ఇంచార్జి శ్రీరాం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాలి





ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

నేటి సమాజంలో విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రీ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలోని మాటూరి వెంకట సుబ్బారావు ఇంజినీరింగ్ కళాశాల (ఎంవీఎస్ఆర్)లో ప్రతిభా అవార్డుల ప్రధానోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.ఆర్. లింబాద్రి, మాజీ ఐఏఎస్, సియస్బీ సివిల్ సర్వీసెస్ అకాడమీ అధినేత్రి యం.బాలలత హాజరై మాట్లాడారు. యంవీయస్సార్ 43 సంవత్సరాలుగా ఎంతోమంది గొప్ప ఇంజనీర్లను అందిస్తుందని, అంతేకాకుండా టాపర్లను గుర్తించి బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలనిచ్చి గౌరవించడం విద్యార్థుల తల్లిదండ్రులకే కాక కళాశాలకు గర్వకారణమన్నారు. బాలలత మాట్లాడుతూ తనకు చిన్నవయసులో వచ్చిన అవార్డు ఐఏఎస్ అవ్వడానికి స్ఫూర్తినిచ్చిందని, తను నడవలేకపోయిన, నిరాశ చెందకుండా, అంగవైకల్యాన్ని జయించి ఐఏఎస్ ఆఫీసర్‌గా, ఐఏఎస్ అకాడమీ ద్వారా వందల మందిని నడిపిస్తున్నానన్నారు. రాష్ట్రంలోనే టాప్ ఇంజనీరింగ్ కళాశాలలో ఒకటైన యంవీయస్సార్ విద్యార్థులు ఇంజనీరింగ్ తర్వాత ఏదో ఒక ఉద్యోగంతో తృప్తి చెందకుండా అవకాశం ఉన్నంత వరకూ నచ్చిన రంగంలో ఉన్నత స్థాయికి చేరాలన్నారు. తదనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ర్యాంకులు పొందిన యంవీయస్సార్ విద్యార్థులు 188 మందిని బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలతో ఘనంగా సత్కరించారు. సంగమమ్ 2024 కన్వీనర్ డా. జి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మెంబర్ హిరణ్మయి కళాశాల సాంస్కృతిక కార్యక్రమాల చైర్మన్ ఆధ్వర్యంలో అవార్డుల అనంతరం కళాశాల ఆవరణలో సింగర్ కార్తికేయ అవసరాల, నాదప్రియ నెడదురివెండి తమ గాత్రంతో వందలాది మంది విద్యార్థుల ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్, పీవీఆర్ కశ్యప్, సెక్రటరీ డా.కె.పి. శ్రీనివాస్ రావు, ట్రెజరర్ జూపూడి సుధాకర్, వైస్ చెర్మన్లు డా. సీతారామ్ బాబు , యం కృష్ణ కుమార్, జాయింట్ సెక్రెటరీ వాసుదేవ రావు, సభ్యులు హిరణ్మయి, ఉమాదేవి, కొణిజేటి వెంకటేశ్వర్లు గుప్త, పార్థసారథి, పవన్ కుమార్ కళాశాల ప్రిన్సిపాల్ డా. కనకదుర్గ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.యస్వీయస్ మూర్తి, సంగమమ్24 కన్వీనర్ డా. జి.శ్రీనివాస్ శర్మ కో కన్వీనర్ ప్రొ. కేవీఆర్కే, హెచ్ఓడీలు, టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన మురుగు..





నవతెలంగాణ - మలక్ పేట్

ముసారాంబాగ్ మెట్రో స్టేషన్ సమీపంలో ఉన్న ద్విచక్ర వాహనాల నిలుపు స్థలంలో మురుగు నిలిచి ఉంది. సమీపంలో మలక్‌పేట్ పోలీసుస్టేషన్ ఉంది. అంతేకాదు వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. మురుగు డ్రైన్‌లో పారిశుధ్య సిబ్బంది పూడిక తీయకపోవడం వలన మురుగు ముందుకు కదలక నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఆ దారిగుండా పోయే వారు ఆ దుర్వాసనను తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంకా దోమలు పెరిగిపోవడం వలన స్థానికులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి మురుగు నిల్వ లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

అరుణ్ కాలనీలో ఎంపీఎల్ క్లినిక్ ప్రారంభం



నవతెలంగాణ-కాప్రా

ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని అరుణ్ కాలనీ హై టెన్షన్ లైన్‌లో డాక్టర్ కిషోర్ మానసారెడ్డిలు ఎంపీఎల్ క్లినిక్ ఏర్పాటు చేశారు. గురువారం క్లినిక్ ప్రారంభోత్సవానికి మాజీ కార్పొరేటర్ పావనీ మణిపాల్‌రెడ్డితో పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కిషోర్ మానసారెడ్డిలకు శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన నామినేషన్లు : ఎన్నికల అధికారి గౌతం



నవతెలంగాణ-సీటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గ స్థానానికి చివరి రోజున 61 మంది అభ్యర్థులకుగాను 91 నామినేషన్లు వచ్చినట్టు మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గ స్థానానికి ఈ నెల 18 నుంచి 25వరకు నిర్వహించిన నామినేషన్ల స్వీకరణలో భాగంగా 114 మంది అభ్యర్థులకుగాను 177 నామినేషన్లు పత్రాలు దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేసవి సైన్స్ శిక్షణా శిబిరం ప్రారంభం



నవతెలంగాణ-కాప్రా

జనవిజ్ఞాన వేదిక మల్కాజిగిరి, కీసర మండల కమిటీ ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌లోని శ్రీమేధా విద్యా మందిర్ హైస్కూల్లో ఉచిత వేసవి సైన్ శిక్షణ శిబిరాన్ని రాష్ట్ర నాయకులు ఆనంద్‌కుమార్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకు సైన్స్ శిక్షణ శిబిరం కొనసాగుతుందన్నారు. ఈ శిబిరంలో విద్యార్థులు తమ చుట్టూ దొరికే వస్తువులతో చిన్న చిన్న ప్రయోగాలు చేయనున్నట్టు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక మేడ్చల్‌లో కోశాధికారి జెన్నీ మాట్లాడుతూ.. కాప్రా, మల్కాజిగిరి, కీసర మండల కమిటీలు ఈ సమ్మర్ క్యాంపు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఐదు వేసవి సైన్స్ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థ బట్టీ విధానానికి అలటు పడిందని తెలిపారు. ఈ విధానానికి స్వస్తి పలకడానికి తమ పరిసర ప్రాంతాల్లో దొరికే వస్తువులతో అనేక రకాల ప్రయోగాలు చేస్తూ విద్యని నేర్చుకునే విధానాన్ని శిక్షణ శిబిరం నేర్పిస్తుందన్నారు. ఈ పది రోజులపాటు సైన్స్, ఫన్ మ్యాథమెటిక్స్, ఆస్ట్రానికి, సైన్స్ ప్రయోగాలు, ఓరిగామి, మీట్ ద సైంటిస్ట్, ఆర్ట్ అండ్ డ్రాయింగ్ వంటి అనేక విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ క్యాంపును ఈసీఐఎల్, కమలానగర్, కుషాయిగూడ, కాప్రా, ఏఎస్‌రావు నగర్ ప్రాంతాల్లోని విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు శివప్రసాద్, కరుణాకర్ రెడ్డి, సోమయాచారి, శివ శంకర్ రెడ్డి, తాహిర్, పాఠశాల ఇన్‌చార్జి మాధవి పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజం కోసం ర్యాలీ



నవతెలంగాణ-కాప్రా

ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జీహెచ్‌ఎంసీ కాప్రా సర్కిల్ పరిధిలోని ఐదు యూనిట్ల పారిశుధ్య సిబ్బంది ఆధ్వర్యంలో మలేరియా రహిత సమాజ నిర్మాణానికి కాప్రా సర్కిల్ నుంచి కమలానగర్ కాలనీలో గుండా ఈసీఐఎల్ చౌరస్తా వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాప్రా సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రీజనల్ డైరెక్టర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ అనురాధ మాట్లాడుతూ.. ప్రతి ఏటా ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని జరుపుకుంటామని గుర్తు చేశారు. మలేరియాను నిర్మూలించడానికి స్థానిక ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ అధికారులకు పలు సూచనలు చేశారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రతీ వారం డ్రై డే రోజున డ్రై డే నిర్వహించాలన్నారు. మలేరియా నివారణకు జీహెచ్‌ఎంసీ సిబ్బంది చేపట్టిన సేవలను అభినందనీయమన్నారు. 'దోమకాటు- ఆరోగ్యానికి చేటు' మంచినీటి పాత్రలపై మూతలు పెట్టుదాం-దోమలు ఆవాసాలుగా మారకుండా చేద్దాం' 'పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుందాం-ప్రజా ఆరోగ్యాన్ని కాపాడుదాం' అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఇంటింటా దోమలు లార్వా సర్వే చేసి, వాటి నివారణకు తగు సూచనలు చేశారు. లార్వా ఉన్న తొట్టెలు, డ్రమ్ములు, పూల కుండీలు నుంచి నీటిలో పెరిగే ఏడీస్ దోమ వలన డెంగ్యూ వ్యాధి వ్యాపిస్తుందని, మంచినీటి పాత్రలపై మూతలు పెట్టుకోవాలని కాప్రా సర్కిల్ అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ రమేష్ సూచించారు. ఈ సందర్భంగా పలువురు మలేరియా సిబ్బంది మాట్లాడుతూ..మలేరియా రహిత సమాజం ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమని, ప్రజలందురూ దోమలు వృద్ధి చెందకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డీసీ ముకుంద రెడ్డి, సర్కిల్, ఏఎమ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, సూపర్‌వైజర్లు, పరమేష్, నరేందర్ రెడ్డి, కనకరాజు, నరసింహ గౌడ్, ఐదు యూనిట్ల మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలి



నవతెలంగాణ-కాప్రా

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్. బాలమల్లేష్ పేర్కొన్నారు. గురువారం సీపీఐ నాయకులు కె.స్వామి అధ్యక్షతన కాప్రా సీపీఐ పార్టీ కార్యాలయం, నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ మతోన్మాదం పేరుతో ప్రజలను విడదీసి మరోసారి అధికారంలోకి రావాలని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ మనువాదాన్ని ప్రవేశపెట్టి ప్రజల మధ్య చిచ్చుపెట్టి అణగారిన వర్గాలను బానిసలుగా చేయాలని కుట్ర పన్నుతుందని పేర్కొన్నారు. సమస్యలను ప్రశ్నించే ప్రతిపక్షాలను సీబీఐ, ఈడీ, ఇన్‌కం ట్యాక్స్ సంస్థలతో అణిచివేస్తుందన్నారు. సీబీఐ, ఈడీ లాంటి రాజ్యాంగ బద్ధ సంస్థలను ఉపయోగించి ప్రతిపక్షాలను అణచివేస్తున్నారని విమర్శించారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీ.ఎస్. బోస్ మాట్లాడుతూ.. దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషించడంతో లౌకికతత్వానికి, దేశ సమగ్రత, సమైక్యతకు తీవ్రభంగం కలిగిస్తున్నదని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి సాయిలు గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శులు దామోదర్‌రెడ్డి, ఉమామహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సీ. హెచ్.దశరథ్, రొయ్యల కృష్ణమూర్తి, తోటపల్లి శంకర్, ఎస్.శంకర్‌రావు, కె.ధర్మేంద్ర, జె.లక్ష్మి, రచ్చకిషన్, హరినాథ్‌రావు, ఎస్.వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

నాచారంలో శాంతిసాయిజెన్ శేఖర్ ప్రచారం



నవతెలంగాణ-కాప్రా

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ ఆధ్వర్యంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాచారంలోని రవీంద్ర నగర్, సాయినగర్, శ్రీరాఘవేంద్ర నగర్, న్యూ రాఘవేంద్ర నగర్‌లో గడపగడపకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాంతిసాయి జెన్ శేఖర్, తదితరులున్నారు.

ఘనంగా ప్రపంచ మలేరియా దినోత్సవం



నవతెలంగాణ-సీటీబ్యూరో

ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆదేశాల మేరకు ప్రతి ఏడాది ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవం జరుపుకుంటారు. మేడ్చల్ - మల్కాజి గిరి జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బాలానగర్ లో గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం జరిపారు. తొలిత ర్యాలీ నిర్వహించి తదుపరి పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని కూకట్‌పల్లి జోన్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామ్ కుమార్ మాట్లాడారు. మలేరియా వ్యాధి ఏన్నా పీలీస్ అనే ఆడదోమల ద్వారా మానవ శరీరంలోకి ప్లాస్మోడియం వలస జీవులు ప్రవేశించడం ద్వారా వ్యాప్తి చెందే ప్రాణాం తక వ్యాధి అన్నారు. జ్వరం చలి వణుకుతో కూడిన తీవ్రమైన జ్వరం తలనొప్పి రోజు విడిచి రోజు జ్వరం రావడం తీవ్రమైన చెమటలు, జ్వరం వచ్చి తగ్గిపోవడం. లక్షణాలు ఉన్నచో వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద పరీక్షలు చేయించుకుని సరైన చికిత్స పొందాలన్నారు. దోమల నివారణకు ఇంటి పరిసర ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, నిల్వఉన్న నీటిలో కిరోసిన్ లేదా వాడిన నూనెను చల్లాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి, నీటి నిల్వను తొలగించాలని, సెప్టిక్ ట్యాంక్ గాలి గొట్టానికి మెష్‌లను బిగించాలని, ఇంట్లో, ఇంటి చుట్టూ పనికిరాని పాత కూలర్లు, పాత టైర్లు, డ్రమ్ములు, కొబ్బరి చిప్పలు, పగిలిన కుండలు, వాడి పారేసే పాత్రలు, సీసాలు లేకుండా చూడాలని తెలిపారు. ఈ విషయాలను ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, ఉపకేంద్రాలలో ప్రజలకు మలేరియా పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ చంద్రకళ, జగద్గిరిగుట్ట వైద్యాధికారిని డాక్టర్ తీతశ్రీ, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యం, సెక్షన్ ఇన్‌చార్జిఅక్షయ్ కుమార్ పాల్గొన్నారు.



వేగంగా విస్తరిస్తున్న యాక్సెస్ మెడిటెక్

- ఈ ఏడాది చివరిలోపు 30-40 శాతం పెరగనున్న కొలువులు
- కొత్త మార్కెట్లు, కొత్త ఆవిష్కరణలే లక్ష్యం
- ఘనంగా ఇన్సూర్‌టెక్ లీడర్ 17వ వార్షికోత్సవం



నవతెలంగాణ-సీటీబ్యూరో

ఇన్సూర్‌టెక్ రంగంలో అగ్రగామిగా ఉన్న యాక్సెస్ మెడిటెక్ ప్రయివేట్ లిమిటెడ్‌హైదరాబాద్ గండిపేటలోని గోల్కొండ రిసార్ట్‌లో తన 17వ వార్షికోత్సవాన్ని జరుపుకుంది. వ్యవస్థాపకుడు, సీఈవో సయ్యద్ ఐజాజుద్దీన్, ప్రాజెక్ట్ డెలివరీ హెడ్ సాయి మేఘన కొలనుపాక, చీఫ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆఫీసర్ మీర్జా ముంతాజ్ అలీ బేగ్ మీడియాను ఉద్దేశించి కంపెనీ విజయగాథ, భవిష్యత్తు ప్రణాళికలను పంచుకున్నారు. ఈ సందర్భంగా సయ్యద్ ఐజాజుద్దీన్ మాట్లాడుతూ.."మేము కొత్త మార్కెట్‌లోకి విస్తరించడం, కొత్త ఉత్పత్తులను పరిచయం చేయడం, పెట్టుబడి పెట్టడం లక్ష్యంగా పెటుకున్నాం. పరిశోధన, అభివృద్ధి, కొత్త ఉత్పత్తులను అమలు చేస్తున్నాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మాడ్యూల్‌లను కలిగి ఉన్నాం. తదుపరి త్రైమాసికంలో 30-40 శాతం మంది ఉద్యోగులను నియమించుకోవడానికి సిద్ధంగా ఉన్నాం" అని అన్నారు. సయ్యద్ ఐజాజుద్దీన్, బీమా పరిశ్రమలో విశిష్ట వృత్తి నిపుణుడు. బీమాలో లోతైన నైపుణ్యంతో ప్లాన్ డిజైనింగ్ రంగంలో రాణిస్తున్నారు. యుకెలోని చార్టర్డ్ ఇన్సూరెన్స్ ఇన్‌స్టిట్యూట్, యూఎస్‌ఎలోని అమెరికాస్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ల వంటి సంస్థల్లో అర్హతలను కలిగి ఉన్నారు.

జే.కే. కాలనీ, విరాట్ నగర్‌లో శ్రీదేవి ప్రచారం



నవతెలంగాణ-కాప్రా

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలని చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. గురువారం డివిజన్ పరిధిలోని జేకే కాలనీ, విరాట్‌నగర్‌లో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను వివరిస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని ప్రజలకు వివరించారు. కాగా ఎండను సైతం లెక్క చేయకుండా కాంగ్రెస్ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడుతున్న కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోచయ్య గౌడ్, బాల్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, జేకే కాలనీ అధ్యక్షులు శ్యామల రమేష్ గంగాధర్, రమేష్, బాల్ నర్సింహ, రాజేష్, శ్రీనివాస్ రెడ్డి, భాను, వెంకట్ రెడ్డి,అశోక్,జంపన్న, కారణకర్, నిఖిల్, వెంకన, కృష్ణ, రాంబాబు, నాగరాజు, వెంకటేష్, మహిళ నాయకురాలు శివమ్మ, నిర్మల, నవనీత, రామ రెడ్డి, అరుణ, మున్నీ, గిరిజ, శిరీష, కవిత, ఇందిరా, రేణుకా, కవిత, రూప, విజయ, సౌజన్య, నీలిమ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో కీసర శ్రద్ధా కళాశాల విద్యార్థుల ప్రభంజనం

- రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించిన కే.శృతి
- అభినందించిన కళాశాల కరెస్పాండెంట్ మదర్



నవతెలంగాణ-కీసర

కీసర శ్రద్ధా జూనియర్ కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న కె.శృతి ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. రాష్ట్ర స్థాయిలో తమ కళాశాల విద్యార్థి ఉత్తమ ర్యాంక్ సాధించడంతో కళాశాల కరెస్పాండెంట్ ఎండీ. మదర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో 83 శాతం, ద్వితీయ సంవత్సరంలో 91 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న శృతికి 436 మార్కులు, అఖిలకు 433, సీఈసీ మొదటి సంవత్సరం చదువు తున్న దివ్యకు 472 వచ్చాయని పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరం చదువుతున్న వర్ష కు 947మార్కులు వచ్చాయని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను గురువారం శాలువాలతో అధ్యాపక బృందంతో కలిసి ఘనంగా సన్మానించారు.



కాంగ్రెస్‌తోనే అభివృద్ధి : మేడ్చల్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్

- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు



నవతెలంగాణ-కీసర

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. గురువారం కీసర మండల కేంద్రంలోని బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ రమేష్ గుప్తా, మాజీ ఉపసర్పంచ్ శ్రావణ్ కుమార్ గుప్తా, మాజీ ఎంపీటీసీ మచ్చని జంగయ్య యాదవ్, పన్నాల బుచ్చిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ తటాకం రమేష్ శర్మ, మాజీ ఎంపీటీసీ జూపల్లి సురేందర్, మాజీ జనరల్ సెక్రెటరీ జూపల్లి నర్సింగరావు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కీసర మండల పార్టీ ఆధ్వర్యంలో వజ్రేష్ యాదవ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మెన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్‌గౌడ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల్లో పట్నం సునీతా మహేందర్ రెడ్డిని గెలిపించాలని చేరిన వారికి సూచించారు. రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కీసర మండల అధ్యక్షుడు కొల కృష్ణయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి ప్రభాకర్ రెడ్డి, కీసర గ్రామ శాఖ అధ్యక్షుడు జూపల్లి రవీందర్, చినింగని నర్సింహ్మ ,అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ



నవతెలంగాణ-అల్వాల్

ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అల్వాల్‌లో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో గురువారం మలేరియా నివారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని అల్వాల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ ఎంటమాలజిస్ట్ అనీల్ ప్రారంభించారు. అనంతరం డీసీ మాట్లాడుతూ.. దోమలను అరికట్టడానికి అవసరం ఉన్న చోట ఫాగింగ్ చేయాలని సిబ్బందికి సూచించారు. పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమల నియంత్రణకు మందులు, దోమతెరలు వాడుకోవాలని తెలిపారు. అంతకుముందు దోమలు నియంత్రణకు వారు ప్రతిజ్ఞ చేశారు. ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నుంచి ఈ సేవా కేంద్రం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ నరసింహారెడ్డి సూపరింటెండెంట్ స్వామి, ఎంటమాలజిస్ట్ సిబ్బంది, తదిరతులున్నారు.

రాగిడి లక్ష్మారెడ్డి గెలుపునకు కార్పొరేటర్ ప్రచారం



నవతెలంగాణ-అల్వాల్

లోక్‌భ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితా అనీల్ కిషోర్, అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం అలాల్ డివిజన్ రిట్రీట్ కాలనీలో ఇంటింటికీ ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమలలో సుభాష్, అన్నపూర్ణ శరత్, గిరి, రాజేందర్, యాదగిరిగౌడ్, చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, తదితరులున్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగాలి

- కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి
- బీఎల్‌వోలకు అవగాహన సదస్సు



నవతెలంగాణ-జవహర్‌నగర్

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచాలని కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి అన్నారు. గురువారం జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌వోలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి ఓటర్ స్లిప్స్ పంపిణీ చేసి ఓటర్లను చైతన్య పరచాలని, ఓటు ప్రాముఖ్యతను వివరించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసే విధంగా కృషి చేయాలన్నారు. జవహర్ నగర్‌లో రాబోయే ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్ రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి, బీఎల్‌వోలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

'కాంగ్రెస్' గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- మల్కాజిగిరి అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరిలో 'కాంగ్రెస్' గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆనంద్‌బాగ్‌లోని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు క్యాంప్ కార్యాలయంలో మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ఆరు డివిజన్‌లకు చెందిన కాంగ్రెస్ అధ్యక్ష, కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలకు ప్రజల్లో మంచి ఆదరణ ఉందన్నారు. వీటిని ప్రజలకు వివరించి, ఓట్లు అడగాలని ఆమె సూచించారు. ప్రతీ కార్యకర్త ఇంటింటికీ వెళ్లి ప్రజలు చేతి గుర్తుకు ఓటు వేసేలా చైతన్యం చేయాలన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటేనే తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. మల్కాజిగిరి అభివృద్ధి కావాలంటే ఈ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. అనంతరం ఆనంద్ బాగ్‌లో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, సతీష్, గుండా నిరంజన్, చారి, నాయకులు చంద్రశేఖర్, సీఎల్ యాదగిరి, నాగేందర్ గౌడ్, కొండ గౌడ్, జీవన్ రెడ్డి, బికే. శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు జీడీ. సంపత్‌గౌడ్, వైనాల ప్రవీణ్, ఉమేష్ సింగ్, వినోద్ యాదవ్, పంజా శ్రీనివాస్ యాదవ్, సంతోష్ రాందాస్, సత్య మూర్తి, సనాది శంకర్, కన్నెమల నాగరాజు, సంజయ్, ఫారూక్, ఫరీద్, మంద భాస్కర్, చందు, శారద, పుష్పలత, కనక లక్ష్మి, సుజాత, సురేష్ సింగ్, యూత్ అధ్యక్షుడు జీడీ చరణ్ జిత్ గౌడ్, అశోక్‌కుమార్, కన్నా, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల వివాహాలకు పుస్తె, మెట్టెలు అందజేత



నవతెలంగాణ- మేడ్చల్

మండల పరిధిలోని గౌడవెల్లి గ్రామానికి చెందిన ముగ్గురు ఆడపిల్లల వివాహాలకు మాజీ ఎంపీపీ పద్మా జగన్‌రెడ్డి దంపతులు గురువారం పుస్తె, మెట్టెలను అందజేశారు. పేదింటి ఆడ బిడ్డలైన శ్రీలత, మల్లిక, ఆర్తీసింగ్ వివాహాలకు పుస్తె, మెట్టెలను అందజేసి కలకాలం సంతోషంగా ఉండాలని దీవించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చూపిన బాటలో నిరుపేదల ఆడ పిల్లల వివాహాలకు పుస్తె, మెట్టెలను అందజేస్తున్నట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా పుస్తె మెట్టెలను అందుకున్న కుటుంబ సభ్యులు పద్మాజగన్‌రెడ్డి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉప్పల్ స్టేడియం వద్ద స్వీప్ అవగాహన



నవతెలంగాణ-సీటీబ్యూరో

కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి గౌతమ్ పొట్రు వారి టీమ్ సభ్యులు ఉప్పల్ స్టేడియంలో గురువారం జరిగిన ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా స్టేడియం వచ్చే క్రికెట్ మ్యాచ్ వీక్షకులకు పార్లమెంటు ఎన్నికల స్వీప్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ స్టేడియం లోపల, బయట పాదచారులకు కనపడే విధంగా ఫ్లెక్సీలు, బ్యానర్లు, స్టాండ్లు, బోర్డులు ఏర్పాటు చేశారు. స్వీప్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా టీమ్ నోడల్ అధికారి, సిబ్బంది స్టేడియం లోపల పలు ప్రాంతాలలో టీంలుగా ఏర్పడి వారికి ఓటు పై అవగాహన కల్పించడంతో పాటు దేశం కోసం ఓటు.. నా మొదటి ఓటు దేశం కోసం.. ఓటు దేశ భవిష్యత్తు కోసం ..ఎన్నికల పర్వం దేశానికి గర్వం ..అనే నినాదాలతో చైతన్య పరుస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. నూతన ఓటర్లు, యువతీ యువకులు, మ్యాచ్ సందర్భంగా ఫ్లెక్సీలపై ఉన్న సమాచారంతో చూపర్లకు ఆకట్టుకునే విధంగా ఉన్నాయి. ప్రతీ ఫ్లెక్సీ ఓట్లను చైతన్య పరచడంతో పాటు సమాజానికి ఒక మంచి మెసేజ్ అందించడంలో సఫలీకృతం అయినట్లుగా భావించవచ్చు. క్రికెట్ మ్యాచ్ చూసే వారికి ఓటు చైతన్యం తెలపడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి



నవతెలంగాణ-కాప్రా

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మల్కా జిగి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మల్లాపూర్ కార్పొరే టర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. గురువా రం రాగిడి గెలుపే లక్ష్యంగా మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్‌నగర్, చాణక్యపురి కాలనీల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కారు గుర్తుకు ఓటు వేసి మల్కాజిగిరి ఎంపీగా లక్ష్మారెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మల్కాజిగిరి పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని గురువారం 129 సురారం డివిజన్ సంజయ్ గాంధీ నగర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రజా సంక్షేమం కోసం పాటుపడే బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి సిద్దిక్, సీనియర్ నాయకులు మధు మోహన్, మహిళా అధ్యక్షురాలు హేమలత, అరుణ, లక్ష్మి నారాయణ, రవి తేజ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

వీల్ చైర్ అందజేత..



నవతెలంగాన-సీటీబ్యూరో

సెవెన్ రేస్ ఫౌండేషన్ సీఈఓ సారా తన ఉదారతను చాటుకున్నారు. నడవలేక ఇబ్బంది పడుతున్న వ్యక్తికి వీల్ చైర్ అందజేశారు. దమ్మాయిగూడకు చెందిన మహమ్మద్ ఖాలీ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న సారా గురువారం అతని ఇంటికి వెళ్లి వీల్ చైర్ అందజేశారు. ఎవరైనా ఆర్థిక ఇబ్బందులతో ఉంటే తన్ను సంప్రదిస్తే తోచిన రూపంలో సహాయం చేస్తాను అని సారా తెలిపారు.

మలేరియా రహిత జిల్లాగా మార్చాలి



- ఇందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలి
- హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకట్

నవతెలంగాన-సీటీబ్యూరో

హైదరాబాద్‌ను మలేరియా రహిత జిల్లాగా మార్చడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలి అని హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట్ తెలిపారు. మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కానున్నందున సిబ్బంది మలేరియా, డెంగ్యూ వంటి కీటక జనిత వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. సిబ్బంది ప్రత్యేకమైన యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని ప్రతి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్తీ దావా ఖానా పరిధిలో కీటక జనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమలు నిర్వహించాలని కోరారు. విద్యార్థిని, విద్యార్థులకు కూడా ప్రతీ పాఠశాలకు వెళ్లి అవగాహన కల్పించాలని కోరారు. ప్రతీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్తీ దావా ఖానాలో కీటక జనిత వ్యాధులకు సంబంధించిన సమాచారంతో కూడిన ప్రచార సామాగ్రిని ముద్రించి అందుబాటులో ఉంచాలని, మలేరియా, డెంగ్యూ సర్వే నిర్వహించి అనుమానితుల నుండి రక్త పరీక్షలు నిర్వహించి తగిన వైద్యంను, సలహాలను అందించాలని సూచించారు. నిర్లక్ష్యం వహించిన సిబ్బంది పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి రాములు, మలేరియా అధికారి నిరంజన్, ఉప మాస్ మీడియా అధికారులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ఇతర సబ్ యూనిట్ ఆఫీసర్స్, సూపర్‌వైజర్స్, సిబ్బంది పాల్గొన్నారు.



కాంగ్రెస్ ప్రభంజనాన్ని ఎవరు ఆపలేరు



- కాంగ్రెస్ యువ నాయకులు పట్నం రినీష్ రెడ్డి
- తల్లి గెలుపు కోసం తనయుడి ముమ్మర ప్రచారం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభంజనాన్ని ఆపలేరని యువ కాంగ్రెస్ నాయకులు పట్నం రినీష్ రెడ్డి అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజుల రామారంలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశానికి ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రానున్న ఎన్నికల్లో కార్యకర్తలు తీసుకోవాల్సిన పలు అంశాలపై వారు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పట్నం రినీష్ రెడ్డి మాట్లాడుతూ గడిచిన నాలుగు నెలలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలతో రాష్ట్ర ప్రజల ముఖాల్లో ఎంతో ఆనందం కనిపిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలోకి నడపడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి అయిన మా అమ్మ పట్నం సునీత మహేందర్ రెడ్డిని పెద్ద మనసుతో ఆశీర్వదించి గెలిపించే విధంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆయన సూచించారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ 2019 లో మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ గా ఎనుముల రేవంత్ రెడ్డి గెలుపు కోసం కృషి చేసినట్లే,ఈ ఎన్నికల్లో కూడ పట్నం సునీతా మహేందర్ రెడ్డి గెలుపు కోసం కార్యకర్తలు కష్టపడాలన్నారు. బస్తీ స్థాయిలో ప్రతీ కార్యకర్త కాంగ్రెస్ జెండాను ప్రతి ఇంటింటికి తీసుకెళ్లి సునీతా మహేందర్ రెడ్డిని భారీ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సిద్దన్నోళ్ల సంజీవరెడ్డి, బండి శ్రీనివాస్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు లాయక్, సీనియర్ నాయకులు జహంగీర్, చాంద్ పాషా, రషీద్ బేగ్, బలరాం, మధు తదితరులు పాల్గొన్నారు.


బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా విస్తృత ప్రచారం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా విస్తృత ప్రచారం ఎమ్మెల్యే కేపీ.వివేకనంద్ నిర్వహించారు. మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే సూచనల మేరకు గురువారం 132 – జీడిమెట్ల డివిజన్ రాఘవేంద్ర కాలనీ ఏరోనాటికల్ ఎన్ క్లేవ్, హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీ, వసంత్ విహార కాలనీ, శ్రీ దుర్గా ఎస్టేట్స్, బుద్ధ నగర్, వెన్నెలగడ్డ, సాయి సంకల్ప నగర్‌లలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వాకర్స్‌తో మాట్లాడుతూ, ఇంటింటికి తిరుగుతూ జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గత నాలుగేండ్లుగా ఎటువంటి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టని కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ప్రజలకు వివరిస్తూ ముమ్మర ప్రసారం నిర్వహించారు. పేద, సామాన్య ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలంటే కేంద్రంతో కొట్లాడి సంక్షేమ పథకాలు అందించే బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థులు పార్లమెంట్లో ఉన్నాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, గుమ్మడి మధుసూదన్ రాజు, సమ్మయ్య నేత, నరేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి సాధించింది



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో అభివృద్ధి సాధించిందని వచ్చిందని డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వీడు రాగిడి లక్ష్మారెడ్డి గెలుపుకై ప్రతీ ఒక్కరు కృషి చేయాలని డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్‌లు తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపుకై ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పిలుపు మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ 29 , 27వ డివిజన్ లో శ్రీ రామ్ కుంట పార్క్ బండారి లేఔట్‌లో గురువారం డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు బొర్రా దేవి చందు ముదిరాజ్, జ్యోతి నర్సింహా రెడ్డి, పైడి మాధవి, సుజాత, రఘువేంద్ర రావు, బాలాజీ నాయక్, పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మార్నింగ్ వాకర్స్ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి ఎంపి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గారిని మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రవి కాంత్, నర్సింహా రెడ్డి, బొర్రా చందు, చంద్రగిరి సతీష్, ఎన్ఎంసి మహిళా అధ్యక్షురాలు అర్పిత ప్రకాష్, నాయకులు గోపాల్ కృష్ణ ముదిరాజ్, అసోసియేషన్ సభ్యులు, స్థానికులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో మన గులాబీ జెండా ఎగరాలి

- కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మల్కాజిగిరి పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని గురువారం 129 సురారం డివిజన్ సంజయ్ గాంధీ నగర్ లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్, అధ్యక్షులు పుప్పాల భాస్కర్లు మాట్లాడుతూ తెలంగాణ వాణిని పార్లమెంట్లో వినిపించినప్పుడే రాష్ట్రానికి వచ్చే ప్రతీ ఒక్క రూపాయి సక్రమంగా చేరి మన ప్రాంతాలు అభివృద్ధి చెందడంతో పాటు సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందజేయలన్నారు. కావున మే 13న జరిగే ఎన్నికల్లో ప్రజా సంక్షేమం కోసం పాటుపడే బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి సిద్దిక్, సీనియర్ నాయకులు మధు మోహన్, మహిళా అధ్యక్షురాలు హేమలత, అరుణ, లక్ష్మి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న బీజేపీని ఎన్నికల్లో ఓడిద్దాం

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కార్మికుల హక్కులను కాలరాస్తున్నా బీజేపీని ఎన్నికల్లో ఓడిద్దాం అని ఏఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్ అన్నారు. మే డే స్ఫూర్తితో హక్కుల రక్షణకై కార్మిక లోకం పోరాడాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ పిలుపునిచ్చారు. గురు వారం కుత్బుల్లాపూర్ ఏఐటీయూసీ నియోజకవర్గ నాయకులతో కలిసి 138వ మే డే దినోత్సవం పోస్టర్‌ను షాపూర్ నగర్ కార్యాలయంలో ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను బీజేపీ అధికారంలోకి వచ్చాక వాటిని తీసివేసి కొత్త చట్టాలు తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాసి బడా పెట్టుబడిదారులకు లాభం చేకూరుస్తుందని కావున రాబోవు ఎన్నికల్లో బీజేపీని ఓడగొట్టడానికి మేడే స్ఫూర్తితో కార్మికులు పనిచేయాలని కోరారు. పెట్టుబడిదారులకేమో బీజేపీ ప్రభుత్వం టాక్స్ తగ్గించి,ప్రజల పై టాక్స్ పెంచి డబ్బులు వసూళ్లు చేసి పెట్టుబడిదారులకు రుణమాఫీ చేస్తుందని అదే పేద ప్రజలకు ఇచ్చే సబ్సిడీని మాత్రం ఉచితాలు అంటూ తీసివేస్తున్నారని విమర్శిం చారు. గతంలో 8 గంటల పనిదినాలు ఉంటే బీజేపీ వచ్చాక 12 గంటల పనిదినాలు అయ్యాయని, కార్మికులకు గతంలో ఇచ్చిన పెన్షన్ స్కీంను తొలగించి కార్మికులకు అన్యాయం చేసే కొత్త పెన్షన్ స్కీంను తెచ్చారని, ఈఎస్ఐలో మందులు దొరకట్లేదని, ఉద్యోగులు దాచుకున్న సొమ్మును కూడా ఇవట్లేదని కావున వీటన్నిటిని కార్మికులకు తెలియచేసే విధంగా కార్మిక సంఘాల నాయకులు మేడేను ఉపయోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు స్వామి, శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షుడు హరినాథ్, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు ప్రవీణ్,సీపీఐ బాచుపల్లి కార్యదర్శి శ్రీనివాస్, ఏఐటీయూసీ నాయకులు నగప్ప, దేవేంద్రప్రసాద్, వెంకటేష్, సుంకిరెడ్డి, చంద్రమౌళి,సామెల్, రవి, బాలాజీ, కుమార్,పూర్ణ చందర్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మలవాని శిఖం కుంట బఫర్‌లో భవన నిర్మాణం



కనుమరుగైన నిమ్మలవాని సుఖం కుంట

- శిఖం బఫర్‌లోనే భవనం నిర్మాణం...సర్వేయర్
- ఇరిగేషన్ అధికారుల పరిశీలన అనంతరం చర్యలు చేపడతామంటున్న.. ఆర్ ఐ.భారతి అధికారి

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట పరిధిలోని సర్వే నెంబర్ 660 నిమ్మలవాని శిఖం కుంట విస్తీర్ణం 1 ఎకరా15 గుంటల భూమి సమీపంలో గత ఏడు సంవత్సరాల క్రితం కీర్తి హెూమ్స్ విల్లాస్ నిర్మాణాలు చేపట్టారు. ఆ క్రమంలో విల్లాస్ నిర్మాణాల సమయంలో సైతం నిమ్మలవాని శిఖం కుంట స్థలం అలాగే ఉందని, అట్టి కుంట స్థలంలో ఇటీవల ఓ వ్యక్తి 150 గజాల స్థలంలో భవన నిర్మాణం చేపట్టడంతో స్థానిక ప్రజలు విస్మయం చెందుచున్నారు. సర్వేయర్ నివేదిక సైతం ప్రకారం భవన నిర్మాణం భవన నిర్మాణం కొంత భాగం బఫర్‌లోనే జరుగుతుందని తెలియ చేశారు. లక్షల రూపాయలు వెలువ చేసే భూమిని నిమ్మవాని శిఖం కుంటను కాన రాకుండా ప్లాట్లను విక్రయించి కుంటున్నారని మండల రెవెన్యూ ఆర్ ఐ భారతి అధికారి దృష్టికి తీసుకు రాగా శికం కుంట భూమిలో ఎవరు నిర్మాణాలు చేపట్టిన తప్పేనని, ఇరిగేషన్ అధికారులతో పరిశీలించారు. నివేదిక అనంతరం చర్యలు తీసుకోనున్నట్లు ఆర్ ఐ తెలిపారు.

భూకబ్జాదారుడు, రౌడీషీటర్ షేక్ అబేద్ రిమాండ్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ పరిధిలోని గాజులరామారం, పలు ప్రాంతాలలోని ప్రభుత్వ భూములను గత కొన్ని సంవత్సరాలుగా యదేచ్ఛగా కబ్జా చేస్తూ అమాయక ప్రజలకు అమ్ముతూ మోసం చేస్తూ తప్పించుకుని తిరుగుతున్న భూకబ్జాదారుడు, రౌడీషీటర్ షేక్ అబేద్‌ను బుధవారం జగద్గిరిగుట్ట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద విచారణ జరిపిన పోలీసులు సాయంత్రం సంగారెడ్డి జైలుకు తరలించారు. ఈ మేరకు సిఐ. కే.క్రాంతి కుమార్ మాట్లాడుతూ నిందితుడు అబేద్ పై ఇప్పటివరకు భూకబ్జాల క్రింద 16 కేసులు నమోదు అయ్యాయని అప్పటినుండి పోలీసుల కండ్లు కప్పి వివిధ ప్రాంతాలలో తలదాచుకుంటున్నాడని తెలిపారు. తిలా పాపం తల పిరికెడు అన్నచందంగా గతంలో కూడా తాను రెవెన్యూ అధికారుల కు ముడుపులు చెల్లిస్తూ ఉన్నానని బహిరంగంగానే చెప్పాడం విశేషం. అక్రమంగా ప్రభుత్వ భూములను కబ్జాలు చేస్తున్న షేక్ అబేద్ పై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను హతమార్చిన కేసులో ఇద్దరి అరెస్ట్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

మహిళపై అత్యాచారం, హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించడంపై కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో, సిఐ కృష్ణ మోహన్, డిఐ వెంకటేశం, ఎస్సైలతో కలిసి పాత్రికేయ సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించిన ఏసిపి శ్రీనివాస్ రావు... ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధి వై జంక్షన్ ప్రాంతంలో రోడ్డు పై ఉన్న గుర్తు తెలియని చిత్తు కాగితాలు ఏరుకుని జీవనం కొనసాగించే మహిళ (45) ను, వై జంక్షన్ వద్ద విష్ణు ప్రియ లాడ్జి సమీపంలోని ఓ సెల్లార్‌లోకి లాక్కెళ్లి ,ఆ మహిళ పై ఇద్దరు యువకులు సామూహిక అత్యాచారం చేసి, దారుణంగా హత్య చేశారు. బీహార్ రాష్ట్రం,బంకా జిల్లాకు చెందిన, నితీష్ కుమార్, మరో మైనర్ బాలుడు, సికింద్రాబాద్ నుంచి సంగారెడ్డికి వెళ్తూ, కూకట్‌పల్లి వై జంక్షన్ ప్రాంతంలో చిత్తు కాగితాలు ఏరుకునే మహిళ కనిపించడంతో, ఇద్దరు కలిసి కలిసి ఆమెపై అత్యాచారం చేసి, హత్య చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తెల్లవారుజామున సమాచారం అందుకున్న పోలీసులు, సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తూ, ఇద్దరు యువకులు ఆ రాత్రి బైక్ పై వచ్చి అఘాయిత్యానికి పాల్పడినట్లు సీసీటీవీ ఫుటేజ్ లభ్యం కావడంతో, ఇద్దరు యువకులను సంగారెడ్డిలో అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా బాలానగర్ జోన్ డిసిపి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, కూకట్‌పల్లి ఏసిపి కె శ్రీనివాసరావు పర్యవేక్షణలో, కూకట్‌పల్లి ఇన్స్పెక్టర్ కృష్ణమోహన్‌తోపాటు డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ వెంకటేశం, సబ్ ఇన్స్పెక్టర్లు రామకృష్ణ, క్రైమ్ సబ్ ఇన్స్పెక్టర్‌తో పాటు కానిస్టేబుల్ తదితరులు కేసును చేదించారు. ఈ కేసును త్వరగా చేదించిన క్రైమ్ సిబ్బందికి సిపి చేత రివార్డ్స్ అందజేస్తామని ఏసిపి తెలిపారు. శారీరక నేరాలు ,లైంగిక సంబంధ నేరాలకు సంబంధించిన ఏదైనా సమాచారం ప్రజల దృష్టికి వస్తె వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు తెలియజేయాలని, లేదా షీ టీమ్స్ వాట్సాప్ నం.9490617444, మహిళా హెల్ప్ లైన్ నంబర్‌ల ద్వారా 8712663061 ద్వారా తెలియజేయాలని తెలిపారు. లేదా నేరుగా కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ సెల్ నంబర్ కు 9490617123 తెలియజేయవచ్చును. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వివరించారు.

ఇంటర్ లో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల శ్రీ భాస్కర్ భవన్ విద్యార్థుల ప్రభంజనం



Y.BHAVYANANDAN



PARLAPALLI HARIKA

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఇంటర్ ఫలితాలలో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల శ్రీ భాస్కర్ భవన్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో వై.భవ్యానందన్ 470 మార్కులకు గాను, 468 మార్కులతో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. ద్వితీయ స్థానంలో 470 మార్కులకు గాను 467 మార్కులను 8 మంది విద్యార్థులు సాధించారు. తృతీయ స్థానంలో 466 మార్కులు 26 మంది విద్యార్థులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో కూడా రాష్ట్ర స్థాయిలో పి.హరిక 1000 కి 991 మార్కులు సాధించగా 990 మార్కులు పి.నిఖిల్ సాధించారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ బి.రవికుమార్ , ప్రిన్సిపల్ ఎస్.హరిబాబు లు మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. ప్రథమ సంవత్సరంలో మొదటి మూడు స్థానాలు మా విద్యార్థులే సాధించారన్నారు. భాస్కర్ భవన్ విద్యార్థులు 98 శాతం ఉతీర్ణత సాధించారన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించండి



- కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి ని భారి మెజారిటీతో గెలిపించాలని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు.ఈ మేరకు ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా డివిజన్ పరిధి శ్రీనివాస్ నగర్‌లో స్థానిక బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఇంటింటా తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన పదేండ్లలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాయంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు స్థానికులు కాదని ఇప్పుడు ఓటేస్తే మళ్లీ ఐదేండ్ల దాక వారు కనపడరని ఓటర్లను చైతన్య వంతులను చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, స్థానిక నాయకులు, శ్రీనివాస్ నగర్ కమిటీ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగుచెందారు

నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలు విసుగు చెందుతున్నారని కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, రంగారెడ్డినగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఏర్వ శంకరయ్య అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ సూచనల మేరకు గురువారం సుమిత్ర నగర్, సౌభాగ్య నగర్, ఆదర్శనగర్ ప్రాంతాలలో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి తిరు గుతూ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఓటర్లను అభ్యర్థించారు. బీఆర్ఎస్ హయాంలోనే డివిజన్లోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాయన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.సుధాకర్, మాజీ వార్డు సభ్యులు రహీం, నాయకులు కార్తీక్ గౌడ్, గౌసుద్దీన్, బాలు నేత, రాజు గౌడ్, టింకు గౌడ్, మహిళా



నాయకురాళ్లు తారక రాణి, ఈశ్వరి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న గులాబీ శ్రేణులు..

కుత్బుల్లాపూర్ : మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపుకై ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆదేశాల మేరకు గురువారం 130–సుభాష్ నగర్ డివిజన్ ఎస్ఆర్ నాయక్ నగర్, సుభాష్ నగర్, ఏకలవ్య నగర్‌లలో మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి, డివిజన్ మహిళా అధ్యక్షురాలు మంగమ్మతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ... సంక్షేమం అంటేనే బీఆర్ఎస్‌గా గత పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలోనే తెలంగాణ రాష్ట్రంను అగ్ర పదాన నిలిపారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలైనా ఏ ఒక్క నూతన సంక్షేమ కార్యక్రమాన్ని చేపట్టలేదు అన్నారు. కావున మే 13న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



మల్కాజిగిరిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ప్రచారం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు వినూత్న ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎల్బీనగర్ నుంచి కూకట్‌పల్లి వరకు, పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు మరియు ఎమ్మెల్సీలు, మెట్రో రైలులో ప్రయాణికులను కలిసి బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని, హైదరాబాదులో ఐటీ రంగంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించుకుంటూ మెట్రోలో ప్రయాణించారు. అనంతరం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో, ఎమ్మెల్యే ఎమ్మెల్సీలు మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ, గత ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో చెట్లను, చెరువులను చూస్తే కేసీఆర్ కనిపిస్తుండె, ఇప్పుడు ఎండిన చెరువులను చూస్తే రేవంత్ రెడ్డి కనిపిస్తున్నాడని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన పది సంవత్సరాలలో ఒకవైపు సంక్షేమంలో, మరోవైపు అభివృద్ధిలో, దేశంలోనే అగ్రమిగా నిలిపిన చరిత్ర తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుంది అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాయమాటలు చెప్పి అధికారంకు వచ్చిన నాలుగు నెలల్లో 6 గ్యారంటీల పేరుతో గారడి చేయడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని ఇప్పటికే ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పైన నమ్మకం తేలిపోయిందని అన్నారు. హైదరాబాద్ మహానగరంలో మంచినీటి సమస్య కరెంటు సమస్యలతో ప్రజలు సతమత మవుతున్నారని కేసీఆర్ పాలించిన తొమ్మిది సంవత్సరాలలో ఏనాడైనా, కరెంటు సమస్య, మంచినీటి సమస్య ప్రజలు ఎదుర్కున్నారా అని కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రశ్నించిన మాజీ మంత్రి మల్లారెడ్డి. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, కొడంగల్‌లో ఓడిపోయిన రేవంత్ రెడ్డికి, మల్కాజిగిరి ప్రజలు ప్రశ్నించే గొంతు ఏదో అభివృద్ధి చేస్తారు.. ఏదో మార్పు తీసుకొస్తారు అని గెలిపించారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మల్లారెడ్డి, శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు, కెపి వివేకానంద, లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీలు శంభుపురి రాజు, దయానంద్, కంటోన్మెంట్ అభ్యర్థి నివేదిత ,కార్పొరేటర్లు, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన సుందర్ నాయక్



నవతెలంగాణ-ఓయు

హైదరాబాద్ గాంధీ భవన్ లో చేరికల కమిటీ చైర్మెన్ కోదండరెడ్డి, జగ్గారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి ఉస్మానియా యూనివర్సిటీ గిరిజన జేఏసీ ఉద్యమ నేత డాక్టర్ సుందర్ నాయక్ డాక్టర్ దేవజి నాయక్, రవి నాయక్ గోపి నాయక్ వెంకన్న నాయక్ చేరారు.

బోరబండ డివిజన్‌లో ఎమ్మెల్యే గోపీనాథ్ పర్యటన



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ శాసనసభ్యులు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపినాథ్ బోరబండ డివిజన్ లో పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, నాయకుల ఇంటిటికి వెళ్లి వాళ్ళ సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ఎన్.విజయ్‌కుమార్, ఆనంద్, యూసఫ్, ధర్మ, బాబురావు, సాయి, అజేయ, దేవ మని, మేరీ, పార్టీ నాయకులు కార్యకర్తలు,పాల్గొన్నారు.



క్రీడలతోనే మానసికోల్లాసం

- జేఎన్ఐఏఎస్ రిజిస్ట్రార్ డాక్టర్ డి.సురేష్...

నవతెలంగాణ-బంజారాహిల్స్

విద్యార్థుల్లో మానసికోల్లాసాన్ని పెంచేందుకు క్రీడలు ఎంతో దోహదం జేఎన్ఐఏఎస్ రిజిస్ట్రార్ డాక్టర్ డి. సురేష్ అన్నారు. బంజారాహిల్స్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీస్ ఆధ్వర్యంలో కురుక్షేత్ర 2024 క్రీడా పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలను జేఎన్ఐఏఎస్ రిజిస్ట్రార్ డాక్టర్ డి.సురేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ మాట్లా డుతూ ప్రతియేటా తమ కాలేజీ నుంచి కురుక్షేత్ర పేరుతో ఆర్కిటెక్ విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహి ంచడం ఆనవాయితీగా వస్తున్నదన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 10 ఆర్కిటెక్ కాలేజీల నుంచి విద్యా ర్థులు 12 రకాల క్రీడల్లో మూడు రోజుల పాటు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహిం చేందుకు ఈ క్రీడా పోటీలు ఎంతో తోడ్పడతాయన్నారు. క్రీడలతో పాటు ఫ్యాషన్ డిజైనింగ్, జర్నలిజం, డిజై నింగ్, ఫొటోగ్రఫీ రంగాల్లో కూడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజే స్తామని తెలిపారు. గత పదేండ్లుగా ఈ కురుక్షేత్ర ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఎన్ఐఏఎస్ ప్రిన్సిపాల్ శాలిని, కో-ఆర్డినేటర్ ఏకే సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జయంతి సందర్భంగా భారీ కేక్ కటింగ్



నవతెలంగాణ-ఓయూ

మహనీయుల స్ఫూర్తితో విద్యార్థులు విద్యలో రాణించాలని పలువురు భక్తులు అభిప్రాయ పడ్డారు. మహనీయుల జయంతి సందర్భంగా గురువారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఎదుట మాల విద్యార్థి సంఘం తెలంగాణ మాల విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కమిటీ, తెలంగాణ మాల ఫెడరే షన్ రాష్ట్ర అధ్యక్షుడు చినేని వెంకట్ ఆధ్వర్యంలో 133 కిలోల కేకును కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చినేని వెంకట్, అద్దంకి ఓఫీర్‌లు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రపం చంలోనే అతిపెద్ద రాజ్యాంగాన్ని రచించి భారత దేశ సమైక్యతను, సమగ్రతను, సంరక్షణకు కృషి చేసినట్లు చెప్పారు. 130 కోట్ల భారతీయుల ప్రజలు హక్కులు ఉన్నాయి అంటే అది అంబేద్కర్ ముందుచూపు,త్యాగఫలమే అన్నారు. కొత్తగా నిర్మించిన పార్లమెంట్ భవనానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరు పెట్టి ఆయన స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఓయూ జెసి చైర్మెన్ గడ్డం అశోక్‌వెం కట్ రాములు, కిరణ్, ప్రశాంత్, తలార్ దత్తాత్రేయ కృష్ణంరాజు పాల్గొన్నారు.

నయా వంచకులను నమ్మొద్దు



నవతెలంగాణ-బంజారా హిల్స్

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజలకు మాయమాటలు చెప్పి వచించిందని,తెలంగాణా ప్రజలను తీవ్ర మోసం చేసిందని జూబ్లీహిల్స్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మనోజ్యాదవ్, ఎన్ఎస్ఈయుఐ హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ కుందన్ యాదవ్ ఆరోపించారు. గురువారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని పలు ప్రాంతాల్లో బీజేపీ తెలంగాణాకు చేసిన ద్రోహాన్ని తెలుపుతూ నయవంచన(పందేడ్ల మోసం- పదేండ్ల విధ్వసం), పేరుతో ఫ్లెక్సీలను ఏర్పాటుచేసి బీజేపీ చేసిన ద్రోహాన్ని స్థానికులకు వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటు వేయాలని, బీజేపీ నమ్మి మరలా మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు ఫిరోజ్, లక్ష్మణ్,రిత్విక్,సుషాంత్,నాగ ఆదిత్య కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ఘనంగా 9వ, స్నాతకోత్సవం



నవతెలంగాణ-ఓయూ

ఆంధ్ర మహిళా సభ కాలేజ్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ కళాశాల ఆధ్వర్యంలో ఎర్లీ చైల్డ్‌కేర్ అండ్ ఎడ్యుకేషన్ 9వ, బ్యాచ్ స్నాత కోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రెసిడెంట్ డిడిఏఎంఎస్ ఉషారెడ్డి చేతు ల మీదుగా 31 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్ర మంలో కళాశాల చైర్పర్సన్ ప్రొఫెసర్ వి.సుధాకర్, కళాశాల ఫౌండర్ ప్రిన్సి పల్ డాక్టర్ లక్ష్మీ, ఉషాకంద, కళాశాల ప్రిన్సిపల్ ఇన్‌ఛార్జి డాక్టర్ నీరజ, డీపీఎస్ చైర్ పర్సన్ కొమరయ్య, డీపీఎస్ డైరెక్టర్ టి సుధా, పల్లవి ఎడ్జ్‌కం సొసైటీ బోడుప్పల్ ప్రిన్సిపల్ తనుజ, స్టేట్ రిసోర్స్ సెంటర్ ఈసీ ఈ శ్రీమతి రత్నమాల బోధన బోధనేతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొ న్నారు. ఈ కార్యక్రమంలో సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు ఈ కోర్సు ద్వారావారు నేర్చుకున్న విషయాలను అనుభవాలను తెలియజేశారు.

ఓయూ గేటు వద్ద 'మహొబ్బత్‌కి దుఖాన్'



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనిర్సిటీ ఎంఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ వికాస్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం ఓయూ ఎన్సీసి గేట్ వద్ద మొహబ్బత్‌కి దుకాన్ నిర్వహించారు. విద్యార్థి విద్యార్థినులకు కాంగ్రెస్ పార్టీ గ్యార ంటీలను విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. గత పది సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం విద్య రంగానికి , నిరుద్యోగులకు, చేసిన నష్టాన్ని వివరి ంచారు. ఈ కార్యక్రమంలో అభిజిత్‌యాదవ్ , రితేష్‌రావు ,అవ్వజ్ , శ్రీకర్, పాల్గొన్నారు.

దానం నాగేందర్ లాంటివాళ్లు ముగ్గురు పార్టీ మారారు

- బీఆర్ఎస్‌కి రాజీనామా చేయకుండా ఎంపీ అభ్యర్థిగా ఎలా నిలిచి ఉంటాడు
- ఎంతమంది పార్టీ మారిన బీఆర్ఎస్ పార్టీకి డోకా లేదు
- 27 నుండి పాదయాత్ర నిర్వహిస్తాం
- ఎమ్మెల్యేలు పద్మారావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

బీఆర్ఎస్ పార్టీ కి ఓటు వేసి పద్మారావు గౌడ్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుందామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం సింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కి మద్దతుగా సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సర్వసభ్య సమావేశం గురువారం ప్యాట్నీలోని ఎస్‌వీఐటీ కాలేజ్ ఆడిటోరియంలో మాజీమంత్రి, ఎంఎల్ఏ తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముందుగా పార్టీ పతాకాన్ని అభ్యర్థి పద్మారావు గౌడ్ ఆవిష్క రించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్, మాజీ మంత్రి మహమ్మద్ అలీ, ఎమ్మెల్సీలు ఎం.ఎస్.ప్రభాకర్‌రావు, సికింద్రాబాద్ అసెంబ్లీ పార్లమెంటరి ఇన్‌చార్జి మేడే రాజీవ్‌సాగర్,స్థానిక కార్పొరేటర్‌లు కొలన్‌లక్ష్మీ టి.మహేశ్వరి, కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్, బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థిఎమ్మెల్యే పద్మారావు గౌడ్ మాట్లాడుతూ సామాన్య కార్యకర్త నుంచి నేను ఈ స్థాయి వచ్చినని, తలసాని శ్రీనివాస్ యాదవ్, నేను మంచి మిత్రులమని, సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో 7అసెంబ్లీ నియోజకవర్గాల్లో 6 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపొందిం దన్నారు. అదే విధంగా పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో బీఆర్ఎస్‌ని గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు. సికింద్రాబాద్ నుంచి ఎంపీగా గెలిచిన కిషన్‌రెడ్డి రాష్ట్రఅభివృద్ధి కోసం కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా తేలేదనిదన్నారు. కిషన్‌రెడ్డి జై శ్రీరాం, మోడీ అని చెప్పుకుంటూ ఓట్లు అడుగుతున్నాడని, ఇక దానం నాగేందర్ బీఆర్ఎస్ పార్టీ నుండి గెలిచి, వేరే పార్టీలోకి వెళ్ళాడని, దానం నాగేందర్ ఎమ్మెల్యేగా రాజినామా చెయ్యకుండా ఎంపీ గా పోటీ చేస్తున్నాడన్నారు. దానం నాగేందర్ లాంటివారు ముగ్గురు పార్టీ మారారు. ఎంత మంది పార్టి మారిన ఏం కాదని, బీఆర్ఎస్ పార్టీ నాయ కులను తయారు చేసుకుంటుందన్నారు. రాబోయే రోజులు బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, మళ్లీ కేసీఆరే కచ్చితంగా ముఖ్యమంత్రి అవుతారని, సికింద్రాబాద్ పార్లమెంట్‌లో బిఆర్ఎస్ పార్టీ గెలు స్తుందన్నారు. మాజీ మంత్రి, ఎంఎల్ఏ తలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అమలు గాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెస్ పార్టీ డ్రామాలు అన్ని చూస్తున్నామన్నారు. ప్రజలకు కావల్సింది అభివృద్ధిన్నారు. నాలుగు నెలలు ఓపిక పడు దామని, బిఆర్ఎస్ హయంలో చేసిన అభివృద్ధి అక్కడ అక్కడ కొన్ని పనులు ఆగిపోయాయని, పార్లమెంట్ ఎన్నికలు ముగియగానే కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వచ్చి పనులు చేపిద్దామన్నారు. సికింద్రాబాద్ పార్ల మెంట్ పరిధిలో పద్మారావు గౌడ్ పాదయాత్ర చేయబోతున్నారు. అందరి సహకారంతో పద్మారావుగౌడ్ పాదయాత్ర విజయవంతం చేద్దామన్నారు. పద్మారావుకు మద్దతుగా ఈ నెల 27 నుండి నియోజకవర్గ పరిధిలో పాదయాత్ర లను నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. పాదయాత్ర లో అభ్యర్థి పద్మారావు గౌడ్ పాల్గొంటారని చెప్పారు.

కాంగ్రెస్‌కే ఆదివాసి, గిరిజనుల మద్దతు

- నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ తెలంగాణ



నవతెలంగాణ-బంజారాహిల్స్

జాతీయ ఆదివాసి గిరిజన ఫెడరేషన్ ఆత్మ గౌరవాన్ని పెంచేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో మూడు కార్పొరేషన్ల ఏర్పాటుకు కృషి చేశారని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ తెలంగాణ, ఎన్‌టిఎఫ్, రాష్ట్ర అధ్యక్షులు ఉషాకిరణ్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మేడ విజయ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. అధికారంలోకి వచ్చిన ప్రజా పాలన ప్రభుత్వం ఆదివాసుల ఆత్మ గౌరవాన్ని గుర్తించి కొమరం భీం సంతు సేవాలాల్ ఏకలవ్య కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ల ఏర్పాటుతోపాటు ఎస్టీ కమిషన్ విభజన చట్టంలోని ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు భూముల శాశ్వత పరిష్కారం జీవో నెంబర్ 3 పునరాధన చట్టం అమలుకు ఉద్యమించి తాత్కాలిక హక్కులు సాధించుకున్న తమకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభు త్వాన్ని అధికారంలోకి తీసుకురావడానికి తెలంగాణ రాష్ట్రంలోని 60 లక్షల గిరిజనుల పక్షాన పోరాడి సంపూర్ణ మద్దతు అందించి ప్రతి నియోజకవర్గం వెళ్లి సమావేశాలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర మహిళా నాయకురాలు డి.విజయ, కార్యదర్శి చంద్రయ్య, రామస్వామి,సురేష్, శేఖర్,స్టీఫెన్, గంగాధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మేఘా..ఒమేగా విద్యాసంస్థల కీర్తి ముందు తరాలకు స్ఫూర్తి..



నవతెలంగాణ-ఓయు

ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో మేఘా,ఒమేగా విద్యాసంస్థల విద్యార్థులు విజయఢంకా మోగించారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులు 988 మార్కులతో ఎంపీసీ, బైపీసీ,965 మార్కులతో సీఈసీ, 916 మార్కులతో ఎంఈసి తమ ప్రతిభను చాటారు. ఇక మొదటి సంవత్సరం ఫలితాల్లో 466 మా ర్కులతో ఎంపీసీ, 435 మార్కులతో బైపిసి, సిఈసి లో 492 ఎంఈసి లో486 మార్కులతో విద్యా ర్థులు ప్రతిభను చాటడం విశేషం. ప్రతిభను కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను గురు వారం కళశాల లో కళాశాల చైర్మన్ నాగం మోహన్ రెడ్డి , వైస్ చైర్ పర్సన్. కసిరెడ్డి మాలతి రెడ్డి , సెక్రటరీ సీతా రామ్ రెడ్డి , సంబంధిత కళాశాలల ప్రిన్సిపల్స్ ప్రత్యేకంగా విద్యార్థులను అభినందిచారు. కళాశాల ఆవరణ ఆనంద సంబరాల్లో మునిగి తేలారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీఆదర్శ్ ఆదుర్స్..టాపర్స్‌కు సత్కారం



సామాజిక స్ఫూర్తితో విద్యా..

నవతెలంగాణ-ఓయూ

బుధవారం ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో సికింద్రాబాద్‌లో గల శ్రీఆదర్శ జూనియర్ కళశాల ప్రథమ ,ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు ఉత్తమ మార్క్సు సాధించారు.ఈ సందర్భంగా కళశాల యాజమాన్యం ఆధ్వర్యంలో గురువారం కళశాలలో టాపర్స్‌కు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఫస్ట్ ఇ యర్ ఎంపీసీలో బి.శ్రవణి 470గాను 467 మార్క్సు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానంలో నిలిచి ంది. ఎంఈసీలో 500 గాను అక్షజ్ 481 మార్క్సు సాధించారు. బైపీసీలో హర్షిక 440మార్క్సుగాను 437 మార్క్స్ సాధించారు. సీఈసిలో రక్షిత 500 మార్క్సు గాను 477 మార్క్సు సాధించారు. ఇక సెకండ్ ఇయర్ యం.పీసీ లో 1000 మార్క్సు గాను శర్వాణి 982 మార్క్స్ పొందారు. యం.పీసీ లో మరొక విద్యార్థిని సుదే ష్‌కు 982 మార్క్సు పొందారు. వీరిని తల్లిదండ్రులు, సహ విద్యార్థులు సమక్షంలో ఘనంగా సన్మానించారు. ఎస్ఆర్‌నగర్, కూకట్‌పల్లి , అల్వాల్, నారాయణగూడ, సికింద్రాబాద్‌లో ఉన్న తమ విద్యా సం స్థలు సామాజిక స్పుహతో విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. నిష్ణాతులైన అధ్యాపకులచే ప్రతి విద్యార్థి పై ప్రత్యేకంగా దృష్టి సారించి వారిలో దాగివున్న ప్రతిభను ప్రోత్సాహిస్తున్నట్లు చెప్పారు.11 సంవత్సరాలు విద్యా రంగాల్లో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దినట్లు చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్స్ సాయికిషోర్ యచ్.విష్ణు వర్ధన్‌రావు , టి.మనోజ్‌యాదవ్, టి.రాహుల్ యాదవ్ ,సికింద్రాబాద్ ప్రిన్సిపాల్ రామలక్ష్మితో పాటుగా కళశాల అధ్యాపకులు, ఉద్యోగులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఓయూ ఆర్ట్స్ కళాశాలలో ఓపెన్ డే

- పలు చిత్రాలు, పోస్టర్ ప్రజెంటేషన్‌తో తమ విద్యా-
- పరిశోధనల తీరును వివరించిన వివిధ డిపార్టుమెంట్లు
- ఆర్ట్స్ కళాశాలను సందర్శించిన విద్యార్థులు
- విద్యార్థులను, అధ్యాపకులను అభినందించిన వీసీ ప్రొ.డి.రవీందర్



నవతెలంగాణ-ఓయూ

ఓయూలో గత మూడు సంవత్సరాలుగా ప్రతి ఏటా ఏప్రిల్ మాసంలో మూడు రోజులపాటు నిర్వహించే "తక్షు" కార్యక్రమంలో భాగంగా గురువారం ఓయూ ఆర్ట్స్ కళాశాలలో " ఓపెన్ డే" కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ కోర్సుల వివరాలతో పాటు విద్యా-పరిశోధనల తీరు తెన్నులను బయటి సమాజానికి తెలియజేసేఉద్దేశంతో "తక్షు" అనే వినూత్న కార్యక్రమాన్ని ఓయూ వైస్ చాన్సులర్ ప్రొఫెసర్ డి.రవీందర్ యాదవ్ 2022 సంవత్సరం నుంచి ప్రవేశపెట్టారు. ఇప్పటికే రెండు మార్లు "తక్షు" విజయ వంతంగా పూర్తి కాగా ఈ సంవత్సరం మూడో మారు ఈ నెల 24 నుంచి ప్రారంభమై 26వ తేదీన ముగియనుంది. ఆర్ట్స్ కళాశాలలో గురువారం జరిగిన ఓపెన్ డే సందర్శకులను ఎంతో ఆకట్టుకుని అబ్బురపరిచిందన్నారు.ఆర్ట్స్ కళాశాలలో సందర్శించిన వైస్ చాన్సులర్ ప్రొఫెసర్ డి.రవీందర్ వివిధ డిపార్టుమెంట్లలో అకడమిక్ అలంకరణలను చూసి మంత్రముగ్ధులయ్యారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. వీసీ ప్రొ.రవీందర్ యాదవ్ విద్యా -పరిశోధనల పట్ల వారికి ఉన్న ఉత్సాహానికి, ఆసక్తిగా తిలకిం చారు. పలు విభాగాలలో సందర్శించి వీసి వారి కార్యక్రమాలను, ప్రదర్శనలను తిలకిం చారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కుతాడి అర్జున్‌రావు వివిధ విభాగాల కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు కలిసి ఆయా డిపార్టుమెంట్లలో ప్రదర్శించిన పోస్టర్ ప్రజెంటేషన్‌తో పాటు చిత్రాల ప్రదర్శనను విసికి చూపిస్తూ వివరించారు. చరిత్ర విభాగంలో ఆర్ట్స్ కళాశాల నమూనాను ప్రదర్శించడంతో పాటు సింధు నాగరికత పరిణామ క్రమాన్ని తమ చిత్రాలు, పోస్టర్స్ ద్వారా విద్యార్థులు వివరించారు. తెలుగు విభాగంలో ప్రొఫెసర్ సి.కాసిం ఆధ్వర్యంలో విద్యార్థులు అధ్యాపకులు కలిసి "కవి సమ్మేళనాన్ని" నిర్వహించారు. సాహిత్య రచన ఆసక్తిని కవిసమ్మే ళనం ద్వారా విద్యార్థులు ఎంతో చక్కగా ప్రదర్శించారు.సోషియాలజీ డిపార్టు మెం టులో విద్యార్థులు ప్రదర్శించిన సామాజిక నిర్మితుల నమూనాలు,థింకర్స్, శాస్త్రవేత్తల సిద్ధాంతాలు, సామాజిక శాస్త్ర అవసరాన్ని గురించి తెలియజేసే పోస్టర్ ప్రజెంటేషన్ ఆహుతులను ఎంతో ఆకట్టుకున్నాయి.ఎకనామిక్స్ విభాంలో ఆర్థిక వ్యవస్థల అభివృద్ధి న మూనాలతో పాటు మానవుల నిత్యజీవి తం లో ఆర్థిక వ్యవస్థ ప్రభావం గురించి తెలి యజేసే ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్‌తో పాటు రిజిస్ట్రార్ ప్రొఫె సర్ పి.లక్ష్మీనారాయణ, ఓయూ ఆర్ట్స్ కళాశాల వివిధ శాఖలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీనవేని రామ్ షఫర్డ్, వివిధ విభాగాల హెడ్స్, బిఓఎస్ చైర్మెన్‌లు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలలో ఓటింగ్ శాతం పెంచాలి

ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ స్లిప్పులు పంచాలి

జీహెచ్ఎంసీ సర్కిల్ 19 అధికారులు, సిబ్బంది ప్రత్యేక సమావేశం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

మే నెల13న జరిగే లోక్‌సభ ఎన్నికలలో సికింద్రాబాద్ పార్లమెంటు ఎన్నికలలో జూబ్లీహిల్స్ నియో జకవర్గం నుండి ఓటింగ్ శాతం పెరగాలని, ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ స్లిప్పులు పంచాలని, అదే విధంగా పోలింగ్ బూత్‌కు రాలేని వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి ఓటు వేయించాలని డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం జీహెచ్ఎంసీ సర్కిల్ 19 ఆఫీస్ పరిధిలోని మధుర నగర్ కమ్యూనిటీ హాల్‌లో సుమారు 400 మంది జీహెచ్ఎంసీ అధికారులు, బిఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు, సెక్టోరల్ ఆఫీసర్స్, ఏఈఆర్‌ఓ లు పాల్గొని ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్, అధికారులు, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. వచ్చే లోక్సభ ఎన్నికలలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో తప్పకుండా ఓటింగ్ శాతం పెంచుదామని, ఓటర్లకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రిగ్గింగ్‌కు పాల్పడకుండా ఓటర్లను అడ్డుకోవాలని అధికారు లకు సూచించారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ సర్కిల్ 19 డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్, ఎఎంసి బాలరాజు, ఏఎంసీ కమల్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రాణి, సెక్షన్ ఆఫీసర్ మంజు భార్గవి, శానిటరీ సూపర్‌వైజర్ విజయకుమార్, నాక్ ఇంజనీర్లు, అన్ని శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో గ్రేట్ బాంబే సర్కస్

నవతెలంగాణ-కంటోన్మెంట్

సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో నేటి నుంచి రోజుల 45 ద గ్రేట్ బాంబే సర్కస్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఇలియాస్ ఖాన్ పోనీ కృష్ణ సంపత్ చెప్పారు. గురువారం సాయంత్రం జింఖానా గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వివరించారు సికింద్రాబాద్ జంటనగర్ వాసుల కోసం ముఖ్యంగా వేసవి సెలవులులో చిన్నారులకు ఆనందాన్ని కలిగించేందుకు జింఖానా గ్రౌండ్‌లో ఈ సర్కస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జింఖానగరంలో 45 రోజుల పాటు ఈ సర్కస్ నిర్వహిస్తారని వివరిం చారు. రోజుకు గంటకు ఒక షో చొప్పున ఉంటుందని ఉంటుందని తెలిపారు రోజుటే మూడు షోలు ఉం టాయి టిక్కెట్ ధర 200 300 400 500 ఈ సర్కస్ 45రోజులు కొనసాగుతుందన్నారు.

పిల్లలకు చదువుతో పాటు క్రీడలు అవసరం

- సమ్మర్ కోచింగ్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి
- జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

పిల్లలకు చదువుతో పాటు క్రీడలు అవసరమని, పిల్లలు తమకు నచ్చిన క్రీడల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ పేర్కొన్నారు. గురువారం నుండి జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో గ్రేటర్‌లోని క్రీడా మైదానాలలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపుల నేపథ్యంలో జీహెచ్ఎంసీ కూకట్ పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ లోని గ్రౌండ్, చందానగర్‌లోని పీజేఆర్ గ్రౌండ్లో సమ్మర్ కోచింగ్ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసి జీహెచ్ఎంసీలో ప్రతి సంవత్సరం సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నట్లుగానే ఈ సంవత్సరం కూడా 44 క్రీడల్లో ప్రత్యేక సమ్మర్ కోచింగ్ క్యాంప్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 6 నుండి 16 సంవత్సరాల వయస్సు గల బాల బాలికలలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందు మే 31 వరకు వేసవి శిక్షణ తరగతులు కొనసాగిస్తామన్నారు. సంవత్సరం అంతా చదువుతో సతమతమయ్యే చిన్నారుల మానసిక ఒత్తిడి తగ్గించి, ఎంజాయ్ చేసేలా ఏర్పాటు చేశామన్నారు. ఆటల పట్ల ఆసక్తి కనిపరిచే చిన్నారుల కోసం వివిధ గేమ్స్ లో సమ్మర్ క్యాంపు లను సిద్ధం చేశామన్నారు. పిల్లల్లో ఉన్న క్రీడా నైపుణ్యత, ప్రతిభను వెలికి తీయడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించడానికి క్రీడలు దోహదపడతాయాన్నారు. ఇక్కడ వివిధ క్రీడలను నేర్చుకున్న వారు రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో ఆడే క్రీడాకారులుగా ఎదిగారని గుర్తు చేశారు. పిల్లలు తమకు నచ్చిన గేమ్స్ ఆడవచ్చని, ఇండోర్స్ కావాలని గ్రౌండ్ ఇన్చార్జికి చెప్పినట్లయితే ఏర్పాటు చేస్తామని తెలిపారు. పిల్లలందరూ ప్రతిరోజు రెగ్యులర్‌గా సమ్మర్ క్యాంప్ కు వచ్చి ఉత్సాహంగా ఉల్లాసంగా నేర్చుకోవాలని ఉద్బోధించారు. ఆయా క్రీడలలో శిక్షణ ఇవ్వడానికి కోచ్‌లను, మెటీరియల్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్, స్పోర్ట్ విభాగపు అధికారులు, క్రీడాకారులు, విద్యార్థులు, కోచ్‌లు, పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు సోలార్ సిస్టమ్‌దే



నవతెలంగాణ-హైదరాబాద్

భవిష్యత్తు అంతా సోలార్ సిస్టమ్ దేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. గరువారం హైదరాబాద్‌లో ది సోలార్ సిస్టమ్ ఇంటిగ్రేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎస్పీడీసీఎల్ రిటైర్డ్ ఇంజినీర్ దేవేంద్రనాథ్ రెడ్డి తదితరులు మాట్లాడారు. సమాజంలో రోజు రోజుకు విద్యుత్, ఇంధన అవసరాలు పెరిగిపోతున్నాయని తెలిపారు. దానికి తగినట్టు అందుబాటులో ఉన్న సోలార్ ఎనర్జీని పూర్తిగా వినియోగించుకోవాల్సిన అవసరముందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.ఆకాశ్ రెడ్డి, జాతీయ అధ్యక్షులు పి.వెంకట్ రెడ్డి, ఏపీ అధ్యక్షులు శ్రీకాంత్, న్యూఢిల్లీ అధ్యక్షులు బల్దీప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మరకత శ్రీలక్ష్మీ గణపతి దేవస్థానం బ్రహ్మోత్సవాలు



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్‌లోని మరకత శ్రీలక్ష్మీ గణపతి దేవస్థానం అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలను కన్నాజిగూడలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ నిర్వాహకులు వ్యవస్థాపకులు మోతుక్కూరు సత్య నారాయణ శాస్త్రి తెలిపారు. మరకత శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానంలో అంగరంగ వైభవంగా సమప్తి పూర్వకంగా జరిగే అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలకు భక్తులు తరలి రావాలని కోరారు. శుక్రవారం ఉదయం సుప్రభాత సేవ, విశేష అభిషేకం, అంకురార్పణ , అగ్ని ప్రతిష్టాపన ప్రత్యేక హోమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు ఆరంజ్యోతి, గీతప్రియలు ఉన్నారు.

ఒకటి కాదు.. రెండు కాదు..
రెండేండ్లుగా జీతం లేకుండా పని చేస్తున్న ఉద్యోగి

- నకిలీ బర్త్, డెత్ సర్టిఫికేట్లు రికవరీ చేయడంలో విఫలం
- జిల్లా స్థాయి విధులు నిర్వహిస్తూ జోరుగా వసూళ్ల పర్వం
- కింది స్థాయి సిబ్బందిపై అజమాయిషీ
- ఆపరేటర్ల నియామకంలోనూ చేతివాటం

నవతెలంగాణ-సిటీబ్యూరో

నేటి రోజుల్లో ఒక్క నెల, రెండు నెలల వరకు జీతం రాకపోతే చాలు వారి పరిస్థితి చెప్పనక్కల్లేదు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయి. ఇంటి అద్దె, పిల్లల ఫీజులు, కుటుంబ నడవడమే కష్టంగా మారుతుంది. కానీ జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి మాత్రం ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా రెండేళ్లుగా జీతం లేకున్నా పని చేస్తున్నారు. ఇది ఆశ్చర్యం కలిగిస్తున్నా ఇది నిజం. డిప్యూటేషన్ మీద వచ్చిన సదరు ఉద్యోగి తన హోదాకు మించి బాధ్యతలు నిర్వహిస్తూ సర్కిల్ కార్యాలయాల్లో కింది స్థాయి సిబ్బందిపై బెదిరింపులకు దిగుతోందని పెద్దఎత్తున విమర్శలున్నాయి. తనకు వచ్చే జీతం తీసుకోకుండా రాకపోయినా బల్దియా కోసం కష్టపడుతున్నారు ఈ జూనియర్ అసిస్టెంట్. తనకు తాను సాటిస్టిక్ ఆఫీసర్‌నంటూ సిబ్బందిపై అజమాయిషీ చేయడంతో పాటు వసూళ్లకు పాల్పడుతున్నారు. విభాగం ఉన్నతాధికారి కనుసన్నల్లోనే ఈ వ్యవహారం నడుస్తున్నట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జనన మరణ ధ్రువీకరణ పత్రాలు జారీలో అలసత్వం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గ్రేటర్ పరిధిలో పుట్టిన, మరణించిన వారి వివరాలను రికార్డు చేసి భద్రపరిచి వాటిని సరైన టైంలో అవసరమైన విభాగాలకు అందించడంతోపాటు ధ్రువపత్రాలను కూడా జారీ చేయాల్సి ఉంటుంది ఈ విభాగం. సరైన వివరాలు నగరవాసులకు అందుబాటులో ఉంచడంతో పాటు మరణాలకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించడం వాటిని అంశాల వారీగా వేరు చేయడం వంటి పనులు చేయాలి. ఏ ఏ కారణం చేత, ఏ ఏ ప్రాంతాల్లో ఎంతమంది మృతి చెందుతున్నారో ఆరా తీయ్యాలి. సాధారణంగా చనిపోతున్న వాళ్ళు ఎంతమంది అన్న వివరాలను సేకరించి ప్రభుత్వానికి పంపించాలి. క్షేత్రస్థాయిలో పనిచేసే సబ్ రిజిస్ట్రర్లు, రిజిస్ట్రార్ నుండి పూర్తి వివరాలను తీసుకుని ప్రధాన కార్యాలయం వాటిని రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాల్సి ఉంటుంది. మరణాలకు గల కారణాలను విశ్లేషించి ఆయా ప్రాంతాల్లో తీసుకోవలసిన చర్యలపై ప్రభుత్వం ఫోకస్ చేస్తుంది.

అంతా తానే అంటూ... బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్ల జారీలో అవకతవకలు

అయితే ఎక్కడ కూడా స్టాటస్టికల్ అధికారులు అలాంటి పనులు జిహెచ్ఎంసిలో చేయడం లేదు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ స్టాటస్టికల్ విభాగంలో పనిచేస్తున్న సబిత గడిచిన రెండు ఏళ్లుగా జీహెచ్ఎంసిలో అసిస్టెంట్ స్టాటస్టికల్ ఆఫీసర్ స్థాయిలో పనిచేస్తుంది. జూనియర్ అసిస్టెంట్ స్థాయి కలిగిన ఈ అధికారి జీహెచ్ఎంసీ జనన మరణ ధ్రువీకరణ విభాగంలో అంతా తానే అంటూ వ్యవహరిస్తూ అక్రమాలకు నిలయంగా మారిందంటూ పలువురు విమర్శిస్తున్నారు. జీహెచ్ఎంజీలో చేపట్టిన ఇనిస్టంట్ బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్ల జారీలో అవకతవకలు జరిగి దాదాపు 25 వేలకు పైగా అక్రమంగా సర్టిఫికెట్లు జారీ అయ్యాయని తెలిసింది. వాటిపై ఎంక్వయిరీ చేసిన అధికారులు వాటిని తొలగించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు

సర్టిఫికెట్లు రికవరీ చేయడంలో విఫలం

రెండు నెలల క్రితం ఫలక్‌నుమా సర్కిల్లో అక్రమంగా జారీచేసిన వందకు పైగా బర్త్ సర్టిఫికెట్లను అధికారులు గుర్తించారు. ఈ అంశంపై పెద్ద దుమారం లేవడంతో అక్కడ పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ను సస్పెండ్ చేసి కేసు నమోదు చేశారు. ఫలక్నుమా సర్కిల్ పరిధిలో జారీ అయిన అక్రమ సర్టిఫికెట్లను రికవరీ చేయడంలో మాత్రం అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారిగా ఉన్న సబిత ఎలాంటి చర్యలు తీసుకోలేదు. బర్త్ సర్టిఫికెట్లతో పాస్పోర్టులు పొందడంతో పాటు ఇతర అనేక ద్రవపత్రాలు పొందేందుకు అవకాశం ఉంటుంది. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ కార్డు వంటి అనేక ధ్రువపత్రాలను పొందేందుకు బర్త్ సర్టిఫికెట్లు ఉపయోగపడతాయి. ఇక డెత్ సర్టిఫికెట్లు ఆస్తుల మార్పిడికి ఇన్సూరెన్స్ కవరేజీలకు ఉపయోగించి లబ్ధి పొందే అవకాశం ఉంది అక్రమార్కులు. జీహెచ్ఎంసి స్వయంగా జారీ చేసిన పత్రాలను నోటీసులు జారీ చేసి వాటిని తీసుకోవచ్చు. కానీ స్టాటస్టికల్ అధికారిగా చెప్పుకుంటున్న సబిత అంశంలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఇప్పుడు జీహెచ్ఎంసిలో పలు అనుమానాలకు తావనిస్తుంది.

జీతం లేకుండానే రెండేళ్లుగా..

జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ కంటే అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగికి జీతం తక్కువగా ఉందని సమాచారం. ఆ జీతం కూడా నెలనెలా తీసుకోకుండా రెండు సంవత్సరాలుగా జీహెచ్ఎంసీ లో పనిచేస్తుంది సదరు అధికారి.

డిస్టిక్ లెవెల్ ఆఫీసర్ స్థానంలో జూనియర్ అసిస్టెంట్

జూనియర్ అసిస్టెంట్‌తో డిస్టిక్ ఆఫీసర్ చేయాల్సిన పనులన్నీ జీహెచ్ఎంసీ బర్త్ అండ్ డెత్ విభాగంలో చేయించడం ఏంటనేది హాట్ టాపిక్‌గా మారింది. జాబ్ చార్ట్ లేకుండా అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారితో అన్ని పనులు ఆ విభాగం అధిపతి చేయిస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. డిస్టిక్ స్టాటస్టికల్ స్థాయి అధికారి ఉన్నప్పటికీ ఇతర విభాగంలో వారి సేవలను ఉపయోగిస్తూ జూనియర్ అసిస్టెంట్ స్థాయి అధికారిని ఉపయోగించుకుంటూ తన పనులు చక్కబెట్టుకుంటుందన్న ఆరోపణలు వస్తున్నాయి.

హెల్త్ సెక్షన్‌లో అన్నీ తానై..పరిశీలన లేకుండా క్లియర్

ఆసుపత్రులకు బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు జీహెచ్ఎంసి ఆన్లైన్‌లో నమోదు చేసే అందుకోసం ఇవ్వాల్సిన అనుమతులను క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే ప్రధాన కార్యాలయం నుండి క్లియర్ చేస్తున్నారు. ఇందులో చీఫ్ మెడికల్ ఆఫీసర్ తోపాటు అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారిగా వ్యవహరిస్తున్న సబిత కీలక పాత్ర వహిస్తున్నారని తెలిసింది. గతంలో ఆసుపత్రులకు లాగిన్ ఐడీలు ఇచ్చేందుకోసం క్షేత్రస్థాయిలో ఉన్న రిజిస్ట్రర్లు సబ్ రిజిస్ట్రర్లు పరిశీలించి రిపోర్టులు పంపితే వాటి ఆధారంగా లాగిన్ ఐడి ప్రధాన కార్యాలయం నుండి జారీ అయ్యేది. కానీ ఇప్పుడు అందుకు భిన్నంగా అంతా తామై వ్యవహరిస్తున్నారు. ప్రధాన కార్యాలయం బర్త్ అండ్ డెత్ విభాగం అధికారులు.

తలుచుకుంటే సాయంత్రానికల్లా ఇంటికి పంపిస్తా..

ఇక జీహెచ్ఎంజీ బర్త్ అండ్ డెత్ విభాగంలో పనిచేసే క్షేత్రస్థాయి అధికారులపై సిబ్బందిపై ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరించడం ప్రధాన కార్యాలయం అధికారులకు పరిపాటి అయింది. అసిస్టెంట్ స్టెటస్టికల్ అధికారిగా వ్యవహరిస్తున్న సబిత కంప్యూటర్ ఆపరేటర్‌పై తమ జులుం ప్రదర్శిస్తూ నిత్యం బెదిరింపులకు దిగుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. నేను తలుచుకుంటే సాయంత్రానికి మిమ్మల్ని ఇంటికి పంపుతానంటూ తాను చెప్పిన పనులు చేయాలంటూ బెదిరిస్తున్నట్లు సిబ్బంది వాపోతున్నారు. మీవి తుమ్మితే ఊడిపోయే ముక్కులంటూ అవుట్ సోర్సింగ్ ఆపరేటర్లను నిత్యం వేధింపులకు గురి చేస్తుందని వాదనలు ఉన్నాయి. సదరు అధికారి వేధింపులను తట్టుకోలేక పలువురు ఆపరేటర్లు ఉద్యోగాలు వదిలేస్తున్నారు. దాంతో కొత్త ఉద్యోగులను నియమించడంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. గడిచిన ఒకటి రెండేళ్లుగా నియమించిన పలువురు ఆపరేటర్లతో లక్షల రూపాయలు తీసుకున్నట్లు తెలుస్తుంది.

సరైన పత్రాలు లేకపోవడంతోనే జీతం రాలేదు - జీహెచ్ఎంసీ సీఎంవోహెచ్

నల్గొండ నుంచి జీహెచ్ఎంసీకి సబిత డిప్యుటేషన్‌పై వచ్చింది. అయితే అక్కడ స్థానికంగా పనిచేసిన సమయంలో జీతం ఎంతవస్తుందో పత్రాలు సమర్పిం చలేదు. నల్గొండ నుంచి ఇక్కడికి వచ్చిన సమయంలో (ఎల్‌పీసీ, ఎస్ఆర్) లాస్ట్ పే సర్టిఫికెట్, సర్విస్ రికార్డు తీసుకోలేదు. సరైన పత్రాలు సమర్పించక పోవడం తోనే సబితకు ట్రేజరీ నుంచి జీతం రాలేదని జీహెచ్ఎంసీ సీ.ఎం.ఓ.హెచ్ డాక్టర్ పద్మజా తెలిపారు. సరైన పత్రాలు సమర్పించలేదని రెండు సార్లు మెమోలు జారీ చేసిన తర్వాత సర్టిఫికెట్లను సమర్పించిందన్నారు.

ఎండ తీవ్రతతో అల్లాడుతున్న జనం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రతిరోజు 40 డిగ్రీలకు పైగా బాణుడి ప్రతాపంతో రోడ్లపైకి రావడానికి జంకుతున్నారు. నగర వాసు లను అలరించేందుకు ఐమాక్స్ పక్క 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం పక్కన ఏర్పాటుచేసిన సమ్మర్ ఉత్సవ్ మేళ మినీ కశ్మీర్ అలరించనుందని నిర్వాహకుడు మిర్జా రఫీక్ బేగ్ తెలిపారు. బయట ఉన్న 40 డిగ్రీల ఎండ తీవ్రతలో అల్లాడుతున్న జనానికి ఎగ్జిబీషన్ లోపల మినీ కశ్మీర్‌ను పరిచయం చేస్తూ మైనస్ 1 డిగ్రీలో స్నోఫాల్, వాటర్ ఫాల్‌ల మధ్య నుంచి. అనం లోపలికి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేస్తు న్నా రు. ఈ సమ్మర్‌లో పిల్లలు ముఖ్యంగా. పిల్లలు ఎంతో ఎంజాయి చేస్తారని తెలిపారు. వీటితో పాటు ఎమ్యూ జిమెంట్ రైడ్స్, స్టాల్స్ కూడా ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. (ప్రతి రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఎగ్జిబీషన్ ఉంటుందని (ప్రారంభోత్సవ తేదీని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు

టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్సుకు
దరఖాస్తుల ఆహ్వానం : డీఈవో రోహిణి

నవతెలంగాణ-సిటీబ్యూరో

మే 1వ తేదీ నుంచి 42 రోజుల టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్(టీటీసీ) సమ్మర్ ట్రైనింగ్ కోర్సు ప్రారంభించను న్నట్టు హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారిణి ఆర్. రోహిణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో మే 1 నుంచి జూన్ 13వ తేదీ వరకు ఈ కోర్సు నిర్వహించనున్నట్టు డీఈవో తెలిపారు. ఈ నెల 22 నాటికి 18 ఏండ్ల నుంచి 45 ఏండ్ల వయసు ఉన్న అభ్యర్థులు ఈ కోర్సులో ప్రవేశాలు పొందేందుకు అర్హులని ఆమె తెలిపారు. అర్హులైన అభ్యర్థులు www.bse.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ నెల 30వ తేదీ లోపు ఆయా దరఖాస్తులను గాంధీభవన్ హైస్కూల్ అందజేయాలని డీఈవో పేర్కొన్నారు.



రాగ రాగిణి మహిళా సంస్థ నిర్వహణలో గానసభలో కళాదీక్షితులు కళా వేదికపై విఖ్యాత గాయకులు శోభా రాజు డీ వీ.మోహన కృష్ణ లను ఆదాయ పన్ను శాఖ విశ్రాంత కమిషనర్ నరసింహప్ప సత్కరించారు.
-నవతెలంగాణ-కల్చరల్

అందమైన జీవితాన్ని అర్థంతరంగా ముంగించొద్దు

- ఫలితాలే జీవితం కాదు
- పాస్..ఫెయిల్ రెండూ స్వీకరించాలి
- జీవితం పట్ల సరైన అవగాహన కలిగి ఉండాలి
- తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రాంచందర్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్రంలో ఇటీవల వెలువడిన ఇంటర్ పరీక్షా ఫలితాలు జీవితంలో ఉన్నత శిఖరాలు ఎదగడానికి దోహదపడతాయనేది నిర్వివాదాంశమని, అయినప్పటికి ఈ ఫలితాలే జీవితం కాదని, ఇవి మన ఎదుగుతున్న జీవితంలో ఒక భాగం మాత్రమేనని ప్రతి ఒక్కరు గుర్తించాల్సిన అవసరం ఉందని తెలంగాణ సైకాల జిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రాంచందర్ అన్నారు., విద్యార్థులు ఈ పరీక్షల్లో పాసైన, ఫెయిల్ అయిన వాటిని నవ్వుతూ స్వీకరించాలని, కానీ విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడికి గురి కావా ల్సిన అవసరం లేదు.విద్యార్థుల పరీక్షా ఫలితాలు తారుమారు అయినంత మాత్రాన, తదుపరి సప్ల మెంటరీ ఉందని దానిలో మంచి ఫలితాలు పొందవచ్చని గమనించాల్సిన అవసరముంది. ఆ దిశగ మీ ఆలో చనలను మార్చుకోవాల్సిన అవసరముంది.భవిష్యత్ జీవితం ఉజ్వలంగా ఉంటుందని ఆలోచిం చుకోవాల్సిన అవసరముంది. ఇంటర్‌లో ఫెయిల్ అయిన 8 విద్యార్థులు తమ ప్రాణాలను అర్థంతరంగా ముగిం చుకోవడం ఎంతో విషాదకరం. తల్లిదండ్రులకు ఆత్మఘోష తప్ప మిగిలేది ఏమీ లేదు.మీ మీదే ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగల్చడం తప్ప.అందమైన జీవితాన్ని అనుభవించ లేక ఎందుకీ అర్థంతర చావులు మీ జీవితం పట్ల మీకు సరైన అవగాహన కలిగి ఉండవలసిన అవసర ముంది.ఆత్మ న్యూనత భావంతో మీరు దిగులు చెందాల్సిన అవసరం లేదు.మీ ఆత్మ విశ్వాసమే మీకు శ్రీ రామ రక్ష అని ప్రముఖ సైకాలజిస్ట్, తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రాంచందర్ చెప్పారు.

కారణాలు: ప్రతికూల ఉద్వేగాలైన డిప్రెషన్, భయం, అశాంతి, అభద్రత, నిరాశ, నిస్పృహ, ఓటమి, అవమానం, సున్నితమైన, తీక్షణమైన మనోభావాలకు భంగం కలగడం, ఉద్రేక పూరిత మనస్తత్వం, నేను ఫెయిల్ అయ్యానే అనే బాధ,



ఇతర విద్యార్థులతో పోల్చుకోవడం,

నివారణ చర్యలు:

తల్లిదండ్రులు విద్యార్థులను ఫలితాలు వచ్చినప్పటి నుండి వారిని కంటికి రెప్పల కాపాడుకోవాలి. పిల్లలను భయపెట్టడం కాని, తిట్టడం కాని చేయకుండ వాళ్లలో మానసిక ఒత్తిడి తగ్గించే ప్రయత్నం చేయాల్సిన అవసరముంది. పిల్లలను ఇతర విద్యార్థులతో పోల్చకుండ తదుపరి పరీక్షల్లో తప్పకుండ నీకు విజయం లభిస్తుంది.బాధ పడాల్సిన పని లేదు అని ఉత్సాహపరచాల్సిన అవసర ముంది. తల్లిదండ్రులు ఫలితాల గురించి పిల్లల ముందు ఇతరులతో మాట్లడకుండా ఉండడం మంచిది. విద్యార్థులు యోగ, ప్రాణాయమం, మెడిటేషన్ లపై ధ్యాస పెట్టాల్సిన అవసర ముంది.నచ్చిన వారితో తమలోని భావాల్ని చెప్పుకోవాలి. అనుమానితుడిని ఒంటరిగా ఉంచరాదు. ప్రతి క్షణం ఆ వ్యక్తిని కనిపెడుతూ ఉండాలి. ప్రమాదకరమైనవస్తువులు,ప్రమాదకరమైన పరిసరాలకు దూరంగా ఉంచాలి. కుటుంబ సంబంధాలు ఆనందంగా, ఆహ్లాదంగా, ఆరోగ్యంగా ఉండేట్లు చూసుకోవాలి. అవసరమైనచో సైకాలజిస్టుల చేత కౌన్సిలింగ్ అందించాలి.

పరుచూరి రఘుబాబు స్మారక జాతీయ నాటక పోటీలు ఆరంభం

నవతెలంగాణ-కల్చరల్

రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై పరుచూరి రఘుబాబు స్మారక 34 వ జాతీయ నాటక నాటిక పోటీలు ఆరంభం ఇనాయి రంగస్థల ప్రముఖుడు ఆచార్య డీ.ఎస్.ఎన్.మూర్తి లాంఛనం గా దీపారాధన చేసి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ముప్పై మూడు సంవత్సరాలు గా నిర్వహిస్తున్న పోటీలలో సుమారు గా అరు వందల నాటకాలు ప్రదర్శించి ఉంటారనీ సినిమా పరిశ్రమలో బ్యూజీగా వింటూ కూడా పరుచూరి బ్రదర్స్ ఈ నాటకాలను ఓపికగా చూడటం విశేషం అన్నారు. అధ్యక్షత వహించిన సినీ రచయిత పరుచూరి గోపాల కృష్ణ మాట్లాడుతూ రవీంద్ర భారతి లో నాటకం వేయటం ఒకప్పుడు తన కోరిక అన్నారు. పరుచూరి రఘుబాబు నాటక పరిషత్ ద్వారా ఎందరో కళాకారులు తెలుగు సినీ పరిశ్రమకు పరిచయం అవుతున్నారని తెలిపారు. పరుచూరి వేంకటేశ్వర రావు మాట్లాడుతూ తెలుగు నాటక రంగంకు చేయూత ఈ నాటిక నాటక పోటీలు నిర్వహిస్తు న్నామని అన్నారు తమ కుమార్డు రఘు బాబు ను పోటీల్లో పాల్గొనే నటీ నటులలో చూసుకుంటున్నా



నని తెలిపారు రంగస్థల నటుడు గుమ్మడి గోపాల కృష్ణ ప్రార్థన గీతం తో సభ ప్రారంభం ఇనది. నాటిక పోటీలలో భాగంగా వెలగలేరు థియేటర్స్ వెలగలేరు వారిచే రాత పీ శ్రీనివాస్ రావు దర్శకత్వంలో సిరిమువ్వ కల్చరల్ హైదరాబాద్ వారిచే స్నిగ్ధ రచించిన జేబు చెప్పిన వూసులు మంజునాథ దర్శకత్వంలో కలాంజలి హైదరాబాద్ వారిచే సూర్య ప్రకాశ్‌రావు రచించిన రైతే రాజు కె రాధా కృష్ణ దర్శకత్వంలో చివరిగా యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ వారిచే ఏ. తమేశ్వరయ్య రచించిన బూడిద నాటిక సత్య నారాయణ దర్శకత్వంలో ప్రదర్శించారు.

పద్య ప్రాభవం కృష్ణ రాయబారం

నవతెలంగాణ-కల్చరల్



ఎన్ని సార్లు విన్నా మళ్ళీ మళ్ళీ వినాలపించే తిరుపతి వేంకట కవుల విరచిత పాండవోధ్యోగ విజ యాలు నాటకం లోని పద్యాలు అందులో శ్రీ కృష్ణ రాయబారం దృశ్యం పద్యాలు ప్రత్యేకం. శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై కల్పన కళా నికేతన్ సంస్థ నిర్వహణ లో రాష్ట్ర చలన చిత్ర నాటక అభివృధి సంస్థ సౌజన్యంతో శ్రీరామ నవమి హనుమ జయంతి లను పురస్కరించుకొని శ్రీ కృష్ణ రాయబారం కర్ణ సందేశం నాటక దృశ్యాలు ప్రదర్శించారు.. జెజగన్ మోహన రావు కృష్ణునిగా బాల నాగేశ్వర రావు దుర్యోధనుని గా జంగయ్య గౌడ్ అర్జునిని గా కర్ణునిగా కూడా నటించి తెలుగు పద్య ప్రాభవాన్ని చూపారు ఈ సందర్భంలో జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ కవి రసమయి డాక్టర్ ఎం.కె రాము పాల్గొని తరచూ పద్య పౌరాణిక నాటకాలు ప్రదర్శన వల్ల తెలుగు భాష సంస్కృతి నిల బడుతుందన్నారు. నేటి తరం వారికి వీటిని పై అవగాహన కల్పించేందుకు కృషి జరగాలన్నారు.

మూర్ఛ వ్యాధితో గుర్తు తెలియని యువకుడు మృతి

నవతెలంగాణ-ముషీరాబాద్



మూర్ఛ వ్యాధితో గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన నల్ల కుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అడిక్‌మెట్ ఫ్లైఓవర్ 30-35 సంవత్సరాల వయస్సు గల ఒక గుర్తుతెలియని వ్యక్తి ఫిట్స్ వచ్చి పడిపోయాడు. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి గుర్తు తెలియని వ్యక్తిని ముషీరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా డ్యూటీ డాక్టర్ పరిశీలించి మృతి చెందినట్లు ప్రకటించారు. పోలీసులు మృతుడి వివరాలకు దర్యాప్తు చేపట్టారు.

'ఇంటర్ ఫలితాల్లో న్యూ ఎరా కళాశాల విజయకేతనం'



- న్యూ ఎరా జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్, డైరెక్టర్ డా.శ్రావణ్ కుమార్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

భవిష్యత్తులో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే తమ కళాశాల ఏకైక లక్ష్యమని, ప్రతి విద్యార్థి కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోగలరని 'న్యూ ఎరా జూనియర్ కళాశాలల' ప్రిన్సిపాల్, డైరెక్టర్ డా.శ్రావణ్ కుమార్ అన్నారు.ఇంటర్ వార్షిక ఫలితాల్లో న్యూ ఎరా జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగర వేశారని, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించి విద్యార్థులు తమ సత్తా చాటారని ఆయన తెలిపారు.ఇంటర్ ఎంపీసీ విభాగంలో కె.రంజిత 466/470, బైపీసీ విభాగంలో జి.తులసీ 429/440, ఎంఈసీ విభాగంలో ఎన్.నిఖిత 479/500, సీఈసీ విభాగంలో అంకిత 474/500 మార్కులతో పాటు మరి కొంత మంది విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు డా.శ్రావణ్ కుమార్ అభినందనలు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీ మేధావి విజయకేతనం



నవతెలంగాణ-మెహదీపట్నం

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలలో మెహిదీపట్నంలోని శ్రీ మేధావి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగిరేసారు. ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాలలో కళాశాల ఎంపీసీ విద్యా ర్థులు కిరణ్ 465/470 మార్కులు, హరిణి 460/470 మార్కులు, బైపిసి విద్యార్థులు అమీనా మీరాజ్ 432/440 మార్కులు, వాగ్దేవి మరియు పూజిత 422/440 మార్కులు, సిఇసి విద్యార్థులు ఆకృతి 460/500 మార్కు లు, అంకిత్ కుమార్ 458/500 మార్కులు సాధించి ఉత్తమ ఫలితాలు సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరం విద్యార్థులలోఎంపీసీ గ్రూప్ కు చెందిన అశ్విని 986/1000 మార్కులు, బైపీసీ విద్యార్థి విశాల్ 948/1000 మార్కులు, ఎంఈసి విద్యార్థి అహ్మద్ 956/1000 మార్కులు, సీఈసీ విద్యార్థి ప్రణీత్ 976/1000 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభను చాటారు. ఇంటర్ ఫలితాలలో తమ కళాశాల విద్యా ర్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు కళాశాల డైరెక్టర్ పూర్ణచందర్, కళాశాల ప్రిన్సిపల్ ఈశ్వ రయ్య హర్షం వ్యక్తం చేశారు. తమ కళాశాలలో అనుసరిస్తున్న వినూత్న బోధన పద్ధతులు అనుభవ జ్ఞులైన అధ్యాపక బృందం యొక్క కృషి వలన తమ కళాశాల ఈ ఉత్తమ ఫలితాలను సాధించిందని వారు అన్నా రు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో వారు విద్యార్థులను సన్మానించారు. ఈ కార్య క్రమంలో కళాశాల అధ్యాపక బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మోదీ వ్యాఖ్యలు విద్వేషపూరితం



- ఎంపీజే తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ అబ్దుల్ అజీజ్..

నవతెలంగాణ-ధూల్‌పేట్

రాజస్థాన్‌లోని బన్స్వారాలో జరిగిన లోకసభ ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముస్లి ంల పట్ల చేసిన విద్వేషపూరిత వ్యాఖ్యలను మూవ్మెంట్‌ఫర్ పీస్ అండ్ జస్టిస్(ఎంపీజే) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ అబ్దుల్ అజీజ్ ఖండించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సంపద నంతా ముస్లిములకు వంచిపెడు తుందని వ్యాఖ్యానించడం బాధ్యతారాహి త్యమేనన్నారు. భారతదేశ ప్రధానిగా ఉన్న వ్యక్తి ఓ వర్గంపై విషం చిమ్మడం దుర్మార్గమన్నారు. ఎలక్షన్ మోడల్ కోడ్, ప్రజా ప్రతినిధుల కోడ్‌ను బహి రంగంగా ఉల్లంఘించడమేనన్నారు. దేశంలోని 196 స్థానాలలో ముస్లింలు ప్రభావం చూపగలరని, వారు ఎవరికి ఓటేస్తే వారే గెలిచే పరిస్థితులున్నా యన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీలు రాజ్యాం గాని కున్న చట్టబద్ధతను తొలగించాలనుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. ఆర్ఎస్ ఎస్, బీజేపీ విద్వేష వ్యాఖ్యలు ప్రజలపై ఎలాంటి ప్రభావం చూపలేకపో యాయన్నారు. దేశ పౌరులు శాంతికాముకులని, దేశంలో సోదరభావాన్ని చూడాలను కుం టున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 80శాతం హిందూ సోదరులు దేశం అన్ని వర్గాల వారిదనే భావిస్తున్నారన్నారని, 75 మంది నిరక్షరాస్యులలోనూ దేశం అందరిదనే భావనలోనే ఉన్నారన్నారు. హిందూ ముస్లింల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టాలనే బీజేపీ ప్రయత్నాలు విఫలం కానున్నా యన్నారు. అన్ని వర్గాల ప్రజలు, ముఖ్యంగా ముస్లింలు విచక్షణ తో ఆలోచించి విద్వేషకర శక్తులను ఓడిం చాలని అబ్దుల్ అజీజ్ అన్నారు.

నేడు ఘంటసాల స్వరామృత ధార మెగాగాన విభావరి

నవతెలంగాణ-కల్చరల్



ఈ నెల 26 ఏదీ శ్రీ త్యాగరాయ గానసభ ప్రధా న వేదిక పై ప్రముఖ గాయకుడు శరత్ చంద్ర స్వర సారథ్యంలో సుప్రీం కోర్టు న్యాయ వాది అధ్యాత్మికవేత్త జీవీఎస్ ఆర్ఎస్ ఎస్ ఎస్ వర ప్రసాద్ చే ఘంటసాల స్వరామృతధార మెగాగాన విభావరి నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకురాలు శివ రమ్య తెలిపారు. వినూత్న కార్యక్రమంలో ఘంటసాల పాడిన పాటలు శ్లోకాలు దండకాలు పద్యాలు పై స్వర విశ్లేషణ రాగ తాళ విశే షాలు శరత్ చంద్ర వివ రణలో వర ప్రసాద్ గానం చేస్తారు. నాటి కార్యక్రమానికి ఘంటసాల అకాడమీ ఛైర్మన్ పీ.నాగేశ్వర రావు సినీ నటుడు కుమనన్ అమెరికా లో స్థిర పడ్డ గాయని పద్మిని వెస్ట్ బెంగాల్ నుంచి దేవి శ్రీనివాస్ జ్వాల కోటి నాగ మణి తదితరులు పాల్గొంటారని ఆమె తెలిపారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికను చిక్కడ పల్లి లోని సంస్థ కార్యలయం లో శరత్ చంద్ర, శివరమ్య తదితరులు విడుదల చేశారు ఈ స్వరామృత ధార యూ ట్యూబ్ చానెల్ లో వీక్షింప వచ్చనీ వారు తెలిపారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

- చివరిరోజు మూడు లోక్ సభ స్థానాలకు 228 మంది అభ్యర్థులు.. 337 సెట్ల నామినేషన్లు దాఖలు
- పోటాపోటీగా బరిలోకి ఇండిపెండెంట్ అభ్యర్థులు
- నేడు పరిశీలన..29న తుది జాబితా విడుదల



నవతెలంగాణ-సిటీబ్యూరో

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కీలకఘట్టం ముగిసింది. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 18న వెలువడిన నాటి నుంచి గురువారం మధ్యాహ్నం 3గంటల వరకు ఎన్నికల నామినేషన్లను స్వీకరించగా ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థుల నుంచి భారీ సంఖ్యలో నామి నేషన్లు వెలువెత్తాయి.గతంతో కంటే భిన్నంగా హై దరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి నియోజకవ ర్గాల లో భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యా యి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, పార్టీల అభ్యర్థులే కాకుండా స్వతంత్ర అభ్యర్థులు ఈ దఫా అధిక సంఖ్యలో ముందుకు వచ్చి నామినేషన్లను సమర్పించారు. రిజిస్టర్డ్, రికగ్నైజ్డ్ పార్టీల నుంచి కూడా అదే స్థాయిలో నామినేషన్లు వచ్చాయి.గురువారం చివరిరోజు కావడంతో 3గంటల తర్వాత అప్పటికే రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయానికి చేరు కుని వేచి ఉన్న అభ్యర్థులకు నామినేషన్ వేసే అవకాశం కల్పించారు. కాగా హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరిపార్లమెంట్ నియోజకవర్గాల్లో మొత్తంగా 228 మంది అభ్యర్థులు.. 337 నామినే షన్లుదాఖలు చేశారు.ఇందులోచివరిరోజే109 మంది అభ్యర్థులు, 153 నామినేషన్లు సమర్పించారు.

కాగా నామినేషన్ల గడువు ముగిసిన అనంతరం హైదరాబాద్ లోక్ సభ స్థానానికి 57 మంది అభ్యర్థులు 85 నామినేషన్లు దాఖలు చేయగా.. చివ రి రోజు 25 మంది 37 నామినేషన్లు సమర్పించారు. ఇక సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి మొత్తం 57 మంది అభ్యర్థులు 75 నామినేషన్లు దాఖలు చేయగా.. చివరి రోజు 23 మంది అభ్యర్థులు 25 నామినేషన్ల పత్రాలు సమర్పించారు. అదే విధంగా మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గ స్థానానికి 114 మంది అభ్యర్థులు 177 నామినేషన్లు దాఖలు చేశారు. చివరి రోజు 61 మంది 91 నామినేషన్లు సమర్పించారు. ఇదిలావుంటే శుక్రవారం నామినేషన్ల పరిశీలన చేపట్టనుండగా.. అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 29వ వరకు గడువు ఉంటుంది. ఆ తర్వాత బరిలో ఉన్న పార్టీల అభ్యర్థులు కాకుండా స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించనున్నారు. పోలింగ్ మే 13వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో జరుగనుంది. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగనున్న విషయం తెలిసిందే. నామినేషన్ల ప్రక్రియ పూర్తికావడం.. పోలింగ్‌కు మరో 18 రోజులే గడువు ఉండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రచారం హెూరెత్తనుంది.

తొలిరోజు ప్రశాంతం

- జిల్లాలో ఓపెన్, టెన్త్, ఇంటర్ పరీక్షలు షురూ
- టెన్త్‌లో 84శాతం, ఇంటర్‌లో 80శాతం విద్యార్థుల హాజరు
- మొత్తం 1063 మంది విద్యార్థుల గైర్హాజరు



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్ స్కూల్) ఆధ్వర్యంలో టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ జిల్లాలో తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పదో తరగతికి 41 కేంద్రాలు, ఇంటర్‌కు 35 కేంద్రాలు కేటాయించారు. తొలిరోజు పదో తరగతి ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్షకు 1282 మందికిగాను 1079 మంది హాజరవ్వగా.. 203 మంది గైర్హాజరయ్యారు. 84శాతం హాజరు నమోదైంది. ఇంటర్‌కు 4289 మందికిగాను 3429 మంది పరీక్ష రాశారు. 860 మంది దుమ్మా కొట్టగా.. 80శాతం హాజరు నమోదు అయ్యింది. టెన్త్, ఇంటర్‌కుగాను మొత్తం 41 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పలు పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. కాగా ఎలాంటి మాల్‌ప్రాక్టీస్, మాస్ కాపియింగ్ వంటి కేసులు నమోదు కాలేదు. ఎలాంటి అవకతవకలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోని పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిం చాలనిడీఈవోఆర్.రోహిణి సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.

28న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'నాట్య మహెూత్సవం-2024'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



ప్రపంచ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్‌దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, స్ఫూర్తి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో28న బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'నాట్య మహెూత్సవం-2024'ను నిర్వహిస్తున్నామని అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్, డా.ఇ.ఎస్.ఎస్ నారాయణ మాష్టార్ తెలిపారు.ఈ మేరకు నాట్య మహెూత్సవంకు సంబంధించిన వాల్ పోస్టర్ ను సంఖ్య శాస్త్ర నిపుణులు దైవజ్ఞ శర్మ, కూచిపూడి, భరత నాట్యం గురువు డా.సురభి శారద, కేంద్ర సెన్సార్ ఫిలిం బోర్డు సభ్యులు క్రిష్టాధి శేషు, మాష్టార్ తో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూచిపూడి, భరత నాట్యం, కథక్, పేరిణి తదితర శాస్త్రీయ నృత్యాలతో పాటు జానపద, దేశ భక్తి,సినిమా, నాట్యకళాకారుల నాట్య ప్రతిభను ప్రోత్సహించడానికి ఈ మహెూత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు.ఈ నాట్య మహెూత్సవంలో పాల్గొన్న ప్రతి నాట్య కళాకారులకు సర్టిఫికెట్, మెమోంటో ప్రధానం చేయనున్నట్లు నారాయణ మాష్టార్ తెలిపారు.ఈ మహెూత్సవంలో పాల్గొని నాట్య ప్రదర్శన ఇవ్వాలనుకునే వారు 6సంవత్సరాల నుంచి 60 ఏండ్లలోపు వారు పాల్గొన వచ్చునని, నాట్య కళాకారులు సన్మానం పొంద డానికి, నాట్య గురువులు ఈ నెల 27వ తేదీలోగా ఫోన్ నెంబర్: 9652347207లో సంప్రదించి పేర్లు రిజిష్టరు చేయించుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా రాజ్‌కుమార్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-సిటీబ్యూరో





టీఎన్జీవోస్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కె.ఆర్. రాజ్‌కుమార్ జన్మదిన వేడుకలను బుధవారం డీఈవో కార్యాలయం ఘనంగా నిర్వహిం చారు. ఆ సంఘం నగర కార్యదర్శి ఎం.భాస్కర్, అసోసియేట్ ప్రెసిడెంట్ డేవిడ్, కోశాధికారి ప్రేమ్, జాయింట్ సెక్రటరీ జయంతి రెడ్డి, ఈసీ ముజా హిద్, ప్రియా, మోయిన్, వారి కార్యవర్గంతో పాటు జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ నర్సింగ్ రావు, ఉద్యోగుల సమక్షంలో రాజ్ కుమార్‌కు శాలువా కప్పి గజమాలతో సన్మానించారు. అనంతం కేక్ కట్ చేయించి తినిపించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ కనీజ్ ఫాతిమా, రమేష్, సూర్య అరుణ, లావణ్య, మీర్జా, సుదర్శన్, శివ, చారి, జి.రాజ్‌కుమార్, విజయలక్ష్మి, సరళారెడ్డి, ఫరూక్, థాకియాలీ, చక్రవర్తి, సుగుణారెడ్డి, బషీర్, మంజు, అజ్మత్, రాజేందర్, శ్రీధర్, హమీద్, సాజిద్, అల్తాఫ్, సూర్య ప్రకాష్, ఇమ్రాన్, రాణి, జకీర్, శశిరత్న కౌసర్, ఖాజాసోహైల్, నర్సింహ, గిరిజా, హేమావతి, రేణుక, సాయిలేఖ, దేవి ప్రసాద్, కృష్ణ, శివజ్యోతి రెడ్డి, గౌసియా, చైతన్య, లక్ష్మీపతి, జాంబయ్య, రాకేష్, సుజాత, శ్రీదేవి, చైతన్య, అజీజ్, సాదత్, కుషాల్, జమీల్, ఇమ్రాన్, రవి, పవన్, పూర్ణిమ, జాన్సీ, సునీత, దామోదర్, లక్ష్మి మర్రమ్మ, రవి, రోషన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

డాక్టర్ ముజీబ్ ఆధ్వర్యంలో

టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) ఆధ్వర్యంలో గురువారం గృహకల్పలోని టీఎన్జీవోస్ భవన్‌లో ఆ సంఘం జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్, స్కూల్ ఎడ్యూకేషన్ యూనిట్ అధ్యక్షులు కె.ఆర్. రాజ్‌కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలబోకే అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి తినిపించారు. ఈ వేడుకల్లో జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, పబ్లిసిటీ సెక్రటరీ వైదిక్ శాస్త్ర, ఈసీ శంకర్, ఏపీఆర్వో వహీద్, వారి కార్యవర్గం, నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం గౌరవాధ్యక్షులు ఖాదర్ బిన్ హాసన్, స్కూల్ ఎడ్యూకేషన్ కార్యదర్శి ఎం.భాస్కర్, అసోసియేట్ ప్రెసిడెంట్ డేవిడ్, వైస్ ప్రెసిడెంట్ బి.రవి, ఈసీ ముజ్జయిద్, ప్రియా, మోయిన్ వారి కార్యవర్గ సభ్యులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

భూగర్భ జలాల్ని పెంచేందుకు కృషి

- ఇంకుడు గుంతల నిర్మాణంపై ముగిసిన శిక్షణ

నవతెలంగాణ-సిటీబ్యూరో



హైదరాబాద్ నగరంలో భూగర్భ జలాల్ని పెంచేందుకు జలమండలి, ఈపీటీఆర్ఐ, జీహెచ్ఎంసీ సం యుక్తంగా చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణంపై పలు ప్లంబర్లు, మేస్త్రీలకు ఇచ్చిన 3 రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమానికి వాతావరణ శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజ రయ్యారు. శిక్షణ పొందిన వారికి ధృవపత్రాలు అందజేశారు. ఎండీ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో భూగర్భ జలాలు ఎండిపోయిన నేపథ్యంతో వాటిని రీచార్జ్ చేయడానికి జల మండలి పలు చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగం గా ట్యాంకర్లు ఎక్కువగా బుక్ చేసుకున్న 30 వేల మంది ప్రాంగణాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టేలా అవగాహన కల్పించామ న్నారు. ఇందు కోసం 18 ఎన్జీవో సంస్థలకు చెందిన ప్రతినిధులు పని చేస్తున్నారన్నారు. ఇప్పటికే వారు 700 మందిని కలిసి ఇంకుడు గుంతల ప్రాముఖ్యం, నిర్మాణ పద్ధతిని సైతం వివరించినట్లు చెప్పారు. ప్రస్తుతం శిక్షణ పొం దిన వారంతా హైదరాబాద్ నగరంలో ఇంకుడు గుంతలు నిర్మించుకో వాలనుకునే వారికి సాంకేతిక సాయాన్ని అందిస్తారని వెల్లడించారు. ఇంకుడు గుంతల నిర్మాణంపై 150 మంది ప్లంబర్స్, మేస్త్రీలకు 22 నుంచి 3 రోజుల పాటు (22, 24, 25 తేదీల్లో) శిక్షణ కార్యక్ర మాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డైరెక్టర్ వీఎల్. ప్రవీణ్ కుమార్, ఇంకుడు గుంతల ప్రత్యేకాధికారి జాల సత్యనారయణ, ఇతర ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది, అధికారుల రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి



- జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా గురువారం పోలింగ్ సిబ్బంది అధికారుల రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ తెలిపారు. గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి నేతత్వంలో జనరల్, పోలీస్ అబ్జర్వర్ల సమక్షంలో ఎన్నికల సంఘం నిబంధనలు అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా పోలింగ్ సి బ్బంది, అధికారుల రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రి యను పూర్తి చేశారు. జిల్లాలోని సికింద్రాబాద్, హైదరాబాద్ రెండు పార్లమెంట్ నియోజకవర్గా లకు మేడ్చల్ పార్లమెంట్ పరిధిలో ఉన్న కంటోన్మె ంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలకు కేటాయించాల్సిన సిబ్బంది, అధికారుల రెండవ ర్యాండమైజేషన్ ప్ర క్రియ గురించి జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ అబ్జర్వర్లకు వివరిస్తూ, ప్రక్రియ మొత్తాన్ని ఎన్నికల ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో సిపి శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, జిల్లా కలెక్టర్, హైదరాబాద్ రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి, హేమం త్ కేశవ్ పాటిల్, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ జనరల్ అబ్జర్వర్ శ్రీవిద్యా 2010 ఐఏఎస్ బ్యాచ్, సికిం ద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ జనరల్ అబ్జ ర్వర్ డాక్టర్ సరోజ్ కుమార్, 2008 ఐఏఎస్ బ్యాచ్, హైదరాబాద్, సికింద్రాబాద్ నియోజకవర్గాల పోలీ స్ అబ్జర్వర్ శశంక్ ఆనంద్ 2006 ఐ.పి.ఎస్ బ్యాచ్, నోడల్ అధికారులు, పాల్గొన్నారు. కమిషనర్ 179 మద్యం షాపులు వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమరా ద్వారా పరిశీలన సీ-విజిల్, ఎఫ్.ఎస్.టి, యస్ యస్ టి, కమాండ్ కంట్రోల్ ద్వారా పరిశీలన చేస్తున్న విషయాన్ని అబ్జర్వర్‌లకు వివరించారు.

దోమల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

- దోమల వల్లా మలేరియా, డెంగ్యూ వ్యాధులు విజృంభిస్తాయి

నవతెలంగాణ-సిటీబ్యూరో



దోమల నివారణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకుని నిర్మూలన చర్యలు చేపట్టాలని, లేదంటే దోమల వల్లా మలేరియా, డెంగ్యూ వ్యాధులు విజృంభించే అవకాశముందని అడిషనల్ కమిషనర్ రవి కిరణ్ తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవ సందర్భంగా గురువారం బేగంపేట సర్కిల్ వెస్ట్ మారేడ్పల్లి మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ (హెల్త్ అండ్ శానిటేషన్) రవి కిరణ్, జీహెచ్ఎంసీ చీఫ్ ఎంటమాలజీ డాక్టర్ రాంబాబులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ రవి కిరణ్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న మొత్తం ఎంటమాలజీ సిబ్బంది చాలా ఉత్సాహంగా దోమల నిర్మూలన కార్యక్రమంలో తమ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగ్యూ వ్యాధులను అరికట్టడంలో ఎంటమాలజీ సిబ్బంది ప్రధాన భూమికను పోషిస్తున్నారని, అదేవిధంగా ఎన్నికల నిర్వహణలో కూడా ఎంటమాలజీ సిబ్బంది పాత్రను కొనియాడారు. చీఫ్ ఎంటమాలజిస్ట్ డా. రాంబాబు మాట్లాడుతూ 1897వ సంవత్సరంలో డాక్టర్ రోనాల్డ్ రోస్ అనే మిలిటరీ వైద్యుడు ఆడ ఏనాఫిలస్ దోమ ద్వారా మలేరియా వ్యాధి సోకుతుందని వివరించడం జరిగింది. 2008వ సంవత్సరంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ వారి 60వ సమావేశంలో ప్రపంచంలో ఉన్న ప్రతి ఒక్క పౌరుడు మలేరియా వ్యాధిని ఏ విధంగా ఎదుర్కోవాలో అవగాహన కల్పించాలని 2008 ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవం గా గుర్తించడం జరిగిందని తెలిపారు. అదే విధంగా ప్రపంచ మలేరియా దినోత్సవం థీమ్‌లో భాగంగా మరి ంత సమానమైన ప్రపంచం కోసం - మలేరియాపై పోరాటాన్ని వేగవంతం చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వ్యక్తిగతముగా తీసుకోవలసిన చర్యలు, సమాజ పరంగా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బేగంపేట డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, సికింద్రాబాద్ జోన్ సీనియర్ ఎంటమాలజిస్ట్ దుర్గాప్రసాద్, బేగంపేట సర్కిల్ అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ శ్రీనివాస్ రెడ్డి, శానిటరీ సూపర్వైజర్ ధనా గౌడ్, డివిజన్ సూపర్వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



న్యూ నల్లకుంట లింగాలగడ్డలోని సెయింట్ మేరీస్ హైస్కూల్ గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ప్రీ ప్రయిమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే సర్టిఫికెట్లను పాఠశాల నిర్వాహకులు వై.వెంకట్ రెడ్డి, ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, ఇన్ చార్జి ఎం.స్వరూప అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు సునంద, గౌతమి, తబసం, తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేశారు.
నవతెలంగాణ-అంబర్‌పేట

అడవి నుండి మా ఇంటికి







2021లో నుపుర్ పోహార్కర్ ప్రారంభించిన పిరుల్ హస్తకళలు ఉత్తరాఖండ్‌లోని మహిళల జీవితాలను మార్చివేశాయి. వారికి జీవనోపాధిని కల్పిస్తున్నాయి. పైన్ సూదుల నుండి కళాఖండాలను తయారుచేసి తమ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు మంచి ఆదాయాన్ని పొందుతూ సగర్వంగా జీవిస్తున్నారు. ఇంతకీ ఆ పిరుల్ హస్తకళల కథేంటో మనమూ తెలుసుకుందాం...

ఉత్తరాఖండ్‌లోని ఖేతిఖాన్ గ్రామంలోని కొన్ని ప్రాంతాల్లోని ప్రజల జీవితం నెమ్మదిగా కదులుతుంది. అలాంటిది మంజు కోసం ప్రతి రోజూ కొన్ని పనులు ఎదురు చూస్తుంటాయి. తన ఇంటి పనిని పూర్తి చేసిన తర్వాత రోటీ బాక్స్‌లు, ట్రేలు, పెన్ స్టాండ్‌లు మొదలైనవాటిని తయారు చేయడానికి కూర్చుంటుంది. వాటన్నింటినీ ఆమె వారానికి రెండు మూడు సార్లు అడవికి వెళ్ళి సేకరించే పైన్ సూదుల ద్వారా తయారు చేస్తుంది. వీటినే PIRUL హస్తకళలు అంటారు. వీటి ద్వారా ఆమె నెలకు సుమారు రూ.7,000 సంపాదిస్తుంది.

అవకాశాలను ప్రోత్సహించడం

PIRUL హస్తకళలు అనేక ఇతర ఉత్పత్తులతోపాటు ప్లాంటర్‌లు, చెవిపోగులు, సర్వింగ్ ట్రేలు, స్టోర్ బాక్స్‌లను అందిస్తోంది. దీని గృహాలంకరణ ఉత్పత్తులు రూ.1,000 నుండి రూ.3,000 మధ్య, జీవనశైలి ఉత్పత్తులు రూ.1,500 నుండి రూ.1,800 మధ్య ఉంటాయి. అయితే ఫ్యాషన్ వస్తువులు రూ.250 నుండి ప్రారంభమవుతాయి. స్టార్టప్ ఇప్పటి వరకు 20,000 కిలోల పైన్ వ్యర్థాలను అప్‌సైకిల్ చేసింది. ఇది ప్రధానంగా ఇన్‌స్టాగ్రామ్, ఎగ్జిబిషన్‌ల ద్వారా ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు, ముంబైతో పాటు మరికొన్ని ప్రధాన నగరాల్లో 12 ఆఫ్‌లైన్ స్టోర్‌లలో ఉత్పత్తులను విక్రయిస్తుంది. స్థానిక ప్రభుత్వ సంస్థలు, కార్పొరేట్ల నుండి బల్క్ ఆర్డర్‌లను కూడా పొందుతుంది.

పైన్ సూదులతో...

'ఈ ఉత్పత్తుల ద్వారా నేను దాదాపు రూ. 15,000 సంపాదించిన రోజులు ఉన్నాయి. ఈ ఆదాయం నా పిల్లల చదువుకు తోడ్పడుతుంది. అలాగే ఇంటి అద్దె సమయానికి కట్టగలుగుతున్నాను'అని ఆమె చెబుతుంది. 2021లో నుపుర్ పోహార్కర్ స్థాపించిన పిరుల్ హ్యాండీక్రాఫ్ట్‌లో పనిచేస్తున్న 100 మంది మహిళల్లో మంజు కూడా ఉన్నారు. ఇది పైన్ సూదుల నుండి కళాఖండాలను తయారు చేస్తుంది. ఉత్తరాఖండ్ స్థానిక మాండలికంలో 'పిరుల్' అంటే ఉత్పత్తులను తయారు చేయడానికి పైన్ సూదులను ఉపయోగించడం. ఇప్పటి వరకు ఈ స్టార్టప్ సుమారు 8,000 ఉత్పత్తులను విక్రయించింది. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలో పైన్ చెట్లు సమృద్ధిగా ఉన్నాయి. ఈ చెట్ల నుండి రెసిన్ అధికంగా ఉండే అత్యంత మండే సూదులు అటవి నేలపై పడిపోతాయి. తర్వాత ఇవి నెమ్మదిగా కుళ్ళిపోయి నీటి ఉపరితల ప్రవాహాన్ని పెంచడానికి, భూగర్భజల పట్టికను తగ్గించడానికి సమకరిస్తాయి. 'పిరుల్ హ్యాండీక్రాఫ్ట్‌లో మేము పైన్ వ్యర్థాలను వివిధ ఉత్పత్తుల్లోకి మార్చడమే కాకుండా జీవనోపాధి అవకాశాలను అందించడం ద్వారా మహిళలకు సాధికారత కల్పించడానికి ప్రయత్నిస్తాము' అని నుపుర్ చెప్పారు.

సమస్యను పరిష్కరించడానికి

సమాజానికి సేవ చేస్తున్న తండ్రిని చూస్తూ పెరిగిన నుపుర్ వెటర్నరీ డిగ్రీని పూర్తి చేసిన తర్వాత సోషల్ డెవలప్‌మెంట్ సెక్టార్‌లో చేరాలనే ఆమె 'అంతర్గత పిలుపు'ని అనుసరించింది. ఎస్‌బీఐ ఫౌండేషన్ వారి వైఎస్ఎఫ్ ఫెలోషిప్ ప్రోగ్రామ్ గురించి తెలుసుకుని అందులో చేరింది. త్వరలో ఉత్తరాఖండ్‌లోని ఖేతిఖాన్‌లో స్థిరమైన జీవనోపాధి, అభివృద్ధి కోసం బీఏఐఎఫ్ ఇన్‌స్టిట్యూట్‌తో కలిసి పనిచేయడం ప్రారంభించింది. ప్రతిచోటా పైన్ అడవులతో కంటికి కనిపించేంత వరకు పైన్ సూదుల కారణంగా అడవిలో మంటలు వ్యాపించాయి. అది పశువుల గడ్డిని కాల్చివేసేది. పైన్ వ్యర్థాల వల్ల సంభవించే అడవి మంటల సమస్యను పరిష్కరించడానికి ఏం చేయాలనే ఆలోచన ఆమెకు వచ్చింది. ఇంతలో వ్యవసాయం, పశువుల పెంపకం, ఇంటి పనుల బాధ్యత పూర్తిగా మహిళల భుజాలపై పడటం గమనించింది. పురుషులేమో మెరుగైన ఆదాయ అవకాశాల కోసం వలస వస్తున్నారు. అయితే పంటల విధానంలో మార్పు, అస్థిర వర్షపాతం, అడవి పందుల బెడద వల్ల మహిళలకు వ్యవసాయం ద్వారా వచ్చే ఆదాయం అంతంత మాత్రంగానే ఉంది.

మహిళలను ఒప్పించేందుకు

ఉత్తరాఖండ్‌లో తన ఫెలోషిప్ సమయంలో ఓ ఏడాది పాటు పైన్ సూదులతో ఉత్పత్తులను తయారు చేయడానికి మహిళలను ఒప్పించేందుకు ప్రయత్నించింది. మొదట చాలా మంది ఆమెను పట్టించుకోలేదు. 'చాలా మంది పైన్ సూదులను తీయడానికి సిగ్గుపడ్డారు. ఎందుకంటే వారు దానిని వ్యర్థంగా భావించారు' ఆమె గుర్తుచేసుకుంది. ఒక దృఢ నిశ్చయంతో నుపుర్ గ్రామాన్ని సందర్శించింది. ఆమె స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శిస్తూ మహిళలతో వ్యక్తిగత సంబంధాలను ఏర్పరచుకోవడానికి ప్రయత్నించింది. చివరికి యువతులు ఈ ఆలోచనపై ఆసక్తి కనబరిచారు. రెండు నెలల్లో PIRUL హస్తకళలు ఆర్డర్‌లను పొందడం ప్రారంభించాయి. 2021లో నలుగురు మహిళలతో ప్రారంభమైన ఈ స్టార్టప్‌లో నుపుర్ చెల్లెలు శర్వరి కూడా చేరారు. అదే ఏడాది పైన్ సూదులతో రాఖీలను తయారు చేయడం ప్రారంభించారు. ఇది ప్రజాదరణ పొందింది. ఇది ఫార్మా కంపెనీ Virbac యానిమల్ హెల్త్ నుండి 5,000 టీ కోస్టర్ సెట్‌ల కోసం కార్పొరేట్ ఆర్డర్‌ను కూడా అందుకుంది.



పరిమిత రవాణా వల్ల

PIRUL హస్తకళలు నేపాల్ సరిహద్దు, అల్మోరా జిల్లా సమీపంలోని ఖేతిఖాన్, ఇతర మారుమూల గ్రామాలకు చెందిన మహిళలతో కలిసి పనిచేస్తాయి. ఇది మహిళలకు దారాలు వంటి ఉపకరణాలను పంపిణీ చేస్తుంది. మహిళలు అడవి నుండి పైన్ సూదులను సేకరిస్తారు. 'పరిమిత రవాణా వల్ల ఉపకరణాలను అందించడానికి, తుది ఉత్పత్తులను సేకరించడానికి ఈ మారుమూల గ్రామాలకు ప్రయాణించడం ఒక ముఖ్యమైన సవాలు. దీని వల్ల సమయం, డబ్బు కాస్త ఎక్కువ ఖర్చు అవుతుంది'ఆమె జతచేస్తుంది.


మరెన్నో గ్రామాలలో...

ఖేతీఖాన్ గ్రామానికి చెందిన కిరణ్ గత రెండేండ్లుగా ఆ సంస్థలో పనిచేస్తుంది. ఇంతకుముందు గృహిణిగా ఉన్న ఆమె ఇప్పుడు నెలకు రూ.7,000 నుంచి రూ.8000 వరకు సంపాదిస్తోంది. 'నేను నా ఇంటి పనులు చేసుకుని ఈ పనిలో కూర్చుంటాను. మంచి ఆదాయాన్ని సంపాదిస్తూ నా సమయం వృధా కాకుండా చూసుకుంటున్నాను. అడవి నుండి మా ఇంటికి ఆదాయాన్ని తెచ్చుకుంటున్నాను' ఆమె చెప్పింది. 'మేము మా మార్కెటింగ్ ప్రయత్నాలను మెరుగుపరచడానికి, మా సంస్థను పెంచడానికి సహయోగ్ గ్రాంట్‌ను ఉపయోగిస్తాము. ఉత్తరాఖండ్‌లోని కొండల్లోని మరెన్నో గ్రామాలలో మా వ్యాపార నమూనాను ప్రతిబింబించడం, జీవనోపాధి అవకాశాలతో స్థానికులకు సాధికారత కల్పించడం ద్వారా ఇది మరింత ప్రభావం చూపుతుంది' అని నుపుర్ చెప్పింది. ■

సమాజం కోసం పని చేయాలని

నాగ్‌పూర్‌కు చెందిన నుపుర్ పోహార్కర్‌కు సమాజం కోసం పని చేయాలనే కోరిక బలంగా ఉండేది. తండ్రి డాక్టర్ అజయ్ వెటర్నరీ డాక్టర్. నక్సల్స్ కార్యకలాపాలతో కొట్టుమిట్టాడుతున్న మహారాష్ట్రలోని ఓ మారుమూల గ్రామానికి తన తండ్రి బదిలీ అయినప్పుడు అక్కడి పరిస్థితులు ఆమెను కలచివేశాయి. కరెంటు, తాగునీటికి అక్కడి ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవారని ఆమె గుర్తుచేసుకుంది. గ్రామస్తులను చైతన్యవంతం చేసి, వారికి పశువుల పెంపకంలో శిక్షణ ఇప్పించి, వారికి ప్రభుత్వ రాయితీలు ఇప్పించే బాధ్యతను అజయ్ తీసుకున్నారు. ప్రస్తుతం అతను నాగ్‌పూర్‌లో జంతు సంరక్షణ కోసం ఓ సంస్థ నడుపుతున్నాడు.

మోడీ పాలనలో పెరిగిన తాళి తాకట్లు



న్యూఢిల్లీ : హిందూ సమాజంలోనే...రోజువారీ వేతనాలు తెచ్చుకుంటున్న వారి నుండి సంపన్నుల వరకూ... బంగారు ఆభరణాల బదిలీ ఎక్కువగా జరుగుతుంటుంది. రిజర్వ్‌బ్యాంక్ వద్ద ఉన్న సమాచారం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది. కుటుంబ అవసరాల కోసం అనేక మంది మహిళలు తమ వద్ద ఉన్న బంగారు ఆభరణాలను బ్యాంకులలో తాకట్టు పెట్టి రుణాలు తీసుకుంటారు.

ముఖ్యంగా కోవిడ్ తర్వాత ఈ ధోరణి అధికంగా కన్పిస్తోంది. ఉద్యోగాలు పోవడం, ఆదాయాలు లేకపోవడంతో అనేక పేద, మధ్య తరగతి కుటుంబాలు విధిలేని పరిస్థితులలో బంగారు ఆభరణాలను బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల వద్ద తాకట్టు పెట్టి డబ్బు తీసుకుంటున్నాయి. 2020 సెప్టెంబర్, 2021 సెప్టెంబర్ మధ్యకాలంలో బంగారు ఆభరణాలపై తీసుకున్న రుణాల సంఖ్య సుమారు 60 శాతం పెరిగిందని ఆర్‌బీఐ లెక్కలు చెబుతున్నాయి. మరో మాటలో చెప్పాలంటే రుణాలు రూ.40,080 కోట్ల నుండి రూ.63,770 కోట్లకు పెరిగాయి.

కోవిడ్ తర్వాత...

మోడీ ప్రభుత్వం సామాన్య కార్మిక కుటుంబాల చేతిలో చాలినంత డబ్బు ఉంచకపోవడమే దీనికి ప్రధాన కారణం. వ్యాపారాలకు భారీగా రుణ రాయితీలు అందించడం పైనే ప్రభుత్వం దృష్టి సారించింది తప్ప సామాన్యుల బాధలు పట్టించుకోలేదు. బంగారాన్ని తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవడం గతంలో కూడా జరిగిందే. కానీ కోవిడ్ తర్వాత ఆ తరహా రుణాలు భారీగా పెరిగాయి. జనాభాలో చివరి 70 శాతం ప్రజల ఆదాయాలు పెరగకపోవడం, స్థిరంగా ఉండడమే దీనికి కారణం. 2017-18, 2022-23 మధ్యకాలంలో నెలసరి, దినసరి ఆదాయం పొందే వారి వాస్తవ వేతనాలు తగ్గాయని ప్రభుత్వ పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) చెబుతోంది. కుటుంబాల రుణభారం పెరగడం, పొదుపు తగ్గిపోవడంపై ఆర్‌బీఐ ఆందోళన వ్యక్తం చేసిన సమయంలోనే బంగారంపై తీసుకున్న రుణాల సంఖ్య పెరగడం ఆశ్చర్యాన్ని కలిగించలేదు.

కాబట్టి మంగళసూత్రాల బదిలీ ప్రభుత్వ విధానాలలో మార్పుల కారణంగా జరిగినదే. పెద్ద నోట్ల రద్దు, కోవిడ్ వంటి పరిణామాల సమయంలో ప్రభుత్వం సమర్థవంతంగా వ్యవహరించలేకపోవడం కూడా ఈ పరిస్థితికి కారణమైంది. కోవిడ్ సమయంలో కుటుంబాల రుణభారం గరిష్ట స్థాయికి చేరింది. ఆదాయ అసమానతలు పెరిగిపోయాయి. అదే కాలంలో గ్రామీణ వేతనాలు, వినియోగం స్థిరంగా ఉండిపోయాయి.

ఆర్‌బీఐ ఆందోళన

పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ విధింపు కారణంగా పరిస్థితి మరింత దిగజారింది. వినియోగ పన్నుల్లో 65 శాతం వాటా కలిగిన కార్మిక వర్గంపై జీఎస్టీ రేట్లు ప్రతికూల ప్రభావం చూపాయి. కార్మికుల వేతనాలు స్థిరంగా ఉండడంతో బంగారు ఆభరణాలపై రుణాలు తీసుకోవడం ఎక్కువైంది. బంగారాన్ని తాకట్టు పెట్టి తీసుకునే రుణాలను నిశితంగా పరిశీలించాలంటూ ఆర్‌బీఐ ఇటీవల బ్యాంకులు, బ్యాంకింగ్ యేతర ఆర్థిక సంస్థలకు సూచించింది. ఎందుకంటే గత ఏడెనిమిది సంవత్సరాల కాలంలో బంగారు ఆభరణాలపై తీసుకున్న రుణాలు అనేక రెట్లు పెరిగాయి. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే కుటుంబాల రుణభారం మరింత పెరుగుతుందని, పొదుపు తగ్గిపోతుందని, అభివృద్ధిపై, వినియోగంపై ప్రభావం పడుతుందని ఆర్‌బీఐ అభిప్రాయపడుతోంది.

విధిలేని పరిస్థితులలో...

హిందూ సంప్రదాయంలో మంగళసూత్రానికి సెంటిమెంట్ పరంగా ఎంతో ప్రాధాన్యత ఉంది. అలాంటి మంగళసూత్రాలను మహిళలు బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల వద్ద తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించలేకపోవడంతో భూమి లేదా ఇంటిని వడ్డీ వ్యాపారులు స్వాధీనం చేసుకుంటున్న సందర్భాలు అనేకం. దానిని నివారించడానికి ఎంతో పవిత్రంగా భావించే మంగళసూత్రాన్ని సైతం కుదువ పెట్టాల్సి వస్తోంది. కాంగ్రెస్‌ను ఆడిపోసుకోవడానికి బదులు ప్రధాని మోడీ ఈ విషయంపై దృష్టి సారిస్తే మంచిదేమో.

మోడీ సెల్ఫ్ గోల్

మంగళసూత్రాల విషయాన్ని అటుంచితే వారసత్వ పన్నుపై కాంగ్రెస్‌ను విమర్శించిన మోడీ సెల్ఫ్ గోల్ చేసుకున్నారు. ఎందుకంటే ఈ పన్ను విధింపుపై గతంలో పరిశీలించింది ఆయన ప్రభుత్వమే. ఆదాయ పంపిణీ గురించి కూడా మోడీ తన ఎన్నికల ప్రచార సభలలో ప్రస్తావిస్తున్నారు. తొలి దశ పోలింగ్‌లో తక్కువ ఓటింగ్ నమోదు కావడంతో కలత చెందిన కమలదళం, ఇప్పుడు హిందూత్వ కార్డును బయటికి తీసి ఓటర్లను పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు రప్పించే ప్రయత్నం చేస్తోంది.

కామ్రేడ్ల సహకారంతో భారీ మెజార్టీ

- ఖమ్మంలో రఘురాంరెడ్డి గెలుపునకు సమష్టి కృషి : మంత్రి తుమ్మల
- లౌకిక పార్టీలతోనే దేశ భవితవ్యం : పొంగులేటి
- మోడీ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం : రాజ్యసభ ఎంపీ రేణుకాచౌదరి
- 'ఇండియా' లో భాగంగా కాంగ్రెస్‌కు మద్దతు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని
- సిద్ధాంత ప్రాతిపదికన కాంగ్రెస్‌తో కూటమి: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
- రాముడు.. బీజేపీ ఒక్క పార్టీకే దేవుడే కాదు : ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి
- కాంగ్రెస్, వామపక్షాల ర్యాలీగా రఘురాంరెడ్డి నామినేషన్



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

వామపక్షాల సహకారంతో అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన మెజార్టీ కంటే కాంగ్రెస్ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అధిక మెజార్టీతో గెలిపిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టుల సమష్టి కృషితో ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలతో పాటు రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాల్లో విజయం సాధిస్తామన్నారు. గురువారం ఖమ్మం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘురాంరెడ్డి (ఆర్ఆర్ఆర్) నామినేషన్ అనంతరం కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు, వామపక్ష నేతలతో కలిసి మంత్రి తుమ్మల మాట్లాడారు. జిల్లా పార్టీ అభిప్రాయ సేకరణ తర్వాతే రఘురాంరెడ్డిని అభ్యర్థిగా ఎంపిక చేశారని తెలిపారు. జిల్లా ప్రజల మనోభావాలకు తగినట్టుగా రఘురాంరెడ్డి ఎంపీగా విజయం సాధించి.. ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. సెక్యులర్ పార్టీలతోనే దేశ భవితవ్యమని అన్నారు. రఘురాంరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలకు పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. ఈ దేశాన్ని గాడిలో పెట్టాలంటే సెక్యులర్ పార్టీలతోనే సాధ్యమన్నారు. రఘురాంరెడ్డి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యసభ ఎంపీ రేణుకా చౌదరి మాట్లాడుతూ.. మోడీ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలు వస్తున్నాయంటే ఈడీని ప్రతిపక్షాల ఇండ్ల మీదకు ఉసిగొల్పుతున్నారని అన్నారు.

ప్రజాస్వామ్యం గుడిలోకి రాక్షసులు : ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాస్వామ్యమనే గుడిలోకి రాక్షసులు చొరబడ్డారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మహిళలను కించపరిచేలా మాట్లాడినా.. మతం పేరుతో వ్యాఖ్యలు చేసినా.. జేబుసంస్థగా మారిన ఈసీ మోడీపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్ పదేండ్ల విధ్వంసాన్ని సాగనంపినట్టుగానే ఎన్డీఏను సైతం దేశం నుంచి తరిమివేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు జరిగిన వందకు పైగా పార్లమెంట్ సీట్లకు ఎన్నికలు పూర్తవగా.. బీజేపీకి మెజార్టీ రాదని సర్వేలు చెబుతున్నాయన్నారు. అబద్ధాలు చెప్పే ప్రధాని.. రాముని పేరు చెప్పి దోఖా చేస్తున్నారని అన్నారు. సిద్ధాంత ప్రాతిపదికన కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిశారని తెలిపారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్, కమ్యూనిస్టుల ఖిల్లా అని తెలిపారు.

ఇండియా కూటమిలో భాగంగా మద్దతు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని

బీజేపీ మతోన్మాద, ఫాసిస్టు, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఏర్పడిన ఇండియా కూటమిలో భాగంగానే కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నట్టు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు తెలిపారు. భువనగిరి పార్లమెంట్ స్థానం మినహా అన్ని చోట్ల సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు చెప్పారు. ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపికైన రఘురాంరెడ్డికి అభినందనలు తెలిపారు.

నేనూ ఖమ్మం జిల్లా వాసినే..: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం

తానూ ఖమ్మం జిల్లా వాసినేనని,.. తన బాల్యమంతా కూసుమంచి మండలం చేగొమ్మలో సాగిందని, అక్కడి తమ భూములు పేదలకు పంపిణీ చేశామని, ఒకప్పుడు తమ ఇంటి స్థలం, ఇంటిని అక్కడి ప్రభుత్వ పాఠశాలకు ఇచ్చినట్టు కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. రాముడు.. బీజేపీ ఒక్క పార్టీకే దేవుడే కాదని, అందరివాడని అన్నారు. బీజేపీ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నిలుపుకోలేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రయివేటు వ్యక్తులకు అప్పగిస్తోందని, చివరకు డిఫెన్స్‌ఫోర్స్‌ను సైతం కాంట్రాక్టుకు ఇచ్చే పద్ధతి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకిప్పుడు 63 ఏండ్లని, తన పిల్లలు సెటిల్ అయ్యారని, ఈ వయసులో ప్రజా సేవ చేయడమే తన పని అని అంటూ మాటలు కాదు చేతల్లో తానేంటో చూపిస్తానని తెలిపారు. నామినేషన్‌కు ముందు స్థానిక కాల్వొడ్డు నుంచి వైరా రోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకు కార్లు, ఆటోలతో వందలాది మంది ర్యాలీగా తరలివచ్చారు. కాల్వొడ్డులో కాంగ్రెస్ శ్రేణులతో సీపీఐ(ఎం), సీపీఐ నేతలు, కార్యకర్తలు ర్యాలీని స్వాగతించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాళోత్ రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, జారె ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంత్‌రావు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎండీ జావీద్, నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, తుంబూరు దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పుడే వెనక్కి తగ్గుతాం..

- రెండు దేశాల ఏర్పాటు పరిష్కారాన్ని అమలు చేస్తే ఆయుధాలు విడనాడుతాం : హమాస్ అధికారి

ఇస్తాంబుల్ : 1967కి ముందునాటి సరిహద్దులతో స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పడినట్టైతే తాము ఆయుధాలు విడనాడి రాజకీయ పార్టీగా మారతామని హమాస్ వ్యాఖ్యానించింది. హమాస్ ఉన్నతాధికారి ఖలీల్ అల్ హయ్యా బుధవారం మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. గాజాలో ప్రస్తుతం యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో నెలల తరబడి కాల్పుల విరమణ చర్చల్లో ప్రతిష్టంభన నెలకొన్న తరుణంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. రెండు దేశాల ఏర్పాటు పరిష్కారమన్న షరతు గనక నెరవేరినట్టైతే ఇజ్రాయిల్‌తో ఐదేళ్ళు అంతకుమించి ఒప్పందం కుదుర్చుకోవడానికి, రాజకీయ పార్టీగా మారడానికి సుముఖంగా వున్నామని చెప్పారు. తాజా చర్చల్లో ప్రతిష్టంభన నెలకొన్న సమయంలో ఈ ప్రతిపాదన వచ్చింది. అయితే హమాస్‌ను తుదకంటా నిర్మూలించాలనే లక్ష్యంతో వున్న ఇజ్రాయిల్ ఈ ప్రతిపాదనను పరిశీలించే అవకాశాలు కూడా కనిపించడం లేదు. స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పాటును ఇజ్రాయి ల్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రస్తుతం కాల్పుల విరమణకు, బందీల మార్పిడి కోసం జరుగుతున్న చర్చల్లో పాలస్తీనాకు ఖలీల్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గాజా, వెస్ట్ బ్యాంక్‌లకు ఐక్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే లక్ష్యంతో ప్రత్యర్థి ఫతా వర్గం నేతృత్వంలోని పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్‌తో హమాస్ చేతులు కలపాలని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రెండూ ఒకటే

నవతెలంగాణ - సిద్దిపేట

కాళేశ్వరం, ఇతర పథకాల్లో అవినీతి జరిగితే కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకటేనని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. గురువారం సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన బీజేపీ విశాల జనసభ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పదేండ్ల పాలనలో మోడీ ఎన్నో సమస్యలను పరిష్కరించారని అన్నారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం కోసం మోడీ కేసులు గెలిచి గుడిని ప్రారంభించారని తెలిపారు. మెదక్ నుంచి రఘునందన్ రావును గెలిపించాలని, మూడోసారి మోడీని ప్రధానమంత్రిని చేద్దామని అన్నారు. తెలంగాణలో బీజేపీని కనీసం 12 లోక్‌సభ స్థానాల్లో గెలిపించాలని కోరారు. తెలంగాణలో విమోచన దినోత్సవం నిర్వహించడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మజ్లిస్ పార్టీకి భయపడు తున్నాయని, బీజేపీ వచ్చాక సెప్టెంబర్ 17న తప్పకుండా నిర్వహి స్తామని చెప్పారు. మోడీ ప్రధాని అయితేనే తెలంగాణలో అవినీతి అంతమవుతుందన్నారు. కార్యక్రమంలో మెదక్, మల్కా జిగిరి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థులు రఘునందన్ రావు, ఈటల రాజేం దర్, బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రేమేందర్ రెడ్డి, ఆకుల విజయ, బీజేపీ సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు మోహన్ రెడ్డి, గడ్డం శ్రీనివాస్, గోదావరి నాయకులు పాల్గొన్నారు.

సహారా ఇండియా పేమెంట్స్ చెల్లించాలంటూ.. కార్మికుల ప్లకార్డుల ప్రదర్శన

సహారా ఇండియాలో పాలసీలు చేసిన ప్రజలకు సెటిల్మెంట్ ద్వారా డబ్బులు అందించడానికి కృషి చేయాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ఏజెంట్లు, పాలసీదారులు ప్లకార్డులను ప్రదర్శించి కోరారు. సిద్దిపేటలో గురువారం జరిగిన బీజేపీ విశాల జనసభ బహిరంగ సభలో అమిత్‌షా మాట్లాడుతుండగా ఆర్మూర్, నిజాంబాద్, కామారెడ్డి, మెట్ పల్లి, సిద్దిపేట, నిర్మల్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన సహారా ఇండియా ఏజెంట్లు, బాధితులు ప్లకార్డులను ప్రదర్శించారు. అక్కడే ఉన్న పోలీసులు, బీజేపీ నాయకులు వారిని వారించి కూర్చోబెట్టారు.

ఓటర్లను రాజకీయ కూలీలుగా మారుస్తున్న పార్టీలు

సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండీ జహంగీర్



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండీ జహంగీర్

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ప్రస్తుత ఎన్నికల్లో పాలక పార్టీలు ఓటర్లను రాజకీయ కూలీలుగా మారుస్తున్నాయని సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండి జహంగీర్ అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలను కులాల పేరుతో, మతాల పేరుతో విభజిస్తూ బీజేపీ కేంద్రంలో పాలన చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువేమీ కాదని, అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. ఎన్నికలలో కోట్ల రూపాయలు కుమ్మరించి.. కులాల్ని మతాల్ని వాడుకొని రాజకీయ లబ్ది పొందేందుకు యత్నిస్తున్నాయని అన్నారు. అమాయక ప్రజలను డబ్బులు, మద్యంతో ప్రలోభపెట్టి.. మభ్యపెట్టి మాయ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భువనగిరి పార్లమెంట్ చరిత్రలో మూడుసార్లు ఎన్నికలు జరగ్గా, 2 సార్లు కోమటిరెడ్డి బ్రదర్స్ ఎన్నికయ్యారని, ఆలేరు రెవెన్యూ డివిజన్, గందమల్ల రిజర్వాయర్, ఆలేరు వంద పడకల ఆస్పత్రి ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. బీజేపీలో నిలబడ్డాయన.. బీఆర్ఎస్ నుంచి వచ్చి, పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి చేసింది ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. గీత కార్మికులను పట్టించుకోలేదన్నారు. కల్లు గీత, పారిశ్రామిక కార్మికులకు మద్దతు తెలుపలేదని, మందలించలేదని చెప్పారు. కులమతాల పేరుతో ఓట్లు అడగడానికి వస్తున్న వారిని నిలదీయాలన్నారు. ఆ అభ్యర్థుల వద్ద డబ్బు తప్ప ప్రజాసేవ లేదని, కమ్యూనిస్టుల వద్ద డబ్బు లేదు.. కానీ ప్రజలకు సేవ చేసే అన్ని అర్హతలున్నాయని చెప్పారు. ప్రజలందరూ మమ్మల్ని ఆశీర్వదించి, సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. అవకాశవాదులను ఓడించాలని నినాదాలు చేశారు. అనంతరం మండలంలోని పటేల్ గూడెం, శ్రీనివాసపురం, గుండ్ల గూడెం, తూర్పు గూడెం, గోలనుకొండ, శర్బనాపురం గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేశారు. పట్టణ కార్యదర్శి ఎక్బాల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, నాయకులు ఎక్బాల్, ధూపటి వెంకటేష్, మొరిగాడి రమేష్, గనగాని మల్లేష్, తాళ్లపల్లి గణేష్, మొరిగాడి మహేష్, జూకంటి పౌల్, ఉస్మాన్ షరీఫ్, నరసింహ, కాసుల నరేష్, మొరిగాడి అశోక్, మొరిగాడు అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మళ్లీ వస్తే రిజర్వేషన్లుండవు...

అందుకే 400 సీట్లు అడుగుతోంది

- ఆర్ఎస్ఎస్ విధానాన్నే ఆ పార్టీ అమలు చేస్తుంది
- ఈ ఎన్నికలు రిజర్వేషన్ల కొనసాగింపుపై రిఫరెండం
- ఓబీసీలకు రిజర్వేషన్లు ఇస్తామంటే బీజేపీకి భయం పట్టుకుంది
- నాడు మండల్ అంటే కమండల్ అన్నది
- రిజర్వేషన్లు కావాలనే నేతలు బీజేపీకి ఎందుకు మద్దతు ఇస్తున్నారో చెప్పాలి
- దేశాన్ని ఎక్స్‌రే తీస్తాం...వారి వాటా వారికిస్తాం... : బీజేపీపై చార్జిషీట్ విడుదల కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు





నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు రద్దు చేసేందుకు కుట్ర చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. లోక్‌సభలో 400 సీట్ల భారీ మెజార్టీ సాధించడం ద్వారా రిజర్వేషన్లు రద్దు చేసే ఆలోచనతో ఉందని చెప్పారు. రిజర్వేషన్లు కొనసాగించా లనేది కాంగ్రెస్ నిర్ణయమనీ, దాన్ని అడ్డుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. రిజర్వేషన్లు కొనసాగించాలా? వద్దా? అనేది ఈ ఎన్నికల్లో రిఫరెండం అని తెలిపారు. తమ పార్టీ ఓబీసీలకు రిజర్వేషన్లు ఇస్తామంటే బీజేపీకి భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో 'నయవంచన- పదేండ్ల మోసం...వందేండ్ల విధ్వంసం' అంటూ బీజేపీపై నాలుగు పేజీల చార్జీషీట్‌ను రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీ, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, జగ్గారెడ్డి, నాయకులు జి నిరంజన్‌తో కలిసి సీఎం రేవంత్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన చేపట్టి దేశాన్ని ఎక్స్‌రే తీస్తామంటూ రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రిజర్వేషన్ల వర్గీకరణ కోరుకునే కొంత మంది నేతలు బీజేపికి ఎందుకు మద్దతు ఇస్తున్నారో, వారికి ఓటు వేయాలని ఎందుకు కోరుతున్నారో అర్థం కావడం లేదంటూ మందకృష్ణనుద్దేశించి పరోక్షంగా చురకలంటించారు. తాత్కాలిక ప్రయోజనాల కోసం బీజేపీ వైపు నిలబడొద్దని హితవు పలికారు. ఆర్ఎస్ఎస్ భావజాలం, బీజేపీ విధానం రిజర్వేషన్లు రద్దు చేయడమేనన్నారు. ఆర్ఎస్ఎస్ ఆలోచనను దేశంపై రుద్దేందుకు ఆ పార్టీ కుట్ర చేస్తోందని విమర్శించారు. వందేండ్లలో రిజర్వేషన్లు రద్దు చేస్తామంటూ ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించిన రోజే నిర్ణయించుకుందని తెలిపారు. తమకు మెజార్టీ వస్తే రిజర్వేషన్లు తీసేయడం సులభమవుతుందనే ఉద్దేశంతోనే మోడీ 400 సీట్లు అడుగుతున్నారని ఆరోపించారు. ఆయన దేశాన్ని మోసం చేశారని విమర్శించారు. డబుల్ ఇంజిన్ అంటే అదానీ, ప్రధాని అంటూ ఎద్దేవా చేశారు. పదేండ్లలో కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందని విమర్శించారు.

రిజర్వేషన్లు కావాలంటే కాంగ్రెస్‌కు ఓటేయాలి

ఓబీసీ రిజర్వేషన్లు 27 శాతాన్ని 50 శాతానికి పెంచుతామంటూ రాహుల్‌గాంధీ ప్రకటించడంతో బీజేపీకి వెన్నులో వణుకు మొదలైందని చెప్పారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచుతామని ఆయన హామీ ఇచ్చారని వివరించారు. మండల్ ఉద్యమానికి వ్యతిరేకంగా బీజేపీ కమండల్ ఉద్యమాన్ని తెచ్చిందని గుర్తు చేశారు. బీజేపీకి వేసే ప్రతి ఓటు రిజర్వేషన్లు తీసేయడానికి ఉపయోగపడుతుందని హెచ్చరించారు. రిజర్వేషన్లు ఉండాలనుకునే వాళ్లు కాంగ్రెస్‌కు ఓటేయాలనీ, వద్దు అనేవాళ్ళు బీజేపీకి ఓటేయాలని రేవంత్ సూచించారు. కాంగ్రెస్‌పై విష ప్రచారం చేసి ఎలాగైనా గెలిచి రిజర్వేషన్లు రద్దు చేయాలని మోడీ చూస్తున్నారని విమర్శించారు.

మోడీ చేసిన అప్పులే ఎక్కువ..

దేశంలో గత 14 మంది ప్రధానుల కంటే మోడీ చేసిన అప్పులే ఎక్కువ అని రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. పదేండ్లలో రూ.113 లక్షల కోట్ల అప్పులు తెచ్చి దేశాన్ని తాకట్టు పెట్టారని ఆరోపించారు. దేశ ప్రజలపై రూ. 168 లక్షల కోట్ల అప్పుల భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేండ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని వాగ్దానం చేశారు. కేవలం ఏడు లక్షల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారన్నారు. మోడీ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకమన్నారు. రైతుల పోరాటంతో నల్ల చట్టాలను వెనక్కి తీసుకున్న ప్రధాని...పార్లమెంటు సాక్షిగా అన్నదాతలకు క్షమాపణ చెప్పారని గుర్తు చేశారు. బీజేపీ ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తోందన్నారు. చేనేత నుంచి కుటీర పరిశ్రమ వరకు జీఎస్టీ పేరుతో దోపిడీకి పాల్పడుతోందన్నారు. అగ్గిపెట్టె, సబ్బు బిళ్ల కాదేదీ కవితకనర్హం అన్నట్టు చివరకు అగర్‌బత్తీలపై కూడా జీఎస్టీ వేసిందన్నారు. 60 ఏండ్లలో కాంగ్రెస్ కూడబెట్టిన ఆస్తులను మోడీ పదేండ్లలో కార్పొరేట్లకు కట్టబెట్టారని విమర్శించారు. విదేశాల నుంచి నల్లధనం తెస్తానన్న ప్రధాని పది పైసలు కూడా తేలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.పెట్రోల్ ధర రూ. 55 నుంచి రూ.110 వరకు పెరిగిందన్నారు. జీఎస్టీ పేరుతో మోడీ దోపిడీ చేశారని విమర్శించారు. చిన్న పిల్లల పెన్సిల్, రబ్బర్‌లపై కూడా జీఎస్టీ వేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రహదారులు అన్నింటినీ కార్పొరేట్ కంపెనీలకు అమ్మేశారన్నారు.

రాజకీయ వ్యాపారస్తులను ఓడించాలి..

- ప్రజా నాయకుడు సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలి : కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు
- చౌటుప్పల్‌లో ఇంటింటి ప్రచారం



నవతెలంగాణ- చౌటుప్పల్ రూరల్

రాజకీయ వ్యాపారస్తులను ఓడించాలి.. నిత్యం ప్రజల కోసం పనిచేసే ప్రజా నాయకుడు సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి.జహంగీర్ సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ గురువారం యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్ 35 ఏండ్ల నుంచి అనేక ప్రజాఉద్యమాల్లో పని చేశారన్నారు. మూసీ నదిని ప్రక్షాళన చేసి భువనగిరి నియోజకవర్గ ప్రజలను కాలుష్యం బారి నుంచి కాపాడాలని, పంటలు, ఆహార ధాన్యాలు, తాగునీరు కలుషితం కాకుండా చూడాలని పాదయాత్రలు, పోరాటాలు చేశారన్నారు. ఈసారి ఎన్నికల్లో అవకాశవాద కాంగ్రెస్‌ను, మతోన్మాద బీజేపీని, ఏర్పాటువాద బీఆర్ఎస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. ఒక్కసారి సీపీఐ(ఎం)కు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, మున్సిపాలిటీ కార్యదర్శి బండారు నర్సింహ, నాయకులు గోశిక కర్నాకర్, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బాలరాజు, బి.నర్సింహ, వెంకటేశం దొడ్ల అండాలు, నాగలక్ష్మి దొడ్ల శంకరయ్య, భిక్షంబాబు పాల్గొన్నారు.

పెద్దపల్లి బీజేపీలో కుమ్ములాట

- గుజ్జుల వర్సెస్ దుగ్యాల అనుచరుల మధ్య ఘర్షణ

నవతెలంగాణ - పెద్దపల్లి



బీజేపీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ నామినేషన్ సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఘర్షణకు దిగారు. పెద్దపల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి జెండా చౌరస్తా వరకు చేపట్టిన ర్యాలీలో గుజ్జుల రామకృష్ణారెడ్డి అనుచరులు, దుగ్యాల ప్రదీప్‌రావు అనుచరులకు మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. బీజేపీ జిల్లా అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్‌రెడ్డిపై గుజ్జుల రామకృష్ణారెడ్డి అనుచరులు దాడికి యత్నించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి కార్యకర్తలను అడ్డుకోవడంతో గొడవ సద్దుమణిగింది.

ఆటలు



బెంగళూర్ మురిసింది



- సన్‌రైజర్స్‌పై 35 పరుగులతో గెలుపు
- విరాట్ కోహ్లి, రజత్ అర్ధ సెంచరీలు
- బెంగళూర్ 206/7, హైదరాబాద్ 171/8

అతిథ్య జట్టుకు ఉప్పల్‌లో చుక్కెదురైంది. 207 పరుగుల ఛేదనలో సన్‌రైజర్స్ హైదరాబాద్ చతికిల పడింది. ట్రావిశ్ హెడ్ (1), హెన్రిచ్ క్లాసెన్ (7), ఎడెన్ మార్‌క్రామ్ (7) వైఫల్యంతో ఛేదనలో హైదరాబాద్ నిరాశపరిచింది. పేసర్లు, స్పిన్నర్లు రాణించటంతో బెంగళూర్ సీజన్లో రెండో విజయం నమోదు చేసింది. విరాట్ కోహ్లి (51), రజత్ పాటిదార్ (50) అర్ధ సెంచరీలకు తోడు కామెరూన్ గ్రీన్ (37 నాటౌట్) రాణించటంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 206 పరుగుల భారీ స్కోరు సాధించింది.



ఐపీఎల్‌లో నేడు

కోల్‌కత X పంజాబ్
వేదిక : కోల్‌కత , రా॥ 7.30
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..

నవతెలంగాణ-హైదరాబాద్

రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ మురిసింది. ఐపీఎల్ 17లో సుమారు నెల రోజుల తర్వాత మరో విజయం ఖాతాలో వేసుకుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 35 పరుగుల తేడాతో గెలుపొందిన ఆర్సీబీ సీజన్లో రెండో విజయం సాధించింది. 207 పరుగుల ఛేదనలో సన్‌రైజర్స్ హైదరాబాద్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 171 పరుగులే చేసింది. ట్రావిశ్ హెడ్ (1), హెన్రిచ్ క్లాసెన్ (7), ఎడెన్ మార్‌క్రామ్ (7), నితీశ్ కుమార్ రెడ్డి (13), అబ్దుల్ సమద్ (10) విఫలమయ్యారు. అభిషేక్ శర్మ (31, 13 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు), షాబాజ్ అహ్మద్ (40 నాటౌట్, 37 బంతుల్లో 1 ఫోర్,1 సిక్స్) పోరాడినా సహచరుల నుంచి మద్దతు లభించలేదు. ఆర్సీబీ బౌలర్లలో కరణ్ శర్మ (2/29), స్వప్నిల్ సింగ్ (2/40), కామెరూన్ గ్రీన్ (2/12) రాణించారు. అంతకుముందు, విరాట్ కోహ్లి (51, 43 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), రజత్ పాటిదార్ (50, 20 బంతుల్లో 5 ఫోర్లు) అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. కామెరూన్ గ్రీన్ (37 నాటౌట్, 5 ఫోర్లు) సైతం ధనాధన్ ఇన్నింగ్స్‌తో మెరవటంతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 206 పరుగులు చేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో జైదేవ్ ఉనద్కత్ (3/30), నటరాజన్ (2/39) వికెట్ల వేటలో రాణించారు.

బెంగళూర్ దూకుడు : ఉప్పల్‌లో టాస్ నెగ్గిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. గత మ్యాచుల్లో సన్‌రైజర్స్‌ను తొలుత



బ్యాటింగ్‌కు ఆహ్వానించి ఇతర జట్లు చేసిన పొరపాట్ల నుంచి ఆర్సీబీ పాఠాలు నేర్చుకుంది. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌కు ఓపెనర్లు ధనాధన్ ఆరంభం అందించారు. సన్‌రైజర్స్ శైలిలోనే పవర్‌ప్లేలో పవర్‌ఫుల్‌గా ఆడేందుకు ఆర్సీబీ సిద్ధమైంది. విరాట్ కోహ్లి (51), కెప్టెన్ డుప్లెసిస్ (25) తొలి వికెట్‌కు మంచి ఆరంభం అందించారు. పాట్ కమిన్స్ ఓవర్లో కోహ్లి, డుప్లెసిస్ కదం తొక్కారు. రెండు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 19 పరుగులు పిండుకున్నారు. 3 ఓవర్లలో 43/0తో నిలిచిన బెంగళూర్ భారీ స్కోరు దిశగా గట్టి పునాది వేసుకుంది. కానీ ఆ తర్వాతి ఓవర్లో నటరాజన్ సన్‌రైజర్స్‌కు బ్రేక్ ఇచ్చాడు. డుప్లెసిస్ (25)ను అవుట్ చేసి రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ జోరుకు కళ్లెం వేశాడు. పవర్‌ప్లే ముగిసేసరికి రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 61/1తో నిలిచింది. విల్ జాక్స్ (6)ను మార్కండే సాగనంపటంతో బెంగళూర్ మరింత ఢీలా పడింది. కానీ రజత్ పాటిదార్ (50) ధనాధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. మయాంక్ మార్కండే ఓవర్లో ఏకంగా నాలుగు సిక్సర్లు కొట్టిన పాటిదార్ ఆ ఓవర్లో 27 పరుగులు పిండుకున్నాడు. పాటిదార్ జోరుతో ఆర్సీబీ ఇన్నింగ్స్ మళ్లీ జోరందుకుంది. రెండు ఫోర్లు, ఐదు సిక్సర్లతో 19 బంతుల్లోనే పాటిదార్ అర్ధ సెంచరీ సాధించగా.. విరాట్ కోహ్లి నాలుగు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 37 బంతుల్లో అర్ధ శతకం బాదాడు. అర్ధ సెంచరీల అనంతరం కోహ్లి,పాటిదార్ వికెట్ కోల్పోయారు. కానీ కామెరూన్ గ్రీన్ (00) డెత్ ఓవర్లలో దంచికొట్టాడు. ఐదు బౌండరీలు బాదిన కామెరూన్ గ్రీన్ కీలక సమయంలో విలువైన పరుగులు చేశాడు. ఆఖరు ఓవర్లో స్వప్నిల్ సింగ్ (12) ఆకట్టుకున్నాడు. నటరాజన్‌పై వరుసగా 6, 4తో ఆర్సీబీ స్కోరు 200 మార్క్ దాటించాడు. మహిపాల్ లామ్రోర్ (7), దినేశ్ కార్తీక్ (11) నిరాశపరిచారు. 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి రాయల్ చాలెంజర్స్ 206 పరుగులు చేసింది.

భారీ బందోబస్తు : సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ మ్యాచ్‌కు హైదరాబాద్ పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సీజన్ ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్‌కింగ్స్ మ్యాచులకు 2500 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆన్‌లైన్‌లో టికెట్ల అమ్మకాలపై పారదర్శకత కోరుతూ యూత్ కాంగ్రెస్ ఉప్పల్ స్టేడియం దగ్గర ధర్నాకు దిగారు. ముందస్తు ఏర్పాట్లలో భాగంగా మ్యాచ్‌కు ఎటువంటి అవాంతరం కలుగకుండా 3800 మంది పోలీసులతో భారీ బందోబస్తు కల్పించారు.

నవచిత్రం

తెలుగు ప్రేక్షకులు గర్వపడేలా

జై హనుమాన్



డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, తేజ సజ్జా పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ 'హను-మాన్' 25 కేంద్రాలలో 100 రోజుల రన్ పూర్తి చేసుకుంది. 92 ఏళ్ల టాలీవుడ్ చరిత్రలో ఆల్ టైమ్ సంక్రాంతి బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె.నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ ఫాంటసీ అడ్వెంచర్ ప్రపంచవ్యాప్తంగా 300 కోట్ల రూపాయల్ని వసూలు చేసింది. ఓవర్సీస్‌లో 5 మిలియన్లకు పైగా కలెక్షన్లు రాబట్టింది. ఇది హిందీతో సహా అన్ని భాషలలో కమర్షియల్ హిట్‌గా నిలిచింది. హనుమాన్ విజయవంతంగా వందరోజుల పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్ర యూనిట్ గ్రాండ్‌గా సెలబ్రేషన్ నిర్వహించింది.

ఈ సందర్భంగా దర్శకుడు ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ,'హనుమన్ యాభై రోజుల వేడుక జరిగిన సమయంలో నిర్మాత నిరంజన్ మనం వంద రోజుల వేడుక కూడా చేయగలుగుతామని అన్నారు. కానీ నేను నమ్మలేదు. కాకపోతే మీరంతా దాన్ని నిజం చేశారు. నేను డైరెక్టర్ అయిన తర్వాత సినిమా అంటే ఒక వీకెండ్ అయిపోయింది. అలాంటి ఈ జనరేషన్‌లో వందవ రోజు కూడా థియేటర్స్‌కి వచ్చి సినిమా చుస్తున్నారంటే చాలా అదృష్టంగా ఫీలౌతున్నాను. పీవీసియుకి అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఇది చాలా కాలంగా కన్న కల. రానున్న ఇరవై ఏళ్ళు దీనిపై స్పెండ్ చేయబోతున్నాను. ఈ యూనివర్స్‌లో మీరు చేసే పాత్రలు మళ్ళీ రాబోతున్నాయి. సముద్రఖని విభీషుడిగా కనిపించబోతున్నారు. తేజ హను- మాన్‌గా కొనసాగుతారు. కొన్ని సర్‌ప్రైజ్ పాత్రలు కూడా రాబోతున్నాయి. పీవీసియులో అన్ని పరిశ్రమల నుంచి చాలా పెద్ద స్టార్స్ కనిపించబోతున్నారు. పీవీసియు నుంచి వచ్చే సినిమాలు మీ అందరి అంచనాలే కాదు, తెలుగు ఆడియన్స్ గర్వపడేలా చేస్తామని నమ్మకంగా చెబుతున్నాను. జైహనుమాన్‌ని బిగ్గెస్ట్ ఫిల్మ్‌గా రూపొందిస్తున్నాం. గొప్ప ఎమోషన్స్ కనెక్ట్ వీఎఫ్ఎక్స్ అన్నీ ఉంటాయి' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

రెండో దశ ఎన్నికల అభ్యర్థుల్లో ధనవంతులెవరంటే.?!



ఢిల్లీ : రెండో దశ పోలింగ్ శుక్రవారం (ఏప్రిల్ 26) రోజున జరగనుంది. ఈ దశలో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు, ఒక బిజెపి అభ్యర్థి అందరిలోకి అత్యధిక ధనవంతులుగా అగ్రస్థానంలో నిలిచారు. నామినేషన్లతోపాటు అభ్యర్థులు ఇసికి దాఖలు చేసిన అఫిడవిట్‌లను పరిశీలించిన అనంతరం అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడిఆర్) రూపొందించ,ఇప జాబితా ఆధారంగా 33 శాతం మంది కోటీశ్వరులుగా ఉన్నారు.

వెంకట రమణే గౌడ

కర్ణాటక మండువ స్థానం నుంచి కాంగ్రెస్ నుంచి పోటీకి దిగారు. ఇతనికి రూ. 622 కోట్లకు పైగా ఆస్తులున్నాయి.

డి.కె సురేష్ : కర్ణాటక ఉపముఖ్యమంత్రి డి.కె శివకుమార్ సోదరుడు డికె సురేష్. బెంగళూరు రూరల్ స్థానం నుంచి పోటీకి దిగారు. ఆయన ఆస్తులు 593 కోట్ల రూపాయలు. 2019 ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికలకు దాదాపు ఈయన ఆస్తులు 75 శాతం పెరిగాయి.

హేమమాలిని :

ప్రముఖ బాలీవుడ్ నటి హేమామాలిని యుపి రాష్ట్రం మధుర సిట్టింగ్ ఎంపి. ఈమె ఈ స్థానం నుంచి రెండుసార్లు బిజెపి తరపున గెలిచారు. ఇప్పుడు వరుసగా మూడోసారి బరిలో నిలిచారు. ఈమెకు రూ. 278 కోట్ల ఆస్తులు ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లో హోషంగాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సంజయ్‌శర్మ రూ. 233 కోట్లు. కర్ణాటక స్టేట్ మాండ్యలో జెడిఎస్ ఛీప్ కుమారస్వామికి రూ. 217 కోట్లు. యూపీలో అమ్రోహా బిజెపి అభ్యర్థి కన్వర్ సింగ్ తన్వర్ రూ. 215 కోట్ల ఆస్తులున్నాయి.

కన్నౌజి నుంచి అఖిలేష్ యాదవ్ నామినేషన్

కన్నౌజి : ఉత్తరప్రదేశ్‌లోని కన్నౌజి స్థానం సమాజ్‌వాది పార్టీకి కంచుకోటగా నిలిచింది. ఈ స్థానం నుంచి ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ రిటర్నింగ్ కార్యాలయంలో గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'కన్నౌజిలో ఎస్పీ చేసిన అభివృద్ధిని బిజెపి ఉద్దేశపూర్వకంగానే అవమానిస్తుంది. అయితే ఎస్పీ చేసిన అభివృద్ధి ఏంటో కన్నౌజి ప్రజలకు తెలుసు'నని అఖిలేష్ అన్నారు. పార్టీ నేతల ఒత్తిడి మేరకే ఈ స్థానం నుంచి పోటీ చేస్తున్నట్లు ఆయన అన్నారు. కాగా, ఇక్కడి నుంచి గతంలో అఖిలేశ్ మేనల్లుడు తేజ్ ప్రతాప్ యాదవ్ పోటీ చేయనున్నట్లు పార్టీ వర్గాలు ప్రకటించాయి. అయితే సమాజ్‌వాది పార్టీ కచ్చితంగా గెలిచే స్థానం కనుక ఆ స్థానంలో అఖిలేష్ మరోసారి బరిలోకి దిగారు.

ఖలిస్తానీ వేర్పాటువాది లోక్‌సభ ఎన్నికల్లోపోటీ?

అస్సాం జైలులో ఉన్న ఖలిస్తానీ వేర్పాటువాది అమృతపాల్ సింగ్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారని వార్తలొస్తున్నాయి. ఈ ఎన్నికల్లో పంజాబ్ రాష్ట్రం ఖాదూర్ సాహిత్ స్థానం నుంచి అమృతపసాల్‌సింగ్ పోటీ చేసే అవకాశాలున్నాయని ఆయన తండ్రి తార్సేమ్ సింగ్ గురువారం చెప్పారు. మొదట్లో రాజకీయాల్లో ఆసక్తి లేకపోయినా.. బుధవారం న్యాయవాది రజ్‌దేవ్ సింగ్ ఖల్సా దిబ్రూగఢ్ జైలులో అమృతపాల్‌ని కలిసిన తర్వాత పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు తార్సేమ్ సింగ్ అన్నారు. కాగా 'వారిస్ పంజాబ్ దే' సంస్థ చీఫ్ అమృతపాల్ సింగ్‌ను గతేడాది ఏప్రిల్ 23న పంజాబ్ పోలీసులు అరెస్టు చేశారు. జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) కింద కేసు పెట్టారు.

పోలింగ్‌కు రాజస్థాన్ సిద్ధం

- 13 లోక్‌సభ సీట్లకు ఎన్నికలు
- పలు కీలక స్థానాల్లో బరిలో ప్రముఖులు
- కాంగ్రెస్, బీజేపీల మధ్య పోటీ


జైపూర్ : మండుతున్న ఎండల్లో ఎడారి రాష్ట్రం రాజస్థాన్‌లో రెండో దశలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. 13 నియోజక వర్గాల్లో ఓటింగ్ జరగనున్నది. ఇప్పటి వరకు మండే ఎండల్లో రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు తీవ్ర ప్రచారాన్ని నిర్వహించాయి. ప్రధాన పార్టీలకు చెందిన స్టార్ క్యాంపెయినర్లు.. అభ్యర్థుల విజయం కోసం తీవ్రంగా శ్రమించారు. నేడు ఎన్నికలు జరగనుండటంతో ఇప్పటికే ప్రచారానికి తెరపడింది. కాగా, పలు సీట్లలో రెండు పార్టీలకు చెందిన కీలక నాయకులు పోటీ చేయనుండటంతో ఈ ఎన్నికలు ఆసిక్తికరంగా మారాయి.

జోధ్‌పూర్ నియోజకవర్గంలో బీజేపీకి చెందిన గజేంద్ర సింగ్ షెకావత్, కాంగ్రెస్ నుంచి కరణ్ సింగ్ ఉచియారాడ మధ్య తీవ్ర పోటీ నెలకొన్నది. 2014, 2019 రెండింటిలోనూ సీటును గెలుచుకున్న షెకావత్.. రాజ్‌పుత్ వర్గానికి చెందిన ఉచియారాడ నుంచి కఠినమైన సవాలును ఎదుర్కొంటున్నాడు.కోటా-బుండి లోక్‌సభ స్థానం మరొక హాట్ సీట్‌గా మారింది. ఇక్కడ రెండుసార్లు గెలిచిన బిజెపికి చెందిన ఓం బిర్లా.. ఇటీవల బీజేపీ నుంచి కాంగ్రెస్‌కు మారిన గుర్జార్ వర్గానికి చెందిన ప్రహ్లాద్ గుంజాల్ నుంచి బలమైన పోటీను ఎదుర్కోనున్నారు. ప్రహ్లాద్ గుంజాల్‌కు మాజీ సీఎం వసుంధర రాజే మద్దతున్నది. దీంతో ఇక్కడ పోటీ చాలా ఆసక్తికరంగా మారింది.

చిత్తోర్‌గఢ్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సీపీ జోషి కాంగ్రెస్‌కు చెందిన అంజనా ఉదయ్‌లాల్, బీఎస్పీకి చెందిన మేఘవాల్ రాధేశ్యామ్‌తో పోటీ పడుతున్నారు. తిరుగుబాటు బీజేపీ ఎమ్మెల్యే చంద్రభన్ సింగ్ అక్యా ఉండటంతో జోషి ప్రచారం మరింత క్లిష్టంగా మారింది.

రాజ్‌సమంద్‌లో మహిమా సింగ్ మేవార్ (బీజేపీ), దామోదర్ గుర్జార్ (కాంగ్రెస్)లు ప్రధాన పోటీదారులు. తొలి నుంచి ఈ సీటు బీజేపీకి కంచుకోటగా చెప్పబడుతున్నప్పటికీ.. చివరి నిమిషంలో కాంగ్రెస్ అభ్యర్థిని మార్చడం రేసులో కొత్త కోణాన్ని జోడించిందని, ఆ పార్టీ దామోదర్ గుర్జర్‌ను ఈ సీటుకు ప్రతిపాదించిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. తొలుత కాంగ్రెస్ సుదర్శన్ రావత్‌ను ఎంపిక చేయగా.. ఆయన వెనక్కి తగ్గారు. అయితే, వాస్తవానికి భిల్వారాలో పోటీకి నిలబెట్టిన గుర్జార్.. తర్వాత ఈ స్థానానికి మారాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఉదయపూర్ నియోజకవర్గంలో మతం కీలక పాత్ర పోషిస్తున్నది. ఇక్కడ బీజేపీకి చెందిన మన్నాలాల్ రావత్, కాంగ్రెస్ నుంచి తారాచంద్ మీనా ప్రధాన పోటీదారులుగా ఉన్నారు. టోంక్-సవాయి మాధోపూర్ సీటులో బీజేపీకి చెందిన సుఖ్‌బీర్ సింగ్ జోనాపురియా, ఎమ్మెల్యే హరీష్ మీనా మధ్య పోటీ ఉన్నది. అజ్మీర్‌లో.. బీజేపీ ఎంపీ భగీరథ్ చౌదరిని తిరిగి నామినేట్ చేయగా.. పాలసీ చైర్మెన్ రామచంద్ర చౌదరి కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. భరత్‌పూర్‌లో, జాట్ ఉద్యమం ఎన్నికల దృశ్యాన్ని రూపొందిస్తుంది. ఈ ప్రాంతంలో దాదాపు 5 లక్షల మంది జాట్ ఓటర్లు ఉన్నారు. అదనంగా, ఈ ప్రాంతంలో దాదాపు 3.50 లక్షల మంది జాటవ్ ఓటర్లు ఉన్నారు. కాంగ్రెస్‌కు చెందిన సంజన ఈ వర్గానికి చెందినవారు కాగా, బీజేపీకి చెందిన రాంస్వరూప్ కోలీ గతంలో బయానా స్థానం నుంచి గెలుపొందారుబార్మర్-జైసల్మేర్ సీటులో త్రిముఖ పోటీ నెలకొన్నది. స్వతంత్ర అభ్యర్థి రవీంద్ర సింగ్ భాటి ప్రముఖ వ్యక్తిగా ఎదిగారు. ఇది కైలాష్ చౌదరి (బీజేపీ), ఉమేదరమ్ బెనివాల్ (కాంగ్రెస్) ఇద్దరికీ ఆందోళన కలిగించే అంశమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఎన్నికల రణరంగంలో ఇద్దరు మాజీ సీఎంల కుమారులు వైభవ్ గెహ్లాట్, దుష్యంత్ సింగ్‌లు వరుసగా జలోర్-సిరోహి, ఝలావర్ నుంచి పోటీ చేస్తున్నారు.రాష్ట్రంలో మొత్తం 25 ఎంపీ స్థానాలున్నాయి. ఇందులో 12 సీట్లకు ఇప్పటికే తొలి దశలో ఎన్నికలు జరిగాయి. ఇప్పుడు 13 స్థానాలకు ఎన్నికలు నేడు జరగనుండటంతో రాష్ట్రంలో ఎన్నికలు పరిపూర్ణం కానున్నాయి. రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2.80 లక్షలకు పైగా ఉన్నది. ఇందులో పురుషులు 1.44 లక్షలకు పైగా, మహిళలు 1.36 లక్షలకు పైగా, థర్డ్ జండర్ 324 మంది ఉన్నారు. తొలిసారి ఓటు వేస్తున్నవారు (18-19 ఏండ్ల వారు) 8,66,325 మంది ఉన్నారు. వైకల్యం ఉన్నవారు 3,22,829 మంది, 85 ఏండ్లు పైబడినవారు 3,01,742 మంది, సర్వీసు ఓటర్లు 26,837 మంది ఉన్నారు.

గుజరాత్‌లో అంత ఈజీ కాదు



గత ఎన్నికల్లో అన్ని స్థానాలూ గెలిచిన బీజేపీ

- కమలాన్ని దడ పుట్టిస్తున్న అంతర్గత పోరు, ఠాకూర్ల నిరసనలు
- గిరిజనుల ఆందోళనలు కూడా
- కాంగ్రెస్, ఆప్ అవగాహనతో 'ఇండియా' బలోపేతం
- రాహుల్ జోడో యాత్ర ప్రభావం

హేమలత

ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్‌షా సొంత ఇలాకా గుజరాత్‌లో 2019 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి అన్ని సీట్లనూ తమ వశం చేసుకుంది. కాగా ఈ మారు పరిస్థితులు అందుకు భిన్నంగా మారాయి. గతంలో మాదిరి బిజెపి గెలుపు నల్లేరుమీద నడక కాదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గతంలో కాంగ్రెస్, ఆప్, బిటిపిల మధ్య ఓట్లు చీలిపోవడంతో బిజెపి గెలుపు సులువైంది. ఈ ఎన్నికల్లో గుజరాత్‌లో ఇండియా బ్లాక్‌లో భాగంగా కాంగ్రెస్, ఆప్ కలసి బరిలోకి దిగడంతో బిజెపిలో వణుకు మొదలైంది. కొందరు బిజెపి అభ్యర్థులు పోటీ నుంచి విరమించుకున్నారు. అంతేకాదు, కుట్రలు పన్ని ప్రత్యర్థులను నామినేషన్ల సమయంలోనే తప్పించే ఎత్తులు వేసింది. అందుకు ప్రత్యక్ష ఉదారణ సూరత్‌లో బిజెపి అభ్యర్థి ఏకగ్రీవం. సర్పంచ్, వార్డు మెంబర్ వంటి వారి ఎన్నిక ఏకగ్రీవం కావడం కద్దు. ఒక ఎంపి స్థానంలో అభ్యర్థులందరి నామినేషన్లు స్క్రూటినీలో పోయి ఒక్క బిజెపి అభ్యర్థిది మిగలడం, ఎన్నిక ఏకగ్రీవం కావడం గమనార్హం.

గిరిజన ఓట్లపై కాంగ్రెస్ దృష్టి

గిరిజన ప్రాబల్యమెక్కువున్న భరూచ్ స్థానంలో కాంగ్రెస్‌కు పట్టు ఉండేది. కానీ, ఈ మధ్యకాలంలో కాంగ్రెస్ గిరిజన నేతలు బిజెపిలోకి ఉడాయించారు. బిటిపి పార్టీ అధ్యక్షుడు మహేష్ వసావా బిజెపిలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో భరూచ్ నియోజకవర్గం పరిధిలోని డేడియాపాడా సీటును ఆప్ గెలుచుకుంది. కాబట్టి భరూచ్‌లో ఆప్ అభ్యర్థి పోటీ చేస్తున్నారు. రాహుల్ జోడో యాత్ర ఈ గిరిజన ప్రాంతాల గుండానే కొనసాగింది. బిజెపి అభ్యర్థి మన్‌సుక్‌భాయ్ వసావాకు ఆప్ చైతర్ వసావా గట్టి పోటీ ఇవ్వనున్నారు. కేజ్రీవాల్



అరెస్టు అవ్వడంతో ఆయన సతీమణి సునీత, పంజాబ్ సిఎం భగవంత్ మాన్, ఆప్ కేంద్రమంత్రులు ఆపార్టీ తరుపున ప్రచారం చేస్తున్నారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో 182 స్థానాల్లో ఆప్ 5, కాంగ్రెస్ 17, బిజెపి 156 స్థానాలను గెలుచుకున్నాయి. స్థానిక సంస్థల్లో ఓబీసిల 10 శాతం రిజర్వేషన్‌ను 27 శాతానికి బిజెపి క్యాబినెట్ పెంచింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం సీట్లను బిజెపి గెలుచుకోగా, బిజెపి 62.21 శాతం, కాంగ్రెస్ 32.11 శాతం ఓట్లు సాధించాయి.







బిజెపికి నిరసనల సెగ

బిజెపి ఐదు సిట్టింగ్‌లను మార్చింది. జునాగఢ్ స్థానంలో పార్టీ అభ్యర్థిని మార్చాలని అరడజను మంది నాయకులు రాష్ట్ర బిజెపి చీఫ్ సిఆర్ పాటిల్‌ను సోషల్‌మీడియా ద్వారా కోరారు. రంజన్ భట్ వడోదరా అభ్యర్థిని మార్చారు. రాజ్‌కోట్ అభ్యర్థి వ్యాఖ్యలతో రాజ్‌పుత్‌ల ఆగ్రహానికి గురయ్యారు. సబరికాంతలో బిజెపి అభ్యర్థిపై కార్యకర్తలు అసంతృప్తిగా ఉన్నారు. కేంద్ర మంత్రి పురుషోత్తమ్ రూపాలా ఠాకూర్లకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేడంతో రూపాలకు రాజ్‌కోట్ టిక్కెట్ ఇవ్వొద్దని ఠాకూర్లు నిరసనలు తెలుపుతున్నారు. అంతేకాదు, ఎన్నికల్లో బిజెపికి ఓటు వేయొద్దని తీర్మానించారు. ఠాకూర్ల ఓట్లతో గెలుస్తున్న బిజెపికి ఈ పరిణామం మింగుడు పడట్లేదు. అమ్రేలీలో సిట్టింగ్ ఎంపి నారాన్ కచ్చదియా, కొత్త అభ్యర్థి భారత్ సుతారియల మద్దతుదారులు బాహాటంగానే తలపడడంతో పార్టీలో అంతర్గత పోరు బయటపడింది. అర్హతను బట్టి కాకుండా కులం ప్రాతిపదికగా అభ్యర్థిత్వం ఖరారు చేస్తుండటంతో అభ్యర్థుల్లో అసంతృప్తి నెలకొంది. బిల్కిస్‌బానో కేసులో దోషులను విడుదల చేయడంతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యింది. రాష్ట్ర జనాభాలో 38 శాతం పోషకాహార లేమితో బాధపడుతున్నట్లు నీతిఆయోగ్ వెల్లడించింది. పట్టణాలే తప్ప గ్రామాల అభివృద్ధి మరచింది. జింక్ స్మెల్టర్ ప్రాజెక్టు కోసం గిరిజనుల భూముల సేకరణపై వ్యతిరేకత కొనసాగుతోంది. ఇత్యాది ప్రతికూలాలు బిజెపిని వెంటాడుతున్నాయి.

26 స్థానాలకు మే 7న పోలింగ్

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గుజరాత్‌లోని 26 లోక్‌సభ స్థానాలకు మూడోవిడతలో ఒకేసారి మే 7న పోలింగ్ జరగనుంది. ఎంపి ఎన్నికలతో పాటుగా ఐదు అసెంబ్లీ స్థానాలకూ అదే రోజున ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 22న నామినేషన్లు ముగిసేనాటికి మొత్తం 491 మంది లోక్‌సభకు, 39 మంది అసెంబ్లీ స్థానాలకు నామినేషన్లను దాఖలు చేశారు. ఇండియా కూటమి సీట్ల సర్దుబాటులో కాంగ్రెస్ 24 స్థానాలోనూ, ఆప్ రెండు స్థానాలోనూ పోటీ చేస్తున్నాయి. భరూచ్, భవనగర్ అనే రెండు ఆప్ స్థానాల్లో చైతర్ వసావా, ఉమేష్ మక్వానాలు పోటీపడుతున్నారు.

కేరళలో ఎల్‌డిఎఫ్‌కు ప్రజాదరణ !

- బిజెపి వ్యతిరేక విధానాలు, యుడిఎఫ్ వైఫల్యాలే ప్రచారాస్త్రాలు
- నేడు అన్ని ఎంసి స్థానాల్లో పోలింగ్‌కు సమాయత్తం
- కేరళ ఎన్నికల రౌండప్ !

తిరువనంతపురం : కేరళ ఓటర్లు శుక్రవారం (ఏప్రిల్ 26) తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు సమాయత్తమవుతున్న నేపథ్యంలో గెలుపుపై సిపిఎం నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్‌కు అవకాశాలు పెరుగుతున్నాయి. గత 40 రోజులుగా ఉధృతంగా సాగిన ఎన్నికల ప్రచారానికి బుధవారం సాయంత్రంతో తెరపడింది. మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, మతోన్మాద పోకడలతో సహా వివిధ సమస్యలను తీవ్రంగా ప్రజల దృష్టికి తెస్తూ ఈ ప్రచారం సాగింది. ఎల్‌డిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారానే లౌకికవాదం, సమాఖ్యవాదం విలువలను పరిరక్షించుకోవాలన్న తమ ఆకాంక్ష నెరవేరగలదని ప్రజలు ఆశిస్తున్నారు.

వామపక్షాలే దేశానికి రక్ష

ధరల పెరుగుదల, వ్యవసాయ సంక్షోభం , సిఎఎ, ఆర్టికల్ 370 రద్దు వంటి అంశాలపై వామపక్ష ఉద్యమాలు, పోరాటాలను ఎల్‌డిఎఫ్ తన ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావించింది. 'వామపక్షాలు లేకపోతే భారతదేశం లేదు' అన్న ఎల్‌డిఎఫ్ నినాదం ఓటర్లను ఆకట్టుకుంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్, పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, రాష్ట్ర కార్యదర్శి ఎం.వి.గోవిందన్ మాస్టర్, సిపిఎం అగ్రనేతలు ప్రకాష్ కరత్, బృందా కరత్, సుభాషిణి అలీతో పాటు సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వంతో సహా పలువురు ప్రముఖ నేతలు ఎల్‌డిఎఫ్ తరపున ప్రచారం సాగించారు. పార్లమెంట్ లోపల, వెలుపల ప్రజా వ్యతిరేక, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడేది వామపక్షాలు మాత్రమేనని నేతలు స్పష్టం చేశారు. సామాన్యుల వాణిని వినిపించడానికి కట్టుబడి వున్నది, అలాగే వ్యవసాయ మార్కెట్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుని, ఆహార ధాన్యాలు, ఎల్‌పిజి , ఇంధనాలు వంటి వాటితో సహా నిత్యావసరాల ధరలను నియంత్రించేందుకు చర్యలు తీసుకునేలా ఒత్తిడి తేగలిగేది కూడా వామపక్షాలేనని నేతలు ప్రజలకు వివరించారు.

బిజెపిపై పోరులో యుడిఎఫ్ నిష్క్రియాపరత్వం

2019 ఎన్నికల్లో రాష్ట్రంలో మొత్తంగా 20 స్థానాలకు గానూ యుడిఎఫ్ 19 స్థానాలను కైవసం చేసుకుంది. ఈ ఎంపీల పేలవమైన పనితీరు ఎన్నికల్లో చర్చకు వచ్చింది. సిఎఎ, ఎన్ఐఎ బిల్లులపై, రైతుల ఆందోళన వంటి అంశాలపై మోడీ ప్రభుత్వ నిష్క్రియాపరత్వంపై ప్రతి సభలోనూ చర్చించారు. యుడిఎఫ్‌లో బలమైన భాగస్వామి ముస్లిం లీగ్‌ను అవమానపరిచారు. రాహుల్ గాంధీ పోటీ చేసే వాయనాడ్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి వారి ఆకుపచ్చ జెండాలను తీసుకురావడం గానీ ఎగురవేయడం గానీ చేయరాదంటూ కాంగ్రెస్ ఆదేశాలు జారీ చేసింది. జెండాలు తీసుకువచ్చినందుకు ముస్లిం లీగ్ కార్యకర్తలపై కాంగ్రెస్ కార్యకర్తలు చేయి కూడా చేసుకున్నారు. 2019లో రాహుల్ గాంధీ ర్యాలీల్లో ఆకుపచ్చ జెండాలు చూసి వాటిని పాకిస్తాన్ జాతీయ పతాకాలుగా తప్పుగా అర్థం చేసుకున్నారు.

సోషల్ మీడియాలో జుగుప్సాకర ప్రచారం

వడక్కర నుండి పోటీ చేస్తున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు కె.కె.శైలజపై సెక్సీ వ్యాఖ్యలతో అత్యంత హేయమైన రీతిలో జరిగిన సైబర్ దాడి కాంగ్రెస్‌ను రాష్ట్ర వ్యాప్తంగా పూర్తిగా రక్షణలో పడేసింది. సైబర్ వేదికగా యుడిఎఫ్ కార్యకర్తలు ఒక మహిళా నేతపై చేసిన దాడి అనూహ్యమైనది, గతంలో కనివినీ ఎరుగనిది. ఆరోగ్య మంత్రిగా పనిచేసే సమయంలో కోవిడ్, నిఫా వైరస్‌లను అత్యంత సమర్థవంతంగా, సాహసోపేతమైన రీతిలో ఎదుర్కోవడంలో శైలజ చూపిన నేర్పు, ప్రతిభ అంతర్జాతీయంగా ప్రశంసలందుకున్నాయి.. తనపై జరిగిన సైబర్ దాడిని ఖండించడానికి పెట్టిన పత్రికా సమావేశంలో ఆమె భావోద్వేగానికి గురయ్యారు. కాంగ్రెస్‌కు చెందిన ప్రత్యర్థి షఫి పరాంబిల్‌పై ఆమె కేసు కూడా పెట్టారు.

అనుభవజ్ఞులను దించిన ఎల్‌డిఎఫ్

సిట్టింగ్ ఎంపి వి.కె.శ్రీకందన్‌పై పాలక్కాడ్ నియోజకవర్గం నుండి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎ.విజయరాఘవన్ భారీ విజయాన్ని నమోదు చేయడానికి సిద్ధమవుతున్నారు. పతనాంతిట్ట నియోజకవర్గంలో మూడుసార్లు ఎంపి అయిన ఆంటో ఆంటోనీకి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ థామస్ ఇజాక్ గట్టి పోటీనిస్తున్నారు. కాంగ్రెస్‌నేత ఎ.కె.ఆంటోనీ కుమారుడు అనీల్ ఆంటోనీ అక్కడ బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తుండడం కాంగ్రెస్‌ను ఇరకాటంలో పడేసింది. కేరళ ఆర్థిక మంత్రిగా ఇజాక్ పనితీరే ఆయనను గెలిపిస్తుందన్న విశ్వాసాన్ని ఎల్‌డిఎఫ్ వ్యక్తం చేస్తోంది. ఎల్‌డిఎఫ్‌కు గట్టి పట్టు వున్న అలతూర్ ఓటర్ల నుండి కేంద్ర కమిటీ సభ్యుడు, మంత్రి కె.రాధాకృష్ణన్‌కు మంచి స్పందన లభిస్తోంది. సిట్టింగ్ ఎంపి రమ్య హరిదాస్‌పై ఆయన పోటీ చేస్తున్నారు. పార్లమెంట్‌లో ఆమె పేలవమైన పనితీరు అందరికీ తెలిసినదే. కొజికోడ్‌లో కేంద్ర కమిటీ సభ్యులు, సిఐటియు నేత ఎలమరం కరీమ్ మూడుసార్లు ఎంపి అయిన ఎం.కె.రాఘవన్‌కు గట్టి పోటీ ఇస్తున్నారు. ఇతర ఎల్‌డిఎఫ్ అభ్యర్థులు ఎం.వి.బాలకృష్ణన్ మాస్టర్ (కాసర్‌గోడ్), ఎం.వి.జయరాజన్ (కన్నూర్), అనీ రాజా (వాయనాడ్), వి.వసీఫ్ (మలప్పురం), కె.ఎస్.హంసా(పొన్నై), వి.ఎస్.సునీల్ కుమార్(త్రిస్సూర్), సి.రవీంద్రనాథ్(చలక్కుడి), కె.జె.షైన్ (ఎర్నాకులం), జాయిస్ జార్జి(కొట్టాయం), థామస్ చజికడన్ (కొట్టాయం), ఎ.ఎం.అరిఫ్(అలప్పుజ), సి.ఎ.అరుణ్‌కుమార్ (మవెలిక్కర), ఎం.ముకేష్ (కొల్లామ్), వి.జాయ్(అత్తింగళ్), పన్నియన్ రవీంద్రన్

ఓటింగ్ శాతాన్ని పెంచటం కోసం...

- ఉచిత దోసె.. ఆహారం, పానీయాలపై డిస్కౌంట్‌లు
- రైడ్‌ల పైనా తగ్గింపు
- బెంగళూరు వ్యాపార సంస్థల వినూత్న ప్రయత్నాలు

బెంగళూరు : కర్నాటకలో శుక్రవారం 14 స్థానాలకు ఓటింగ్ జరగనుండగా.. బెంగళూరులోని వివిధ రెస్టారెంట్లు, వ్యాపార, రవాణా సేవలు ఓటర్లను పోలింగ్ బూత్‌లకు వచ్చేలా వినూత్న ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఓటు వేయటానికి వచ్చేవారి కోసం ఉచిత ఆహారం, పానియాలు, కాఫీ, విమాన చార్జీలపై తగ్గింపులు వంటి ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. అయితే, పట్టణ ఓటర్లను నిమగ్నం చేయటానికి ఈ చర్యలు ఉద్దేశించబడ్డాయి. ముఖ్యంగా బెంగళూరులో పోలింగ్ శాతం తక్కువగా ఉంటుంది. ఇందులో భాగంగానే ఇక్కడి వ్యాపార సంస్థలు ఇలాంటి ప్రయోగాలు చేస్తున్నాయనీ, ఇలాంటి చర్యలు ఆమోదించదగినవేనని సామాజికవేత్తలు అంటున్నారు.బర్గర్‌లపై తగ్గింపు, కాంప్లిమెంటరీ బీర్, పోలింగ్ స్టేషన్‌లకు ఉచిత రైడ్‌లు వంటివి ఇందులో ఉన్నాయి. బృహత్ బెంగుళూరు హోటల్స్ అసోసియేషన్ కూడా ఓటర్లకు ఉచిత, రాయితీ భోజనం అందించటానికి కర్నాటక హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మిస్టర్. ఫిల్లీ బర్గర్ అవుట్‌లెట్ ఎన్నికల రోజున ఓటు వేసినవారు తమ వేలుకు ఉన్న సిరాను చూపిస్తే.. మొదటి 100 మంది కస్టమర్‌లకు 30 శాతం తగ్గింపును అందిస్తున్నది. వండర్లా హాలిడేస్ కూడా ఓటర్లకు టిక్కెట్లపై 15 శాతం తగ్గింపును కల్పిస్తున్నది. మరికొన్ని సంస్థలు ఓటింగ్ రసీదులను చూపించే వారికి భోజనంపై 20 శాతం తగ్గింపును అందిస్తున్నాయి.



ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ కూడా 18 నుంచి 22 సంవత్సరాల వయస్సు గల మొదటిసారి ఓటర్లకు విమానాలలో 19 శాతం తగ్గింపును అందిస్తున్నది. మొబిలిటీ అగ్రిగేటర్ యాప్ బ్లూస్మార్ట్ బెంగుళూరు, ఢిల్లీ ఎన్‌సీఆర్‌లోని పోలింగ్ స్టేషన్‌ల నుంచి 30 కి.మీ పరిధిలో రాయితీ రైడ్‌లను అందిస్తున్నవాటిలో ఒకటిగా ఉన్నది.బృహత్ బెంగళూరు హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని తినుబండారాలు కూడా ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. కామత్ హోసరుచి అండ్ అయ్యంగార్ ఓవెన్ ఫ్రెష్‌లో 10 శాతం తగ్గింపు నుంచి కేఫ్ ఉడిపి రుచిలో ఉచిత మాక్‌టెయిల్‌లు, హోటల్ నిసర్గా గ్రాండ్‌లో కాంప్లిమెంటరీ దోసె, లడూ, జ్యూస్ వరకు.. ఓటు వేసేందుకు వచ్చే పౌరులకు అందించనున్నాయి.

ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ ఏర్పాటు

- ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ వెల్లడి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీని నియమించింది. ఈమేరకు గురువారం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీ వెల్లడించారు. మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కె పుష్పలీల, ఎస్ రాములనాయక్, ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి, దివ్యవాణి చౌదరి, కత్తి వెంకటస్వామిలను సభ్యులుగా నియమించారు. ఈ కమిటీ శుక్రవారం తొలిసారి భేటీ కానుంది.

హామీలపై మాట్లాడరెందుకు..?

- సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ నేత రావుల సూటి ప్రశ్న

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

0మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై సీఎం రేవంత్ ఎందుకు నోరుమెదపటం లేదని బీఆర్ఎస్ సీనియర్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు కొండంత..అమలు చేసింది గోరంతని విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడు తూ...అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో రేవంత్ సర్కార్ అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేసి ందని విమర్శించారు. మైనారిటీలకు రిజర్వేషన్లు, ఉద్యోగాల కల్పన, ఇమా మ్‌లు, మౌజామ్‌లు, పాస్టర్లకు వేతనాల పెంపు తదితరాంశాలపై జనానికి మొండి చేయి చూపిందని ఎద్దేవా చేశారు. అందువల్ల లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని చూసి మోసపోవద్దని కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

బిజినెస్

ఇబ్బడిముబ్బడిగా క్రెడిట్ కార్డుల వాడకం

- ఆన్‌లైన్‌లో రూ.1 లక్ష కోట్ల వ్యయం
- రూ.60వేల కోట్ల చేరువలో ఆఫ్‌లైన్ లావాదేవీలు
- దేశంలో 10.2 కోట్ల కార్డులు



న్యూఢిల్లీ : క్రెడిట్ కార్డు వ్యయాలు రికార్డ్ స్థాయిలో పెరిగాయి. 2024 మార్చిలో తొలిసారి ఆన్‌లైన్‌లో క్రెడిట్ కార్డుల ఖర్చులు రూ.1,04,081 కోట్ల మార్క్‌ను అధిగమించాయి. 2024 ఫిబ్రవరిలోని రూ.94,774 కోట్లతో పోలిస్తే 10 శాతం పెరగ్గా.. 2023 మార్చిలో నమోదైన రూ.86,390 కోట్ల వ్యయాలతో పోలిస్తే ఏకంగా 20 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. చిన్న కొనుగోళ్లకూ క్రెడిట్ కార్డులను వినియోగిస్తుండటంతో వీటి పరిమాణం గణనీయంగా పెరిగింది. దీంతో ఆన్‌లైన్‌లోనూ కొనుగోళ్ల రికార్డ్ స్థాయిలకు చేరుతున్నాయి. దేశంలో క్రెడిట్ కార్డుల సంఖ్య 10.2 కోట్లకు చేరింది. గతేడాదితో పోలిస్తే దాదాపు 20 శాతం పెరిగింది. క్రెడిట్ కార్డులతో ఆఫ్‌లైన్‌లో జరిగే పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) లావాదేవీలూ భారీగానే పెరిగాయి. 2023 మార్చిలో రూ.50,920 కోట్లుగా ఉన్న ఆఫ్‌లైన్‌లో క్రెడిట్ కార్డుల వ్యయాలు.. గడిచిన నెలలో 19 శాతం పెరిగి రూ.60,378 కోట్లకు చేరాయి. మొత్తంగా క్రెడిట్ కార్డ్ లావాదేవీలు 20 శాతం పెరిగి రూ.1,64,586 కోట్లకు చేరాయి. క్రెడిట్ కార్డుల జారీలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ 20.2 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానంలో ఎస్‌బీఐ 18.5 శాతం, ఐసిఐసిఐ బ్యాంక్ 16.6 శాతం, యాక్సిస్ బ్యాంక్ 14 శాతం, కొటాక్ మహీంద్రా బ్యాంక్ 5.8 శాతం చొప్పున వాటాలు కలిగి ఉన్నాయి. క్రెడిట్ కార్డులు జారీ చేస్తున్న టాప్ 10 బ్యాంకులే మొత్తం 90 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉన్నాయి.

సైయంట్ లాభాల్లో 16 శాతం వృద్ధి

హైదరాబాద్ : గడిచిన ఆర్థిక సంవత్సం (2023-24) జనవరి నుంచి మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో సైయంట్ కంపెనీ 15.9 శాతం వృద్ధితో రూ.189 కోట్ల నికర లాభాలు సాధించింది. కంపెనీ రెవెన్యూ 6.3 శాతం పెరిగి రూ.1,861 కోట్లకు చేరింది. మొత్తం రెవెన్యూలో డిజిటల్, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సెగ్మెంట్ 80 శాతం వాటాను కలిగి ఉంది. 2024-25లో తమ సంస్థ ఆర్డర్ బుక్ బలంగా ఉందని.. ఇంటిలిజెంట్ ఇంజనీరింగ్, టెక్నాలాజీ సొల్యూషన్స్‌పై పెట్టుబడుల దృష్టి కొనసాగుతుందని సైయంట్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిష్ణ బొడనపు తెలిపారు. గురువారం బీఎస్ఈలో సైయంట్ లిమిటెడ్ షేర్ 1.27 శాతం పెరిగి రూ.1,916 వద్ద ముగిసింది.

ఒలెక్ట్రాకు రికార్డ్ నికర లాభాలు

- గతేడాది 8,232 ఇవిలకు ఆర్డర్

హైదరాబాద్ : ప్రముఖ విద్యుత్ వాహనాల తయారీ కంపెనీ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ (ఓజీఎల్) గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో 17.1 శాతం వృద్ధితో రికార్డ్ స్థాయిలో రూ.76.83 కోట్ల నికర లాభాలు సాధించినట్టు తెలిపింది. ఇంతక్రితం ఏడాదిలో రూ.76.83 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2023-24లో మొత్తంగా 8,232 విద్యుత్ వాహనాల ఆర్డర్లను దక్కించుకున్నట్టు పేర్కొంది. ప్రస్తుతం తమ చేతిలో 10వేల పైబడిన ఈవీ బస్సుల ఆర్డర్ ఉందని వెల్లడించింది. దేశంలో ఏ కంపెనీ ఇంత పెద్ద ఆర్డర్లను కలిగి లేదని తెలిపింది. ఇప్పటి వరకు 1,746 యూనిట్లను డెలివరీ చేసినట్లు వెల్లడించింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రెవెన్యూ 5.8 శాతం పెరిగి రూ.1154.14 కోట్లకు చేరింది. '2023-24లో రెవెన్యూ, లాభాల పరంగా బలమైన వృద్ధిని సాధించాము. మా తయారీ సామర్థ్యం పెంచుకోవడంపై దృష్టి కొనసాగుతుంది. అదే విధంగా బలమైన ఆర్డర్ బుక్‌ను కలిగి ఉన్నాము. మా నూతన సీతారాంపూర్ యూనిట్‌లో ఫిబ్రవరి 24న పాక్షిక ఉత్పత్తి ప్రారంభమైంది. తొలి బ్యాచ్ బస్సులను డెలివరీ చేశాము." అని ఓజీఎల్ సీఎండీ కెవి ప్రదీప్ తెలిపారు.

ఎరయా రూ.50 కోట్ల పెట్టుబడులు

ERAAYA Lifespaces Limited

హైదరాబాద్ : కొత్త స్వాధీనాల కోసం రూ.50 కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు ఎరయ లైఫ్‌స్పేసెస్ వెల్లడించింది. ఈ మొత్తాన్ని లీజర్ టూరిజంలో వ్యయం చేసినట్లు తెలిపింది. దాదాపు రూ.3 కోట్లతో లొనవాలాలో లగ్జరీ స్టేకేషన్ ప్రాపర్టీని కొనుగోలు చేసినట్లు పేర్కొంది. మోహాలిలోని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు సమీపంలోని శాటిలైట్ సిటీలోని అతిపెద్ద వాణిజ్య సముదాయాన్ని రూ.47 కోట్లతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. ఇది ఆతిథ్య వ్యాపారాన్ని విస్తరించడంలో, వద్ధి సంభావ్య వ్యాపార ప్రాంతాలలో తన పోర్ట్‌ఫోలియోను విస్తరించడంలో బలమైన నిబద్ధతను ప్రదర్శిస్తుందని పేర్కొంది.

సింగిల్ చార్జింగ్‌తో 323 కి.మీ ప్రయాణం

- అల్ట్రావయోలెట్ కొత్త ఈవీ బైక్ ఆవిష్కరణ



బెంగళూరు : ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఈవీ) స్టార్టప్ అల్ట్రావయోలెట్ తాజాగా భారత్ మార్కెట్లోకి తన అల్ట్రావయోలెట్ ఎఫ్77 మ్యాచ్2 మోటార్ సైకిల్‌ను విడుదల చేసింది. సింగిల్ చార్జింగ్‌తో 323 కిలోమీటర్ల దూరం ప్రయాణించొచ్చని ఆ కంపెనీ తెలిపింది. ఇది ఇంతకుముందు 2022 చివర్లో ఆవిష్కరించిన అల్ట్రావయోలెట్ ఎఫ్77 మోటారు సైకిల్ అప్ డేటెడ్ వర్షన్ బైక్ అని పేర్కొంది. స్టాండర్డ్, రెకాన్ వేరియంట్లలో లభించే ఈ బైకు తొమ్మిది రంగుల్లో లభ్యమవుతుందని తెలిపింది. ఎక్స్‌షోరూం వద్ద స్టాండర్డ్ వేరియంట్ బైక్ రూ.2.99 లక్షలు, రెకాన్ వేరియంట్ రూ.3.99 లక్షలుగా నిర్ణయించింది.